# ఆధునిక భాషా నిర్మాణం

## ఎం.ఏ. - తెలుగు సెమిస్టర్ - IV, పేపర్ - II

*రచయితలు :*

**ప్రొఫెసర్ వి. సిమ్మన్న**
డిపార్ట్‌మెంట్ ఆఫ్ తెలుగు
ఆంధ్రా యూనివర్సిటీ,
విశాఖపట్టణం, ఎ.పి.

**డా॥ ఎన్.వి. కృష్ణారావు**
డిపార్ట్‌మెంట్ ఆఫ్ తెలుగు & ఓ.ఎల్.
ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం
గుంటూరు.

**డా॥ కె. బలరామ్**
డిపార్ట్‌మెంట్ ఆఫ్ తెలుగు & ఓ.ఎల్.
ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం
గుంటూరు.

**డా॥ పి. శ్రీనివాసులు**
తెలుగు లెక్చరర్
గవర్నమెంట్ డిగ్రీ కాలేజి, చేబ్రోలు
గుంటూరు జిల్లా.

*సంపాదకులు*
**డా॥ ఎన్.వి. కృష్ణారావు**
డిపార్ట్‌మెంట్ ఆఫ్ తెలుగు & ఓరియంటల్ లాంగ్వేజస్
ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం,
గుంటూరు.

*డైరెక్టర్*
**డా. నాగరాజు బట్టు**
యంహెచ్ఆర్ఎమ్., ఎంబిఏ., ఎల్ఎల్ఎమ్., ఎం.ఎ (సై) ఎం.ఎ (సో)., ఎం.ఇడి., ఎంఫిల్., పిహెచ్.డి

**దూరవిద్యా కేంద్రం**
ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, నాగార్జున నగర్ - 522 510
ఫోన్ నెం. 0863-2346208, 0863-2346222, 0863-2346259 (స్టడీ మెటీరియల్)
వెబ్‌సైట్: www.anucde.info, ఇమెయిల్: anucdedirector@gmail.com

M.A., Telugu : STRUCTURE OF MODREN TELUGU

Edition : 2023

No. of Copies :

© Acharya Nagarjuna University

This book is exclusively prepared for the use of students of **M.A. TELUGU** Centre for Distance Education, Acharya Nagarjuna University and this book is mean for limited circulation only

Published by :

**Dr. Nagaraju Battu**
Director
Centre for Distance Education
Acharya Nagarjuna University
Nagarjuna Nagar-522510

Printed at :

# ముందుమాట

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం 1976లో స్థాపించినది మొదలు నేటి వరకు ప్రగతి పథంలో పయనిస్తూ వివిధ కోర్సులు, పరిశోధనలు అందిస్తూ 2016 నాటికి NAAC చే గ్రేడ్ 'A' ను సంపాదించుకొని దేశంలోనే ఒక ప్రముఖ విశ్వవిద్యాలయంగా గుర్తింపు సాధించుకొన్నదని తెలియజేయడానికి సంతోషిస్తున్నాను. ప్రస్తుతం గుంటూరు, ప్రకాశం జిల్లాలోని 447 అనుబంధ కళాశాలల విద్యార్థులకు డిప్లమో, డిగ్రీ, పీజి స్థాయి విద్యాబోధనను ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం అందిస్తోంది.

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఉన్నత విద్యను అందరికీ అందించాలన్న లక్ష్యంతో 2003-04లో దూరవిద్యా కేంద్రాన్ని స్థాపించింది. పూర్తిస్థాయిలో కళాశాలకు వెళ్ళి విద్యనభ్యసించలేని వారికి, వ్యయభరితమైన ఫీజులు చెల్లించలేని వారికి, ఉన్నత విద్య చదవాలన్న కోరిక ఉన్న గృహిణులకు ఈ దూర విద్యాకేంద్రం ఎంతో ఉపయోగపడుతుంది. ఇప్పటికే డిగ్రీ స్థాయిలో బి.ఏ., బి.కాం., బి.ఎస్‌సి., పీజీ స్థాయిలో ఎం.ఏ., ఎం.కాం., ఎం.ఎస్‌సి., ఎం.సి.ఏ., ఎల్.ఎల్.ఎం., ఎం.బి.ఏ., కోర్సులను ప్రారంభించిన విశ్వవిద్యాలయం గత సంవత్సరం కొత్తగా జీవన నైపుణ్యాలు అనే సర్టిఫికేట్ కోర్సును కూడా ప్రారంభించింది.

ఈ దూర విద్యా విధానం ద్వారా విద్యనభ్యసించే విద్యార్థుల కొరకు రూపొందించే పాఠ్యాంశాలు సులభంగాను, సరళంగాను విద్యార్థి తనంతటతానుగా అర్థం చేసుకునేలా ఉండాలనే ఉద్దేశ్యంతో విశేష బోధనానుభవం కలిగి రచనా వ్యాసంగంలో అనుభవం గల అధ్యాపకులతో పాఠ్యాంశాలను వ్రాయించడం జరిగింది. వీరు ఎంతో నేర్పుతో, నైపుణ్యంతో నిర్ణీత సమయంలో పాఠ్యాంశాలను తయారుచేశారు. ఈ పాఠ్యాంశాలపై విద్యార్థినీ, విద్యార్థులు, ఉపాధ్యాయులు నిష్ణాతులైనవారు ఇచ్చే సలహాలు, సూచనలు, సహృదయంతో స్వీకరించబడతాయి. నిర్మాణాత్మకమైన సూచనలు గ్రహించి మున్ముందు మరింత నిర్దిష్టంగా అర్థమయ్యే రీతిలో ప్రచురణ చేయగలం. ఈ పాఠ్యాంశాల అవగాహన కోసం, అభివృద్ధి కోసం సంశయాల నివృత్తి కోసం వారాంతపు తరగతులు, కాంటాక్టు క్లాసులు ఏర్పాటు చేయడం జరిగింది.

దూరవిద్యా కేంద్రం ద్వారా విజ్ఞాన సముపార్జన చేస్తున్న విద్యార్థులు, ఉన్నత విద్యార్హతలు సంపాదించి జీవనయాత్ర సుగమం చేసుకోవడమే కాక చక్కటి ఉద్యోగావకాశాలు పొంది, ఉద్యోగాలలో ఉన్నత స్థాయికి చేరాలని, తద్వార దేశ పురోగతికి దోహదపడాలని కోరుకుంటున్నాను. రాబోయే సంవత్సరాలలో దూరవిద్యాకేంద్రం మరిన్ని కొత్త కోర్సులతో దిన దినాభివృద్ధి చెంది ప్రజలందరికీ అందుబాటులో ఉండాలని అకాంక్షిస్తున్నాను. ఈ ఆశయ సాధనకు సహకరిస్తున్న, సహకరించిన దూర విద్యాకేంద్రం డైరెక్టర్లకు, సంపాదకులకు, రచయితలకు, అకడమిక్ కోఆర్డినేటర్లకు, అకడమిక్ కౌన్సిలర్లకు మరియు అధ్యాపకేతర సిబ్బందికి నా అభినందనలు.

**ప్రొఫెసర్ పి. రాజశేఖర్**

ఉపకులపతి

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం

# M.A. TELUGU

FOURTH SEMESTER

PAPER - II SYLLABUS

**402TL21 - STRUCTURE OF MODERN TELUGU**

**ఆధునిక భాషా నిర్మాణం**

**SYLLABUS**

1. ఆధునిక తెలుగు భాషా వర్ణాలు - వాటి వ్యాప్తి - ఆధునిక తెలుగు భాష - సంధి స్వరూపం
2. ఆధునిక తెలుగు భాష - నామ నిర్మాణం - సమాస నిర్మాణం
3. వాక్య నిఆర్మణం -వాక్య భేదాలు, కర్మణి, కర్తరి ప్రయోగాలు
4. తెలుగు భాష ఆధునికీకరణ ఆశ్యకత - పద్ధతులు - సమస్యలు
5. తెలుగు భాషలో మాండలిక భేదాలు - సామాజికం - ప్రాంతీయం

**ఆధారగ్రంథాలు :**


1. ఆధునిక ప్రామాణికాంధ్ర వ్యాకరణం - వజ్ఝల వెంకటేశ్వర్లు
2. ఈనాడు భాషా స్వరూపం - బూదరాజు రాధాకృష్ణ
3. తెలుగు భాషా చరిత్ర - భద్రిరాజు కృష్ణమూర్తి
4. తెలుగు వెలుగులు - చేకూరి రామారావు
5. తెలుగు వాక్యం - చేకూరి రామారావు
6. భాషానువర్తనం - చేకూరి రామారావు
7. తెలుగు భాషా తత్వం - కొమఱ్ఱాజు వెంకట లక్ష్మణరావు
8. A Grammar of ModernTelugu - Bh. Krishan Murthy
9. Sandhi Balavyakaranam - J. Pratap Reddy.

# విషయ సూచిక


| | | |
|---|---|---|
| 1. | ఆధునిక తెలుగు భాషా వర్ణాలు - వాటి వ్యాప్తి | 1.1 - 1.19 |
| 2. | ఆధునిక తెలుగు భాషా - సంధి స్వరూపం | 2.1 - 2.21 |
| 3. | ఆధునిక తెలుగు భాషా - తెలుగు హల్సంధులు | 3.1 - 3.20 |
| 4. | ఆధునిక తెలుగు భాష - నామ నిర్మాణం | 4.1 - 4.16 |
| 5. | ఆధునిక తెలుగు భాష - సమాస నిర్మాణం | 5.1 - 5.20 |
| 6. | వాక్య నిర్మాణం | 6.1 - 6.20 |
| 7. | ఉపవాక్య భేదాలు | 7.1 - 7.11 |
| 8. | తెలుగు భాషా పరిమాణం | 8.1 - 8.10 |
| 9. | తెలుగు భాష ఆధునికీకరణ - ఆవశ్యకత పద్ధతులు - సమస్యలు | 9.1 - 9.12 |
| 10. | తెలుగులో మాండలికాలు | 10.1 - 10.20 |
| 11. | మాండలిక భేదాలు | 11.1 - 11.15 |
| 12. | అనుకృతి వాక్యాలు | 12.1 - 12.12 |
| 13. | తెలుగులో నామ్నీకరణాలు | 13.1 - 13.14 |
| 14. | తెలుగులో నామ్నీకరణాలు | 14.1 - 14.17 |

పాఠం - 1

# ఆధునిక తెలుగు భాషా వర్ణాలు - వాటి వ్యాప్తి

**విషయ సూచిక :**

1.1. వర్ణాలు

1.2. అచ్చులు

1.3. హల్లులు

1.4. గుణితం

1.5. అచ్చుల గుణితం

1.6. హల్లులు గుణితం

1.7. వర్ణోత్పత్తి కాణాలైన అవయవాలు రకాలు

1.8. అచ్చుల ఉత్పత్తి

1.9. హల్లుల ఉత్పత్తి

1.10. వర్గీకరణం

## 1.1. వర్ణాలు :

తెలుగు భాష మూల ద్రావిడ భాష నుంచి పుట్టింది. ద్రావిడ భాషల్ని ఉత్తర, మధ్య, దక్షిణ ద్రావిడ భాషలుగా భాషా శాస్త్రవేత్తలు వర్గీకరించారు. తెలుగు భాష మధ్య ద్రావిడ భాషా కుటుంబానికి చెందింది. తెలుగు భాషను ప్రపంచంలో సుమారు 16 కోట్ల మంది మాట్లాడుతున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో తెలుగు భాషను ఆధికార భాషగా 1966లో గుర్తించబడింది. తెలుగు భృషకు వేల సంవత్సరాల నుంచి ఇతర భాషలతో సంంధం వుంది. అందువల్ల తెలుగు భాషలోదనికి ఇతర భాషల నుండి పదజాలం వచ్చిచేరింది. తెలుగు భాషకు మొదటి నుంచి సంస్కృత ప్రాకృత భాషలతో సాంస్కృతిక సంబంధాలున్నాయి. ఆకారణంగా తెలుగు భాషలో తత్సమ, తద్భవ శబ్ధాలు ఎక్కువగా చేరాయి.

మనం మాట్లాడే భాషలో అనేక ధ్వనులు ఒకదానితో ఒకటి కలిసి ఉంటాయి. ఒక వాక్యంలోని పదాల్ని విడదీసి ఒక్కొక్క పదాన్ని వేర్వేరు ధ్వనులుగా వర్గీకరించవచ్చు.

"సినిమాకు రా" అనే వాక్యంలో "సినిమాకు" "రా" అనే రెండు పదాలు చోటు చేసుకున్నాయి. సినిమాకు అనే మాటను సి, నీ, మా, కు అని నాలుగు ధ్వనులుగా విభజించవచ్చు. అంతే కాక "సి" అనే ధ్వనిని స్, ఇ, అనే రెండు ధ్వనులుగా విడదీయవచ్చు. ఇవి మూల ధ్వనులు అన్నమాట

"సినిమాకు" అనే మాటలో స్, ఇ, న్, ఈ, మ్, ఆ, క్, ఉ అనే ఎనిమిది మూల ధ్వనులు వున్నాయి. "రా" అనే పదంలో ర్, ఆ అనే రెండు మూల ధ్వనులున్నాయి. మూల ధ్వనికి వ్యాకరణంలో "వర్ణం" అని అంటారు. మరి రెండు ధ్వనులుగా విడదీయరాని మూల ధ్వనికి "వర్ణం" అని పేరు.

ఉదా : అ, ఊ, క్, ర్

తెలగు భాషకు ఉచ్చరణాన్ని బట్టి వర్ణాలు 54. నేడు ప్రచారంలో వున్న లిపిని బట్టి వర్ణాలు 50

అ, ఆ, ఇ, ఈ

ఉ, ఊ, ఋ, ౠ,

ఎ, ఏ, ఐ, ఒ, ఓ, ఔ,

క ఖ గ ఘ ఙ

చ ఛ జ ఝ ఞ

ట ఠ డ ఢ ణ

త థ ద ధ న

ప ఫ బ భ మ

య ర ల వ

శ ష స హ ళ ం ః

ఆ, ఏ - ల నడిమి రెండు వర్ణాలు, చ, జ - ల ద్వివిధోచ్చారణం, "ఫ" వర్ణపు అన్య దేశ్య ఉచ్చారణం, "క్ష" యొక్క విశిష్ట ఉచ్చారణం పరిగణించి బిందు విసర్గల్ని విడిచిపెట్టితే వర్ణాలు 54.

## 1.2. అచ్చులు :

స్వతంత్రంగా ఉచ్చరించతగ్గ వర్ణాలకు అచ్చులు అని పేరు. తెలుగులో అచ్చులు 14. అచ్చులకు స్వరాలు, ప్రాణాలు అనే పేరు కూడా ఉన్నాయి.

అ ఆ ఇ ఈ ఉ ఊ ఋ ౠ, ఎ ఏ ఐ, ఒ ఓ ఔ.

() ఈ అచ్చులను మన పూర్వ వైయాకరణులు వర్ణ సమామ్నాయంలో చేర్చారు. ఇవి సంస్కృతంలో వున్నాయి. వాటి ఉపయోగం అతి విరళం. తెలుగులో ఈ అచ్చులు లేవు. "క్లుప్తము" అనే తత్సమంతో ఇది కనబడుతుంది. స్వతంత్రమైన

అక్షరాలుగా () అనే అచ్చులు కనబడవు. కాబట్టి తెలుగు నుంచి తొలగించారు. "క్లుప్తం" అనే పదాన్ని "క్లుప్తం" అని లకారయుక్తంగా రాసుకోవచ్చు.

## 1.3. హల్లులు :

అచ్చుల సహాయం లేక ఉచ్చరించబడని వర్ణాలను హల్లులు అని అంటారు. ఇవి తెలుగులో 34 హల్లులను వ్యంజనాలుఅని అంటారు.

క ఖ గ ఘ ఙ, చ ఛ జ ఝ ఞ, య ర ల వ, వ ష స హ ళ "ఱ" అనే వర్ణానికి బండి ఱా లేక శకటరేఫ అనే పేరు వుంది. పూర్వ వైయాకరణాలు దీనిని హల్లుల్లో చేర్చారు. దీనికి రకార ఉచ్చారణమే వుంది. ఒకప్పుడు రకారానికి కొంచె భిన్నంగా దీని ఉచ్చారణ వుంది. ఇది ద్రావిడ భాషా వర్ణం. ఱ కారయుక్త పదాలు తెలుగులో వున్నాయి. దీనికి రకారపు ఉ చ్చారణమే వుండడం చేత దీని ఆవశ్యకత లేదు. అందువల్ల దీనిని తొలగించడమైంది. ద్విత్వ ఱ కారం గల పదాలు తెలుగులో వున్నాయి. సంస్కృతంలో లేవు. గుఱ్ఱము మొదలైనవి. వీటిని ద్విత్వ ర కారంతోనే రాయవచ్చు. ఉదా ॥ గుర్రం, కుర్రవాడు, మర్రి.

బిందువు, విసర్గం అనే పేర్లు గల రెండు వర్ణాలున్నాయి. బిందువుకు లిఖిత చిహ్నం వృత్తాకార రేఖ "ం" విసర్గకు లిఖిత చిహ్నం ఒక దాని కింద మరోకటి అంటకుండరాసిన రెండు చిన్న వృత్తాలు "ః" బిందువుకు అనుస్వారం, సున్న అనే పేర్లు కూడా వున్నాయి.

బిందు విసర్గాలు రెండును ఉచ్చారణను బట్టి హల్లులు అనడమే యుక్తం.వ ఈటికి అచ్చుల వంటి స్వతంత్రోచ్చారణం లేదు అచ్చుల సహాయంతోనే వీటిని పలుకుతాము. బిందువు ఉచ్చారణ "మ" కారం వంటిది. ఉదా॥ హంస, పుస్తకం. విసర్గ ఉ చ్ఛారణం "హ" కారం వంటటిది. ఉదా॥ దుఃఖం, వయః, పరిమితః, పునః, బహుశః

బిందు విసర్గలకు ముందే అచ్చులువస్తాయి. వెనకరావు. ఇతర హల్లులకు ముందు గాని, వెనుక గాని అచ్చులు రావచ్చు.

ఉదా : అ + ం = అం

అ + ః = అః

అ + న్ = అన్

న్ + అ = న

తెలుగులో లిఖిత వర్ణాలు ఏయే ధ్వనులకు గుర్తులో వాటిని ఆయా ధ్వనులు గానే చదువుతాము. ఉదా॥ అ, ఉ, క, ఛ. అయితే బిందువు, విసర్గం అనేవి ఆయా లిఖిత చిహ్నాలకు ప్రత్యేకమైన పేర్లు.

**అక్షరాలు :**

ధ్వన్యాత్మకాలైన వర్ణాల స్థానేలిఖిత భాషలో ఉపయుక్తాలైన రేఖా రూప చిహ్నాలకు లిపి అని పేరు. అచ్చులు, క కా రాది హల్లులు, బిందు విసర్గలు తెలులు లిపిలోని వర్ణాలు.

స్వతంత్రోచ్చారణ యోగ్యమైన క్షుద్రతమ ధ్వనిగాని, తత్ప్రతి నిధి అయిన లిపి రూపం గాని “అక్షరం” అనబడుతుంది.

కేవల అచ్చులును, ఒకటి గాని, ఒకటి కన్న హెచ్చు కాని హల్లులతో ఒక్క అచ్చు కూడుట వల్ల ఏర్పడిన ధ్వనులు అక్షరాలు అనిపించుకుంటాయి.

ఉదా : అ, ఓ, క, శ్రీ, సం, అన్, విల్

అ, ఓ : ఇవి అచ్చులు. స్వతంత్రోచ్చారణ కలవి కాబట్టి ఇవి అక్షరాలు

క: క్+అ : ఒక హల్లు మీద ఒక అచ్చు చేరిన అక్షరం.

శ్రీ: శ్ + ర్ + ఈ మొదటి రెండు హల్లుల మీద ఒక అచ్చు చేరిన అక్షరం.

సం: స్ + అ +ం హల్లుకు, బిందువుకు నడుమ అచ్చు గల అక్షరం

అన్: అ + న్. అచ్చుపై హల్లు వుంది

విల్: వ్ + ఇ + ల్. రెండు హల్లుల నడుమ అచ్చు వుంది.

పై ఉదాహరణాల్లో ఒక్కొక్క అక్షరంలో ఒకొక్క అచ్చు మాత్రమే వుంది. ఒక అక్షరంలో హల్లులు ఎన్ని అయినా వుండవచ్చు.

తెలుగు పదాల్లో ఒకటి రెండు హల్లులు గల అక్షరాలు ఎక్కువ. మూడు నాలుగు హల్లులు గల అక్షరాలు తక్కువ. ఎక్కువ హల్లులు గల అక్షరాలతో కూడిన పదాలు సాధారణంగా తత్సమాలు.

ఉదా : మహాత్మ్యం, మత్స్యం, స్వాస్థ్యం, శార్ఙ్గం

**అక్షరాలు - వర్గీకరణ :**

అక్షరాల్ని ఐదు విధాలుగా వర్గీకరించవచ్చు. 1. సహజాలు, 2. సరళాలు, 3. ద్విత్వాలు, 4. సంయుక్తాలు, 5. బిందు విసర్గాంతాలు.

**1. సహజ అక్షరాలు :**

అ, ఆ మొదలైనవి అచ్చులు. ఇవి మూల ధ్వనులైన వర్ణాలే కాక అక్షరాలు కూడా అవుతాయి.

**2. సరళ అక్షరాలు :**

ఒక హల్లు మీద ఒక అచ్చు చేరగా ఏర్పడినవి.

ఉదా : మా, తీ, రి హై, కృ

**3. ద్విత్వఅక్షరాలు :**

ఒక హల్లు మీద అదే హల్లు చేరి ఒక అచ్చుతో కూడినవి.

ఉదా ॥ క్క, మ్మీ, య్యా, ర్ర

**4. సంయుక్త అక్షరాలు :**

ఒకటి కన్నా హెచ్చు మల్లుల మీద అచ్చు చేరగా ఏర్పడినవి.

ఉదా : ర్మి, త్ర్య, ర్వ్యా, క్ష్మ

**5. బిందు, విసర్గాంత అక్షరాలు :**

చివర బిందువు గాని, విసర్గం కాని వున్నవి

ఉదా॥ కం, స్వం, ర్చిః వాః

సాధారణంగా తెలుగు శబ్దాలు అజంతాలు, అంటే అంత మందు అచ్చుకలవి. తెలుగు మాటల చివర హల్లు సాధారణంగా వుండదు. పద్యరచనలో ఛందోనియమ పాలన కోసం కాని, శ్రావ్యత కోసం కాని కవులు హలంత శబ్దాల్ని ప్రయోగిస్తారు.

ఉదా॥ వనముల్, వచ్చెన్, కర్తల్

హలంతాలైన ముల్, చ్చెన్, ర్తల్ వంటివి ఒకొక్కటి ఒక అక్షరం. వీటిలో చివరి హల్లు విడిచిపెట్టి, అచ్చుకు ముందున్న హల్లులను బట్టి, ఏ రకానికి చెందిన అక్షరంలో నిర్ణయించవచ్చు. "ముల్" సరళాక్షరం "చ్చెన్" ద్విత్వాక్షరం. "ర్తల్" సంయుక్తాక్షరం.

## 1.4. గుణితం :

హల్లులతో అచ్చులను, మల్లులతో మల్లులను చేర్చి అక్షరాల్ని ఏర్పరచి పలకడాన్ని, రాయడాన్ని గుణితం అని అంటారు.

ఉదా : "క" కు దీర్ఘ మిస్తే "కా" "క" కింద "ప" రాస్తే "క్ప" లేదా కకార, ఆకారాలు "కా", కకార, పకార అకారాలు "క్ప"

గుణింతం చెప్పడంలో కేవల హల్లులను నిర్దేశించుటకు కా, మా, రా అని ఇలా దీర్ఘాంతంగా చెప్పడం అలవాటు.

ఉదా : "కా" కు ఏత్వమిస్తే "కే", "కా" కింద "వా" రాస్తే "క్వ" మా కింద "మా" రాస్తే "మ్మ"

గుణితం అంటే గుణించబడింది అని అర్థం. వర్ణాలు సంయోగం ద్వారా అక్షరాల సంఖ్య బహుగుణమై వృద్ధి పొందుతుంది. కాబట్టి ఈ ప్రక్రియకు ఈ పేరు వచ్చింది. ఈ పద్యానికి 'గుణింతం" అనే రూపాంతరం వాడుకలో వుంది.

## 1.5. అచ్చుల గుణితం :

తెలుగులోని హల్లులు అకారయుక్తాలైన అక్షరాలు. వీటిలో అత్వం స్వ తస్సిద్ధంగానే వుంది. కనుక హల్లుల మీద "ఆ" మొదలైన అచ్చులను బోధించే గుర్తుల్ని చేర్చుట వల్ల సరళాక్షరాల ఏర్పడతాయి. గుణితంలో అచ్చుల స్థానే వచ్చే గుర్తులకు "స్వరమాత్రలు" అని పేరు. కొన్ని హల్లుల్లో గల "తల కట్టు" (✓) సహజమైన అకారమాత్ర. ఈ క్రింది పట్టికలో "ఆ" మొదలైన స్వరమాత్రలు ఇవ్వబడ్డాయి.

| అచ్చు | స్వరమాత్ర పేరు | స్వరమాత్ర గుర్తు |
|---|---|---|
| ఆ | దీర్ఘం | ా |
| ఇ | గుడి | ి |
| ఈ | గుడి దీర్ఘం | ీ |
| ఉ | కొమ్ము | ు |
| ఊ | కొమ్ము దీర్ఘం | ూ |
| ఋ | వట్రవాసుడి | ృ |
| ౠ | సుడి దీర్ఘం | ౄ |
| ఎ | ఎత్వం | ె |
| ఏ | ఏత్వం | ే |
| ఐ | కింద ఐత్వం | ై |
| ఒ | ఒత్వం | ొ |
| ఓ | ఓత్వం | ో |
| ఔ | ఔత్వంౌ | |

2. కకారానికి అచ్చుల గుణితం ఈ విధంగా వుంటుంది.

క, కా, కి, కీ, కు, కూ, కృ, కౄ, కె, కే, కై, కొ, కో, కౌ

తక్కిన హల్లుల కాకుండా ఇలాగే అచ్చుల గుణితం వుంటుంది.

3. అచ్చుల గుణితంలో కొన్ని విశిష్ట రూపాలున్నాయి. వీటిని గుర్తించడానికి హల్లులను తలకట్టు కలవి గాను, తలకట్టు లేనివిగాను గుర్తించాలి.

తలకట్టు లేనివి : ఖ జ ఞ ట ణ బ ల

మిగిలిన హల్లుల తలకట్టు వున్నవి : క, గ, ఘ, చ, ఛ, ఝ, ఠ, డ, ఢ, త, థ, ధ, న, ప, భ, మ, య, ర వ, శ, ష, స, హ, ళ

తలకట్టు గల హల్లులకు దీర్ఘం ఇచ్చినప్పుడు తలకట్టు పోతుంది. కాని ఈ కింది అక్షరాల్లో అది పోదు.

ఘా, ఝా, మా, యా, హా

4. "గుడి" ఇచ్చినప్పుడు తల కట్టుపోతుంది. కాని ఈ కింది అక్షరాల విశిష్టత గమనించదగ్గంది.

య్ + ఇ = యి, య్ + ఈ = యీ

మ్ + ఇ = మి, మ్ + ఈ = మీ లేక మీ

5. ప, ఫ, వ అనే అక్షరాలకు కొమ్ము ఇస్తే ఈ కింది రూపాలు ఏర్పడతాయి.

ప్ + ఉ = పు, ఫ్ + ఉ = ఫు, వ్ + ఉ = వు

6. మ, య అనే అక్షరాలకు కొమ్ము ఇస్తే ఈ కిందిరూపాలు ఏర్పడుతాయి

మ్ +ఒ = మొ, మ్ + ఓ = మో

య్ + ఒ = యొ, య్ + ఓ = యో

ఘ, హ అనే అక్షరాలకు ఒ, ఓ లు చేరితే రెండేసి రూపాలు ఏర్పడుతాయి.

ఘ్ + ఒ = ఘొ లేక ఘొ

ఘ్ + ఓ = ఘో లేక ఘో

హ్ + ఒ = హొ లేక హో

హ్ + ఓ = హో లేక హో

## 1.6. హల్లుల గుణితం :

హల్లుపై హల్లు చేర్చి రాయడం హల్లుల గుణితం. ద్విత్వ, సంయుక్త అక్షరల్లోని మొదటి హల్లు మీద వచ్చే హల్లుల్ని బోధించే గుర్తులకు "హల్మాత్రలు" అనిపేరు. అక్షరంలోని చివరి అచ్చు యొక్క మాత్ర మొదటి హల్లు మీద చేర్చి, దాని కింద రెండవ, మూడవ హల్లుల మాత్రలను రాసిన ఎడల అక్షరం తయారవుతుంది.

ఉదా : రకార, యకార, అకారాలు = ర్యా

తకార, రకార, ఇకారాలు = త్రి

రకార, మకార, యకార అకారాలు = ర్మ్య

సకార, తకార, రకార ఈకారిలు = స్త్రీ

2. ఈ క్రింది పట్టిలో కొన్ని విశిష్టమైన హల్మాత్రలు ఇవ్వబడ్డాయి. ఈ హల్మాత్రలను "ఒత్తులు" అని అంటారు. కొన్నింటికి ప్రత్యేకమైన పేర్లు వున్నాయి.

| హల్లు | హల్మాత్ర | హల్లు | హల్మాత్ర |
|---|---|---|---|
| క | ్క | య | ్య (క్యావడి) |
| త | ్త | ర | ్ర (క్రావడి) |
| న | ్న (నావడి) | ల | ్ల |
| మ | ్మ | వ | ్వ |

ఈ హల్మాత్రలతో కూడిన అక్షరాలకు ఉదా॥ క్క, ర్తి, మ్నా, శ్మ, జ్యో, శ్రీ, ప్లా, జ్వ

3. తల కట్టు గల వ్యంజనాక్షరాల తలకట్లు తొలగించగా మిగిలిన అంశలే వాటి మాత్రలు

ఉదా॥ గకారమాత్ర - "్గ", ఛకారమాత్ర - ్ఛ,

ధకారమాత్ర - ్ధ, షకారమాత్ర - ్ష

ఇలాంటి మాత్రలు గల కొన్ని సంయుక్తాక్షరాలు

ర్గ, ద్ఛ, గ్ధా, ర్ష

4. తలకట్లు లేని హల్లులకు అవే మాత్రలుగా ఉపయోగపడతాయి.

ఉదా॥ ఖ, జ, ణ, బ, ఞ

ఈ మాత్రలు గల కొన్ని అక్షరాలు :

ర్ఖ, బ్జ, ర్ణ, ల్బ, జ్ఞ

5. సంయుక్తాక్షరణంలో ప, వ అనే హల్లులు ద్వితీయ స్థానంలో వుండి ఉకారయుక్తమైనప్పుడు ఉకారపు మాత్రము (కొమ్ము) రెండవ మల్లుతో చేర్చి రాయడం వుంది.

ఉదా : పప్పు లేక పప్పు

పువ్వు లేక పువ్వు

6. "క్ష" అనేది ఒక విశిష్ట ఉచ్చారణ గల అక్షరం సంయుక్తాక్షరంలో మొదటి హల్లు మీది మాత్ర తలకట్టు లేనిదిగా వుంటంది.

ఉదా : త త ణ ం తార్క్యుడు

క్షా క్ష

7. ఒకే అక్షరంలో మూడు, నాలుగు హల్లులు సంయుక్తాలైనప్పుడు లేఖన, ముద్రణ, సౌకర్యార్థం మొదటి మల్లును విడదీసి పొల్లుగా రాయవచ్చు.

ఉదా : శార్‌ఙ్గము తార్‌క్ష్యుడు

హలంత పదాలు సమాస గతములైనప్పుడు ఈ పద్ధత అనుసరించవచ్చు.

ఉదా ॥ బృహత్ ప్రణాళిక తత్‌క్షణము

దుర్ గ్రాహము, నిస్‌త్రై గుణ్యాడు

8. ఒక పదంలో ఎన్ని అచ్చులు వుంటాయో, అన్ని అక్షరాలు వుంటాయి. ఆయా అక్షరాల్ని విడివిడిగా రాయడం తెలుగు లేఖన పద్ధతిలోని విశిష్టత.

ఉదా : మహాత్మ్యము : మా, హా, త్మ్య, ము

9. పొల్లు హల్లును, బిందువును, విసర్గమును తత్పూర్వాక్షర భాగాలుగానే పరిగణించాలి.

ధేనువుల్ : ధే + ను + వుల్ = (మూడు అక్షరాలు)

సత్‌పుత్రుడు : సత్ + పు + త్రు + డు = (నాలుగు అక్షరాలు)

సంస్థ : సం + స్థ (రెండు అక్షరాలు)

వాఃపూరము : వ్యాః + పూ + ర + ము (నాలుగు అక్షరాలు)

బహుశ : బ + హు + శః (మూడు అక్షరాలు)

**వర్ణోత్పత్తి క్రమం :**

మనం మాటాడేటప్పుడు శ్వాసకోశాల నుండి బహిర్గమించే నిశ్వాసవాయువు కంఠందాటి నాసమార్గంలో వెలువడక,నోటి ద్వారా బయటకు పోతుంది. ఆ మార్గంలోని కొన్ని అవయవాల చలనాదుల వల్ల వివిధ వర్ణాలు ఉత్తన్నమవుతాయి.

## 1.7. వర్ణోత్పత్తి కారణాలైన అవయవాలు - రకాలు :

వర్ణోత్పత్తి కారణాలైన అవయవాల్ని మూడు రకాలుగా పేర్కొనవచ్చు.

**1. స్వర పేటిక :**

స్వరపేటిక నేకృకాగ్రం అంటారు. ఇదికంఠనాళం పై భాగం, మెడముందు ఉబ్బెత్తుగా కన్పించే అవయవమే ఈ స్వరపేటిక. దీనిని సామాన్యులు గొంతుకముడి అని అంటారు. ఇది శ్వాస మార్గంలో ఒక భాగం. దీనికి పైని "ఉప జిహ్వా" అనే చర్మపు పొర, ఆ పైన గళాగ్ర భాగం వున్నాయి.

**స్వరపేటిక పని :**

స్వరపేటికలో నాద తంత్రులు అనబడే రెండు చర్మ భాండాలున్నాయి. వీటి మధ్యలో నుండి నిశ్వాస వాయువు పైకి పోయే మార్గం వుంది. ఈ తంత్రులు బిగువుగా వున్నప్పుడు వాయు మార్గానికి నిరోధం కలుగుతుంది. ఈ నిరోధానికి "సంవాదం" అని పేరు. సన్నని మార్గం నిండా నిశ్వాస వాయువు బయటికి పోయేటప్పుడు నాదతంత్రులు ప్రకంపంన చెందడం వల్ల ఒక క్రమ విహిత ధ్వని విశేషం పుట్టుతుంది. ఈ ధ్వనికి "నాదం" అని పేరు. ఈ నాదమే కొన్ని వర్ణాల ఉత్పత్తికి కారణమవుతుంది. నాదాత్మక వర్ణాలకు "ఘోషాలు" అనిపేరు.

నాదతంత్రులు వదులుగా వుండే వాయుమార్గం అడ్డు లేక విశాలంగా వుండి, శ్వాస వాయువు బాహాటంగా పైకి పోతుంది. వాయు మార్గం ఆ నిరోధం అగుటకే "వివారం" అని పేరు. అందువల్ల నాద తంత్రులు ప్రకంబనం చెందవు. స్వేచ్ఛగా శ్వాస వాయువు పోవడం వల్ల నాద రహిత వర్ణాలు పుడతాయి. వీటికి "అఘోషాలు" అని పేరు. స్వరపేటికలోని సంవార, వివారాలకు "బాహ్య ప్రయత్నం" అని పేరు. ముఖగహ్వరానికి వెలుపల, కంఠం వైపు, జరిగే వర్ణోత్పాదక ప్రయత్నమే "బాహ్య ప్రయత్నం"

**2. నీరులేక ముఖ గహ్వరం :**

ఇది గళాగ్రభాగం. అంటే కంఠంయొక్క పై భాగం. లేక జిహ్వామూలం (నాలుక మొదలు) మొదలుకొని పెదవుల వరకు గల రెండు దవుడల మధ్య వున్న భాగం

**ముఖ గహ్వరం పని :**

ముఖ గహ్వరంలోని మీది దవుడలో తట్టు పుటాకారం అంటే దొప్పలాంటిది. దీనిని నోటిపై కప్పు అని అనవచ్చు. దీనిలోని భాగాలు వరుసగా ఐదు 1. కంఠం, 2. తాలువు, 3. మూర్ధం, 4. ఊర్ధ్వ దంతూలం, 5. ఊర్ధ్వోష్ఠం (పై పెదవి). ఇవి అచలాలు. ఇది కదలవు. నాలుక యొక్క భాగాలు వరుసగా, జిమ్వా మూలం (నాలుక మొదలు) జిహ్వా మధ్యం (నాలుక నడిమి భాగం), జిహ్వా మూలం (నాలుక మొదలు) జిహ్వా మధ్యం (నాలుక నడిమి భాగం), జిమ్వాగ్రం (నాలుక కొన). ఇది కాక క్రింది దవుడలోని పెదవి, ఈ నాలుగు చలనాలు అంటే కదలే స్వభావం కలవన్న మాట. చాలా భాగాలకు 'కరణాలు' అనీ, అచల భాగాలకు స్థానాలు అని పేర్లు. స్థానకరణాల స్పర్శ (సామీప్యం) వల్ల కాని, స్పర్శరాహిత్యం (దూరీకరణం) వల్ల కాని వేర్వేరు వర్ణాలు పుడతాయి.

**3. నాసా గహ్వరం :**

గళాగ్ర భాగం నుండి శ్వాస వాయువు ముక్కు ద్వారా బయటికి పోయే మార్గం "నాసాగహ్వరం"

**నాసా గహ్వరపని :**

నిశ్వాస వాయువు పూర్తిగా ముఖ గహ్వరం ద్వారా బయటికి పోక, కొంత వాయువు నాసాగహ్వరం ద్వారా పోవడం వల్ల కొన్ని వర్ణాలు ఉత్పన్నం అవుతున్నాయి. ఇవే అను నాసికాలు. అందువల్ల నాసాగహ్వరం కూడా వర్ణోత్పత్తి అవయవంగా పేర్కొనబడింది.

## 1.8. అచ్చుల ఉత్పత్తి :

ముఖ గహ్వరం పూర్తిగా తెరచి "ఆ" అని పలికితే నాదాత్మకమైన స్వరం వినబడుతుంది. దీనికి మొదటి హేతువు స్వరపేటికలోని సంవారం వల్ల కలిగే నాద తంత్రీ ప్రకంబనం, రెండవ హేతువు ముఖ గహ్వరం "వివృతం" అవడం "వివృతం" అంటే స్థానకణాలకు స్పర్శ లేకపోవడం. ఇది ఒక అభ్యంతర ప్రయత్నం అంటే ముఖ గహ్వరం లోపల జరిగే క్రియ. ఇక మూడవ హేతువు నిశ్వాస వాయువు స్వరపేటిక గుండా, గళం గుండా, ముఖ గహ్వరం ద్వారా నిర్గమించడం. నాద తంత్రుల వద్ద పుట్టిన ధ్వని తరంగాలు వాయువు ద్వారా ప్రయాణం చేస్తాయి. ఆ నాదం శ్రవణాలను తాకగానే మనకు వినబడుతుంది.

నాదాత్మకాలైన అకారాది అచ్చులు పై రీతిగా ఉత్పన్నం అవుతాయి. అవి ఘోషాలు.

అన్ని అచ్చులు ఒకే స్థానం నుండి పుట్టవు. అచ్చుల ఉత్పత్తి స్థానాలు ఈ కింది పట్టికలో వున్నాయి.

| అచ్చులు | స్థానాలు | అచ్చులు | స్థానాలు |
|---|---|---|---|
| అ, ఆ | కంఠం | ఎ ఏ, ఐ | కంఠం, తాలువు |
| ఇ, ఈ | తాలువు | ఒ, ఓ, ఔ | కంఠం, ఓష్ఠాలు |
| ఉ, ఊ | ఓష్ఠాలు | | |
| ఋ, ౠ | మూర్ధం | | |

## 1.9. హల్లుల ఉత్పత్తి :

నోటిపై కప్పులోని కంఠాన్ని (స్థానం) జిహ్వామూలం (కరణం) స్పృశించడం వల్ల అంత వరకూ నిరోధించబడిన నిశ్వాస వాయువు ఒక్కసారిగా విడువడి స్ఫోటనం (ప్రేలుడు, విరుగుట) చెందడం వల్ల క, ఖ, గ, ఘ, ఙ అనే వర్ణాలు పుడతాయి. ఉత్పత్తి స్థానాన్ని బట్టి ఇది కంఠ్యాలు

పై రీతినే తాలు, జిహ్వా మధ్యమాల స్పర్శాల వల్ల పుట్టిన చ, ఛ, ఝ, ఞ అనే హల్లులు తాలవ్యాలు.

నాలుక కొనను వెనుకకు మడచి (ప్రతివేష్టి తజిహ్వాగ్రం) మూర్ధాన్ని స్పృశించడం వల్ల పుట్టిన ట, ఠ, డ, ఢ, ణ అనే హల్లులు మూర్ధన్యాలు.

ఊర్ధ్వ దంతమూలాన్ని జిమ్వాగ్రంతో స్పృశించడం వల్ల పుట్టిన త, థ, ద, ధ న అనే హల్లులు దంత్యాలు

ఓష్ఠ ద్వయ స్పర్శ ల్ల పుట్టిన ప ఫ బ భ మ అనే హల్లులు ఓష్ఠాలు.

పై హల్లుల ఉత్పత్తికి స్థాన కరణాల స్పర్శయే కారణం. ఈ అభ్యంతర ప్రయత్నం "స్పృష్టం" అనబడుతుంది. "స్పృష్టం" అంటే స్పృశించబడినవి అని అర్థం.

అభ్యంతర ప్రయత్నానికి తోడుగా జిహ్వ ప్రయత్నం కూడా పై హల్లుల ఉత్పత్తికి ఆవశ్యకమవుతున్నాయి. స్వరపేటికలోని "సంవార - వివారాలే బాహ్య ప్రయత్నాలు.

సంవారం వల్ల నాదాత్మకాలైన గ, ఘ, జ, జ, ఝ, ఞ డ ఢ, ణ, ద, ధ, న, బ, భ, మ అనే హల్లులు, వివరం వల్ల శ్వాసాత్మకాలైన క, ఖ, చ, ఛ, ట, ఠ త, థ, ప, ఫ అనే హల్లులు పుడతాయి. వీటిలో నాదాత్మకాలు ఘోషాలు. తక్కినవి అఘోషాలు.

బాహ్య ప్రయత్నంలో మరో భేదం వుంది, ఇవి రెండు విధాలు :

అల్ప వాయువును వదలుట. అధిక వాయువును వదలుట అల్ప వాయు నిర్గమనం వల్ల క, గ, జ, చ జ, ఞ, ట, డ, ణ, త, ద, న ప, బ, మ అనే హల్లులు కలుగుతాయి. వీటిని అల్ప ప్రాణాలు అని పేరు. ప్రాణం అనగా వాయవు అని అర్థం. అధికవాయు నిర్గమనం వల్ల ఖ, ఘ, ఛ, ఝ, ఠ, ఢ, థ, ధ, ఫ, ఛ అనే వర్ణాలు కలుగుతాయి. కావున వీటిని "మహా ప్రణాలు" అని అంటారు.

పయి హల్లుల్లో జ, ఞ, ణ, న, మ అనే ఐదు హల్లులు పలికేటప్పుడు "స్పష్ట" ప్రయత్నంతో పాటు, అల్ప ప్రాణ ప్రయత్నంతో పాటు, సంవార ప్రయత్నంతో పాటు శ్వాస వాయువులోని కొంత అంశాన్ని నాసాగహ్వారం ద్వారా బయట వదలుతాం. నాసికా సాహాయ్యంతో పలకడం చేత వీటికి అనునాసికాలు అని పేరు సార్థకమైంది. ముక్కు మూసుకొని వీటిని పలుకలేక పోవుటయే ఇందుకు ప్రమాణం.

స్థాన, కరణ, స్పార్శాల వల్ల పుట్టుట చేత పైన పేర్కొన్న 25 హల్లులను "స్పర్శాలు" అని అంటారు.

ముఖ గహ్వరంలోని స్థానకరణాలు ఒక దానికి ఒకటి ఒకంచెం దూరంగా వుండుటయే ఈ "షద్వివృతం" అనబడుతుంది. ఈ షత్ కొంచెం వివృతం = తెరచుకొని వుండం అని అర్థం. ఈ అభ్యంతర ప్రయత్నం వల్ల య, ర, ల, వ, ళ అనే హల్లులు పుడతాయి. ఇవి ఘోషాలు, అల్ప ప్రాణాలు ఈ హల్లుల ఉత్పత్తి స్థానాలు ఈ కింద ఇవ్వబడ్డాయి.

| వర్ణం | ఉత్పత్తి స్థానం |
|---|---|
| య | తాలువు |
| ర | దంతమూలం |
| ల | దంతమూలం |
| వ | దంత మూలం, ఓష్ఠం |
| ళ | మూర్ధం |

య, ర, ల, వ ఈ హల్లుల ఉచ్చారణ అచ్చులకు, హల్లులకు మధ్యగా వుండడం వల్ల వీటికి "అంతస్థాలు" అనే పేరు వచ్చింది. భాషా శాస్త్రవేత్తలు అందుచేతనే వీటిని "అర్థాచ్చులు" అని అన్నారు. సగం అచ్చులు, సగం హల్లు అని అర్థం.

"ఈ షత్ స్పృష్టం" అనే అభ్యంతర ప్రయత్నం వల్ల శ, ష, స, హ లు అనే హల్లులు ఉత్పన్నం అవుతాయి. ఈ షత్ కొంచెం. స్పృష్టం = స్పృశించబడింది. అంటే స్థాన కారణాల స్పర్శం అల్పం అని అర్థం. ఇది "వివృతం" అని కొందరి మతం. అంటే స్థానకరణాలు ఒకదాని ఒకొటి తాకవు అని అభిప్రాయం. వాయువునకు స్థానకరణాలతో ఘర్షణలేక రాపిడి వుంది. ఈ హల్లుల ఉత్పత్తి స్థానాలు ఈ దిగువ పేర్కొనబడ్డాయి.

| హల్లు | ఉత్పత్తి స్థానం |
|---|---|
| శ | తాలువు |
| ష | మూర్ధం |
| స | దంత మూలం |
| హ | కంఠం |

శ, ష, స అనే వర్ణాలకు వివారం, బాహ్య ప్రయత్నం, ఇవి అఘోషాలు. "హ" కారం ఘోషం, మహాప్రాణం.

వాయు ఘర్షణ జాతాలు కాబట్టి శ, ష, స, హ లకు ఊష్మాలు అనే పేరు వచ్చింది.

నిసర్గ "హ" కార సదృశం. ఈ లిఖిత చిహ్నం మూడు విధాలు.

**1. పదాంత విసర్గ :**

ఉదా : పునః బహుశః

**2. క, ఖ, అనే కంఠ్యాలకు ముందు వున్న విసర్గ :**

ఉదా : దుఃఖం, ఉషఃకాంతి

**3. ప, ఫ అనే ఓష్ఠ్యాలకు ముందువున్న విసర్గ :**

ఉదా : వయః తపః ఫలం

పదాంత క, ఖ పూర్వ విసర్గలకు ఉత్పత్తి స్థానం కంఠం. ప, ఫ పూర్వ విసర్గకు స్థానం ఓష్ఠాలు.

**అనుస్వారం మూడు విధాలు :**

**1. పదాంతం :**

ఉదా : పుస్తకం, ధనం

**2. య, ర, ల, వ, శ, ష, స, హ అనే హల్లుల ముందు వున్న బిందువు :**

ఉదా : సంయమి, హంస, సింహం

**3. అనునాసికాలు కాక మిగిలిన స్పర్శ వర్ణాలకు ముందు వున్న బిందువు :**

ఉదా : పంకం, అంజని, కంఠం, కందం, రంభ

మొదటి రెండు విధాల అనుస్వారం అర్ధమకారంతో సమానం. ఓష్ఠ ద్వయం ఈషత్ స్పృష్టం, లేదా ఈ షద్వివృతం అయినప్పుడు ఈ ధ్వని పుడుతుంది. ఇది మకారంలాగే ఓష్ఠ్యం, అనునాసికం, ఘోషం.

క, ఖ, గ, ఘ - ల ముందుగల బిందువు "ఙ" కారతుల్యం

చ, ఛ, జ, ఝ - ల ముందు గల బిందువు "ఞ" వర్ణతుల్యం

ట, ఠ, డ, ఢ - ల ముందువున్న బిందువు "ణ" వర్ణతుల్యం

త, థ, ద, ధ - ల ముందు వున్న బిందువు "న" వర్ణతుల్యం

ప, ఫ, బ, భ - ల ముందురి వున్న బిందువు "మ" కారతుల్యం

## 1.10. వర్ణ వర్గీకరణం :

**ఉత్పత్తి స్థానాన్ని బట్టి వర్ణాల వర్గీకరణం :**

ఉత్పత్తి స్థానాన్ని బట్టి వర్ణాల్ని ఈ కింది విధంగా వర్గీకరించవచ్చు.

**1. కంఠ్యాలు :**

కంఠం వద్ద నుండి పలుకబడేవి

అ, ఆ, క, ఖ, గ, ఘ, ఙ, హ

(విసర్గం -పదాంతం - జిహ్వామూలీయం)

**2. తాలవ్యాలు :**

తాలువు వద్ద నుండి పలుకబడేవి

ఇ, ఈ, చ, ఛ, జ, ఝ, ఞ, య, శ

**3. మూర్ధన్యాలు :**

మూర్ధం వద్ద నుండి పలుకబడేవి

ఋ, ౠ, ట, ఠ, డ, ఢ, ణ, ర, ష, ళ, క్ష

**4. దంత్యాలు :**

ఊర్ధ్వ దంతమూలం వద్ద నుండి పలుకబడేవి.

త, థ, ద, న, ల, స, చ, జ

**5. ఓష్ఠ్యాలు :**

ఓష్ఠాల వద్ద నుండి పలుకబడేవి

ఉ, ఊ, ప, ఫ, బ, భ య

(విసర్గం - ఉపధ్మానీయం)

**6. అనునాసికాలు :**

నాసా సాహాయ్యంన పలుకబడేవి

ఙ, ఞ, ణ, న, మ, ం (అనుస్వారం)

**7. కంఠతాలవ్యాలు :**

ఎ, ఏ, ఐ,

**8. కంఠోష్ఠ్యాలు :**

ఒ, ఓ, ఔ

**9. దంతోష్ఠ్యాలు :**

వ, ష

**అభ్యంతర ప్రయత్నం రీత్యా వర్ణాల వర్గీకరణం :**

అభ్యంతర ప్రయత్నం రీత్యా వర్ణాలు 4 రకాలు

**1. వివృత ప్రయత్నకాలు :**

అ, ఆ, ఇ, ఈ, ఉ, ఊ, ఎ, ఏ, ఐ, ఋ, ఓ, ఔ

**2. స్పృష్ట ప్రయత్నకాలు :**

క, ఖ, ఘ, ఙ, చ, ఛ, జ, ఝ, ఞ, ట, ఠ, డ, ఢ, ణ, త, థ, ద, ధ, న, ప, ఫ, బ, భ మ (స్పర్శ వర్ణాలు-25) ళ.

**3. ఈషద్వివృత ప్రయత్నకాలు :**

ఋ, ౠ, య, ర, ల, వ (అంతస్థాలు)

**4. ఈ షత్ స్పృష్ట ప్రయత్నకాలు :**

శ, ష, స, (ఊష్మాలు) క్ష

**3. బాహ్య ప్రయత్నం రీత్యా వర్ణాలు వర్గీకరణ :**

బాహ్య ప్రయత్నం రీత్యా వర్ణాలను రెండు విధాలుగా పేర్కొనవచ్చు.

1. సంవార ప్రయత్నకాలు, నాదాత్మకాలు, ఘోషాలు, అన్ని అచ్చులు. హల్లులలో గ, ఘ, జ, జ, ఝ, డ, ఢ, ణ, ద, ధ, న, బ, భ, మ, య, ర, ల, వ, హ, ళ, ం (అనుస్వారం)

2. వివార ప్రయత్నకాలు, శ్వాసాత్మకాలు, అఘోషాలు : క, ఖ, చ, ఛ, ట, ఠ, త, థ, ప, ఫ, శ, ష, స, ః (విసర్గం)

**4. నిశ్వాస వాయు పరిమాణ నియంత్రణ బట్టి వర్ణాలు వర్గీకరణం :**

నిశ్వాస వాయు పరిమాణ నియంత్రణ అనే బాహ్య ప్రయత్నాన్ని బట్టి వర్ణాలు 2 రకాలు 1. అల్ప ప్రాణాలు, 2. మహా ప్రాణాలు.

**1. అల్ప ప్రాణాలు :**

అన్ని అచ్చులు.

హల్లులు : క, గ, జ, చ, జ, ఞ, ట, డ, ణ, త, ద, న, ప, బ, మ, య, ర, ల, వ, ళ

**2. మహా ప్రణాలు :**

హల్లులు : ఖ, ఘ, ఛ, ఝ, ఠ, ఢ, థ, ధ, ఫ, ఛ (ఒత్తు అక్షరాలు

శ, ష, స, హ ః (విసర్గ) క్ష

ప్రాణం అంటే వాయువు అని అర్థం. అల్ప ప్రాణం కలది అంటే అల్పమైన వాయువును వదలుట వల్ల ఉత్పన్నమయ్యేది అల్ప ప్రాణం.

మహా ప్రాణం కలది అంటే అధికమైన వాయువును వదలుట వల్ల ఉత్పన్నమయ్యేది మహా ప్రాణం.

**5. ఉత్పత్తిని బట్టి అచ్చులు వర్గీకరణం :**

ఉత్పత్తిని బట్టి అచ్చుల్ని 3 విధాలుగా వర్గీకరించవచ్చు. 1. సరళాలు, 2. సంయుక్తాలు, 3. విశిష్టాలు.

**1. సరళాలు :**

ఏ అచ్చులను దీర్ఘీకరించి, ఎంతసేపు పలికినా ఆ ధ్వని మాత్రమే వినబడుతుందో అలాంటి అచ్చులు సరళాలు

అ, ఆ, ఇ, ఈ, ఉ, ఊ, ఎ, ఏ, ఒ, ఓ, మేష స్వరం

**2. సంయుక్తాలు :**

రెండు అచ్చులు కలిసి ఏర్పడిన అచ్చులు సంయుక్తాచ్చులు. ఇవి 2 మాత్రమే ఐ, ఔ

**3. విశిష్టాలు :**

విశిష్ట లక్షణాలు గల అచ్చులు ఇది 2 మాత్రమే ఋ, ౠ

ఇవి సంస్కృతంలోనివి. ద్రావిడ భాషల్లో లేవు. తత్సమాలలోనే వీటి ఆవశ్యకత. ఒకే స్థానం నుండి ఉత్పన్నమైన అచ్చులు.

**6. ఉచ్చారణ కాలపరిమాణాన్ని బట్టి అచ్చుల వర్గీకరణ :**

ఒకే స్థానం నుండి ఉత్పన్నమైన అచ్చులను ఉచ్చారణ కాలపరిమాణాన్ని బట్టి 2 విధాలుగా వర్గీకరించవచ్చు. 1. హ్రస్వాలు, 2. దీర్ఘాలు,

1. హ్రస్వాచ్చులు : అ, ఇ, ఉ, ఋ, ఎ, ఒ,
2. దీర్ఘాచ్చులు : ఆ, ఈ, ఊ, ౠ, ఏ, ఔ

**7. ఉచ్చారణకాల పరిమాణం బట్టి అచ్చులు వర్గీకరణ :**

ఉచ్చారణ కాల పరిమాణం ప్రకారం అచ్చులను 2 రకాలుగా వర్గీకరించవచ్చు. 1. లఘువులు, 2. గురువులు

1. లఘువులు : ఏక మాత్రా కాలికాలు. అంటే హ్రస్వాచ్చులు లఘువులు, అ, ఇ, ఉ, ౠ, ఎ, ఒ

2. గురువులు : ద్విమాత్రా కాలికాలు. అంటే దీర్ఘాచ్చులు. సంయుక్తాచ్చులు గురువులు ఆ, ఈ, ఊ, ౠ, ఏ, ఓ, ఐ, ఔ

**8. స్పర్శహల్లులు వర్గీకరణం :**

స్పర్శ హల్లులను 5 వర్గాలుగా వర్గీకరించవచ్చు. వర్గం పేరు వర్గంలోని మొదటి వర్ణాన్ని బట్టి ఉంచబడింది. "వర్గం"ను "వర్గు" అని కూడా అంటారు.

క - వర్గం : క, ఖ, గ, ఘ, ఙ

ఛ - వర్గం : చ, ఛ, జ, ఝ, ఞ

ట - వర్గం : ట, ఠ, డ, ఢ, ణ

త - వర్గం : త, థ, ద, ధ, న

ప - వర్గం : ప, ఫ, బ, భ, మ

**9. విసర్గ వర్గీకరణం :**

విసర్గ మూడు విధాలు

1. పదాంత విసర్గ : ఇది కంఠ్యం. పదాంతంలో వుంటుంది.

2. జిహ్వా మూలీయం : ఇది జిహ్వా మూలం నుండి అంటే కంఠం వద్ద నుండి పుడతాయి. కాబట్టి కంఠ్యం కంఠ్య వర్ణం అయిన క, ఖ లకు ముందు వుంటాయి.

3. ఉపధ్మానీయం: ఇవి ఓష్ఠ్యాలయిన ప, ఫలకు ముందుగా వుంటాయి. "ఊపధ్మానం" అంటే పెదవి (ఓష్ఠం) అని అర్థం. కాబట్టి ఈ విసర్గకు "ఉపధ్మానీయం" అని పేరు వచ్చింది.

**10. అనుస్వారం వర్గీకరణం :**

అను స్వారం 3 విధాలు

1. పదాంత అనుస్వారం : ఇది అర్థమకారోచ్చారణం కలది. కొన్ని తెలుగు పదాల చివర "ము" వర్ణానికి బదులుగా వస్తుంది.

2. అపరివర్తనీయం : ఇది మార్పులేని అనుస్వారం. అంతస్థ, ఊష్మ వర్ణాల ముందు వస్తుంది. అర్థమ కారోచ్చారణం కలది. దీనికి బదులు మరొక వర్ణం రాదు

   ఉదా : సంయమము, సంరావము, సంతాపము, సంవత్సరము, అంశము, మాంసము, సంహారము

3. అనునాసికం : అను నాసిక వర్ణాల ఉచ్చారణ కలది. అనునాసికేతర వర్గ హల్లు ముందుగల అనుస్వారం ఆ వర్గాను నాసికముతో సమానం. అను స్వారానికి బదులుగా తత్స్యల్యమైన అనునాసికం రాయడం కద్దు. ఇలాంటి లేఖన పద్ధతి సంస్కృతం నుండి వచ్చింది.

ఉదా : అంగము - అఙ్గము, వంచన - వఞ్చన

కాండము - కాణ్డము పంథా - పన్థా

బింబము - బిమ్బము

బిందు పూర్వకంగా రాయడమే తెలుగు పద్ధతి. లేఖన ముద్రణకు మిక్కిలి సదుపాయమైంది. అనునాసిక వర్ణయుక్తంగా రాసే ప్రాచీన పద్ధతిని విడిచి బిందుయుక్తంగా రాసే నవీన పద్ధతిని, హిందీ, ఒడియా మొదలైన భాషల్లో నేడు అవలంబిస్తున్నారు.

**ఆధారగ్రంథాలు:**

1. ఆధునిక తెలుగు వ్యాకరణం - ఎన్. శివరామమూర్తి
2. ఆధునిక తెలుగు వెన్నెలకంటి వ్యాకరణం - వెన్నెలకంటి ప్రకాశం
3. ఆధునిక తెలుగు భాషా నిర్మాణం - శివుని రాజేశ్వరి
4. ఆధునిక ప్రామాణికాంధ్ర వ్యాకరణం - వజ్ఝల వేంకటేశ్వర్లు
5. ఆధునిక భాషాశాస్త్రం - వెలమల సిమ్మన్న
6. ఈనాడు భాషా స్వరూపం - బూదరాజు రాధాకృష్ణ

7. తెలుగు దారి - వెల్చేరు నారాయణరావు

8. తెలుగులో వెలుగులు - చేకూరి రామారావు

9. తెలుగు భాషా చరిత్ర (సంపాదకులు) - భద్రిరాజు కృష్ణమూర్తి

10. తెలుగు భాషా చరిత్ర - వెలమల సిమ్మన్న

11. తెలుగు భాషా తత్త్వం - కొమర్రాజు లక్ష్మణరావు

12. తెలుగు భాషా శాస్త్రవేత్తలు - వెలమల సిమ్మన్న

13. తెలుగు భాషా స్వరూపం - బూదరాజు రాధాకృష్ణ

14. తెలుగు వాక్యం - చేకూరి రామారావు

15. ప్రౌఢ వ్యాకరణం - బహుజనపల్లి సీతారామయ్య

16. బాల వ్యాకరణం - చిన్నయసూరి

17. బాల వ్యాకరణం - శాస్త్రీయ వ్యాఖ్య - వెలమల సిమ్మన్న, గుమ్మా సాంబశివరావు

18. భాషా తపస్వి గిడుగు - వెలమల సిమ్మన్న

19. భాషానువర్తనం - చేకూరి రామారావు

20. వ్యావహారిక భాషా వ్యాకరణం - వడ్లమూడి గోపాలకృష్ణయ్య

21. శబ్ద బ్రహ్మ చిన్నయసూరి (అముద్రితం) - వెలమల సిమ్మన్న, గుమ్మా సాంబశివరావు

22. సంధి - వెలమల సిమ్మన్న

**II. ఆంగ్లం :**

1. A Grammar of ModernTelugu - Bh. Krishan Murthy

2. Sandhi Balavyakaranam - J. Pratap Reddy.

పాఠం - 2

# ఆధునిక తెలుగు భాష - సంధి స్వరూపం

**విషయ సూచిక :**


2.1. సంధి నిర్వచనం

2.2. సంధులు

2.2.1. జాతుల్ని బట్టి సంధులు

2.2.2. సంధి జరిగే స్థానాన్ని బట్టి సంధులు

2.2.3. సంధి వర్ణాల స్వభావాన్ని బట్టి సంధులు

2.2.4. జరగడం, జరగకపోవడం బట్టి సంధులు

2.2.5. సంధిలో జరిగే వర్ణ వికారం

2.3. తెలుగు అచ్సంధులు


## 2.1. సంధి నిర్వచనం :

"సమ్" పూర్వక "ధా" ధాతువునుంచి "సంధి" శబ్దం వచ్చింది. సంధి అనే దానికి కూడిక, కలయిక, చేరిక మొదలైన అర్థాలువున్నాయి. వ్యాకరణశాస్త్ర వ్యవహారాల్లో "సంధి" అంటే వర్ణసంయోగం. దీన్నే "సంహిత" అని కూడా అంటారు. భాషల్లో ఉచ్చారణ సౌలభ్యం కోసం ఒక శబ్దం చివర్లో వుండే వర్ణం దానికి సన్నిహిత పరమైన ఇంకో శబ్దం యొక్క ఆదివర్ణంతో కలిస్తే "సంధి" అవుతుంది. భాషా స్వరూపాన్ని బోధించే వ్యాకరణ ప్రక్రియలన్నింటిలోనూ "సంధి" చాలా ముఖ్యమైంది. భాషా చారిత్రక దృష్టితో సంధి స్వరూప స్వభావాల్ని తెలుసుకోవడం ఎంతైనా అవసరం.

### సంస్కృతంలో సంధి :

తెలుగుభాషలోని "సంధి" విధానానికి సంస్కృతభాషలోని "సంహిత" (వర్ణసంయోగం) కు చాలా తేడా వుంది. "పరస్సన్నికర్షస్సంహితా" (అష్టాధ్యాయి 1-4-109) అని పాణిని పేర్కొన్నాడు. మిక్కిలి సన్నికర్షముకల ధ్వనుల కూడిక "సంహిత." సంస్కృతవైయాకరణులు, రెండు అక్షరాలు ఉచ్చరించేటప్పుడు అర్ధమాత్రాకమైన కాలం కంటే అధిక వ్యవధానం లేకపోవడాన్ని "సంహిత" అని అన్నారు. సంస్కృతంలోని సంధులకు ద్రావిడ భాషలోని సంధులకు ఎలాంటి సంబంధం లేదు. సంస్కృత సంధులైన సవర్ణ దీర్ఘ, గుణ, వృద్ధి, యణాదేశం మొదలైన సంధులు ద్రావిడభాషల స్వభావానికి పూర్తిగా భిన్నమైనవి.

**ద్రావిడ భాషలు :**

సంధి స్వరూప స్వభావాల విషయాల్లో ప్రాచీన తెలుగు వైయాకరణులకు, అర్వాచీన తెలుగు వైయాకరణులకు కొంచెం భేదం కన్పిస్తుంది. ప్రాచీన వైయాకరణులైన కేతన, విన్నకోట పెద్దన మొదలైనవారు చెప్పిన సంధి లక్షణాల్ని, ఇతర ద్రావిడ భాషావ్యాకర్తలు చెప్పిన సంధి లక్షణాల్ని నిశితంగా పరిశీలిస్తే సంస్కృత వ్యాకరణ సంప్రదాయాల్ని తు.చ. తప్పకుండా అనుసరించి ముఖ్యంగా సంస్కృతంలో రాసిన అధర్వణకారికల్ని అనుసరించి చెప్పినట్లు కన్పిస్తుంది.

సర్వసాధారణంగా దక్షిణ భారతదేశ భాషావ్యాకరణాలన్నీ అంటే తెలుగు, కన్నడం, మలయాళం మొదలైన భాషలన్నీ సంస్కృతవ్యాకరణ సంప్రదాయాల్ని అనుసరించాయి. అయితే సంస్కృత వ్యాకరణ సంకేత పద్ధతిని కూడా విశేషంగా అవలంబించి అనుసరించిన అర్వాచీన వ్యాకర్తల్లో బాల వ్యాకరణకర్త చిన్నయసూరి మొదటివాడు అని చెప్పక తప్పదు.

**I. తమిళంలో సంధి : తొల్కాప్పియనార్ -"తొల్కాప్పియం" :**

ద్రావిడ భాషల్లో చాలా ప్రాచీనమైన వాఙ్మయం గల భాష తమిళం. తమిళభాషలో మొట్టమొదటి గ్రంథం "తొల్కాప్పియం". దీన్ని రాసినవాడు తొల్కాప్పియనార్. "తొల్కాప్పియం" లో సంధిస్వరూపం చాలా చక్కగా చెప్పబడింది.

పూర్వపదాంత్యభాగానికీ పరపదాది భాగానికీ సంధి జరుగుతుంది. తమిళంలో సంధి నాలుగువిధాలుగా జరుగుతుంది. అచ్చు కు అచ్చుపరమైనప్పుడూ, హల్లుకు అచ్చుపరమైనప్పుడూ, అచ్చున కు హల్లుపరమైనప్పుడూ, హల్లుకి హల్లు పరమైనప్పుడూ సంధి అవుతుంది. ఇవి నామపదాలుకానీ, క్రియాపదాలు కానీ కావచ్చు. సంధికార్యాలు నాలుగు విధాలు. అందులో మూడు మార్పుతో కూడుకున్నవి. ఒకటి మార్పు లేనిది. ఈ మార్పు మూడు విధాలుగా వుంటుంది. ఒకటి ఆదేశం, రెండు ఆగమం, మూడు లోపం.

1. ఆదేశం : ఉదా : మణ్ + కుడుం = మట్కుడుం
2. ఆగమం : ఉదా : ఆనై + కోడు = ఆనైక్కోడు
3. లోపం : ఉదా : మరమ్ + వేర్ = మరవేర్

మొత్తం మీద తమిళభాషలో సంధి జరిగే సందర్భాలు రెండు విధాలుగా కన్పిస్తున్నాయి. ఒకటి ప్రాతిపదికకు విభక్తి ప్రత్యయం పరమైనపుడు సంధి జరుగుతుంది. అప్పుడు ఒక వర్ణం కానీ, ఔపవిభక్తిక ప్రత్యయం కానీ ఆగమం అవుతుంది.

**II. కన్నడంలో సంధి : కేశిరాజు -"శబ్దమణిదర్పణం" :**

కన్నడవైయాకరణుల లక్షణాలు తమిళవైయాకరణుల లక్షణాలకు దగ్గరగా వున్నాయి.

"ఎరడుం పలవుల వర్ణం
పరస్పరం కూడు వందమదుసంధివలం
స్వరరహితవ్యంజనమవు
పరవర్ణమనైదు తిర్పునాసంహితెయుళ్" (శబ్దమణిదర్పణం - 49)

రెండుకానీ, అంతకంటే ఎక్కువకానీ వర్ణాలు పరస్పరం కలిస్తే "సంధి" అవుతుందని కేశిరాజు చెప్పాడు. ఆ సంహితలో స్వర రహితమైన వ్యంజనం పరస్వరంతో కలుస్తుంది.

ఉదా : కూర్తు + ఈవం = కూర్తీవం

ఎన్న + అరసం = ఎన్నరసం

"పదమధ్యం పదదంత్యం
దిదగ్ధరిం సంధి విషయమెరడక్కుమిళా,
విదితప్రకృతి ప్రత్యయ
మొదవిద పదయుగద బెరకెచేడిద్దురతిం" (శబ్దమణిదర్పణం - 50)

కన్నడ భాషలో వ్యాకర్తలు సంధిని రెండు విధాలుగా విభజించారు. ఒకటి పద మధ్య సంధి. రెండు పదాంత్య సంధి.

**1. పదమధ్యసంధి :**

ఉదా : i) నామ విభక్తి :

మాతు + అం = మాతం

ii) ధాతు విభక్తి :

నుడిద + అం = నుడిదం

నుడిద + ఇర్ = నుడిదిర్

**2. పదాంత్యసంది :**

ఉదా : అవన + అళ్తనం = అవనాళ్తనం

బెసదిదెవు + ఒళ్ళం = బెసదిదెవొళ్ళం

కన్నడంలో సంధికార్యాలు మూడువిధాలుగా వుంటాయి. ఒకటి లోపం, రెండు ఉచితాక్షరాగమం, మూడు అంత్యాక్షరద్విత్వం.

1. లోపం : స్వరం పరమైనప్పుడు విభక్తి స్వరానికి, ప్రకృతి స్వరానికీ (అ,ఇ,ఉ, ఎలకు) లోపం అవుతుంది.

ఉదా : క్రమద + ఆయ్తు = క్రమదాయ్తు

చలద + ఆణ్మం = చలదాణ్మం

అరస + ఆళ్ = అరసాల్

2. ఆగమం : ఆ, ఇ, ఈ, ఎ, ఏ, ఐ, ఓ వర్ణాలకు అచ్చుపరమైనపుడూ, అవధారణార్థక "ఎ" కారం పరమందుగల షష్ఠీవిభక్త్యంత "అ" కారానికీ మధ్య "యు" కారం వస్తుంది.

ఉదా : ఆ + ఇర్ద ఆయుర్ద

కవి + ఆర్ = కవియార్

పసె + ఇర్దం = పసెయిర్దం

జో + ఎందు = జోయెందు

ఆతన + ఎ = ఆతనయె

ఉ, ఊ, ఋ, ౠ, ఓ, ఔ ల తర్వాత "వ" కారం వస్తుంది.

ఉదా : మనువిన, పూవిన, గోవిన.

3. ద్విత్వం : ఉదా : కణ్ + అం = కణ్ణం

పన్ + ఒన్డు = పన్నొండు

**III. తెలుగులో సంధి - వ్యాకర్తలు :**

1. మూలఘటిక కేతన - "ఆంధ్ర భాషా భూషణం"

"మొదలిపదము తుదివర్ణము
వదలక పైపదము మొదలివర్ణముతోడం
గదియగ సంధులు నాదగు
విదితపుఁదత్సంధులెల్ల వివరింతుదగన్"

(ఆంధ్ర భాషాభూషణం - 44)

పైన చెప్పిన సంధి నిర్వచనంలో రెండుపదాలు కలిసేటప్పుడు మొదటి పదంలోని చివరివర్ణం, తర్వాత పరమయ్యేపదంలోని మొదటివర్ణం కలిసేటప్పుడు సంధి జరుగుతుందని చాలా స్పష్టంగా తెలియజేశాడు కేతన.

2. విన్నకోట పెద్దన - "కావ్యాలంకార చూడామణి"

"ఆదిశబ్దాంతవర్ణంబు నంత్యశబ్ద
పూర్వవర్ణంబుతోఁగూడఁబొత్తు
చేత సంధియగు ....." నని విన్నకోట పెద్దన చెప్పాడు

(కావ్యాలంకార చూడామణి : 9-45)

బాగా పరిశీలిస్తే కేతన, విన్నకోట పెద్దనలు ఇద్దరూ చెప్పిన సంధి లక్షణాలకు తమిళ, కన్నడ వ్యాకర్తలు చెప్పిన సంధి లక్షణాలకు దగ్గర పోలికవుంది.

3. అధర్వణాచార్యులు - "వికృతివివేకం"

"ఆద్యంత వర్ణయోరైక్యం
సన్ధిరిత్యుచ్యతేబుధైః
పూర్వస్యపరరూపత్వ
మత్రైవనియతం భవేత్" (వి.వి. : సంధి-1)

అని తన కారికలద్వారా తెలియజేశాడు. సంస్కృతభాషలో కన్పించే పరరూపసంధి, తెలుగుభాషలో స్వరసంధి విషయంలో సర్వేసర్వత్ర నియతంగా జరగడం విశేషమని అధర్వణాచార్యులు చెప్పాడు.

4) అప్పకవి - "అప్పకవీయం"

"ఎచటసంధి గలుగునచటఁబూర్వపదాంత
హల్లుతోడఁగూడినట్టిస్వరము
లోపముగ నొనర్చి యాపొల్లుతోమీది
యక్షరంబు గూర్పనయ్యెసంధి"

పూర్వపదం చివర హల్లుతో కలిసివున్న స్వరాన్ని లోపింపజేసి మిగిలిన పొల్లుహల్లుతో తర్వాతి పదంలోని మొదటి అక్షరం కలిస్తే సంధి అవుతుందని అప్పకవిబిచెప్పాడు. .

5) పరవస్తు చిన్నయసూరి - "బాలవ్యాకరణం" -

"పూర్వపరస్వరంబులకు పరస్వరం
బేకాదేశంబగుట సంధియనంబడు" (బాల-సంధి-1) :

మూలఘటిక కేతన, విన్నకోట పెద్దన ఇరువురూ పూర్వాంత్య వర్ణాలు అచ్చులు మాత్రమే అని కానీ, పరరూపత్వం అనీ స్పష్టంగా తెలియజేయలేదు. అధర్వణాచార్యులు అచ్చుఅనకుండా వర్ణశబ్దం వాడినప్పటికీ పరరూపాన్ని చెప్పాడు. చిన్నయసూరి స్వరం అని నిర్దేశించడమే కాక పరరూపత్వాన్ని విధించాడు. అయితే సూరి "బాలవ్యాకరణం" లో (1858) సంధి పరిచ్ఛేదంలో హల్సంధుల్ని కూడా రాశాడు. బహుజనపల్లి సీతారామాచార్యులు "ప్రౌఢవ్యాకరణం" లో (1885) ఇదే విషయాన్ని గూర్చి పునరుద్ఘాటించాడు కూడా.

దీనికి కారణం ఏమంటే సంధి, సంధితుల్యాలైన వానినన్నింటిని అతడు గ్రహించాడని తెలుస్తుంది. అంటే సంధిశబ్దం, సంధికార్య విశేషంలో రూఢమైందని తెలుసుకోవాలి.

తెలుగుభాష అజంతభాష కాబట్టి చిన్నయసూరి స్వరాలకు సంబంధించిన మార్పులకే ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చాడు. అంచేత పరస్పర ఏకాదేశ రూప కార్యమే "సంధి" అని చెప్పాడు. అధర్వణాచార్యులు కూడా ఇలాగే చెప్పాడు. "పూర్వస్య పరరూపత్వ మత్రైవ నియతంభవేత్" (అధర్వణ కారికలు) చిన్నయసూరి పూర్వాంధ్ర వైయాకరణుల మతానుసారం పరరూపసంధియే "సంధి" అని గ్రహించాడు.

పైవిధంగా "సంధి" అనే పదాన్ని గూర్చి ప్రముఖ వ్యాకర్తలు పలు విధాలుగా నిర్వచించారు. ఎవరు ఎన్ని రకాలుగా "సంధి" ని నిర్వచించినా భావం మాత్రం ఒక్కటే. ఒక్క మాటలో చెప్పాలంటే ఆద్యంత వర్ణాల కలయికే "సంధి"

## 2.2. సంధులు :

తెలుగు అజంత భాష. అంటే పదాల చివర అచ్చులు గల భాష. కాబట్టి రెండు పదాల మధ్య అచ్చులతో అచ్చులకే సంధి సాధారణం. హలాదులైన (హల్లులతో ప్రారంభమయ్యే) పదాలకు పూర్వ పదాలతో సాధారణంగా సంధి వుండదు.

### 2.2.1. జాతుల్ని బట్టి సంధులు :

తెలుగు పదాల జాతుల్ని బట్టి సంధుల్ని రెండు పెద్ద తెగలుగా వర్గీకరించవచ్చు.

1. సాంస్కృతిక సంధులు, 2. తెలుగు సంధులు

### 1. సాంస్కృతిక సంధులు :

సాంస్కృతిక సమాసాల్లోని పదాల నడుమ వచ్చే సంధులు సాంస్కృతిక సంధులు. సంస్కృత సంధి నియమాల ప్రకారమే ఈ సంధులు జరుగుతాయి. సాంస్కృతిక సమాసం అంటే సామాసిక ప్రాతిపదికలతో కూర్చిన పద సముదాం. తుదిని తెలుగు ప్రత్యమం వుంటుంది.

ఉదా॥ ప్రజా + అధినేత = ప్రజాధినేత

సత్ + మార్గము = సన్మార్గము

దుః + అవస్థ = దురవస్థ

వేర్వేరు తెలుగు పదాల నడుమ గాని, తెలుగు సమాసాలలోని పదాల నడుమ కాని, జరిగే సంధులు తెలుగు సంధులు

ఉదా॥ బలము + ఉన్నది = బలమున్నది

చెన్ను + కలువ = చెంగలువ

### 2.2.2. సంధి జరిగే స్థానాన్ని బట్టి సంధులు :

సంధి జరిగే స్థానాన్ని బట్టి సంధి రెండు విధాలు.

1. బహిస్సంధి లేక పదాంత సంధి
2. అంతస్సంధి లేక పదమధ్య సంధి

### 1. బహిస్సంధి :

రెండు వేర్వేరు పదాల మధ్య జరిగే సంధి "బహిస్సంధి". పూర్వ పదాంత మందు జరుగుట చేత దీనిని "పదాంత సంధి" అని అంటారు.

ఉదా॥ (అ) వారు + అన్నారు = వారన్నారు

(ఆ) గురు + ఆజ్ఞ = గుర్వాజ్ఞ

**2. అంతస్సంధి :**

ఒకే పదం లోపల రెండు అంశాల నడుమ జరిగే సంధి అంతస్సంధి. పదమధ్య మందు జరుగుట చేత దీనిని "పదమధ్య సంధి" అని పేరు. పదాంశం అంటే చివరి ప్రత్యామం కాని, ముందు వున్న ఉపసర్గ కాని కావచ్చు.

ఉదా॥ మూర + ఎడు = మూరెడు

గేస్తు + ఆలు = గేస్తురాలు

(ఇవి తెలుగు ప్రత్యమ సంధులు)

ఉదా॥ పరి + అటనమ = పర్యటనము

అభి + ఇష్టము = అభీష్టము

(ఇవి ఉపసర్గ సంధులు)

**2.2.3. సంధి వర్ణాల స్వభావాన్ని బట్టి సంధులు :**

సంధి వర్ణాల స్వభావాన్ని బట్టి సంధి నాలుగు విధాలు. 1. అచ్ సంధి (స్వరసంధి), 2. హల్ సంధి (వ్యంజన సంధి), 3. విసర్గ సంధి, 4. అనుస్వార సంధి

**1. అచ్ సంధి :**

సంధి వర్ణాలు రెండూ అచ్చులు అయినప్పుడు జరిగే సంధి అచ్ సంధి లేక స్వర సంధి

ఉదా॥ నీవు + ఎవరవు = నీవెవరు (తెలుగు సంధి)

పితృ + ఆదేశము = పిత్రాదేశము (సాంస్కృతిక సంధి)

**2. హల్ సంధి (వ్యూంజన సంధి) :**

సంధి వర్ణాల రెండింటిలో ఒకటి హల్లు అయినప్పుడు జరిగే సంధి హల్సంధి లేక వ్యంజన సంధి ఇది మూడు విధాలు.

అ) హల్లు + హల్లు, ఆ) హల్లు + అచ్చు, ఇ) అచ్చు + హల్లు

**అ) హల్లు + హల్లు :**

రెండు పదాలు హలంతాలు కావు. కావున తెలుగు సంధుల్లో రెండు హల్లుల సంధి అసంభవం సాంస్కృతిక సమాన సంధులు ఇలాంటివి.

ఉదా॥ జీవత్ + భాష = జీవద్భాష

వాక్ + మాధుర్యము = వాఙ్మధుర్యము

**ఆ) హల్లు + అచ్చు :**

హల్లుతో అచ్చుకు కలిగే సంధి కూడా సాంస్కృతిక సమాసాలలోనే వుంటుంది

ఉదా॥ దిక్ + అంతము = దిగంతము

జగత్ + ఈశుడు = జగదీశుడు

**ఇ) అచ్చు + హల్లు :**

అచ్చుతో హల్లుకు అయ్యే సంధులు

ఉదా॥ వృక్ష + ఛాయ = వృక్షచ్ఛాయ (సాంస్కృతిక సంధి)

కను + తమ్మి = కనుదమ్మి (తెలుగు సంధి)

**3. విసర్గ సంధి :**

విసర్గ సంధి సాంస్కృతిక సమాస సంధి. విసర్గకు హల్లుగానే పరిగణన. కాబట్టి ఇది ఒక విధమైన హల్సంధే. విసర్గకు అచ్చుతో కాని, హల్లుతో కాని సంధి వుండవచ్చు.

ఉదా॥ పునః + ఆలోచన = పునరాలోచన

మనః + భావము = మనోభావము

**4. అనుస్వార సంధి :**

అనుస్వారాంతాలైన పదాలు తెలుగులో వున్నాయి. అనుస్వారానికి హల్లు గానే పరిగణన. కాబట్టి ఇది కూడా హల్సంధి భేదమే

ఉదా॥ సులభం + ఆ = సులభమా

**2.2.4. జరగడం, జరగకపోవడం బట్టి సంధులు :**

సంధి జరుగుట, జరుగక పోటను బట్టి సంధి రెండు విధాలు : 1. నిత్య సంధి, 2. వైకల్పిక సంధి.

**1. నిత్య సంధి :**

తప్పనిసరిగా జరిగే సంధి నిత్య సంధి. నేటి తెలుగులో నిత్య సంధులు తక్కువ

ఉదా॥ నేనో (నేను + ఓ), నీవు (నీవు + ఓ) ఈ పని చేయాలి

దిక్కులేని వారికి దేవుడే (దేవుడు + ఏ) తోడు

నీవు మనిషిని కావా (కావు +ఆ)

కను + కవ (కనుగవ)

పై మొదటి మూడు వాక్యాల్లో ఓ, ఏ, ఆ, అనే ఏ కాక్షర పదాలకు పూర్వ పదాంత్య ఉకారంతో నిత్య సంధి. నాల్గవ ఉ దాహరణ సమాన సంధి నిత్య సంధి.

**2. వైకల్పిక సంధి :**

వక్త లేక రచయిత ఇష్టాన్ని బట్టి సంధి చేయడం కాని, చేయకపోవడం కాని సమ్మతమైతే ఆ సంధి వైకల్పికం.

ఉదా॥ అది + ఏమి = అదేమి, అది యేమి, అది ఏమి

ఇక్కడ రాతలో సంధి చేసినా, చేయకపోయినా దోషం లేదు.

**2.2.5. సంధిలో జరిగే వర్ణ వికారం :**

సంధిలో జరిగే వర్ణ వికారం మూడు విధాలు. 1. లోపం, 2. ఆగమం, 3. ఆదేశం.

**1. లోపం :**

పూర్వపద, అంత్యవర్ణం కాని, ఉత్తర పద, ఆద్య వర్ణం కాని తొలగిపోవుటయే వర్ణలోపం.

అ) వాడు + ఎవడు = వాడెవడు

ఇక్కడ పూర్వ వర్ణలోపం. ఉత్తర పద, ఆద్య వర్ణమైన ఎత్వం నిల్చినది. ఇది పర రూపసంధి

ఆ) వాని + అది = వానిది (అది - ప్రత్యయము)

ఇక్కడ ఉత్తర పదాంశాది అయిన ఆ వర్ణానికి లోపం. పూర్వ పద, అంత్య ఇవర్ణం నిల్చినది. ఇది పూర్వ రూప సంధి.

ఇలాంటి సంధులు లోప సంధులు

**2. ఆగమం :**

రెండు సంధి వర్ణాల నడుమ మరో వర్ణం కొత్తగా వచ్చుట వర్ణ ఆగమం

ఉదా॥ తేనె + ఈగ = తేనెటీగ

మా + ఊరు = మావూరు

ఇలాంటి సంధులు ఆగమ సంధులు

**3. ఆదేశం :**

సంధి వర్ణాలలో ఒకటి పోయి దాని స్థానే మరొక వర్ణం వచ్చుట వర్ణ ఆదేశం

తల్లి + తండ్రి (బహు వచనలు వర్ణం) తల్లిదండ్రులు

ఇక్కడ ఉత్తర పదాది “త” వర్ణానికి బదులు “ద” వర్ణం వచ్చింది. ఇలాంటివి ఆదేశ సంధులు.

## 2.3. తెలుగు అచ్సంధులు :

1. అ, ఆ, ఇ, ఈ ఊ, ఎ, ఏ, ఐ, ఒ, ఓ, ఔ ల మీద అ, ఆ, ఐ, ఔలకు సధి లేదు

   ఉదా॥ పెద్ద + అడవి = పెద్ద అడవి

2. అ, ఆ, ఇ, ఈ, ఎ, ఏ, ఐ, ఒ, ఓ, ఔ లకు ఇ, ఈ, ఎ, ఏ లు పరమైతే సంధి వైకల్పికం. సంధిలో య కారం ఆగమంగా వస్తుంది. పరమగుట అంటే తర్వాత వచ్చుట అని అర్థం.

   ఉదా॥ అమ్మ + ఇప్పుడు = అమ్మ ఇప్పుడు అమ్మ యిప్పుడు

   చేప + ఈదును = చేప ఈదును, చేప యీదును

3. అ, ఆ, ఇ, ఈ, ఊ, ఎ, ఏ, ఐ, ఒ, ఓ, ఔ లకు ఉ, ఊ, ఒ, ఓ, లు పరమైతే సంధి వైకల్పికం. సంధిలో వకారం ఆగమంగా వస్తుంది

   ఉదా॥ ఒక + ఉత్తరం = ఒక ఉత్తరం, ఒక వుత్తరం

   మా + ఊరు = మా ఊరు, మావూరు

4. ఏమి, అది, అవి, ఇది, ఇవి - ఈ సర్వనామాలకు అది - అవి, ప్రత్యయాంత పదాలకు ఇ, ది, వి -ప్రత్యయాంత క్రియలకు అచ్చుపరమైతే సంధి వైకల్పికం

   ఉదా॥ అది + ఎవరు = అది ఎవరు (వి సంధి)

   అదెవరు (స్వరలోపం)

   అది యెవరు (య-ఆగమం)

   ఏమి + ఉన్నది = ఏమి ఉన్నది (వి సంధి)

   ఏమున్నది (స్వరలోపం)

   ఏమివున్నది (వ-ఆగమం)

5. ఇకారాంతాలైన నామాలు, విశేషణాలు, అసమాసక క్రియలు, మొదలైన పదాలకు అచ్చు పరమైతే సంధి వైకల్పికం

ఉదా॥ చేయి + ఎత్తి = చేయిఎత్తి, చేయెత్తి

తెలివి + ఉంటే = తెలివి ఉంటే, తెలివి వుంటే

6. ని, ను, కి, కు అనే విభక్తి ప్రత్యమాలు గల పదాలు మీద అచ్చు చేరితే సంధి వై కల్పికం

| | | | |
|---|---|---|---|
| ఉదా॥ | హరిని + ఆశ్రయించు | = | హరిని ఆశ్రయించు (విసంధి) |
| | | | హరినాశ్రయించి (స్వరలోపం) |
| | గోవులను + అడ్డగించి | = | గోవులను అడ్డగించి |
| | | | గోవులనడ్డగించి |

7. ఉకారానికి అచ్చు పరమైతే సంధి వైకల్పికం

| | | | |
|---|---|---|---|
| ఉదా॥ | గోవిందుడు + అప్పుడు | = | గోవిందుడు అప్పుడు |
| | | | గోవిందుడప్పుడు |
| | చదువునందు + ఆసక్తి | = | చదువునుందు ఆసక్తి |
| | | | చదువునందాసక్తి |

8. సంధిలో పరస్వరం అయిన ఋకారం రేఫతుల్యం, హల్లువంటిది. కనుక దీనికి సంధి రాదు.

| | | | |
|---|---|---|---|
| ఉదా॥ | అతడు + ఋషి | = | అతడు ఋషి |

9. హ్రస్వాచ్చులకు ప్రశ్నార్థకమైన "ఆ" అనే ఏకాక్షర పదం చేరితే సంధి నిత్యం

| | | | |
|---|---|---|---|
| ఉదా॥ | ఉన్నది +ఆ | = | ఉన్నదా |
| | వచ్చావు + ఆ | = | వచ్చావా |
| | నేను వచ్చేది + ఆ | = | నేను వచ్చేదా |

10. దీర్ఘ సంయుక్తాచ్చులకు ప్రశ్నార్థక "ఆ" పరమైతే వకారం ఆగమంగా వస్తుంది.

| | | | |
|---|---|---|---|
| ఉదా॥ | ఇది మీ జాగా + ఆ | = | ఇవి మీ జాగావా |
| | ఏది కావాలి, కాపీ + ఆ, టీ + ఆ | = | ఏది కావాలి కాఫీవా, టీవా |

11. హ్రస్వాచ్చుల మీద నిశ్చయార్థకమైన "ఏ" అనే ఏకాక్షర పదం చేరితే సంధి నిత్యం

| | | | |
|---|---|---|---|
| ఉదా॥ | అది + ఏ | = | అదే |

| | | |
|---|---|---|
| రవి + ఏ | = | రవే |
| జానకి + ఏ | = | జానకే |

12. దీర్ఘ, సంయుక్తాచ్చుల మీద నిశ్చయార్థకమైన 'ఏ' చేరితే యకారం కాని, వకారం కాని ఆగమిస్తుంది.

| | | | |
|---|---|---|---|
| ఉదా॥ | కాఫీ + ఏ | = | కాఫీయే, కాఫీవే |
| | రేడియో + ఏ | = | రేడియోయే, రేడియోవే |

13. దీర్ఘాంతమైన విధ్యర్థక క్రియకు ఏకవచనంలో స్త్రీ సంబుద్ధి వాచకమైన "ఏ" పరమైతే సంధిలో "వ"కారం ఆగమిస్తుంది.

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| ఉదా॥ | రా + లు | = | రావే | | | |
| | పో + ఏ | = | పోవే, | తే + ఏ | = | తేవే |
| | అందుకో + ఏ | = | అందుకోవే | లే + ఏ | = | లేవే |

14. హ్రస్వాంతమైన విధ్యర్థక క్రియ మీద ఏకవచనంలో స్త్రీ సంబుద్ధి వాచకమైన "ఏ" చేరితే సంధి వల్ల రెండు రూపాలు సిద్ధిస్తాయి.

| | | | |
|---|---|---|---|
| ఉదా॥ | చూడు + ఏ | = | చూడే, చూడవే |

15. హ్రస్వాచ్చులకు "ఓ" అనే ఏకాక్షర పదం పరమైతే సంధి నిత్యం.

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| ఉదా॥ | అది + ఓ | = | అదో | ఇది + ఓ | = | ఇదో |
| | నేను + ఓ | = | నేనో | వాడు + ఓ | = | వాడో |
| | ఎవరు + ఓ | = | ఎవరో | ఎంత + ఓ | = | ఎంతో |

16. దీర్ఘాచ్చులమీద "ఓ" చేరితే సంధిలో వకారం ఆగమిస్తుంది.

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| ఉదా॥ | కాఫీ + ఓ | = | కాఫీవో | టీ + ఓ | = | టీవో |
| | జగా + ఓ | = | జాగావో | బంగాళా + ఓ | = | బంగళావో |
| | లుంగీ + ఓ | = | లుంగీవో | లంగా + ఓ | = | లంగావో |

17. ఒకటి కన్నా హెచ్చు పదాలు గల సమగ్ర క్రియలలో ఉకారానికి సంధి నిత్యం.

| | | | |
|---|---|---|---|
| ఉదా॥ | వెళ్లుతు + ఉన్నాడు | = | వెళ్లుతున్నాడు |
| | వస్తు + ఉన్నాను | = | వస్తున్నాను |
| | చెప్పక + ఉన్నాడు | = | చెప్పకున్నాడు |

18. ధ్వన్యనుకరణ శబ్దాల తుది అచ్చుకు "అని" మొదలైన "అను" ధాతు రూపాలు పరమైతే సంధిలో మకారం ఆగమిస్తుంది.

ఉదా॥ గణ గణ మని గంట మ్రోగింది

ఇక్కడ గణ గణ + అని = గణ గణమని (ఆగమ సంధి)

19. మధ్యమ పురుష విధ్యర్థక క్రియ తుది అచ్చుకు నిశ్చయార్థమైన ఆ - ఈ లు పరమైతే సంధిలో మకారం వస్తుంది.

ఉదా॥ చూడు + ఆ = చూడుమా

చూడు + ఈ = చూడుమీ

20. ముఖాంతర కథనంలో "అ" వర్ణకాంతమైన అసమాపక క్రియ మీద "అను" ధాతురూపం ఏదైనా చేరితే సంధిలో మకారం ఆగమంగా వస్తుంది.

ఉదా॥ చేర + అని = చేరమని

ఉండ + అన్నాడు = ఉండమన్నాడు

పో + అంటే = పొమ్మంటే

21. హ్రస్వాచ్చులు అంతలో గల పదాలతో సముచ్చయం, అర్థ విశేష బోధకం, అయిన "ఉ" శబ్దం చేరితే ఆహ్రస్వాచ్చులకు దీర్ఘం వస్తుంది. "ఉ" లోపిస్తుంది.

ఉదా॥ రాముడు + ఉ = రాముడూ    హరి + ఉ = హరీ

అందరు + ఉ = అందరూ    ఎక్కడ + ఉ = ఎక్కడా

**"న"కార ఆగమ సంధి :**

కొన్ని అజంత పదాల తర్వాత అజాది పదాలు వచ్చినప్పుడు సంధి స్వరాల మధ్య "న"కారం ఆగమంగా వస్తుంది. ఈ నకారానికి చరిత్ర వుంది. ఈ కింద పేర్కొన్న పెక్కు సంధుల్లోని ఆగమనకారం ఒకప్పుడు పదావయవమైన నకారమే అయినా, కేవలం ఉచ్చారణ సౌకర్యం కొరకు వచ్చిన నకారంగానే దీనిని నేడు పరిగణించవచ్చు.

1. "అ"వర్ణకాంతాలైన కొన్ని నామాల మీద అచ్చు చేరితే కొన్ని చోట్ల "న" కారం ఆగమం వస్తుంది. ఒకొక్కప్పుడు సంధిరాదు.

ఇల్లు + అ = ఇంట

ఒడ్డు + అ = ఒడ్డున,

ఉదయము + అ = ఉదయమున, ఉదయాన

ఇలాంటి పదాలు "అ" వర్ణకాంతాలు. వీటికి వాక్యంలో క్రియలతో అన్వయం. ఈ విభక్తి కారక వాచక విభక్తి.

ఉదా॥ ఇంట + ఉన్న = ఇంటనున్న (ఇంటిలో)

చేత + ఉన్న = చేతనున్న (చేతిలో)

ఉదయాన + ఓ = ఉదయాననో

సముద్రపు టొడ్డున + ఇద్దరును = సముద్రపు టొడ్డున ఇద్దరును (సంధికాదు)

2. అప్రయత్యయాంత కారకం మీద ఏకాచ్కాలైన ఆ, ఏ, ఓ, లు చేరితే నకారం ఆగమంగా వస్తుంది. పర రూప సంధి కావడం కూడా కద్దు.

కారకం అంటే క్రియా బోధితమైన వ్యాపారంలోని విశేషాన్ని తెలిపే పదం. అక్కడ, అంతట, లోపల మొదలైనవి.

ఉదా॥ అక్కడ + అ = అక్కడ నా అక్కడా

లోపల + ఏ = లోపలనే, లోపలే

ఎక్కడ + ఓ = ఎక్కడనో, ఎక్కడో

3. "గా" ప్రత్యయాంతాలైన కారకాలమీద ఏకాచ్క పదాలు చేరితే సంధిలో నకారం వస్తుంది.

ఉదా॥ తిన్నగా + ఏ = తిన్నగానే

ఎంతగా + ఓ = ఎంతగానో

ఎక్కువగా + ఆ = ఎక్కువగానా

4. అ వర్ణకాంతాలైన వైభక్తికాల మీద ఏకాచ్చ పదాల చేరితే నకారం ఆగమిస్తుంది. పరరూప సంధి కూడా అవుతుంది.

అవర్ణ కాంత వైభక్తికాలు : చేత, వల్ల, లోపల, క్రింద, మీద, వద్ద, యు లావ, మొదలైనవి. ఇవి నామాలతో కలిసి విభక్తి ప్రత్యమాలు చేసే పనినే చేస్తాయి. కారకాల వలె క్రియలతో అన్వయిస్తాయి.

ఉదా॥ బాలుని చేత + ఏ = బాలుని చేతనే, బాలుని చేతే

దేని వల్ల + ఓ = దేని వల్లనో, దేని వల్లో

చెట్టు మీద + ఓ = చెట్టు మీదనో, చెట్టు మీదో

దీర్ఘ సంయుక్తాచ్చులు అంత మందు గల వైభక్తికాల మీద ఏకాచ్క పదాలు చేరితే సంధిలో నకార ఆగమం నిత్యం

ఉదా॥ ఇంటిలో + ఆ = ఇంటిలోనా

నాతో + ఏ = నాతోనే

ఎవరిపై + ఓ = ఎవరిపైనో

వైభక్తికాలమ మీద అజాదులైన ఏకాధికాక్షర విశిష్ట పదాలు చేరితే సంధి రాకపోవుటే వాడుక.

ఉదా॥ చెట్టు మీద + ఎన్ని కాకులు = చెట్టు మీద ఎన్ని కాకులు

నాతో + ఎందుకు = నాతో ఎందుకు

5. అప్రత్యయాంత అసమాపక క్రియల మీద ఏకాచ్చ పదాలు గాని, అజాదులైన ఇతర పదాలు గాని చేరితే సాధారణంగా నకారం ఆగమంగా వస్తుంది.

ఉదా॥ వెళ్ళ + ఏ (+ లేదు) = వెళ్ళనే లేదు, వెళ్ళే లేదు

చెప్ప + ఏ (+ చెప్పడు) = చెప్పనే చెప్పడు, చెప్పే చెప్పడు

6. "గా" ప్రత్యయాంత అసమాపక క్రియల మీద "ఏ" చేరితే నకారం వస్తుంది. అజాదులైన స్వంత్ర పదాలు వస్తే సంధి రాదు.

ఉదా॥ వెళ్ళగా + ఏ = వెళ్ళగానే

చెప్పంగా + ఏ = చెప్పంగానే

వెళ్ళగా వెళ్ళగా + అడవిలో = వెళ్ళగా వెళ్ళగా అడవిలో (ఇక్కడ సంధి లేదు)

7. "తే" ప్రత్యయాంత అసమాపక క్రియల మీద ఏ కాచ్కు పదాలు చేరితే "న" కారం ఆగమిస్తుంది.

తే, అంత, క్రియలు : అయితే, వెళ్ళితే, పుట్టితే, వస్తే, చేస్తే మొదలైనవి.

"తే"కి బదులుగా "టే" వచ్చినవి : అంటే, తింటే, వింటే మొదలైనవి.

ఉదా॥ మీరు ఇపుడే బయలు దేరితేనో

ఈ వాక్యంలో బయలు దేరితే + ఓ = బయలు దేరితేనో

నీవు ఉంటేనే ఈ కార్యం నెరవేరుతుంది

ఈ వాక్యంలో ఉంటే + ఏ = ఉంటేనే

8. "అక" ప్రత్యయాంత అసమాపక క్రియల మీద ఏకాచ్కు పదాలు చేరితే తరుచుగా "న" కారం ఆగమిస్తుంది. పరరూప సంధి కూడా వస్తుంది.

ఉదా॥ సరిగా చదువకనో, వ్రాయకనో, వాని పరీక్ష పోయింది. ఇక్కడ చదువుక + ఓ, వ్రాయక + ఓ = చదువకనో, వ్రాయకనో, చదువకో, వ్రాయకో అని కూడా సంధి చేయవచ్చు.

ధనము లేకనే (లేకే) వానికి ఆగతి పట్టినది. ఇక్కడ లేక + ఏ = లేకనే, లేకే

9. "ఇన" ప్రత్యయాంత అసమాపక క్రియ "తే" ప్రత్యయాంతంతో సమానమైన అర్థంకల ప్రాచీన రూపం దీని మీద "ఉ" శబ్దం చేరితే "న" కార ఆగమం, లేక పూర్వ స్వరానికి దర్ఘం వస్తుంది.

ఉదా॥ వెళ్ళిన + ఉ = వెళ్ళినను, వెళ్ళినా (=వెళ్ళినప్పటికీ)

10. "ఏ" ప్రత్యయాంత అసమాపక క్రియల (విశేషణాల) మీద అందుకు, అప్పుడు, అంత, మొదలైన సన్నిహిత సంబంధం కల వైభక్తిక పదాలు పరమైతే సంధిలో ఉకారం వస్తుంది. ఒక్కొక్కప్పుడు పరస్వరం లోపిస్తుంది.

ఉదా॥ తెచ్చే + అందుకు = తెచ్చేటందుకు, తెచ్చేందుకు

వచ్చే + అప్పుడు = వచ్చేటప్పుడు, వచ్చేప్పుడు

చెప్పే + అంతటి = చెప్పేటంతటి, చెప్పేంతటి

పై అసమాపక క్రియల మీద వైభక్తికేతర స్వతంత్ర పదాలు వస్తే సంధి వుండదు.

ఉదా॥ వచ్చే ఆదివారం నాడు, రక్షించే ఉపాయం, చూపే ఆదరణ మొ॥

11. ఏకాచ్చపదాలు ఏ, ఓ, లు చేరిన పదాలకు "ఆ", "ఉ", "అని" పరమైతే నకారం వస్తుంది.

ఉదా॥ నీవే + ఆ = నీవేనా

నేనే + ఉ = నేనేను

ఏమో + అని = ఏమోనని

"అదేమోనే నన్నడగకు" అనే వాక్యం స్త్రీని సంబోధించి పలికింది. ఇక్కడ ఏమో + ఏ = ఏమోనే

**తెలుగు సమాస సంధులు :**

**సమాసం - నిర్వచనం :**

రెండు కాని, రెండింటి కన్నా ఎక్కువ కాని, పదాలు ఒక దానిలో ఒకటి కలిపి ఏక పదంగా ఏర్పడితే, అది సమాసం. సమాస పదం ఏక వస్తు బోధకం. "వస్తువు" అంటే ఇక్కడ "వ్యక్తి" కూడా కావచ్చు.

1. తెలుగులో బంధుత్వ సూచకాలు, వ్యక్తి బోధకాలు గ్రామ నిర్దేశకాలు అయిన నామాలలో కొన్ని సమాసాలున్నాయి. ఈ సమాసాలలో తరచుగా అత్త, అల్లుడు, అయ్య, అమ్మ, అప్ప మొదలైనవి ఉత్తర పదాలుగా వుంటాయి. గ్రామ నామాలలో ఊరు అవే పదం వుంటుంది. కొన్ని నామాలలో తత్సయ పదాలతో అచ్చ తెలుగు పదాలు యధేచ్ఛంగా సమసించును.

బంధత్వ సూచక, వ్యక్తి, గ్రామ, బోధక నామాలలో అచ్చుకు అచ్చు పరమైతే సంధి నిత్యం.

**1. బంధు సూచక నామాలు :**

| | | | |
|---|---|---|---|
| ఉదా॥ | మేన + అత్త | = | మేనత్త |
| | మేన + అల్లుడు | = | మేనల్లుడు |
| | చిన్న + అన్న + అయ్య | = | చిన్నన్నయ్య |
| | అమ్మ + అమ్మ | = | అమ్మమ్మ |

మరికొన్ని ఉదాహరణలు : బుచ్చక్కయ్య, దొడ్డమ్మ, పెద్దబ్బి, పెద్దబ్బాయి, చిన్నత్త మొ॥

**2. వ్యక్తి నామాలు :**

| | | | |
|---|---|---|---|
| ఉదా॥ | వెంకట + అప్ప + అయ్య | = | వెంకటప్పయ్య |
| | అప్పల + ఆచారి | = | అప్పలాచారి |
| | లక్ష్మి + అయ్య | = | లక్ష్మయ్య |
| | జోగులు + అమ్మ | = | జోగులమ్మ |

ఇలాంటివే మరికొన్ని ఉదాహరణలు : గౌరమ్మ, చెల్లప్ప, వెంకయ్య, రామన్న, లచ్చన్న, నూకాలమ్మ, పంతులమ్మ, బుల్లయ్య, రాఘవమ్మ, బుచ్చబ్బాయి, సూరయ్య, శివయ్య, జానకమ్మ మొదలైనవి.

ఇకారాంత పదం మీద అకారాదిపదం చేరిత పూర్వ పరస్వరాలు రెండింటికి ఎత్వం ఒక్కటే ఆదేశంగా వస్తుంది. ఈ ఎత్వానికి హ్రస్వమే హస్వరోచ్చారణ.

| | | | |
|---|---|---|---|
| ఉదా॥ | చిట్టి + అమ్మాయి | = | చిట్టెమ్మాయి |
| | ఆది + అమ్మ | = | ఆదెమ్మ |
| | బుల్లి + అమ్మ | = | బుల్లెమ్మ |

**3. గ్రామనామాలు :**

| | | | |
|---|---|---|---|
| ఉదా॥ | కొత్త + ఊరు | = | కొత్తూరు |
| | చింతల + ఊరు | = | చింతలూరు |
| | కొత్త + అగ్రహారం | = | కొత్తగ్రహారం |

ఇలాంటివే గుమ్మలూరు, కొవ్వూరు, సాలూరు, ఏలూరు, నాగూరు, మొట్టూరు మొదలైనవి.

2. సమాస పదాలైన కొన్ని సాధారణ వస్తు వాచక నామాలలో సైతం అచ్చుకు అచ్చు పరమైతే సంధి నిత్యం ఇత్వం మీద "ఆ" చేరినచోట్ల "ఆ"కు మేష స్వరోచ్చారణ.

ఉదా॥ పోగ + ఆకు = పోగాకు

చింత + ఆకు = చింతాకు

వేప + ఆకు = వేపాకు

చిగురు + ఆకు = చిగురాకు

కొన్ని కారకాది పదాలలోనూ నిత్య సంధి కన్పిస్తుంది.

ఉదా॥ ఒకొక్క + అప్పుడు = ఒకొక్కప్పుడు

అప్పుడు + అప్పుడు = అప్పుడప్పుడు

అక్కడ + అక్కడ = అక్కడక్కడ

కొన్ని సమాసాలలో సంధి లేకపోవుట కద్దు

ఉదా॥ దుక్క + ఇనుము = దుక్క ఇనుము, దుక్కయినుము

పోత + ఇనుము = పోత ఇనుము, పోతయినుము

కండె + ఎముక = కండె ఎముక, కండెయెముక

పై సమాసాలలో య కార, ఆగమం సమ్మతమే, తొలి పదం, తొలి అక్షరం మీదనే స్వరాఘాతం. రెండవ పదం తొలి అక్షరం మీద స్వరాఘాతం లేదు.

3. ఆశ్చర్య, విషాద, సంతోషాది మనో వికారల అతిశయ్యాన్ని తెలిపే అమ్రేడిత సమాసాలతో అచ్చు మీద చేరే అచ్చుకు సంధి తప్పక వస్తుంది.

ఉదా॥ అయో + అయోయ = అయ్యయ్యో

ఆహా + ఆహా = ఆహాహా

ఏమిటి + ఏమిటి = ఏమిటేమిటీ

ఇదిగో + ఇదిగో = ఇదిగిదిగో

ఇలాంటి ఆమ్రేడిత సంధులు క్రియలలో కూడా వస్తాయి.

ఉదా॥ అరచి + అరచి = అరచరచి

అనగా + అనగా = అనగనగా

ఉండు + ఉండు = ఉండుండు

వ్యంజక పదాల ద్విరుక్తిలో వక్త ఇచ్ఛను బట్టి సంధి రాకపోవుట కద్దు. అలాంటి చోట్ల సమాపరచన లేదు.

ఉదా॥ ఔరా ! ఔరా ! ఎంత పని చేశాడు

అయో ! అయో! నా కొంప మునిగింది.

దీర్ఘాంతాలైన సంబుద్ధి పదాలకును, క్రియలకును ద్విరుక్తిలో సంధి రాదు. అలాంటి చోట్ల సమాస రచన లేదు.

ఉదా॥ అక్కా, అక్కా వేగంరావే

ఉండే, ఉండే తొందర పడకు

ఉంటావా, ఉంటావా, ఒక క్షణం

4. వీప్సలోను, కించి దూనతార్థంలోను, ఆయా ద్విరుక్త పదాల సంధిలో పూర్వ పద, అంత్య స్వరానికి, విభక్తికి లోపం వస్తుంది.

| | | | |
|---|---|---|---|
| ఉదా॥ | అక్కడ + అక్కడ | = | అక్కడక్కడ |
| | అప్పటికి + అప్పటికి | = | అప్పటప్పటికి |
| | ఇంట + ఇంట | = | ఇంటింట |
| | ఊర + ఊర | = | ఊరూర |
| | నాటికి + నాటికి | = | నానాటికి |
| | ఉప్పగా + ఉప్పగా | = | ఉప్పుప్పగా |

5. "కచ్చితము'' అనే అర్థంలో కొన్ని పదాలకు ద్విరుక్తి వస్తుంది. ఇలాంటి సమాసాల్లో పరరూపమైన ఆమ్రేడిత సహిత ద్విత్వట కారంతో కూడి ముందు వస్తుంది. తది తరాక్షరాలకు లోపం కలుగుతుంది.

| | | | |
|---|---|---|---|
| ఉదా॥ | నడుము + నడుము | = | నట్టనడుము (నట్టనడుము అంటే) ఎచ్చు తక్కువలు లేని సరైన నడుము అని అర్థం |
| | కడ + కడ | = | కట్టకడ్డ |
| | తుద + తుద | = | తుట్టతుద |
| | చివర + చివర | = | చిట్ట చివర |

6. కొన్ని సమాసాలలో అచ్చుకు అచ్చు పరమైతే రెండు పదాల నడుమ "ఉ'' కారం ఆగమంగా వస్తుంది. ఉకారం రాని లోప సంధి కూడా కొన్ని చోట్ల వస్తుంది.

| | | | |
|---|---|---|---|
| ఉదా॥ | నిలువు + అద్దము | = | నిలువుట్టదము |
| | పెంకు + ఇల్లు | = | పెంకుటిల్లు |
| | దుక్కి + ఎద్దు | = | దుక్కిటెద్దు |

7. కొన్ని సమాసాల్లో సంధ్యచ్చుల మధ్య రకారం ఆగమంగా వస్తుంది.

| | | | |
|---|---|---|---|
| ఉదా॥ | పొద + ఇల్లు | = | పొదరిల్లు |
| | బొమ్మ + ఇల్లు | = | బొమ్మరిల్లు |
| | గంగి + ఎద్దు | = | గంగిరెద్దు, గంగెద్దు (లోప సంధి) |

8. కొన్ని సమాసాలలో సంధ్యచ్చుల నడుమ - పకారం ఆదేశంగా వస్తుంది.

| | | | |
|---|---|---|---|
| ఉదా॥ | తామర + ఆకు | = | తామరపాకు, తామరాకు (లోప సంధి) |

9. పుల్లింగ శబ్దాల మీదను, కొన్ని విశేషణాల మీదను స్త్రీ లింగ సూచక ప్రత్యయం “అది” చేరితే సంధిలో రకారం ఆగమంగా వస్తుంది. పుల్లింగడు ప్రత్యయం లోపిస్తుంది.

| | | | |
|---|---|---|---|
| ఉదా। | పేద + ఆలు | = | పేదరాలు |
| | గొడ్డు + ఆలు | = | గొడ్డురాలు |
| | గేస్తు + ఆలు | = | గేస్తురాలు |
| | మనుమ + ఆలు | = | మనుమరాలు |

10. “నిడు” మొదలైన పదాల మీద అచ్చు చేరితే సమాసంలో ఆపదం చివరి అక్షరానికి ద్విత్వటకారం ఆదేశంగా వస్తుంది.

| | | | |
|---|---|---|---|
| ఉదా॥ | నిడు + ఊరుపు | = | నిట్టూరుపు |
| | నడు + ఇల్లు | = | నట్టిల్లు |
| | కడు + ఎదురు | = | కట్టెదురు |
| | చిరు + అడవి | = | చిట్టడవి |

**ఆధారగ్రంథాలు:**


1. ఆధునిక తెలుగు వ్యాకరణం - ఎన్. శివరామమూర్తి
2. ఆధునిక తెలుగు వెన్నెలకంటి వ్యాకరణం - వెన్నెలకంటి ప్రకాశం
3. ఆధునిక తెలుగు భాషా నిర్మాణం - శివుని రాజేశ్వరి
4. ఆధునిక ప్రామాణికాంధ్ర వ్యాకరణం - వజ్జల వేంకటేశ్వర్లు
5. ఆధునిక భాషాశాస్త్రం - వెలమల సిమ్మన్న

6. ఈనాడు భాషా స్వరూపం - బూదరాజు రాధాకృష్ణ
7. తెలుగు దారి - వెల్చేరు నారాయణరావు
8. తెలుగులో వెలుగులు - చేకూరి రామారావు
9. తెలుగు భాషా చరిత్ర (సంపాదకులు) - భద్రిరాజు కృష్ణమూర్తి
10. తెలుగు భాషా చరిత్ర - వెలమల సిమ్మన్న
11. తెలుగు భాషా తత్త్వం - కొమర్రాజు లక్ష్మణరావు
12. తెలుగు భాషా శాస్త్రవేత్తలు - వెలమల సిమ్మన్న
13. తెలుగు భాషా స్వరూపం - బూదరాజు రాధాకృష్ణ
14. తెలుగు వాక్యం - చేకూరి రామారావు
15. ప్రౌఢ వ్యాకరణం - బహుజనపల్లి సీతారామయ్య
16. బాల వ్యాకరణం - చిన్నయసూరి
17. బాల వ్యాకరణం - శాస్త్రీయ వ్యాఖ్య - వెలమల సిమ్మన్న, గుమ్మా సాంబశివరావు
18. భాషా తపస్వి గిడుగు - వెలమల సిమ్మన్న
19. భాషానువర్తనం - చేకూరి రామారావు
20. వ్యావహారిక భాషా వ్యాకరణం - వడ్లమూడి గోపాలకృష్ణయ్య
21. శబ్ద బ్రహ్మ చిన్నయసూరి (అముద్రితం) - వెలమల సిమ్మన్న, గుమ్మా సాంబశివరావు
22. సంధి - వెలమల సిమ్మన్న

**II. ఆంగ్లం :**

1. A Grammar of ModernTelugu - Bh. Krishan Murthy
2. Sandhi Balavyakaranam - J. Pratap Reddy.

పాఠం - 3

# ఆధునిక తెలుగు భాష - తెలుగు హల్సంధులు

**విషయ సూచిక :**


3.1. తెలుగు హల్సంధులు

3.2. సాంస్కృతిక సమాస సంధులు - అచ్సంధులు

3.3. సాంస్కృతిక సమాస సంధులు - హల్సంధులు

3.4. విసర్గ సంధులు


## 3.1. తెలుగు హల్సంధులు :

1. హలంత నామాలకు అర్థ శేషద్యోతకాలైన ఆ, ఏ, ఓ లు పరమైతే వ్రాతలో ఆ పొల్లు హల్లుతో అచ్చు చేరిన ఒకే అక్షర సంజ్ఞ వస్తుంది. పొల్లు హల్లు కాని, తర్వాత అచ్చు కాని విడిగారాయదు.

   ఉదా॥ రమేశ + ఆ వచ్చాడు = రమేశా వచ్చాడు

   వచ్చిన వాడు రమేశ్ + ఏ = వచ్చినవాడు రమేశే

   రమేశ్ + ఓ, వర్ధన్ + ఓ రావడం ఖాయం = రమేశో, వర్ధనో రాయడం ఖాయం

2. హలంత నామాల మీద సముచ్చయార్ధకమైన ఉశబ్దం చేరితే ఆ హల్లుతో ఉకారం చేరి ఒక అక్షరం ఏర్పడుతుంది. చివరి ఉత్వానికి దీర్ఘం రావచ్చు. చివరి అక్షరం మీద ఆరోహి స్వర స్థాయి వుంటుంది.

   ఉదా॥ రమేశ్ + ఉ, వర్ధన్ + ఉ, వచ్చారు = రమేశు, వర్ధను, వచ్చారు

   రమేశూ, వర్ధనూ వచ్చారు

   పై సమచ్ఛయ ఉశబ్ద సంధిలో ఉత్వం ఈఎమద ద్విత్వను వర్ణం రావచ్చు.

   ఉదా॥ రమేశ్ను, వర్ధనున్ను వచ్చారు.

   కొన్ని చోట్ల పై "ఉ" శబ్ద సంధిలోఉత్వానికి ముందు "న" కారం ఆగమిస్తుంది.

   ఉదా॥ విఠల్ను, కుమార్ను వచ్చారు.

   పై సముచ్చయార్థక "ఉ" శబ్ద సంధిలో "ఉ" కారం లోపించవచ్చు. అప్పుడు పదాంతం మీది ఆరోహి స్వర స్థాయి ఒక్కటే సముచ్చయార్ధ సూచకం.

   ఉదా॥ రమేశ్, వర్ధన్, వచ్చారు.

3. హలంత నామాల మీద అజాది పదాలు చేరితే విసంధిగా రాయడమే ఉత్తమ పద్ధతి. ఉచ్చారణలో హల్లు అచ్చుతో కలిసి పోతుంది. తదను సారంగా హల్లుతో అచ్చు చేరిన అక్షరం యథోచితంగా రాయవచ్చు. తొలి పదం హ్రస్వచ్చుమీది హల్లుకు ద్విత్వం కూడా రావచ్చు.

ఉదా॥ ప్రభాత్ ఉన్నాడా ? = ప్రభాతున్నాడా ?

కుమార్ ఎక్కడ ? = కుమారెక్కడ ?

ఆనంద్ ఏడీ = ఆనందేడీ

4. హలంత నామాల మీద హలాది పదాలు చేరేటప్పుడు సంధి లేదు. పొల్లు హల్లును విడిగా రాయాలి. పొల్లు హల్లుతో పరమైన హల్లు చేర్చి సంయుక్తాక్షరం రాయరాదు.

ఉదా॥ ప్రభాత్ సినిమా "ప్రభాత్సినిమా॥

మరికొన్ని ఉదా॥ మోహన్ కనిపించలేదు, సంగమ్ హోటలు, తాజ మహల్ వసతి భవనం, అలంకార్ టాకీస్, రమేశ్ చెప్పాడు, జీవన్ మాతో రాలేదు.

5. హలంత నామాల మీదను ను-కు-ప్రత్యమాలుకాని, లో, తో, వద్ద మొదలైన వైభక్తి కాలు కాని, హలంత ద్వంద్వ సమాసాల మీద బహు వచనాలు వర్ణకంకాని చేరితే సంయుక్తాక్షరం రాయరాదు.

ఉదా॥ రమేశ్‌ను, వర్ధన్‌కు, కుమార్‌తో, ప్రభాత్‌తో అలంకార్ వద్ద, రమేష్ - వర్ధన్‌లు, ప్రభాకర్ - దివాకర్‌లు

6. బింద్వంత శబ్దాల మీద ఏకాక్షర పదాలు ఆ, ఏ, ఓ, లు చేరితే బిందువకు మకారం ఆదేశంగా వస్తుంది.

ఉదా॥ ఏది మంచిది, కలం + ఆ, ఖడ్గం + ఆ = ఏది మంచిది, కలమా, ఖడ్గమా ?

ధనం + ఏ, మూలం = ధనమే మూలం

తృణం + ఓ, పణం + ఓ = తృణమో, పణమో

7. సముచ్చయార్థక "ఉ" శబ్దం చేరితే బింద్వంత పదాల బిందువుకు మకారం ఆగమంగా వస్తుంది అంత్యాక్షరం మీద ఆరోహి స్వర స్థాయి వుంటుంది.

ఉదా॥ వెంకటరత్నం + ఉ, సింహచలం + ఉ, వచ్చారు = వెంకటరత్నము, సింహాలచలము వచ్చారు

ఈ ఉత్వానికి దీర్ఘం కూడా వస్తుంది. వేపటరత్నమూ, సింహాచలమూ వచ్చారు.

ఉత్వంతో పాటు "ను" వర్ణంగాని, ద్విత"ను" వర్ణంగాని రావచ్చు.

వేపట రత్నమును, సింహాచలమును వచ్చారు

ఉత్వం లోపించి బింద్వంత అక్షరం మీద ఆరోహి స్వర స్థాయి ఒకటే సముచ్చయార్ధ ద్యోతకమౌతుంది.

వెంకటరత్నం, సింహాచలం వచ్చారు.

8. బింద్వంత శబ్దాల మీద అజాది పదాలు చేరితే సంధి లేదు.

ఉదా॥ ధనం ఏదీ ?

కర్మ ఫలం అనుభవించక తప్పదు

చలం ఎక్కడ ఉన్నాడు

రాజ్యం ఎంత అందమైన పిల్ల

9. అచ్చుకు క, చ, ట, త, ప లు పరమైతే సంధి రాక పోవుటే నేటి తెలుగు లక్షణం. ఈ కింది వాక్యాలలోని పదాల తొలి అక్షరాలు అయిన క, చ, ట, త, ప లు ప్రకృతి భావంతోనే వున్నాయి.

ఉదా॥ వాడు పది రోజులుగా కనబడలేదు

పద్యం చదివిన వెంటనే అర్థం తెలియలేదు

నీకు టీ ఇష్టమా, కాఫీ ఇష్టమా చెప్పు

తనకు చేతకాదు, ఎవరు చెప్పినా వినడ

కళ్ళు తెరచి చూడు, బ్రతుకు తెరువు తెలుసుకో

10. సన్నిహితమైన అన్వయ సంబంధం గల రెండు పదాలు వరుసగా వచ్చేటప్పుడు రెండవ పదం తొలి అక్షరమైన "క" కారం "గ" కారంగానూ, "చ" కారం "జ" కారంగానూ, "త" కారం "ద" కారం గాను కొన్ని చోట్ల మారుతుంది. ఈ ఆదేశం వైకల్పికం మాత్రమే.

**అ) "క" కరానికి "గ" కారం :**

నీవు గాని, నేను గాని, నీవు కాని, నేను కాని

ఇదిగాక, ఇది కాక

కాలు గాలిన పిల్లి, కాలుకాలిన పిల్లి

నివురు గప్పిన నిప్పు, నివురు కప్పిన నిప్పు

**ఆ) "చ" కారానికి "జ" కారం :**

నేను ఏం జెయ్యను, నేను ఏం చెయ్యను

శ్రావణం జొరబడగానే, శ్రావణం చొరబడగానే

ఇ) "త" కారానికి "ద" కారం :

ఆహార సమస్య తీవ్ర రూపం దాల్చింది

ఆహార సమస్య తీవ్ర రూపం తాల్చింది

చకారానికి సకారా దేశం నేటి శిష్ట భాషలో కనబడదు.

పామరజన వ్యవహారంలో సెప్పు, సేసినాడు, సదివి, మొదలైనవి వినిపిస్తున్నవి. సకారానికి వకారం గాని, బకారం గాని వచ్చే స్థలాలు వన్నట్టు తోచదు.

11. "అ" ప్రత్యయాంత అసమాపక క్రియల మీద ఇతర ధాతువులు చేరి సంయుక్త ధాతువులు ఏర్పడతాయి. ఇలాంటి సంయుక్త క్రియలలో రెండవ క్రియ తొలి అక్షరాలైన క చ ట త పలు , గజ ద, బ లుగా కొన్ని స్థలాలలో మారుతాయి. ఈ క్రింది పట్టికలోని మొదటి స్తంభంలోనివి "అ" ప్రత్యయాంత అసమాపక క్రియపై చేరిన ధాతువులు, రెండవ స్తంభంలోనివి సంయుక్త ధాతువులు.

| పరమైన ధాతువు | సంయుక్త ధాతువు |
|---|---|
| కలుగు | చేయగలుగు, వ్రాయగలుగు |
| చేయు | తెలియజేయు, కలుగజేయు |
| చెప్పు | నచ్చజెప్పు, ఒప్ప జెప్పు |

పైన చెప్పిన గ జ ద బ ల ఆదేశం నిత్యం కాదు. అవి రాని స్థలాలు కూడా కలవు.

ఉదా॥ ఒప్ప చెప్పు, తెలియచేయు మొ॥

కొన్ని క్రియా రూపాలలో గ జ ద బ ఆదేశం నిత్యం

ఉదా॥ కాబట్టి, వెళ్ళబట్టి, తిరుగబోత మొ॥

12. కొన్ని సంయుక్త క్రియలలో తొలి పదంలోని చివరి మువర్ణ కానికి లోపం. ద్వితీయ పదాది ప కారానికి, వకారా దేశం లేక బకారా దేశం, మొదలైన మార్పులు కలుగుతాయి.

ఉదా॥ భయము + పడు = భయపడు

ఎర్రన + పారు = ఎర్రబారు

తెల్ల + పారు = తెల్లవారు

కను + కొను = కనుగొను

13. తెలుగు సమాసాలలో అచ్చుకు హల్లు పరమగుట వల్ల వర్ణలోప, ఆగమ, ఆదేశాది వికాలు జరుగుతాయి. ఆయా సంధి కార్యాల్ని వర్ణించట వల్ల చెప్పుకో తగ్గ ప్రయోజనం లేదు. కాబట్టి సంధి విచ్ఛేదాలు, సమాసాలు, మాత్రమే ఈ క్రింది పట్టికలో చూపబడ్డాయి.

ఉదా॥ ప్రాత + చదువు = ప్రాజదువు

ఇలాంటివే ప్రాబలుకు, ప్రాయిల్లు మొ॥

లేత + మొగ్గ = లే మొగ్గ

ఇలాంటివే లేదూడ, లే బ్రాయము, లేబరువు మొ॥

పూవు + తేనె = పూదేనే

ఇలాంటివే పూరెమ్మ, పూదోట మొ॥

14. ద్వంద్వ సమాసాలలో కొన్ని చోట్ల క చ త ప లు మారవు - కొన్ని చోట్ల గ స ద వలు గా మారుతాయి. కొన్ని చోట్ల తొలి పదం చివరి “ము” వర్ణకం లోపిస్తుంది.

**అ) సంధిలో మార్పు లేని సమాసాలు :**

మంచి చెడ్డలు, పిన్న పెద్దలు, అక్క చెల్లెళ్లు, పసుపు కుంకుమలు, దారి తెన్నులు, తెలివి తేటలు, ఆట పాటలు, పడుగు పేకలు, నలుపు తెలుపులు

**ఆ) “ము” వర్ణక లోపం గల సమాసాలు :**

అందము + చందము = అందచందాలు

ఇలాంటివే చుట్ట పక్కాలు, లంచ పంచాలు

**ఇ) వై కల్పికంగా మార్పు వచ్చే సమాసాలు :**

తల్లి + తండ్రి = తల్లి తండ్రులు, తల్లిదండ్రులు

కాలు + చేయి = కాలు చేతులు, కాలు సేతులు

అన్న + తమ్ముడు = అన్న తమ్ములు, అన్న దమ్ములు

కూర + కాయ = కూరకాయలు, కూరగాయలు

ఉక్కు + టెక్కు = ఉక్కుటెక్కులు, ఉక్కుడెక్కులు

## 3.2. సాంస్కృతిక సమాస సంధులు - అచ్సంధులు

తెలుగు సాహిత్యంలో సాంస్కృతిక సమాసాలకు ప్రముఖ స్థానం వుంది. సమాసంలో కనీసం రెండు ప్రాతిపదికలు వుంటాయి. పూర్వపదం అంత్య వర్ణానికి ఉత్తర పదం ఆద్య వర్ణంతో సంధి జరుగుతుంది. సమాస సంధుల ప్రయోజనం దృష్ట్యా సమాస ప్రాతిపదికలను అజంత శబ్దాలుగానూ, హలంత శబ్దాలుగాను వర్గీకరించవచ్చు.

1. అ, ఆ లు సవర్ణాచ్చులు. అలాగే ఇ, ఈ, లు, ఉ, ఊ లు, ఋ, ౠ లు సవరాచ్చులు.

సవర్ణాచ్చుల్లో ఒక అచ్చు అదే అచ్చుతో గాని, రెండవ అచ్చుతో గాని చేరితే ఆ రెండు అచ్చులకు దీర్ఘచ్చు ఒకటే ఆదేశంగా వస్తుంది.

అ + అ = ఆ, అ + ఆ = ఆ, ఆ + ఆ =ఆ

ఇలాగే తక్కిన అచ్చుల విషయం ఊహించుకోవచ్చు.

ఉదా॥ అ) పుష్ప + అంజలి = పుష్పాంజలి (అ + అ = ఆ)

పరమ + ఆత్మ = పరమాత్మ (అ + ఆ = ఆ)

ప్రజా + అనురాగం = ప్రజానురాగం (ఆ + అ = ఆ)

ప్రజా + ఆదరణ ప్రజాదరణ (ఆ + ఆ = ఆ)

ఆ) రవి + ఇంద్రుడు = రవీంద్రుడు (ఇ +ఇ = ఈ)

కవి + ఈశ్వరుడు = కవీశ్వరుడు (ఇ + ఈ = ఈ)

నదీ + ఇనుడు = నదీనుడు (ఈ + ఇ = ఈ)

అవనీ + ఈశుడు = అవనీశుడు (ఈ + ఈ = ఈ)

ఇ) గురు + ఉపదేశము = గురూపదేశం (ఉ + ఉ = ఊ)

ధేను + ఊధము = ధేనూధము (ఆవు పొదుగు) (ఉ + ఊ = ఊ)

వధూ + ఉద్వాహము = వధూద్వాహము (ఊ + ఊ = ఊ)

సరయూ + ఊర్మి = సరయూర్మి (ఊ + ఊ = ఊ)

ఈ) పితృ + ఋణము = పితౄణము (ఋ + ఋ = ౠ)

ౠ కారం గల పదాలు లేవు

సవర్ణ అచ్చుల కలిసేటప్పుడు సంధిలో దీర్ఘచ్చు ఒక్కటే వస్తుంది. కాబట్టి ఈ రకమైన సంధికి "సవర్ణ దీర్ఘ సంధి" అని పేరు.

2. అ, ఆ, లలో ఒక అచ్చుకు ఇ, ఈ లలో ఒకటి పరమైతే ఏ కారమును, ఉ, ఊ లలో ఒకటి పరమైతే ఓ కారమును, ఋ కారం పరమైతే "అర్" ను సంధ్యచ్చుల రెండింటికి ఆదేశంగా వస్తుంది.

అ (ఆ) + ఇ (ఈ) = ఏ

అ (ఆ) + ఉ (ఊ) = ఓ

అ (ఆ) + ఋ = అర్

ఉదా॥ అ) మద + ఇభము = మదేభము (అ + ఇ = ఏ)

మహా + ఇంద్రుడు = మహేంద్రుడు (ఆ + ఇ = ఏ)

పరమ + ఈశ్వరుడు = పరమేశ్వరుడు (అ + ఈ = ఏ)

మహా + ఈశ్వరుడు = మహేశ్వరుడు (ఆ + ఈ = ఏ)

ఆ) సూర్య + ఉదయము = సూర్యోదయము (అ + ఉ = ఓ)

మహా + ఉన్నతి = మహోన్నతి (ఆ + ఊ = ఓ)

సముద్ర + ఊర్మి = సముద్రోర్మి (అ+ ఊ = ఓ)

రంభా + ఊరు = రంభోరు (ఆ + ఊ = ఓ)

ఇ) రాజ + ఋషి = రాజర్షి (అ + ఋ = అర్)

మహా + ఋషి = మహర్షి (అ + ఋ = అర్)

గుణం అంటే అక్షర పరిమాణంలో పెరుగుదల. ఇక్కడ "ఇ" కారానికి "ఏ" ఉకారానికి "ఓ" ఋకారానికి "అర్" రావడమే పెరుగుదల. అంచేత ఈ రకమైన సంధికి "గుణ సంధి" అని పేరు

నేడు వాడుకలో తెప్పోత్సవము ఎన్నికోద్యోగి, అనే మిశ్ర సమాసాలు కన్పిస్తున్నాయి అచ్చ తెనుగు పదం మీద సమాస ప్రాతిపదిక చేరిన సమాసాలు ఇవి

తెప్ప + ఉత్సవము = తెప్పోత్సవము

ఎన్నిక + ఉద్యోగి = ఎన్నికోద్యోగి

ప్రయోగ ప్రాచుర్యాన్ని బట్టి వీటికి సాధుత్వం అంగీకరించవచ్చు.

3. అ, ఆ లలో ఒక అచ్చుకు "ఏ" కాని, "ఐ" కాని పరమైతే రెండు సంధ్య చ్చులకు "ఐ" కారాన్ని "ఓ" కాని, "ఔ" కాని పరమైతేరెండు సంధ్యచ్చులకు "ఔ" కారాన్ని ఆదేశంగా వస్తుంది.

అ (ఆ) + ఏ (ఐ) = ఐ

అ (ఆ) + ఓ (ఔ) = ఔ

ఉదా॥ అ) లోక + ఏక, పూజ్యుడు = లోకైక పూజ్యుడు (అ + ఏ = ఐ)

వసుధా + ఏకత్వము = వసుధైకత్వము (ఆ + ఏ = ఐ)

భావ + ఐక్యము = భావైక్యము (అ + ఐ = ఐ)

మహా + ఐశ్వర్యము = మహైశ్వర్యము (ఆ + ఐ = ఐ)

ఆ) పాప + ఓఘము = పాపౌఘము (అ + ఓ = ఔ)

మహా + ఓషధి = మహౌషధి (ఆ + ఓ = ఔ)

పరమ + ఔషధము = పరమౌషధము (అ + ఔ = ఔ)

మహా + ఔన్నత్యము = మహౌన్నత్యము (ఆ + ఔ = ఔ)

"వృద్ధి" అంటే అక్షర పరిమాణంలో గుణం కన్న ఎక్కువ పెరుగుదల. ఏ, ఓ లకు ఐ, ఔలు వచ్చుట వృద్ధి. అంచేత ఈ రకమైన సంధికి "వృద్ధి సంధి" అని పేరు.

ఈ నియమానికి కొన్ని అపవాదాలున్నాయి. అకారం మీద ఓష్ఠ శబ్దం పరమైతే "ఔ" త్వం రాకపోవడం కూడా వుంది.

ఉదా॥ బింబ + ఓష్టము = బింబౌష్ఠము, బింబోష్ఠము

సాధారణంగా ఔత్వం రాని సంధి రూపాలే ఎక్కువ వాడుకలో వున్నవి.

ఉదా॥ బింబోష్ఠి, అధరోష్ఠము, దంతోష్ఠ్యము మొ॥

4. ఇ, ఈ, లకు ఉ ఊ లకు, ఋకారానికి ఉ, ఊ లకు వకారం ఋ కారానికి రకారం, ఆదేశంగా వస్తుంది.

ఉదా॥ అ) అతి + అధికం = అత్యధికం (ఇ + అ = య)

అతి + ఆనందం = అత్యానందం (ఇ + ఆ = యా)

దేవీ + ఆలయం = దేవ్యాలయం (ఈ + ఆ = యా)

భావి + ఔన్నత్యము = భావ్యౌన్నత్యము (ఇ + ఔ = యౌ)

కవి + ఉత్తముడు = కవ్యుత్తముడు (ఇ + ఉ = యు)

ఆ) అణు + అస్త్రము = అణ్వస్త్రము (ఉ + అ = వ)

వధూ + ఆగమనం = వధ్వాగమనం (ఊ + ఆ = వా)

ఇ) పితృ + ఉపదేశము = పిత్రుపదేశము (ఋ + ఉ = రు)

ధాతృ + ఈశ్వర (+లు) = ధాత్రీశ్వరులు (ఋ + ఈ = రీ)

మాతృ + ఔదార్యము = మాత్రౌదార్యము (ఋ + ఔ = ర్)

ఈ రకమైన సంధికి సంస్కృత వ్యాకరణానుసారంగా "యణాదేశ సంధి" అని పేరు.

5. పై ప్రసంగాల్లోని ఋకార సంధులు సంస్కృత వ్యాకరణాలనుసారంగా ఇవ్వబడ్డాయి. ఋకారం రకార ఉచ్చారణ గల అచ్చు. ఋ కారం గల చోట్ల సంధి చేయక పోవుట దోషం కాదు. వి సంధిగా రాయుటే నేటి భాషా మార్యాద.

ఉదా॥ మహా ఋషి, రాజ ఋషి, వసంత ఋతువు, పితృ ఋణం, పితృ ఆదేశం, మాతృ ఆశీర్వాదం మొ॥

6. ప్ర, పరి, అభి, వి, అను ఇత్యాది అజంత సంస్కృత ఉపసర్గం మీద అజాది పదాలు చేరితే సమాస సంధి సూత్రాలే వర్తిస్తాయి.

ఉదా॥ ప్ర + ఆరంభము = ప్రారంభము

పరి + ఆటన = పర్యటన

అభి + ఇష్టము = అభీష్టము

వి + ఊఢము = వ్యూఢము

అను + అర్థము = అన్వర్థము

ఇలాంటివి ఉపసర్గ సంధులు అంతస్సంధులు

7. సంస్కృతంలో ఏకారాంత పదాలు లేవు. ఐ, ఓ, ఔ, కారాంత పదాలు చాలా తక్కువ. అలాంటి పదాల మీద అచ్చు పరమైతే ఏర్పడే సమాసాలు అప్రసిద్ధాలు. కొన్ని మాత్ర ఈ క్రింది ఇవ్వబడ్డాయి.

ఉదా॥ రై (ధన) + ఈశుడు = రాయీశుడు (కుబేరుడు)

గో + అక్షి = గవాక్షము (కిటికీ)

గో + అధ్యక్షుడు = గవాధ్యక్షుడు

గౌ (చంద్ర) + ఉదయము = గ్లావుదయము

8. సంస్కృతంలో సాధారణ సంధి సూత్రాలకు లొంగని కొన్ని విశిష్ట సంధులు గల సమాసాలు, ఉపసర్గయుక్త పదాలున్నాయి. వాటిని ఏక పదాలు గానె భావించవచ్చు.

ఉదా॥ ప్రౌఢ, స్వైర, అక్షౌహిణీ, కులటా, వేదండ, మస్తిష్క, మనీషా, దశార్ణ, కర్కంధు, సారంగ, సీమంత, మంజీర, ప్రభుతులు

9. సాంస్కృతిక సామాసాలలోని అచ్సంధులను సంస్కృత వ్యాకరణ నియమానుసారంగా తు, చ తప్పకుండ పాటించనక్కరలేదు. అర్థ స్పష్టత నిమిత్తం సమాస మధ్యంలో విసంధి పాటించవచ్చు. ఉత్తమ రచయితలు సమాసాలలో విసంధి పాటిస్తున్నారు. ఈ క్రింది ఉదాహరణలు వాడుకలో వున్నాయి.

ఉదా॥ సమస్త ఐశ్వర్యములు, అనేక ఉపకారాలు, సాంఘిక, ఆర్థిక, అసమానతలు, ప్రధాన ఉద్దేశం, జానకీ అన్వేషణ, ఆనంద ఉత్సాహాలు, అంతర్జాతీయ ఉద్రిక్తత, భారత ఉప ఖండం, ప్రజా ఉద్యమం, ప్రపంచ ఆరోగ్య సంస్థ, ప్రత్యేక ఆదర భావం, సామాజిక ఔన్నత్యం, జాతీయ అవసరాలు, అధిక ఆహార ఉత్పత్తి, గరిష్ట ఉష్ణోగ్రత, భీష్మ ఏకాదశి.

10. కొన్ని సమాసాలు నిత్య వ్యవహారంలో రూఢములై పోవుట చేత వాటిని విసంధ్రిగా రాయరాదు

ఉదా॥ పరమేశ్వరుడు, విగ్రహారాధన, జీవాత్మ, పరమాత్మ, దేవాలయం, ప్రజానురాగం, లోకోక్తి, సకల గుణాభిరాముడు, ఏకైక పుత్రుడు, సూర్యోదయం, హిమాలయం, పూర్వోత్తరాలు, అన్నోదకాలు, మహానుభావుడు, దేవాంతకుడు, పరాధీనం, స్వాధీనం, విద్యాభ్యాసం, విద్యార్థి, శుభాకాంక్షలు, సంవత్సరాది, పరోపకారం, మహోజ్జ్వలము, జయాపజయాలు, అచంద్రార్కం, రజతోత్సవము, వంశాభివృద్ధి దేవతార్చన.

## 3.3. సాంస్కృతిక సమాస సంధులు - హల్సంధులు :

1. సంస్కృత హలంత శబ్దాల సంఖ్య పరిమితమైంది. క, ట, త, ప (విసర్గ) తప్ప ఇతర హల్లులు అంతమందు గల పదాలు లేవు. తెలుగు వ్యాకరణానికి సంబంధించిన “అచ్” అనే చకారాంత పదం, “హల్” అనే ఎకారంత పదం, పారి భాషిక పదాలు సాహిత్యంలో వాటి ప్రయోజనం లేదు. సమాసాలలో క, ట, త, ప విసర్గాంత శబ్దాలకు అచ్చులతోనూ, హల్లులతోనూ, సంధి జరుగుతుంది. హలంత శబ్ద పరిచయం కొరకు కొన్ని హలంత సమాస ప్రాతిపదికలు ఈ కింద పేర్కొనబడ్డాయి.

**అ) కకారాంతాలు :**

దిక్, వాక్, జలముక్ (=మేఘం), స్రక్ (మాలిక), రుక్ (కాంతి, లోగం), అసృక్ (నెత్తురు), వణిక్ (వైశ్యుడు), ఋక్ (వేదంలోని ఋక్కు)

**ఆ) టకారాంతాలు :**

షట్ (ఆరు), ద్విట్ (శత్రువు), త్విట్ (కాంతి), రాట్ 9రాజు), మధులిట్ (తుమ్మెద), జలరుట్ (పద్మం), స్వారాట్ (ఇంద్రుడు).

**ఇ) తకారాంతాలు :**

తత్ (ఆది, వాడు), మత్ (నాయొక్క), సత్ (మంచిది, మంచివాడు), మరుత్ (గాలి, దేవతలు), విద్వత్ (పండితుడు), భగవత్ (భగవంతుడు), విద్యుత్ (మెరుపు), చలత్ (కదులుతున్న), లసత్ (ప్రకాశిస్తున్న) భ్రమత్ (తిరుగుతున్నవి)

**ఈ) పకారాంతాలు :**

అప్ (నీరు), కకుప్ (దిక్కు), ఈ రెండు తప్ప పరిలేవు (వ్యాకరణ పారిభాషిక పదాలున్నాయి)

**ఉ) విసర్గాంతాలు :**

**1. విభక్తులు గల శబ్దాలు :**

“అః” అంతముందుగలవి మనః, యశః, వచః, తమః, రజః, తేజః, శ్రేయః మొ॥

**2. విభక్తులు లేని అవ్యయాలు :**

అంతః, బహిః, అధః, పునః, పురః, తిరః, ముహుః, సద్యః, స్వక్తిః, ప్రాతః, ఉచ్చైః

**3. ఉపసర్గలు :**

నిః, దుః

2. క, చ, ట, త, ప లకు అచ్చు పరమైతే, ఆ క చ ట త ప ల కు వరుసగా గజడదబలు ఆదేశంగా వస్తాయి.

| | | | |
|---|---|---|---|
| ఉదా॥ | వాక్ + ఇంద్రియము | = | వాగింద్రియము |
| | అచ్ + అంతము | = | అజంతము |
| | షట్ + ఆనన | = | షడానన |
| | తత్ + ఏకము | = | తదేకము |
| | కకుప్ + అంతము | = | కకుబంతము |

3. క, ట, ప ల మీద వర్గానుసిక హకారేతర ఘోష హల్లులు చేరితే ఆ క, ట, ప, ల కు క్రమంగా గ, డ, బ లు ఆదేశమగుతుంది.

పరమయ్యే హల్లులు : గ, ఘ, జ, ఝ, డ, ఢ, ద, ధ, బ, భ, య, ర, ల, వ

| | | | |
|---|---|---|---|
| అ) | దిక్ + గజము | = | దిగ్గజము |
| | వాక్ + ఘనత | = | వాగ్ఘనత |
| | ఋక్ + వేదము | = | ఋగ్వేదము |
| ఆ) | ద్విట్ + గర్వము | = | ద్విడ్గర్వము |
| | రాట్ + జాతి | = | రాడ్జాతి |
| | షట్ + భాషలు | = | షడ్భాషలు |
| ఇ) | అప్ + జాతము | = | అబ్జాతము |
| | అప్ + బిందువు | = | అబ్బిందువు |
| | అప్ + రాశి | = | అబ్రాశి |

4. తకారికి గ ఘ, ద ధ, బభ, య ర వ లు పరమైతే ఆ తకారానికి దకారం ఆదేశంగా వస్తుంది.

| | | | |
|---|---|---|---|
| ఉదా॥ | తత్ + దినము | = | తద్దినము |
| | ఆపత్ + ధర్మము | = | ఆపద్ధర్మము |

| | | | |
|---|---|---|---|
| | జగత్ + బాంధవుడు | = | జగద్బాంధవుడు |
| | ఉత్ + భవము | = | ఉద్భవము |

5. చ ఛ లు, జ ఝ, లు, ట ఠ, డ ఢలు పరమైతే తకారానికి క్రమంగా చ జ ట డ లు ఆదేశముతుంది.

| | | | |
|---|---|---|---|
| ఉదా॥ | సత్ + చరిత్ర | = | సచ్చరిత్ర |
| | బృహత్ + ఛాయ | = | బృహచ్ఛాయ |
| | సత్ + జనుడు | = | సజ్జనుడు |
| | తత్ + టీక | = | తట్టిక |

6. తకారానికి శవర్ణం పరమైతే ఆ తకారానికి చకారం, శవర్ణానికి ఛవర్ణం, ఆదేశంగా వస్తుంది.

| | | | |
|---|---|---|---|
| ఉదా॥ | విద్వత్ + శిరోమణి | = | విద్వచ్ఛిరోమణి |
| | విద్యుత్ + శక్తి | = | విద్యుచ్ఛక్తి |

7. "త" కారానికి "ల" కారం పరమైతే ఆ తకారానికి బదులుగా "ల" కారం వస్తుంది.

| | | | |
|---|---|---|---|
| ఉదా॥ | విద్యుత్ + లత | = | విద్యుల్లత |
| | తత్ + లావణ్యము | = | తల్లావణ్యము |

8. తకారానికి క, ఖ, త, థ, ప, ఫ, ష, న, క్ష లు పరమైతే సంధి కాదు.

| | | | |
|---|---|---|---|
| ఉదా॥ | శరత్ + కాలము | = | శరత్కాలము |
| | సత్ + ఫలము | = | సత్ఫలము |
| | సత్ + సంకల్పము | = | సత్సంకల్పము |
| | తత్ + క్షణము | = | తత్క్షణము |

9. క ట త ప లకు న, మ లు పరమైతే ఆ క ట త ప లకు వాటి వర్గాను నాసిక హల్లులు ఆదేశంగా వస్తాయి.

| | | | |
|---|---|---|---|
| ఉదా॥ | వాక్ + నిపుణుడు | = | వాఙ్నిపుణుడు |
| | వాక్ + మాధుర్యము | = | వాఙ్మాధుర్యము |
| | శరత్ + నవరాత్రములు | = | శరన్నవరాత్రములు |
| అపవాదాలు : | ఈషత్ + మాత్రము | = | ఈషణ్మాత్రము |
| | మృత్ + మయము | = | మృణ్మయము |

ఇక్కడ "న" కారం రాక "ణ" కారం వచ్చింది. "యాత్ర", "మయ" అనేవి ప్రత్యయాలు కాబట్టి వీటితో కూడిన సంధులు అంతస్సంధులు.

"యావత్" అనే సమాస ప్రాతిపదిక మీద "మంది" అనే అచ్చ తెలుగు పదం చేరి "యావన్మంది" అనే మిశ్ర సమాసం ఏర్పడుతుంది. ఈ పదం ప్రాచుర్యంలో వ్యవహారంలో వుండడం చేత దీనిని సాధువుగా అంగీకరించాలి.

10. క, చ, ట, త, ప లకు హ కారం పరమైతే ఆ వర్గ హల్లులకు క్రమంగా గ జ డ ద బ లును హ కారానికి ఘ, ఝ, ఢ, ధ, భలను ఆదేశంగా వస్తుంది.

ఉదా॥ దిక్ + హస్తి = దిగ్ఘస్తి

అచ్ + హల్ (లు) = అజ్ఝల్లులు

స్వారాట్ + హయము = స్వారాడ్ఢయము

జగత్ + హితము = జగద్ధితము

కకుప్ + హస్తి = కకుబ్భస్తి

11. "సమ్" ఉపసర్గకు అను నాసికేతర వర్గ హల్లులు పరైతే "మ" కారానికి తద్వర్గీయ అను నాసికోచ్చారణ గల అనుస్వారం ఆదేశమౌతుంది.

ఉదా॥ సంకల్ప, సంగత, సంఘాత, సంచయ, సంభన్న సంజాత, సంతాప, సందీప్త, సన్న్యాస, సంపూర్ణ, సంభార, సమ్మాన ప్రభృతులు

"సమ్" ఉపసర్గకు అంతస్థ ఊష్మములు పరమైతే మకారానికి అనుస్వారం ఆదేశం. "రాట్" శబ్దం పరమైనప్పుడు మాత్రం మకారం మారదు.

ఉదా॥ సంయమ, సంరావ, సంవీన, సంవహన, సంశయ, సంసరణ, సంహార ప్రభృతులు

సమ్ + రాట్ = సమ్రాట్

"సమ్" ఉపసర్గకు "కృ" ధాతు సంబంధి "కార" ప్రభృతులు పరైతే మకారానికి బిందువు ఆదేశంగాను, తదుపరి సకరాం ఆగమం గాను వస్తుంది.

ఉదా॥ సమ్ + కారం = సంస్కారం

సమ్ + కృతి = సంస్కృతి

12. పుం శబ్దం మీద ఇతర శబ్దాలు చేరితే, జరిగే సంధి కార్యాలకు ఈ క్రింది ఉదాహరణలు గమనింప తగ్గవి.

ఉదా॥ పుం + గవము = పుంగవము } మార్పులేదు

పుం + భావము = పుంభావము }

పుం + కోకి = పుంస్కోకిల } 'స' ఆగమం
పుం + త్వము = పుంస్త్వము

### 3.4. విసర్గ సంధులు :

1. విసర్గాంతాలైన కొన్ని శబ్దాలకు, కొన్ని అవ్యయాలకు క, ఖ, ప, ఫ, క్ష లు పరమైతే సంధి కాదు.

**అ) శబ్దయుక్త సమాసాలు :**

ఉదా॥ మనఃకు హరము, మనఃఖేదము, సరఃప్రాంతము, ఛందః ఫణితి, తపః ఫలము, వయః పరిమితి, జ్యోతిః పుంజము, మనః క్షోభము, ఆయుఃక్షీణత, ధనుఃకోటి (వింటి కొప్పు) మొ॥

**ఆ) అవ్యయయుక్త సమాసాలు :**

ఉదా॥ అంతఃకరణము, ప్రాంతఃకాలము, బహిఃప్రదేశము, సంద్యఃఫలితము, మహుః కంపితము మొ॥

2. "అః" అంత మందుగల కొన్ని శబ్దాలకు "అం" అంత ముందు కొన్ని అవ్యయాలకు కార, కృత, కర, కామ, ప్రభృతులు పరమైతే విసర్గకు సకారం ఆదేశంగా వస్తుంది.

ఉదా॥ శ్రేయః + కరము = శ్రేయస్కరము
పురః + కారము = పురస్కారము

ఇలాంటివే మరికొన్ని ఉదా॥ యశస్కామ, అయస్కాంత, భాస్కర, అహస్కర, పురస్కృత, తిరస్కార, నమస్కార, సమస్కృతి ప్రభృతులు

3. "ఇ", "ఉః" అంత ముందు గల శబ్ద, అవ్యయ, ఉపసర్గలకు క ఖ, ప, ఫ, లు పరమైతే విసర్గ స్థానంలో షకారం ఆదేశంగా వస్తుంది.

అ) ఛతుః + కోణము = చతుష్కోణము
ధనుః + కోటి = ధనుష్కోటి (ఒక తీర్థము)
ఆయుః + కర్మ = ఆయుష్కర్మ
చతుః + పథం = చతుష్పథం

ఇ) బహిః + కారము = బహిస్కారము
అవిః + కరణము = ఆవిష్కరణము

ఉ) నిః + కారణము = నిష్కారణము
దుః + ఫలము = దుష్ఫలము

ఇలాంటివే మరి కొన్ని ఉదా॥ నిష్కపట నిష్ఫల, నిష్క్రమణ, నిష్పీడ్యమాన, దుష్కర, దుష్ప్రవర్తన ప్రభృతులు

4. అకారేతర స్వర పూర్వక విసర్గాంత శబ్దాల మీదను, విసర్గాంత, అవ్యయ, ఉప సర్గలు అన్నింటి మీదను, అచ్చు గాని, వర్గాను నాసిక, రవర్ణేతర ఘోష హల్లు గాని, చేరితే విసర్గకు రకారం ఆదేశంగా వస్తుంది.

అకారేతర స్వర పూర్వక విసర్గలు అంటే "అః" తప్పించి తక్కినవి ఇః, ఉః, ఆః, ఈః, ఊః, ఓంః

అవ్యయాలలో "సద్య" అనే పదానికి ఈ నియమం వర్తించదు.

పరమయ్యే ఘోష హల్లులు : గ, ఘ, జ, ఝ, డ, ఢ, ద, ధన, బ, భ, మ, య, ల, వ, హ

**1. ఉదాహరణలు (అచ్చు చేరినవి) :**

**అ) శబ్ద సందులు :**

| | | |
|---|---|---|
| హవిః + అర్పణ | = | హవిరర్పణ |
| చతుః + ఉపాయము (లు) | = | చతురుపాయములు |
| ఆయుః + ఆరోగ్యము (లు) | = | ఆయురారోగ్యములు |
| దోః + అంతరము | = | దోరంతరము |

**ఆ) అవ్యయ సంధులు :**

| | | |
|---|---|---|
| అంతః + అంగము | = | అంతరంగము |
| బహిః + ఉద్యానము | = | బహిరుద్యానము |
| పునః + ఆలోచన | = | పునరాలోచన |
| ప్రాతః + ఉపాసన | = | ప్రాతరుపాసన |

**ఇ) ఉపసర్గ సంధులు :**

| | | |
|---|---|---|
| నిః + ఆశ | = | నిరాశ |
| దుః + ఆక్రమణ | = | దురాక్రణ |
| నిః + ఉద్యోగము | = | నిరుద్యోగము |
| దుః + అదృష్టము | = | దురదృష్టము |

**2. ఉదాహరణలు (హల్లులు చేరినవి) :**

**అ) శబ్ద సంధులు :**

| | | | |
|---|---|---|---|
| ఉదా॥ | జ్యోతిః + లత | = | జ్యోతిర్లత |
| | యజుః + వేదము | = | యజుర్వేదము |
| | ధనుః + బాణము | = | ధనుర్బాణములు |

**ఆ) అవ్యయ సంధులు :**

| | | | |
|---|---|---|---|
| ఉదా॥ | అంతః + నాళము | = | అంతర్నాళము |
| | పునః + జన్మ | = | పునర్జన్మ |
| | బహి + భూమి | = | బహిర్భూమి |

**ఇ) ఉపసర్గ సంధులు :**

| | | | |
|---|---|---|---|
| ఉదా॥ | నిః + మానుష్యము | = | నిర్మానుష్యము |
| | నిః + దోషము | = | నిర్దోషము |

నిః, దుః, ఉప సర్గలతో కొన్ని అచ్చ తెలుగు పదాలకు సంధి కన్పిస్తుంది.

| | | |
|---|---|---|
| నిః + యోగమాటము | = | నిర్యోగమాటము |
| దుః + అలవాటు | = | దురలవాటు |

శిష్ట భాషలో వునన ఈ పదాల్ని సాధువులుగా గ్రహించుట సమంజసం

5. అకారేతర స్వర పూర్వక విసర్గాంత శబ్దాలకును, విసర్గాంత అవ్యయ, ఉపసర్గాలకును రకారం పరమైతే విసర్గ లోపిస్తుంది. తత్పూర్వ స్వరం హ్రస్వమైతే దాకిని దీర్ఘం వస్తుంది.

"సద్యః" అనే అవ్యయానికి ఈ నియమం వర్తించదు.

| | | | | |
|---|---|---|---|---|
| ఉదా॥ | అ) | రోచిః + రమ్యము | = | రోచీరమ్యము |
| | | జ్యోతిః + రూపము | = | జ్యోతీరూపము |
| | | చక్షుః + రక్షణ | = | చక్షూ రక్షణ |
| | | వాః + రాశి | = | వారాశి |

ఆ) స్వః + రాజ్యము = స్వరాజ్యము

ఇ) నిః + రవము = నీరవము

నిః + రంధ్రము = నీ రంధ్రము

నిః + రోగము = నీ రోగము

అంతః అనే అవ్యయం మీద రాష్ట్ర శబ్దం చేరితే నియమానుసారం 'అంతరాష్ట్ర' అని సంధి జరుగవలసి వుంది. కాని నేటి వ్యవహారంలో 'అంతరాష్ట్రీయ' అనే ప్రయోగాలు విశేషాలుగా కనిపిస్తున్నాయి. కనుక అంతః + రాష్ట్రీయము = అంతరాష్ట్రీయము అని సంధి చేయుట యుక్తము.

6. "అః" అంతమందు గలశబ్దాలకు అకారం గాని, ఘోష హల్లులు గాని పరమైతే, పూర్వ పదం చివరి "అః"కు ఓత్వం ఆదేశంగా వస్తుంది. పరమైన అకారం లోపిస్తుంది. పరమైన హల్లులకు మార్పులేదు.

**అ) ఉదాహరణలు (అచ్చుచేరినవి) :**

ఉదా॥ మనః + అభిప్రాయము = మనోభిప్రాయము

పయః + అబ్ధి = పయోబ్ధి

శ్రేయః + అభిలాష = శ్రేయోభిలాష

వయః + అర్హత = వయోర్హత

"సద్యః" అనే అవ్యయానికి ఈ సంధి వస్తుంది

సద్యః" అనురాగము = సద్యోనురాగము

**ఆ) ఉదాహరణలు (హల్లులు చేరినవి) :**

ఉదా॥ తమః + గుణము = తమోగుణము

వయోః + ధర్మము = వయోధర్మము

"సద్య" అనే అవ్యయానికి ఈ సంధి వుంది

సద్యః + ఘృతము = సద్యోఘృతము

సద్యః + గర్భము = సద్యో గర్భము

సద్యః + జాతము = సద్యోజాతము

7. "అః" అంతమందుగల శబ్దాలకు అకారేతర అచ్చులు పరమైతే విసర్గ లోపిస్తుంది. పరమైన అచ్చుకు మార్పులేదు.

| | | | |
|---|---|---|---|
| ఉదా॥ | మనః + ఆనందము | = | మన ఆనందము |
| | సుమనః + ఉద్యానము | = | సుమన ఉద్యానము |
| | పయః + ఓదనము | = | పయఓదనము |

ఇలాంటి సమాసాలు శ్రుతిహితాలు కాకపోవుటచే సాహిత్యంలో కన్పించవు. ఇట్టి ప్రయోగాలు రచనా సౌష్ఠవానికి తోడ్పడవు.

8. విసర్గాంత శబ్ద, అవ్యయ, ఉపసర్గల మీద చ ఛ లు పరమైతే "శ" వర్ణం ట, ఠ లు పరమైతే ష వర్ణం, త థ లు పరమైతే "స" వర్ణం విసర్గకు ఆదేశంగా వస్తాయి.

| | | | | |
|---|---|---|---|---|
| ఉదా॥ | అ) | యశః + చంద్రిక | = | యశశ్చంద్రిక |
| | | సభః + ఛత్రము | = | సభశ్ఛత్రము |
| | | బహిః + చిహ్నము | = | బహిశ్చిహ్నము |
| | | దుః + చరిత్ర | = | దుశ్చరిత్ర |
| | ఆ) | ధనుః + టంకృతి | = | ధనుష్టంకృతి |
| | ఇ) | సరః + తీరము | = | సరస్తీరము |
| | | అంతః + తాపము | = | అంతస్తాపము |
| | | నిః + తేజము | = | నిస్తేజము |
| | | దుః + తరము | = | దుస్తరము |

9. విసర్గాంతాలైన శబ్ద, అవ్యయ, ఉపసర్గలకు శ, ష, స లు పరమైతే విసర్గకు లోపం, పరహల్లుకు ద్విత్వం వస్తుంది.

| | | | | |
|---|---|---|---|---|
| ఉదా॥ | అ) | మనః + శాంతి | = | మనశ్శాంతి |
| | | యశః + శరీరము | = | యశశ్శరీరము |
| | | అంతః + శుద్ధి | = | అంతశ్శుద్ధి |
| | | నిః + శబ్దము | = | నిశ్శబ్దము |
| | | దుస + శీలుడు | = | దుశ్శీలుడు |
| | ఆ) | చతుః + షష్టి | = | చతుష్షష్టి |

ఇ) తపః + సిద్ధి = తపస్సిద్ధి

అంతః + సారము = అంతస్సారము

దుః + సాహసము = దుస్సాహసము

10. పై ప్రసంగాల్లో వివరించిన విసర్గ సంధి విశేషాలు చాలా వరకు తెలుగు సాహిత్యంలో లభించే ప్రయోగాలకు లక్షణాలు. మరికొన్ని విశేష సంధులు ఈ క్రింద ఇవ్వబడ్డాయి.

ఉదా॥ స్వః + పతి = సఃపతి స్వర్పతి

గీః + పతి = గీఃపతి, గీర్పతి

అహః + పతి = అహఃపతి, అహర్పతి

అహః + అహము = అహరహము

అహః + రాత్రి = అహోరాత్రము

11. అజంత పదం మీద హలాది పదం చేరితే సంధిలేదు. సంధి ఒక్క చోట మాత్రం వుంది.

హ్రస్వాచ్చుమీద ఛవర్ణం చేరితే నిత్యం గాను, దీర్ఘచ్చు మీద చేరితే వై కల్పికంగాను, ఆ ఛ వర్ణానికి ముందు చవర్ణం ఆగమంగా వస్తుంది.

ఉదా॥ వృక్ష + ఛాయ = వృక్షచ్ఛాయ

గృహ + ఛిద్రము = గృహచ్ఛిద్రము

పంక్తి + ఛందము = పంక్తిచ్ఛందము

మహా + ఛాయ = మహాచ్ఛాయ, మహా ఛాయ

సీతా + ఛందము = సీతాచ్ఛందము, సీతాఛందము

హ్రస్వ, దీర్ఘంత ఉపసర్గలకు ఛవర్ణం పరమైతే ఆ ఛ వర్ణానికి ముందు చవర్ణ ఆగమం నిత్యం.

ఉదా॥ పరి + ఛేదము = పరిచ్ఛేదము

వి + ఛిన్నము = విచ్ఛిన్నము

స + ఛిద్రము = సచ్ఛిద్రము

ఆ + ఛాదన = ఆచ్ఛాదన

**ఆధారగ్రంథాలు:**


1. ఆధునిక తెలుగు వ్యాకరణం - ఎస్. శివరామమూర్తి
2. ఆధునిక తెలుగు వెన్నెలకంటి వ్యాకరణం - వెన్నెలకంటి ప్రకాశం
3. ఆధునిక తెలుగు భాషా నిర్మాణం - శివుని రాజేశ్వరి
4. ఆధునిక ప్రామాణికాంధ్ర వ్యాకరణం - వజ్ఝల వేంకటేశ్వర్లు
5. ఆధునిక భాషాశాస్త్రం - వెలమల సిమ్మన్న
6. ఈనాడు భాషా స్వరూపం - బూదరాజు రాధాకృష్ణ
7. తెలుగు దారి - వెల్చేరు నారాయణరావు
8. తెలుగులో వెలుగులు - చేకూరి రామారావు
9. తెలుగు భాషా చరిత్ర (సంపాదకులు) - భద్రిరాజు కృష్ణమూర్తి
10. తెలుగు భాషా చరిత్ర - వెలమల సిమ్మన్న
11. తెలుగు భాషా తత్త్వం - కొమర్రాజు లక్ష్మణరావు
12. తెలుగు భాషా శాస్త్రవేత్తలు - వెలమల సిమ్మన్న
13. తెలుగు భాషా స్వరూపం - బూదరాజు రాధాకృష్ణ
14. తెలుగు వాక్యం - చేకూరి రామారావు
15. ప్రౌఢ వ్యాకరణం - బహుజనపల్లి సీతారామయ్య
16. బాల వ్యాకరణం - చిన్నయసూరి
17. బాల వ్యాకరణం - శాస్త్రీయ వ్యాఖ్య - వెలమల సిమ్మన్న, గుమ్మా సాంబశివరావు
18. భాషా తపస్వి గిడుగు - వెలమల సిమ్మన్న
19. భాషానువర్తనం - చేకూరి రామారావు
20. వ్యావహారిక భాషా వ్యాకరణం - వడ్లమూడి గోపాలకృష్ణయ్య
21. శబ్ద బ్రహ్మ చిన్నయసూరి (అముద్రితం) - వెలమల సిమ్మన్న, గుమ్మా సాంబశివరావు
22. సంధి - వెలమల సిమ్మన్న


**II. ఆంగ్లం :**


1. A Grammar of ModernTelugu - Bh. Krishan Murthy
2. Sandhi Balavyakaranam - J. Pratap Reddy.

పాఠం - 4

# ఆధునిక తెలుగు భాష - నామ నిర్మాణం

విషయ సూచిక :


4.1. భాషా భాగాలు

4.1.1. నామాలు

4.1.2. క్రియలు

4.1.3. విశేషణాలు

4.1.4. కారకాలు

4.1.5. సర్వనామాలు

4.1.6. వైభక్తికాలు

4.1.7. సంయోజకాలు

4.1.8. వ్యంజకాలు

4.2. నామాలు - రకాలు

4.2.1. వ్యక్తి వాచక నామాలు

4.2.2. జాతి వాచక నామాలు

4.2.3. భావవాచక నామాలు

4.2.4. సమూహవాచక నామాలు

4.2.5. ప్రత్యేక విశేషాలు


## 4.1. నామ నిర్మాణం

### 4.1.1. భాషా భాగాలు :

వాక్యంలోని వేరు వేరు పదాలు వేరు వేరు పనులను నిర్వర్తించే పదంచేసేపనిని "వృత్తం" అనవచ్చు. పదాల వృత్తాన్ని బట్ట వాటిని వేరు వేరు వర్గాలుగా ఏర్పరచవచ్చు. ఈ వర్గాలను "భాషా భాగాలు" అని అంటారు. ఈ భాషా భాగాలు 8.

| | | | |
|---|---|---|---|
| 1. | నామాలు | 5. | సర్వనామాలు |
| 2. | క్రియల | 6. | వైభక్తికాలు |
| 3. | విశేషణాలు | 7. | సంయోజకాలు |
| 4. | కారకాలు | 8. | వ్యంజకాలు |

**1. నామములు (Nouns) :**

వ్యక్తి, వస్తువులను పేర్కొనే పదాలు నామములు. నామం అంటే పేరు అని అర్థం. "నామం" అనే పదానికి వ్యాపకమైన అర్థం. ఉదా॥ ఉపాధ్యాయుడు, వృక్షం, రాజు, నిద్ర, దయ, సుఖం, తల్లి, ఇల్లు.

ఈ నిర్వచనంలో వస్తు శబ్దానికి వ్యాపకమైన అర్థంవుంది. ఇల్లు, కొండ మొదలైనవి జడ వస్తువులు. చెట్టు, లత, మొదలైనవి వృక్షజాతులు. పిల్లి, కాకి మొదలైనవి పశుపక్ష్యాది ప్రాణి జాతులు. నిద్ర దయ మొదలైన ధర్మాలు వీటి అన్నింటికి వస్తు శబ్దం వర్తిస్తుంది. మానవ సమాజంలోని స్త్రీ పురుషులందరికిని వ్యక్తి శబ్దం వర్తిస్తుంది. ఈ శబ్దం దేవతలకు,రాక్షసులకు కూడా వర్తిస్తుంది.

శారద, వాల్మీకి, అనే పేర్లు ప్రత్యేక వ్యక్తులను సూచించేవి. ఇవి వ్యక్తి వాచక నామములు. పిల్లి మొదలైనవి ఒకే జాతికి చెందిన ఒక్కొక్క వ్యక్తిని సూచించే పేర్లు. పిల్లి ఒక జాతి జంతువుకు పేరు. పువ్వు రేడియో మొదలైనవి ఒక జాతికి చెందిన ఒకొక్క వస్తు ఒకొక్క వస్తువును సూచించేపేర్లు. ఇలాంటివి సాధారణ నామములు కామం, క్రోధం మొదలైనవి మానసికమైన భావాలు. నిద్ర ఒక అవస్థ. ఇలాంటి పదాలు భావవాచక నామములు

**4.1.2. క్రియలు (Verbs) :**

వాక్యం యొక్క భావాన్ని పూర్తి చేయడానికి క్రియ అవసరం. క్రియలేనిదే వాక్యం పూర్తి కాదు. వాక్యానికి అంతటికి సర్వ ప్రధానమైన పదం క్రియ. క్రియ మీదనే ఇతర పదాలు ఆధారపడి వుంటాయి.

వ్యక్తి వస్తువులను ఉద్దశించి ఏదో ఒక విషయం చెప్పుటై ఉపయోగపడేది. వ్యాపారాదులను బోధించేది అయిన పదానికి క్రియ అని అంటారు. చేయుట, ఉంచుట, ఆగుట - ఇవి వ్యాపారాదుల్లో అంతర్గతాలు.

ఉదా॥ ఆయన రేపు వస్తారు

వాడు బుద్ధిమంతుడు

ఔను యుద్ధంలో అనేకులు మరణించారు.

**4.1.3. విశేషణాలు (Adjectives) :**

నామ బోధిత వ్యక్తి వస్తువులను వర్ణించుటకు గాని, నిర్దేశించుటకు గాని, వాటి సంఖ్యను లేక పరిమాణామాన్ని తెలుపుటకు గాని ఉపయోగపడుతున్న పదాలు విశేషణాలు. తరుచుగా విశేష గుణాలకు నామముల ముందే ప్రయోగం.

"తెల్లని'' అనే పదం రంగును తెలుపుతున్నది. "మంచి'' అనే పదం పుస్తకం యొక్క ఒక గుణాన్ని తెలుపుతుంది. "సముద్రపు నీరు'' అనే ఉక్తిలో "సముద్రపు'' అనే పదం నీటి లక్షణాన్ని తెలుపుతుంది. ఎర్రని, చెడ్డ, క్రొత్త మొదలైనవి నామం చేత తెలుపుపడ్డ వ్యక్తి, వస్తువుల్ని వర్ణిస్తాయి. "ఈ ఇల్లు'' అనే చోట "ఈ'' అనే పదం ఇంటిని నిర్దేస్తున్నది. "మా నూతన భవనము'' అన్న చోట "మా'' అనే పదం భవనాన్ని నిర్దేశిస్తున్నది. "నాలుగు మాటలు'' అనే ఉక్తిలో "నాలుగు'' అనే పదం మాటల సంఖ్యను తెలుపుతుంది. "మూడవ ఇల్లు'' అన్న చోట "మూడవ'' అనే పదం ఇంటి క్రమ సంఖ్యను తెలుపుతుంది. "ఎక్కువ'' అనే పదం భావం యొక్క పరిమాణాన్ని సూచిస్తుంది. ఈ క్రింది ఉక్తులలో మొదటి పదాలు విశేషణాలు. తర్వాత పదాలు నామాలు

ఉదా॥ తియ్యని ఫలం, ఆ వైద్యుడు, పది పత్రికలు, ఇంత ధనం

**4.1.4. కారకాలు :**

క్రియలు, లేక విశేషణాలు లేక ఇతర కారకాలకు ఆ శ్రితాలై ఆ పదాలు బోధించే అర్థాన్ని మరికొంత వ్యక్త పరచి చెప్పే పదాలను "కారకాలు'' అని అంటారు. ఉదా॥ బండి వడిగా పోతున్నది ఆమె ఎంతో మంచి బాలిక, కొంచెం తొందరగా నడక సాగించు.

క్రియా బోధిత వ్యాపారాల విశేషాల్ని వివరించే పదాలకు "కారకాలు'' అని పేరు. కారకం అంటే "చేయించేది'' అని అర్థం. క్రియ వ్యాపార బోధకం క్రియాన్వయం కలవి మాత్రమే కాక క్రియా భోధిత వ్యాపారాల్ని వ్యకత్పరచేవి కాబట్టి అవి కారకాలు అనబడతాయి.

కారకాలు క్రియలతోనే కాక విశేషణాలతోనూ, ఇతర కారకాలతోనూ అన్వయించి వాటికి ఆశ్రితాలుగా వుంటాయి. ఇలాంటి కారకాలు తరచుగా పరిమాణ వాచకాలు.

ఈ క్రింది వాక్యాల్లోని కారకాలు విశేషణాలకు ఆశ్రితాలు. ఉదా॥

1. ఈ పుస్తకం చాలా చక్కని బొమ్మలతో నిండి వుంది.
2. మా స్నేహలత ఎంతో మంచి బాలిక
3. ఇంత పెద్ద బరువు నేను మోయలేను.

మొదటి వాక్యంలో "చాలా'' అనే పదం "చక్కని'' అని వేశేషణానికి ఆశ్రితమైన, విశేషణ బోధితమైన గుణం (చక్కదనం) యొక్క పరిమాణాన్ని తెలుపుతున్నది.

రెండో వాక్యంలో "ఎంతో'' అనే కారకం, "మంచి'' అనే విశేషణాన్ని తెలుపుతుంది.

మూడో వాక్యంలో "ఇంత'' అనే కారకం "పెద్ద'' అనే విశేషణాన్ని ఆశ్రయిస్తున్నవి. ఇవి కూడా పరిమాణ వాచకాలే.

ఈ క్రింది వాక్యాల్లోని కారకాలు ఇతర కారకాలకు ఆశ్రితాలు.

1. ఆమె నిన్నటి కచేరీలో చాలా చక్కగా పాడింది.

2. వాడు ఎంతో దీనంగా ప్రార్థించాడు.

3. కొంచెం తొందరగా నడక సాగింపు

మొదటి వాక్యంలో "చక్కగా" అనే పదం కారకం. "పాడింది" అనే క్రియకు ఆశ్రితం. "చాలా" అనే కారకం "చక్కగా" అనే కారకానికి ఆశ్రితం. అమె ఎంత చక్కగా పాడిందో తెలుపుతుంది. ఇది పరిమాణ వాచకం.

రెండో వాక్యంలోని "ఎంతో" అనే కారకం "దీనంగా" అనే కారకానికి ఆశ్రితం.

మూడో వాక్యంలోని "కొంచెం" అనే కారకం "తొందరగా" అనే కారకానికి ఆశ్రితం. ఇవి కూడా పరిమాణ వాచకాలే.

**4.1.5. సర్వనామాలు (Pronouns) :**

వ్యక్తి, వస్తువుల్ని పేర్కొనక వాటిని నిర్దేశించుటకు గాని, వాటి సంఖ్యను లేక పరిమాణాన్ని తెలుపుటకు గాని ఉపయుక్తాలై నామములకు బదులుగా వచ్చే పదాలు సర్వనామాలు అనబడతాయి.

ఉదా॥

1. జానకి నా నేస్తం. ఆమె మిక్కిలి తెలివైంది.
2. రాజా, నీవు, నేను కలిసి ఈ సాయంకాలం సిమాకు పోదాము. వస్తావా ? అని గోపి రాజును అడిగాడు. వాడు తాను రానన్నాడు.
3. విద్యార్థులలో కొందరు మాత్రమే సమ్మెలో పాల్గొన్నారు.
4. ఆయన మా నాన్నగారు, వీరు మా బంధువులు
5. ఇది ఎవరి పుస్తకం

మొదటి వాక్యంలో "ఆమె" అనే పదం "జానకి అనే నామానికి బదులుగా వచ్చింది. "జానకి" అనే వ్యక్తిని నిర్దేశిస్తుంది.

రెండో వాక్యంలో "నీవు" అనే పదం "రాజు" అనే వ్యక్తిని నేను, వాడు, తాను, అనే పదాలు "గోపి" అనే వ్యక్తిని నిర్దేశిస్తుంది. ఆ నామాలకు బదులుగా వచ్చినవి.

మూడో వాక్యంలో "కొందరు" అనే పదం విద్యార్థులను తెలియజేస్తుంది.

నాల్గో వాక్యంలో "ఆయన" అనే పదం వక్త యొక్క నాన్నగారిని, వీరు అనే పదం వక్త బంధువులను నిర్దేశిస్తుంది.

ఐదో వాక్యంలో "ఇది" అనే పదం పుస్తకాన్ని నిర్దేశిస్తుంది.

వాడు అనే సర్వ నామం సమస్త పురుష వ్యక్తుల నామాలకు బదులుగా వచ్చి, ఒక్క వ్యక్తినే నిర్దేశిస్తుంది. ఒకే జాతికి చెందిన సమస్త నామాలకు బదులుగా వచ్చేవి కాబట్టి ఇలాంటి పదాలకు "సర్వనామ" సంజ్ఞ సార్థకమైంది. నామాలకు బదులుగా వచ్చే పదాలు సర్వనామాలు అంటే సరిపోదు. "ఏనుగు" అనేనామాలకు బదులుగా గజం, దంతి మొదలైన నామాల్లో ఏదైనా రావచ్చు. కాని ఇవి సర్వనామాలు కావు. సర్వ నామాలు వ్యక్తి వస్తువుల్ని పేర్కొవు.

ఒకే వస్తువును పేర్కొనే నామం ఏ సందర్భంలో వచ్చినా ఆ వస్తువునే బోధిస్తుంది. కాని సర్వనామం సందర్భానుసారంగా ఏ వస్తువునైనా బోధించగలదు. "చెట్టు" అనే నామం భాషలో ఎక్కడ వచ్చినా చెట్టునే బోధిస్తుంది. కొండను గాని, నదిని గాని బోధించలేదు. "అది" అనే సర్వనామం సందర్భాన్ని బట్టి చెట్టును, కొండను, నదిని మరియే వస్తువును గాని బోధించగలదు.

మా గ్రామం చెంత ఒక కొండ వుది. అది ఎత్తైంది. దాని దిగువను ఒక మర్రి చెట్టు వుంది. అది మిక్కిలి విశాలమైంది. ఆ ప్రక్కనే ఒక నది ప్రవహిస్తుంది. అది ఎండా కాలంలో కూడా ఎండిపోదు.

ఇందులో "అది" అనే సర్వనామం మూడు చోట్ల వచ్చింది. మూడు వేర్వేరు వస్తువుల్ని నిర్దేశిస్తుంది.

"ఆమె" అనే సర్వనామం ఏ స్త్రీ వ్యక్తినైనా నిర్దేశించగలదు. ఇది అన్ని సర్వనామాలకు సమానమైన లక్షణం.

ఒక వ్యక్తి గాని వస్తువును గాని, ఉద్దేశించి చెప్పేటప్పుడు ఎప్పుడూ ఆ వ్యక్తి ఆ వస్తువుల నామాలనే వాడడం మంచి కాదు. ఆ రచన సహృదయ పాఠకులకు విన సొంపుగా వుండదు. ఉదా॥

దశరథుడ అయోధ్యకు రాజు. దశరథునికి ముగ్గురు భార్యలు. దశరథునికి సంతానం లేదు. దశరథుడు సంతాన ప్రాప్తికై పుత్ర కామేష్టి చేయగా దశరథునికి నలుగురుకొడుకులు కలిగారు. అని కథ రాసినా, చెప్పినా సుందరంగా వుండదు. కటువుగా వుంటుంది. చదివేవారికి గాని, వినే వారికి గాని అంతగా ఆమోదయోగ్యంగా వుండదు. పై కథలో "దశరథ" అనే శబ్దాన్ని పదే పదే ప్రయోగించక అతనికి, అతడు మొదలైన సర్వ నామాల్ని వాడడం వల్ల నామ పునరుక్తి నివారించబడి శ్రుతి రంజకత పెంపొందుతుంది.

నామాలు వ్యక్తి వస్తువుల చిత్రణం చేయుటలో సమర్థమైనవి. చెట్టు సముద్రం, శివుడు, నర్తకి అనే నామాల్లో ఎంతో అర్థం ఇమిడి వుంది. సర్వ నామాలకు అలాంటి శక్తి లేదు. వ్యక్తి, వస్తువులను నిర్దేశించడం, వాటి సంఖ్యను పరిమాణాన్ని చెప్పడం మాత్రమే సర్వనామాల లక్షణం. అయితే సర్వ నామాలు నామాలకు బదులుగా వచ్చే పదాలు మాత్రమే కావు. వాటికి ప్రత్యేకమైన అర్థం, వృత్తం వున్నాయి. నామాలు చేయలేని పనిని సర్వనామాలు చేస్తాయి.

ఉదా॥ రాముడు లక్ష్మణునితో తమ్ముడా ! నీవు ఇక్కడనే వుండు, నేను పోయి బంగారు లేడిని పట్టి తెస్తాను అని అన్నాడు.

ఈ వాక్యంలో "నేను" అనే సర్వ నామం వక్త అయిన రామునిని తెలుపుతుంది. ఇక్కడ "నీవు" అనే సర్వ నామం సంబోధించిన వ్యక్తి అయిన లక్ష్మణునికి తెలుపుతుంది. ఇక్కడ నేను, నీవు అనే సర్వ నామాల్ని అలాగే వాడాలి. వాటికి బదులుగా నామాలు వాడరాదు.

పై వాక్యంలో "................ లక్ష్మణుడు ఇక్కడనే వుంటాడు. రాముడు పోయి బంగారు లేడిని పట్టి తెస్తాడు" అని చెప్పరాదు. "నీవు", "నేను" సర్వనామాల విశిష్ట, ప్రత్యేకత అదే.

ప్రశ్న వాచకలైన ఏమి, ఏది, ఏవి, ఎవరు మొదలైన సర్వనామాలు, ఒకటి, రెండు మొదలైన సర్వనామాల్ని పరిహరించరానివి.

**2.1.6. వైభక్తికాలు :**

వ్యక్తి వస్తువులకు, ఇతర వ్యక్తి వస్తువులతో గల సంబంధం సూచించడానికి ఆ వ్యక్తి వస్తువుల్ని బోధించే నామాల వెనుక గాని, సర్వ నామాల వెనుక గాని, కారక బంధ, విశేషణ బంధాల ఏర్పాటులో వచ్చే పదాలు వైభక్తికాలు.

ఉదా॥ చెట్టు మీద రెండు పక్షులు వున్నవి. ఇంటి లోని పోరు అశాంతికి మూలం

వైభక్తికాలు రెండురకాలు

1. కారక బంధాల ఏర్పాటున వచ్చేవి కారకీయ వైభక్తికాలు

2. విశేషణ బంధాల ఏర్పాటున వచ్చేవి వైశేషణిక వైభక్తికాలు

**కారక బంధాలు :**

ఉదా॥ 1. బల్ల మీద పుస్తకం వుంది

2. పిల్లలు తోట లోపల ఆడుకుంటున్నారు

3. రోగ నివారణ కొరకు ఔషధం సేవించవలెను

4. యాత్రికుడు బండి నుంచి పడిపోయినాడు.

"బల్ల మీద" అనే ఉక్తి "ఉన్నది" అనే క్రియతో అన్వయిస్తున్నది. ఎక్కడ ఉన్నది ? అనే ప్రశ్నకు జవాబు. కాబట్టి ఈ ఉక్తి కారకం చేసే పనినే చేస్తుంది. దీనిలో రెండు పదాలు చేరి వున్నాయి. కారక వృత్తం గల "బల్ల మీద" వంటి ఉక్తి లేక పద బంధం "కారకోక్తి" లేక "కారక బంధం" అనబడుతుంది. "మీద" అనే పదం బల్లకును, పుస్తకం యొక్క ఉనికిని, గల సబంధం తెలుపుతుంది. పుస్తకం బల్ల మీద ఉన్నది. బల్ల క్రిందను గాని, మరొక చోటను గాని లేదు. సంబంధ సూచికమైన "మీద" అనే పదానికి వ్యాకరణంలో "వైభక్తికం" అనే సంజ్ఞ తగివుంది.

రెండో వాక్యంలో "తోట లోపల" అనే కారక బంధం "ఆడుకుంటున్నారు" అనే క్రియను వ్యక్త పరచుస్తుంది. "లోపల" వైభక్తికం. "తోట" అనే నామంపై చేరడం వల్ల కారక బంధం ఏర్పడింది. "లోపల" అనే వైభక్తికం తోటకును, పిల్లలు "ఆడుకొనుట" అనే వ్యాపారానికి గల సంబంధం తెలుపుతుంది.

రోగ నివారణకు ఔషధ సేవనంతో గల సంబంధం "తెలిపే కొరకు" అనే పదం వైభక్తికం. "రోగ నివారణ కొరకు" అనే ఉక్తి కారక బంధం

బండికి, యాత్రికుని పడిపోవడానికి గల సబంధం తెలిపే "నుంచి" అనే పదం వైభక్తికం "బండి నుంచి" కారక బంధం.

మీదు, లోపల, కొరకు, నుంచి, అనే పదాలు కారక బంధాల ఏర్పాటున నామాల మీద చేరుతాయి. కాబట్టి అవి కారకీయ వైభక్తికాలు.

**విశేషణ బంధాలు :**

ఉదా॥ 1. బల్ల మీద పుస్తకం నాది

2. తోట లోపలి పువ్వులు ఆ పిల్లలను ముగ్ధులను చేసినవి

3. విద్యవలన ప్రయోజనాలు అనేకాలు

4. ఆయన్నది వెన్నవంటి మనస్సు.

"బల్లమీద" అనే ఉక్తి "పుస్తకం" అనేనామానికి విశేషణంగా ఆచరిస్తుంది. "ఏ పుస్తకం ? అనే ప్రశ్నకు అది సమాధానం. ఇది విశేషణ బంధం. లేక విశేషణోక్తి అనబడుతుంది. "మీది" అనే పదం బల్లకును, పుస్తకంనకును, గల సంబంధాన్ని సూచిస్తుంది. కాబట్టి ఇది వైభక్తికం. విశేషణ బంధం ఏర్పాటున వచ్చే వైభక్తికం కాబట్టి "మీది" అనే పదం "వైశేషణిక వైభక్తికం" అవుతుంది.

రెండో వాక్యంలో "తోట లోపలి" అనే విశేషణ బంధం "పువ్వులు" అనే నామాన్ని వ్యక్త పరుస్తుంది. "లోపలి" అనే వైశేషణిక వైభక్తికం. తోటకును, పువ్వులకును గల సంబంధాన్ని సూచిస్తుంది.

మూడో వాక్యంలోని విద్య వలని విశేషణ బంధం "వలని" వైశేషణిక వైభక్తికం.

నాల్గో వాక్యంలో "వెన్నవంటి" విశేషణ బంధం "వలని" వైశేషణిక వైభక్తికం.

వైభక్తికాలు నామాల మీదనే కాక సర్వనామాల మీద కూడా చేరడం వల్ల కారకబంధాలు, విశేషన బంధాలు ఏర్పడతాయి.

**కారక బంధాలు :**

నా మీద, నీదాక, ఆమెలో మీ వద్ద, వాని తర్వాత, దీని దగ్గర వాటి నడమ

**వివేషన బంధాలు :**

నీలోని శక్తి, నా దగ్గరి ధనం, వాని మీది ప్రేమ, అతని చేతి సాయం, వారి తోడి వియ్యం, ఆమె వంక చుట్టాలు

**4.1.7. సంయోజకాలు (Interjections) :**

సంయోగం కలిగించేది కలిపేది సంయోజకం. ఆశ్రిత ఉపవాక్యాన్ని అవశిష్ట వాక్యాంశంతో అనుబద్ధం చేసేది కాబట్టి అలాంటి సంయోజకాన్ని "అనుబంధి సంయోజకం" అంటారు.

పదాల్ని గాని, ఉక్తుల్ని గాని, వాక్యాల్ని గాని కలుపుటకై ఉపయోగపడే పదాలు సంయోజకాలు.

ఉదా॥ రాముడును, కృష్ణుడును స్నేహితులు

వాడు ధనవంతుడే కాని వానికి సౌఖ్యం లేదు

పుస్తకం బీరువాలో నో పెట్టె లో నో ఉంటుంది.

**4.1.8. వ్యంజకాలు (Conjunctions) :**

ఆశ్చర్యం, సంతోషం, దుఃఖం, మొదలైన తీవ్రమైన ఆకస్మిక మనోభావాల్ని వెల్లడించడానికి ఉపయోగపడే పదం వ్యంజకం.

ఉదా॥ 1. అయ్యో ! చిట్టి తండ్రీ, ముమ్మలను విడిచి పోయినావా ?

2. అబ్బా ! ఈ నొప్పి సహించలేను.

3. ఆహా! ఈ శిల్ప సౌందర్యం, అత్యద్భుతం, వర్ణనాతీతం

4. ఓహో! ఎంత విజయోత్సాహంతో ప్రజలు వేడుకలు జరుపుకుంటున్నారు.

5. సెబాస్! నీ ఆట చాలా బాగున్నది.

6. ఛీ! ఇక్కడ నుండి పో, నీ మొగం చూడకూడదు.

7. పాపం! ఆవిడకు తీరని కష్టం వచ్చింది.

పై వాక్యాల్లోని అయ్యో, అబ్బా, మొదైలన పదాలు ఒక ఆకస్మికమైన మానసిక భావోద్రేకాన్ని తెలుపుతుంది. దుఃఖం, బాధ, ఆశ్చర్యం, ఆనందం మొదలైన మనో వికారాల్ని సూచించడానికి ఆ పదాలు ఉపయోగపడుతున్నాయి. మనో గత విస్మయ దుఃఖ సంతోషాది భావాతిశయ వ్యంజకాలు కాబట్టి ఈ ప దాల్ని "వ్యంజకాలు'' అంటారు.

ఎనిమిది భాషా భాగాల వర్గీకరణ ఆంగ్లం మదలైన పాశ్చాత్య భాషల్లో వుంది. అంతేకాదు హిందీ మొదలైన భారతీయ ఆర్య భాషల ఆధునిక వ్యాకరణాలు కూడా ఈ మార్గనే అవలంబించారు. సమస్త ఉన్నత భాషల్లోనూ అష్ట విద భాషా భాగ ప్రణాళికయుక్తమైనదే అని ఆధునిక భాషావేత్తలు ఏకాభిప్రాయానికి వచ్చారు. ఈ వర్గీకరణం తెలుగు భాషకు వర్తింప చేయడం సహేతుకం అనుటలో సందేహం లేదని వజ్ఝల వేంకటేశ్వర్లు గారు "ఆధునిక ప్రామాణికాంధ్ర వ్యాకరణం''లో పేర్కొన్నారు.

ఎనిమిది భాషా భాగాల్లో నామాలు, క్రియలు, సర్వనామాలు మాత్రమే ప్రత్యయాత్మక రూపభేదాలు గల పదాలు. కారకాలు, వైభక్తికాలు, సంయోజకాలు, వ్యంజకాలు, రూప భేదాలు లేని పదాలు. వీటినన్నంటిని "అవ్యయాలు'' అనే వర్గంగా సంస్కృత వ్యాకరణానుసారంగా, మన పూర్వ వ్యాకరణాల్లో పేర్కొవడం జరిగింది. "అవ్యయ'' సంజ్ఞ ఆ వర్గంలోని పదాల వృత్తానికి సంబంధించింది కాదు, రూపానికి సంబంధించినది మాత్రమే.

తెలుగులోని విశేషణాలు సంస్కృత విశేషణాల వంటివికావు. సంస్కృత విశేషాలు నామాలు వంటివే. వాటికిప్రత్యయాత్మక రూపాలున్నాయి. "ఆశ్రితం''లైన విశేషణాలూ "అధికారు''లైన నమాలూ, సమాస లింగ విభక్తి వచనాలు గలవై వుంటాయి. ఇలాంటి సామానాధికరణ్యాం ఆశ్రిత అధికార భావం గల తెలుగు విశేషణాలకూ నామాలకు లేదు. తెలుగు విశేషణాలు సహజంగా రూప భేదాలు లేని అవ్యయం లాంటివే. కాబట్టి వృత్తంనకు సంబంధించని ఈ "అవ్యయ'' సంజ్ఞ భాషా భాగాల్ని పేర్కొనడానికి పనికారాదు.

నామాలు, క్రియలు, సర్వనామాలు, ప్రత్యయాల సహాయంన వేర్వేరు రూపాల్ని పొంది వేర్వేరు అర్థాల్లో ఉపయోగపడతాయి.

1. "పిల్ల'' అనే నామం యొక్క కొన్ని రూపాలు

పిల్లలు, పిల్లను పిల్లకు, పిల్లలను, పిల్లలకు,

పిల్లల, పిల్లా, పిల్లలారా పిల్లలం

2. తినుట ఒక వ్యాపారం. "తినుట" అనే పదం క్రియ. దీని నుండి ఏర్పడిన కొన్ని క్రియా రూపాలు :

తిను, తిన్నాను, తిన్నాడు, తినుట, తినకు, తిన, తినక, తింటు, తిన్నాక, తింటే

3. "వాడు" అనే సర్వనామం యొక్క కొన్ని రూపాలు :

వాడు, వారు, వానిని, వారిని, వాని, వారి, వారికి.

నామాలుమొదలైన పదాల నుండి అనేక క్రొత్త పదాలు ఏర్పడి క్రొత్త అర్థాలు బోధిస్తాయి.

ఉదా॥ "మగ" అనే పదం నుండి మగవాడు, మగడు, మగతనం, మగటిమి, మొదలైన పదాలు ఏరపడతాయి.

"రాజ" శబ్దం నుండి రాజ్య, రాజత్వ, రాజ్ఞ శబ్దాలు ఏర్పడతాయి.

"చేయుట" అనే క్రియ నుండి చేరిక, చేరుప, చేరువ, అనే క్రొత్త పదాలు ఏర్పడతాయి. ఒక పదం నుండి మరొక పదం ఏర్పడే ప్రక్రియకు "వ్యుత్పత్తి" అని అంటారు.

ఒక్కొక్కపుడు రెండు మూడు పదాలు కలియడం వల్ల క్రొత్త పదాలు సిద్ధిస్తాయి.

ఉదా॥ చిచ్చర పిడుగు, ముమ్మారు, స్వేచ్ఛ, వాదోడు మొదలైనవి. ఇవి సమాసాలు

భాషా భాగాలు, ఒక్కక్క భాషాభాగంలోని ఉపభేదాలు, వాటి వేర్వేరు రూపాలు, ఆయా రూపాల ఉ పయోగాలు, పదాల వ్యుత్పత్తి, మొదలైన విషయాలు పదాలకు సంబంధించినవి. వీటిని గురించి వివరించే వ్యాకరణ భాగమే "పద విజ్ఞానం" అనబడుతుంది.

## 4.2. నామాలు - రకాలు

**నామాలు :**

ప్రాకృతిక సృష్టిలోని వ్యక్తి వస్తువులను, మానవ కల్పిత సృష్టిలోని వ్యక్తి వస్తువుల్ని, మానవ భావనా గమ్యాలైన వ్యక్తి వస్తువుల్ని పేర్కొడానికి ఉపయోగపడే సంజ్ఞలనే "నామాలు" అని అంటారు.

ఉదా॥ మానవుడు, నక్షత్రం, ఆవు, పక్షి, సముద్రం, దేవత, రాక్షసి, విమానం, నౌక, శక్తి, సౌంద్యం

ఇక్కడ వస్తు శబ్దానికి వ్యాపకమైన అర్థం వుంది. "వస్తువు" అంటే జ్ఞానేంద్రియ గోచరాలైన పశుపక్ష్యాదులు, జడ పదార్థాలు మాత్రమే కాక, భావనా గోచరాలైన వ్యక్తి వస్తు ధర్మాలు, వ్యాపారాలు కూడా వస్తువులే.

ఉదా॥ అందం, ధైర్యం, దయ, తెలుపు, పరుగు, వ్రాత.

ఇంకా వివరణ కోసం ఈ క్రింది వాక్యాన్ని పరిశీలిద్దాం.

"మా తరగతిలో రంగయ్య అందరి కన్నా తెలివైన బాలుడు".

ఇందులో "బాలుడు" అనే పదం తరగతిలోని ప్రతి పురుష వ్యక్తిని బోధిస్తుంది. ఆ పదం ఒక వయః పరిమితికి లోబడిన ప్రతి పురుష వ్యక్తికిని పేరు. బాలురు అందరును ఒక తెగకు, లేక జాతికి చెందిన వ్యక్తులు. "రంగయ్య" అనే పదం బాలురు అందరిలో ప్రత్యేకంగా ఒక్కనిని మాత్రమే గుర్తించుటకై పెట్టన పేరు. కాబట్టి "బాలుడు" అనే పదం "జాతి వాచక నామం" "రంగయ్య" అనే పదం "వ్యక్తి వాచక నామం" అని అంటాం.

**4.2.1. వ్యక్తి వాచక నామాలు :**

ఒక వ్యక్తికి గాని, ఒక వస్తువుకు గాని, ప్రత్యేక సంజ్ఞగా వుంచబడిన పేరు "వ్యక్తి వాచక నామం" అవుతుంది.

గంగ, గోదావరి, మన దేశంలోని రెండు ప్రసిద్ధ నదుల పేర్లు. ఇవి వ్యక్తి వాచక నామాలు.

"నది" జాతి వాచక నామం. అలాగే పర్వతాలు, జాతి వాచక నామం. హిమాలయం, వింధ్య అనే పేర్లు వ్యక్తి వాచకాలు. "వ్యక్తి" అనే పారిభాషిక సంజ్ఞ ఇక్కడ శాస్త్రీయమైన సంజ్ఞగా స్త్రీ పురుష వ్యక్తులకే కాక పశు పక్ష్యాదులకును, జడ వస్తువులకును వర్తిస్తుంది.

**వక్తి వాచకనామాలు :**

**1. స్త్రీ వ్యక్తుల పేర్లు :**

ద్రౌపది, సత్యభామ, సరస్వతి, పార్వతి, లక్ష్మి

**2. పురుష వ్యక్తుల పేర్లు :**

రామమూర్తి, కృష్ణుడు, అప్పారావు, నూకరాజు

**3. జంతువుల పేర్లు :**

టామీ, స్వీటీ (కుక్కల పేర్లు), నందిని (గోవు పేరు)

**4. గ్రామాదుల పేర్లు :**

హైదరాబాద్ (నగరం), అమెరికా (ఖండం)

వ్యక్తి వాచక నామాలకు ఒక నిర్దిష్టమైన అర్థం లేదు. అవి ఒకే జాతిలోని వేర్వేరు వ్యక్తుల్ని, వస్తువుల్ని ప్రత్యేకంగా గుర్తించడానికి ఉపయోగపడే సంజ్ఞలు మాత్రమే. సాధారణ నామాలే వ్యక్తులకు వర్తించేటప్పుడు తమ సహజమైన అర్థాన్ని కోల్పోయి వ్యక్తి వాచక నామాలుగా పరిగణిస్తాయి.

ఉదా॥ లత, సౌదాయని, రాజు మొ॥

సాధారణ నామాల వ్యక్తులను గుర్తించుటకై ఈ పేర్లు పెడితే అవి వ్యక్తి వాచక నామాలు అవుతాయి.

ఉదా॥ సౌధాయని, లత అక్క చెల్లెళ్ళు వారి సోదరుడే రాజు.

సాధారణ నామాల లింగ వచనాలు అవి వ్యక్తి వాచక నామాలుగా పరిణమించేటప్పుడు వాటికి వర్తించవు.

ఉదా॥ 1. రత్నం మా స్నేహితురాలు, ఉద్యోగం చేస్తున్నది.

2. నిజంగా రత్నం లాంటివాడే మా మిత్రుడు రత్నం

3. అవధానులు ఏడీ, కనిపించడేమి ?

4. మా వంటావిడ రాముడు వండిన వంటకాలు చాలా రుచికరంగా వుంటాయి.

5. దొడ్డమ్మ మంచి హాస్య రచయిత, ఎన్నో చక్కని పాటలు వ్రాశారు.

"రత్నం" సాధారణ నామంగా నపుంసక లింగం. వ్యక్తి వాచక నామంగా తొలి వాక్యంగా స్త్రీ లింగం

రెండో వాక్యంలో పుం లింగం

మూడో వాక్యంలో "అవధానులు" సాధారణ నామంగా బహువచనం. కాని మూడో వాక్యంలో వక్తి వాచక నామంగా ఏక వచనం.

నాలుగో వాక్యంలో "రాముడు" వ్యక్తి వాచక నామం, స్త్రీ లింగం.

ఐదో వాక్యంలో "దొడ్డమ్మ" వక్తి వాచక నామం పులింగం.

వ్యక్తి వాచక నామాల వర్ణక్రమం సాధారణ నామాల వలె నియమబద్ధం కాదు. వాటి పలుకుబడి వర్ణక్రమం వ్యక్తుల ఇచ్ఛాధీనం.

ఉదా॥ విష్ణుమూర్తి॥ పర్యాయపదంగా "నారాయణుడు" అని మాత్రమే అనాలి గాని "నారాయణ" అని అనకూడదు. మానవుల్లో ఒకానొక వ్యక్తికి "నారాయణ" అనే పేరు వుండవచ్చు.

బుర్రా, పిలకా, చింతా, నిమ్మా మొదలైన దీర్ఘాంత పదాలు. జాతి వాచకాలైన బుర్ర, పిలక, చింత, నిమ్మ మొదలైన పదాల్ని వాటి వాటి అర్థాల్లో దీర్ఘాంతాలుగా రాయాలి.

**మరికొన్ని వ్యక్తివాచక నామాలకు ఉదా॥ :**

**1. తత్సమాలు కాని ప్రాతిపదికలు, మనుష్యుల పేర్లు :**

నారాయణ, సహజానంద, భార్గవ, రామకృష్ణ, రామచంద్ర

**2. హలంతాలు, మనుష్యుల పేర్లు :**

ఆనంద్, కుమార్, చిత్తరంజన్, శేఖర్, తిలక్, కిశోర్

**3. వర్ణ వికారం చెందినవి, మనుష్యుల పేర్లు :**

రామ్మూర్తి, వెంకట్రావ్, పురుషోత్తం, సీతారాం, ఈశ్వర్రావు, కాళిదాసు, భగవాన్లు, సన్నిబాబు, యల్లయ్య, సుబ్రహ్మణ్యం, సుబ్బమ్మ, అచ్చుతం.

**వ్యక్తి వాచక నామాలను జాతి వాచక నామాలుగా ఒక్కొక్కప్పుడు వ్యవహరించడం కద్దు :**

1. అమె సామాన్యులురాలు కాదు, చిత్రాంగి సుమీ
   (= రాజ రాజ నరేంద్రుని భార్య చిత్రాంగి వంటి స్త్రీ)

2. కోడె రామమూర్తి కలియుగ భీముడు
   (=మహాబలశాలి)

3. ఆయన వంటి సాధు పుంగవులు లోకంలో అరుదు
   అతడు సాక్షాత్తు హరిశ్చంద్రుడు (సత్యవ్రతుడు)

**4.2.2. జాతివాచక నామాలు (Common Nouns) :**

ఒక జాతికి, లేక తెగకు, చెందిన ప్రతి వ్యక్తిని గాని ప్రతి వస్తువును గాని బోధించే పేరు "జాతి వాచక నామం" అవుతుంది.

ఉదా॥ భూమి, చెట్టు, వాన, ఆకాశం, తల్లి, కొడుకు, అక్క, గురువు, పండితుడు, కర్త, రచయిత్రి, పాటగాడు, దొర, ఏనుగు, కలం, కాగితం, ఇల్లు, ఊరు, యంత్రం, రేడియో, బండి

**4.2.3. భావ వాచక నామాలు (Abstract Nouns) :**

జ్ఞానేంద్రియ గోచరాలు కాని, కేవలం భావన చేతనే గ్రహించదగ్గ వ్యక్తి వస్తువుల గుణ, అవస్థా, వ్యాపారాల పేర్లు భావ వాచక నామాలు ఉదా॥

**1. గుణాలు :**

మంచితనం, తెలివి, ధైర్యం, కఠినత్వం, మార్దవం, వలపు, తీపి, దయ, శ్రమ, నునుపు, సొంపు మొ॥

**2. అవస్థలు :**

బాల్యం, యౌవనం, నిద్ర, ఆరోగ్యం, మృత్యువు, లేమి మొ॥

**3. వ్యాపారాలు :**

నడక, ప్రార్థనం, రక్షణ, పఠనం, చలనం, వ్రాత, వంట, పరిపాలన, పర్యటనం

వ్యక్తి వస్తువులకు కొన్ని ధర్మాలు లేక గుణాలు వుంటాయి. తెల్లని పువ్వు యొక్క ధర్మం తెల్లదనం. అగ్ని గుణం వేడిమి. మిత్రుడైన వ్యక్తి ధర్మం మైత్రి. ఇలాంటి గుణాదుల పేర్లు భావ వాచక నామాలు ఉదా॥ తెల్లదనం, వేడిమి, మైత్రి మొ॥

**4.2.4. సమూహ వాచక నామాలు (Collective Nouns) :**

ఒకే జాతికి చెందిన పెక్కు మంది వ్యక్తుల లేదా పెక్కు వస్తువుల సముదాయాల్ని బోధించే పేర్లు సమూహక వాచక నామాలు.

కొన్ని పశువుల సమూహాన్ని "మంద" అనీ, కొన్ని హంసల గుంపును "పిండు" అనీ, కొంత మంది దొంగలగుంపును "ముఠా" అనీ అంటారు. మంద, పిండు, ముఠా మొదలైన పేర్లకు "సమూహవాచక నామాలు" అని పేరు.

మరికొన్ని సమూహ వాచక నామాలకు ఉదా॥ సమూహం, కదంబం బృందం, దళం, గణం, సంచయం, నికరం, రాశి, సంఘం, సమాజం తండం, గుంపు మొ॥

కొన్ని సమూహ వాచక నామాలు విశిష్ట వ్యక్తి వస్తువుల సమూహాలకే చెల్లుతుంది.

| | | | |
|---|---|---|---|
| ఉదా॥ | పైకం | = | పికముల సమూహం |
| | జనత | = | జన సమూహం |
| | యౌవతం | = | యువతీ సమూహం |
| | సేన, సైన్యం | = | సైనికుల సమూహం |

ఈ క్రింది సమాస పదాలలోని ద్వితీయ పదాలు సమూహ వాచక నామాలు పూర్వ పద బోధిత వక్తి వస్తువుల సమూహాల్ని బోధిస్తాయి.

ఉదా॥ గజయూథం, గాయక బృందం, సైనిక దళం, నట వర్గం, బంధువర్గం, మంత్రి మండలి, పండిత పరిషత్తు, రత్నహారం, పుష్ప గుచ్ఛం, ప్రమధ గణం, ధాన్య రాశి, పర్వతశ్రేణి, అంచపిండు ఆలమంద.

**2.2.5. ప్రత్యేక విశేషాలు :**

కొన్ని భావ వాచక నామాలు అర్థాన్ని బట్టి జాతి వాచక నామాలుగా ఉపయోగపడతాయి.

ఉదా॥ వంట ఒక కళ

ఈ రోజున వంటలు బాగున్నవి

మరికొన్ని ఉదా॥

1. ఆలోచన మానవునికి గల ఒక అద్భుతమైన శక్తి (భా.నా)
   ఆ క్షణంలో అతని మెదడులో ఎన్నో ఆచనలు మెదిలినవి (భా.నా)

2. భోజనం, పరిశ్రమ విశ్రాంతి - ఇవి ఆరోగ్యాన్ని పెంపొందించేటట్టు ప్రతివాడును జాగ్రత్త పడవలెను (భా.నా)
   ఒక భోజనం ఖరీదు రెండు రూపాయలు (భా.నా)
   ప్రభుత్వం వారు దేశంలో ఎన్నో భారీ పరిశ్రమలు నెలకొల్పినారు (భా.నా)

నామాలకు, నామ బోధిత వ్యక్తి వస్తువులకు గల భేదం, సంబంధం సావధానతతో గుర్తించడం అవసరం చెట్టు అనగానే సృష్టిలోని ఒక వస్తువు మనకు గోచరిస్తుంది. ఆ వస్తువు నామం కాదు. ఆ వస్తువును బోధించడానికి మనలో మనం ఏర్పరచుకొన్న ధ్వని రూప సంజ్ఞ లేక లిఖిత రూప సంజ్ఞ అయిన "చెట్టు" అనే పదం నామం అవుతుంది.

భాషలోని అన్ని పదాలు సంజ్ఞలే. ఒకొక్క పదం ఒకొక్క భావానికి గుర్తు. పదాల్ని సంజ్ఞా మాత్రాలుగా ఉపయోగించేటప్పుడు అవి కూడా ఒక రకమైన వస్తువులే. శ్రవణ గోచర ధ్వనులుగానూ, దృష్టి గోచర రేఖాకృతులుగానూ, అవి వస్తువులు. కనుక ప్రతి పదం సంజ్ఞా మాత్రమైనపుడు నామం అవుతుంది.

"బాలుని పేరు రంగయ్య" అనే వాక్యంలో వాస్తవంగా "రంగయ్య" కేవల సంజ్ఞ మాత్రమే. "రంగయ్య" అనే పదం నామం. నపుంసక లింగం. "అవును" అనే అధ్యాహార్య క్రియకు ఉద్దేశ్య సంబంధి పూరకం. "వాడు నా మిత్రుడు రంగయ్య" అనే వాక్యంలో "రంగయ్య" అనే పదం, పదం మాత్రమే కాదు, పురుష వ్యక్తి బోధకం, అది వ్యక్తి వాచక నామం, పుం లింగం.

"నీ మాటలు నేను నమ్మను" అనే వాక్యంలో "నేను" ఉద్దేశ్యం, "నమ్మను" క్రియ, "మాటలు" కర్మ.

పై వాక్యం ఒక వ్యాకరణ విషయాల్ని బోధిస్తుంది. దీనిలోని వాక్యంలో నేను, నమ్మను, మాటలు అనే మూడు పద మాత్రాలే. కాబట్టి అవి మూడునూ నామాలే. నపుంసక లింగాలు, ఏక వచనాలు. "అవును" అనే అధ్యాహార్య క్రియకు ఉద్దేశ్యాలు.

"కదలడు - వదలడు" చిత్రం నేను చూడలేదు. అనే వాక్యంలో "కదలడు - వదలడు" చిత్రం యొక్క పేరు కాబట్టి అది నామం.

"పాప నవ్వింది" చాలా బాగున్నది, నేను చదివాను" అనే వాక్యంలో "పాప నవ్వింది" ఒక నవల పేరు. కాబట్టి అది నామం. వ్యక్తి వస్తువుల్ని పేర్కొనుటకై ఉపయోగపడే పదాలు, పదబంధాలు, వాక్యాలు కేవలం సంజ్ఞలుగా నామాలు అని గ్రహించాలి.

వ్యాపార బోధకాలైన భావ వాచక నామాలకును, క్రియా నామాలకును భేదం వుంది.

ఉదా॥ 1. మన దేశంలో చాలా మందికి చదువు, వ్రాత, రావు

2. మనదేశంలో చాలా మందికి చదువుట, వ్రాయుట రావు

మొదటి వాక్యంలోని "చదువు", "వ్రాత" అనే పదాలు భావ వాచక నామాలు. "రావు" అనే క్రియకు ఉద్దేశ్యం.

రెండో వాక్యంలో "చదువుట", "వ్రాయుట" అనే పదాలు యుగ్మ భాషాభాగాలు, క్రియా నామాలు. వీటికి నామ లక్ష్మణమే కాక క్రియా లక్షణం కూడా వుంది.

"వార్తా పత్రిలను చదువుట వల్ల అనేక లాభాలు కలవు" అనే వాక్యంలో "వార్తా పత్రికలను" అనే పదం "చదువుట" అనే క్రియా నామానికి కర్మ. "వార్తా పత్రికల చదువు వల్ల" అని అనరాదు. "చదువు" కేవలం నామమే. "వార్తాపత్రికల చదువు వల్ల" అని అంటే అనవచ్చు. అప్పుడు "వార్తా పత్రికల" అనేపదం విశేషణ కల్పము, "చదువు" అనే నామాన్ని వ్యక్తపరుస్తుంది. కాబట్టి "చదువుట" లాంటి క్రియా నామాలను భావ వాచక నామములుగా భ్రమించరాదు.

క్రియా నామాలకును, జాతి వాచకనామాలకును గల భేదం గుర్తించాలి. "రచయిత", "రచించేవాడు" అనే రెండు పదాలు సమానార్థకాలే అయినా వృత్తంలో భేదం వుంది.

"కథానికలను రచించేవాడు" అని అనవచ్చు. కాని "కథానికలను రచయిత" అని అనరాదు. రచించేవాడు క్రియా నామం. "రచయిత" జాతి వాచక నామం మాత్రమే. దీనికి క్రియా వృత్తం లేదు. "కథానికల రచయిత" అనిగాని, "కథానిక రచయిత" అనిగాని అనవచ్చు.

**ఆధారగ్రంథాలు:**

1. ఆధునిక తెలుగు వ్యాకరణం - ఎన్. శివరామమూర్తి
2. ఆధునిక తెలుగు వెన్నెలకంటి వ్యాకరణం - వెన్నెలకంటి ప్రకాశం
3. ఆధునిక తెలుగు భాషా నిర్మాణం - శివుని రాజేశ్వరి
4. ఆధునిక ప్రామాణికాంధ్ర వ్యాకరణం - వజ్ఝల వేంకటేశ్వర్లు
5. ఆధునిక భాషాశాస్త్రం - వెలమల సిమ్మన్న
6. ఈనాడు భాషా స్వరూపం - బూదరాజు రాధాకృష్ణ
7. తెలుగు దారి - వెల్చేరు నారాయణరావు
8. తెలుగులో వెలుగులు - చేకూరి రామారావు
9. తెలుగు భాషా చరిత్ర (సంపాదకులు) - భద్రిరాజు కృష్ణమూర్తి
10. తెలుగు భాషా చరిత్ర - వెలమల సిమ్మన్న
11. తెలుగు భాషా తత్త్వం - కొమర్రాజు లక్ష్మణరావు
12. తెలుగు భాషా శాస్త్రవేత్తలు - వెలమల సిమ్మన్న
13. తెలుగు భాషా స్వరూపం - బూదరాజు రాధాకృష్ణ
14. తెలుగు వాక్యం - చేకూరి రామారావు
15. ప్రౌఢ వ్యాకరణం - బహుజనపల్లి సీతారామయ్య
16. బాల వ్యాకరణం - చిన్నయసూరి
17. బాల వ్యాకరణం - శాస్త్రీయ వ్యాఖ్య - వెలమల సిమ్మన్న, గుమ్మా సాంబశివరావు

18. భాషా తపస్వి గిడుగు - వెలమల సిమ్మన్న

19. భాషానువర్తనం - చేకూరి రామారావు

20. వ్యావహారిక భాషా వ్యాకరణం - వడ్లమూడి గోపాలకృష్ణయ్య

21. శబ్ద బ్రహ్మ చిన్నయసూరి (అముద్రితం) - వెలమల సిమ్మన్న, గుమ్మా సాంబశివరావు

22. సంధి - వెలమల సిమ్మన్న

**II. ఆంగ్లం :**

1. A Grammar of ModernTelugu - Bh. Krishan Murthy

2. Sandhi Balavyakaranam - J. Pratap Reddy.

పాఠం - 5

# ఆధునిక తెలుగు భాష - సమాస నిర్మాణం

విషయసూచిక

5.1. సమాసం - నిర్వచనం

5.2. సమాసం - రకాలు

5.2.1. సాంస్కృతిక సమాసాలు

5.2.2. తత్సమ సమాసాలు

5.2.3. ఆచ్ఛిక సమాసాలు

5.2.4. మిశ్ర సమాసాలు

5.3. సమాస గత పదాల పరస్పర అన్వయాన్ని బట్టి సమాసాల రకాలు

5.3.1. తత్పురుష సమాసం

5.3.2. కర్మ ధారయ సమాసం

5.3.3. ద్విగు సమాసం

5.3.4. ద్వంద్వ సమాసం

5.3.5. బహుమ్రీహి సమాసం

5.3.6. కారకీ భావ సమాసం

## 5.1. సమాసం - నిర్వచనం :

పరస్పర అన్వయం కల రెండు గాని అంత కన్నా ఎక్కువ గాని ప్రాతి పదిక పదాలు విభక్తి, వైభక్తిక, అన్యపద లోపాత్మకంగా ఒక దానితో ఒకటి కలిసి ఏకపదంగా ఏర్పడడమే సమాసం. అలా ఏర్పడ్డ ఏక పదమే సమస్త పదం కాక సామాసి పదం అనబడుతుంది. సంక్షిప్తంగా సామాసిక పదమే సమాసం అని వ్యవహరించబడుతుంది.

సమాజంలోని పూర్వ పదాలకు స్వతంత్ర స్థితి లేదు. అవి సమాసగత ప్రాతిపదికలు. చివరి పదం మాత్రం స్వతంత్రంగా వుండలదు.

ఉదా॥ దండతాడిత భుజంగం

ఈ సమాసంలోని "దండ", "తాడిత" అనే మొదటి రెండు పదాలు సమాస ప్రాతిపదికలు. "భుజంగము" తత్సమ ప్రాతిపదిక. దండం చేత తాడితమైన భుజంగం అని అర్థం.

ఇక్కడ మొదటి రెండు పదాల్లోనూ తత్సమాల్లో వచ్చే "ము" వర్ణకం, "చేత" వైభక్తికం, "ఐన" క్రియా విశేషనం లోపించాయి.

ఎక్కువ భావం తక్కువ పదాలతో ఇమిడ్చి సంగ్రహంగా చెప్పడమే సమాస రచనా ప్రయోజనం. సమాసంలో పూర్వ ప్రాతిపదికల చివరలుప్తమైన విభక్తి వైభక్తి కాదుల అర్థం సుగ్రాహమై వున్నప్పుడే ఎంత దీర్ఘ సమాసమైనా సుభోధమై వుంటుంది. సమాస గత పదాలు విడదీసి లుప్త విభక్త్యాదుల్ని పూరించి అర్థం వివరించడమే "విగ్రహం" లేక "విగ్రహవచనం" అనబడుతుంది. దీనికే "వ్యాస వచనం" అని కూడా అంటారు. సమాసం అర్థ వివరణమే విగ్రహ వచనం.

ఉదా॥ పద్మలోచనుడు - పద్మముల వంటి లోచనములు కలవాడు

వంటిల్లు - వంటకై ఏర్పడ్డ ఇల్లు

రామ లక్ష్మణులు - రాముడును, లక్ష్మణుడును

విగ్రహ వచనంలో వీలైనంత వరకు సమాసగత పదాలనే వాడాలి. తప్పనిసరి అయితేనే తప్ప సమానార్థక పదాల్ని వాడరాదు.

## 5.2. సమాసాలు - రకాలు :

సాధారణంగా సమాసాలను నాలుగు రకాలుగా వర్గీకరించవచ్చు. అ) సాంస్కృతిక సమాసాలు, ఆ) తత్సమ సమాలు, ఇ) ఆచ్చిక సమాసాలు, ఈ) మిశ్ర సమాసాలు

### 5.2.1. సాంస్కృతిక సమాసాలు :

సంస్కృత భాషలో సంస్కృత ప్రాతిపదికల సంయోగం వల్ల ఏర్పడ్డవి సంస్కృత సమాసాలు. వాటి చివర తెలుగు ప్రత్యయాలు చేరగా సిద్ధించినవి సాంస్కృతిక సమాసాలు.

ఉదా॥ దండ తాడిత భుజంగః (ఇది సంస్కృత సమాసం)

దండతాడిత భుజంగము (ఇది సాంస్కృతిక సమాసం)

మరికొన్ని ఉదా॥ వీణాగానము, ప్రజా నాయకుడు, హృదయేశ్వరి

### 5.2.2. తత్సమ సమాసాలు :

సమాసంలోని తొలి పదంగాని, మలిపదంగాని లేక రెండూ గాని తత్సమాలయితే, ఆ సమాసం తత్సమ సమాసం అవుతుంది.

**i. ఆచ్ఛికంతో తత్సమం కలిసిన సమాసాల సంఖ్య హెచ్చు :**

ఉదా॥ చలికాలం, వెన్నెల రాత్రి, ముల్లోకములు, అంపశయ్య, నలు దిక్కులు, రేడియో నివేదిక, ఫిల్ము సంగీతం, హోటలు భోజనం, వినువీధి.

**ii. తత్సమంతో ఆచ్ఛికం కలిసిన సమాసాల సంఖ్య తక్కువ :**

ఉదా॥ వాసన బియ్యం, బుద్ధి తక్కువ, మాయలేడి, పట్టపు రాణి, మంత్రి హోదా

**iii. తత్సమంతో తత్సమం కలిసి ఏర్పడ్డ సమాసాలు :**

ఉదా॥ పట్టపు దేవి, మాయలోకం

సూచన : సీత భర్త, రాముని భార్య, గురువు బోధన - ఇవి సమాసాలు కావు. వ్యస్తపదాలు కలిసి ఏర్పడ్డ పద బంధాలు (ఉక్తులు). వీటిలోని పూర్వ పదాలు సంబంధ విభక్తి రూపాలు. ఇక్కడ ప్రత్యయ లోపం లేదు. ఉక్తిలో పదాలకు ఏక పదత్వ సిద్ధిలేదు. ఉక్తిలోని రెండు పదాలు, తొలి అచ్చుల మీదను స్వరాఘాతం వుండడమే ఇందుకు నిదర్శనం. సమాసమైతే రెండో పదం తొలి అచ్చు మీద స్వరాఘాతం వుండదు.

### 5.2.3. ఆచ్ఛిక సమాసాలు :

కేవల ఆచ్ఛిక పదాల సంయోగం వల్ల ఏర్పడ్డవి ఆచ్ఛిక సమాసాలు

ఉదా॥ కను విందు, పలు వరుస, మాట నేర్పరి, పెద్ద పులి, అన్న దమ్ములు, వేపాకు, ముక్కంటి, పెంకుటిల్లు, రైలు బండి, హోటలు తిండి, మోటరు కారు, తిరుగుడు కీలు.

**సూచన :**

పై ఉదాహరణలు సమాసాలు ఏక పదత్వ సిద్ధి ఒక్కటే ప్రబల కారణం. చదివేటప్పుడు రెండో పదం తొలి అచ్చు మీద స్వరాఘాతం వుండదు. పెక్కింటిలో తొలి పదాలకు స్వతంత్ర ప్రయోగం కూడా వుంటుంది. ఆచ్ఛికాలలో సమాస ప్రాతిపదికకు, వ్యస్త పదానికి రూపంలో భేదం వుండదు. కనుక ఒకొక్క ఉదాహరణ సమాసం అని నిర్ణయించబడానికి స్వరాఘాతం మొదలైన కారణాలు ఆధారాలు.

"కనువిందు"లో మొదటి పదం అయిన "కను" శబ్దానికి "కన్నులకు" అనే అర్థం చెప్పి అది సమాసం అని నిర్ణయించవచ్చు.

"పలు వరుస"లోని "పలు" "శబ్దానికి" "పళ్ళ" అనే బహు వచనార్థం చెప్పి అది సమాసం అని నిర్ణయించవచ్చు.

"పెద్ద పులి" అనే సమాసంలో తొలి పదం అయిన "పెద్ద" అనే విశేషణం తర్వాత విభక్త్యాదుల లోపం కాదు. అయినా "పెద్దపులి" ఒక జాతి పులిని తెలుపుటకై ఏరపడ్డది. కాబట్టి అది ఏక పదం. సమాసం. "పులి" లోని తొలి అచ్చు మీద స్వరాఘాతం కూడ లేదు. ఇట్లే తక్కిన సమాసాల విషయంలోనూ అవి సమాసాలు అవడానికి గల కారణాల్ని ఊహించుకోవచ్చు.

**5.2.3. మిశ్ర సమాసాలు :**

(సంస్కృత) సమాస ప్రాతిపదికలతో ఆచ్చిక ప దాలు చేరి ఏర్పడ్డాయి. ప్రత్యయాది లోపం కల ఆచ్చిక పదాలతో తత్సమాలు చేరి ఏర్పడ్డవి. మిశ్ర సమాసాలు అవుతాయి. ఇలాంటివి వ్యవహారంలో ప్రచురంగా వున్నాయి.

సమాస ప్రాతిపదికలతో ఆచ్చిక పదాలు చేరి ఏర్పడ్డవి.

ఉదా॥ లోక వాడుక, గజ ఈతగాడు, శుష్కదండుగ, దిన వెచ్చెము, అధిక దిగుబడి, ఆర్థిక వనరులు, ఉత్తమ ఇల్లాలు, వైద్య సలహా

ఆచ్ఛికాలతో తత్సమాల చేరి ఏర్పడవి.

ఉదా॥ పచ్చ కర్పూరం, చట్ట సమ్మతం, ముమ్మర కార్యక్రమం రైతాంగం, ఎన్ని కోద్యోగి, సేద్య సమాచారం.

పై ఉదాహరణల్లో తొలి పదంలో పెక్కు చోట్ల ప్రత్యయలోపం కన్పిస్తుంది. ముమ్మర = ముమ్మరమైన, చట్ట = చట్టము చేత, రైతాంగం, ఎన్నికోద్యోగి, అనే సమాసాలలో సంస్కృత సమాస సంధి వుంది. రైతు (=రైత) + అంగము = రైతాంగము ఎన్నిక + ఉద్యోగి = ఎన్నికోద్యోగి

**5.3. సమాస గత పదాల పరస్పర అన్వయాన్ని బట్టి సమాసాలు :**

సమాస గత పదాల పరస్పర అన్వయాన్ని బట్టి సమాసాలు ఆరు రకాలు.

1. తత్పురుష సమాసం
2. కర్మధారయ సమాసం
3. ద్విగు సమాసం
4. ద్వంద్వ సమాసం
5. బహు వ్రీహి సమాసం
6. కారకీ భావ సమాసం

**5.3.1. తత్పురుష సమాసం :**

ఉత్తర పదార్థ ప్రధానమైంది. అంటే సమాసంలోని రెండు పదాలలోను రెండవ పదం అర్థం ప్రధానంగా కలది తత్పురుష సమాసం. మొదటి పదం ఆశ్రితమై అధికారి పదమైన రెండవ దానిపై ఆధారపడి వుంటుంది. దీనిలో తొలి పదం తర్వాత తరచుగా సంబంధ వాచక, కర్మ వాచక, కారకవాచక, విభక్తి ప్రత్యయాల్లో ఏదో ఒకటి కాని, కారకీయ వైభక్తికం కాని లోపిస్తుంది. రెండు పదాల విభక్తులు భిన్నాలు కావడం వల్ల సంస్కృత వ్యాకరణాను సారంగా దీనిని వ్యధికరణ తత్పురుష సమాసం అంటారు. రెండు పదాలు రెండు భిన్న వస్తువుల్ని బోధించడమే ఈ వ్యధికరణ తత్పురుష లక్షణం.

"రాజ కుమారుడు'' అనే సమాసంలో "రాజు'' శబ్దం (రాజు, రాజు యొక్క) సంబంధ వాచక విభక్తి "కుమారుడు'' నామ వాచక విభక్తి. ఈ పదాలు భిన్న భిన్న వ్యక్తి బోధకాలు. కనుక ఇది వ్యధికరణ తత్పురుష సమాసం. "వృక్ష పతితం' అంటే వృక్షము నుండి పతితమైనది అని విగ్రహం వృక్షం వేరు, పతితమైన వస్తువు (పూవు, పండు, లేక ఆకు) వేరు. కాబట్టి ఇది కూడా వ్యధికరణ తత్సరుష సమాసం. సారాంశం ఏమంటే "తత్పురుషం'' అంటేనే వ్యధికరణ తత్పురుషం అన్న మాట.

**తత్పురుష సమాసం - ఉప భేదాలు :**

తత్పురుష సమాసంలోని తొలి పదంలో లోపించిన విభక్తి ప్రత్యయ, వైభక్తికాలను బట్టి ఈ సమాసంలో ముఖ్యంగా మూడు ఉప భేదాలున్నాయి.

అ) సంబంధ తత్పురుషం, ఆ) కర్మక తత్పురుషం, ఇ) కారక తత్పురుషం

**అ) సంబంధ తత్పురుషం :**

సంబంధ వాచక విభక్తి లోపం కలది సంబంధ తత్పురుష సమాసం. ఈ సంబంధాలు బహు ప్రకారాలు. స్వస్వామి, అంగాంగి, కర్తృత్వ, కారణ, జన్య జనక, ఆధారాధేయ, సేవ్య సేవక, గుణి గుణ, బాంధవ్య, ప్రయోజన, మూల్య, పరిమాణ, కాల, వయః ప్రభృతులు. అనేక విభక్తి వైభక్తికాల అర్థాలు ఈ సంబంధ విభక్తికి కలవు కాబట్టి కొన్ని కారక తత్పురుష సమాసాలు సంబంధ తత్పురుష సమాసాలుగా పేర్కొవడం తప్పు కాదు.

ఉదా॥ దశరథ పుత్రుడు - దశరథుని పుత్రుడు (జన్యజనక సంబంధం)

కాళిదాస నాటకములు - కాళిదాసుని నాటములు (కర్తృత్వం)

చోరభయం - చోరుల సంబంధమైన భయం (కారణం)

సేనాధిపతి, మాతృప్రేమ, జగదీశ్వరుడు, ప్రభుత్వ శాసనం, కుమార సంభవం, సీతా వివాహం, కవి కల్పన, గ్రంథ రచన, లోక రక్షకుడు, పుస్తక శతము, కావ్య పంచకం (సాంస్కృతికాలు)

**ఆచ్చికాలు :**

ఉదా॥ మలపట్టి, ముబ్బు తునక, కనుగవ, పలు వరుస, నూతి నీరు

**మిశ్రం :**

ఉదా॥ వైద్య సలహా

**తత్సమం :**

దొంగ భయం

**సూచన :**

సంబంధ వాచక విభక్తి లోపం గాని, ఏకపదత్వ సిద్ధిగాని లేనిది సమాసాలు కావు. అవిపద బంధాలు మాత్రమే.

ఉదా॥ నాయిల్లు, రాముని పుస్తకం, గుర్రంతోక, పుస్తకం వెల, బెల్లం రుచి, పువ్వుల వాసన మొ॥

వాటిలో సంబంధ వాచక విభక్తి ప్రత్యయం వుంది. పైగా రెండు పదాల తొలి అచ్చుల మీదను స్వరాఘాతం వుంది.

నామంతో వైభక్తికం కలిసి ఏర్పడ్డవి పద బంధాలే సమాసాలు కావు.

ఉదా॥ చెట్టు మీద, నూతి లోపల, ఊరి వెలుపల, ఇంటిలోన, నా దగ్గర, నీ యెడల, కవుల యందు, రాజు వంటి మొ॥

**ఆ) కర్మ తత్పురుషం :**

పూర్వ పదంలో కర్మ వాచక విభక్తిలోపం వుంటే అది కర్మ తత్పురుష సమాసం.

ఉదా॥ స్వర్గప్రాప్తుడు - స్వర్గాన్ని ప్రాపించిన వాడు (పొందినవాడు)

రస పిపాసుడు - రసాన్ని పానం చేయగోరేవాడు

ఊహాతీతం - ఊహను అత్రికమించింది పైవి సాంస్కృతికాలు.

**ఇవి అచ్చికాలు :**

నెలతాల్పు - నెలను తాల్చిన వాడు (ఈశ్వరుడు)

గాలిమేతరి - గాలిని మేసేది (పాము)

**ఇ) కారక తత్పురుష :**

పూర్వ పదానికి ఉత్తర పదంతో కారకాన్వయం వుంటే అధికార తత్పురుష సమాసం పూర్వ పదంలో కారక వాచక విభక్తి, వైభక్తి కాదుల లోపం వుంటుంది. క్రియాన్వయం కల కరణ, కర్తృత్వ, నిమిత్త, ప్రయోజన, అపాదాన, హేతు, నిర్ధారణ, అధికారణ, ప్రభృతి అర్థాలు గల విభక్తి వైభక్తికాల్ని విగ్రహవచనంలో పేర్కొవాలి. కారకాలకు తరచుగా క్రియలతోను, విశేషణాలతోనూ అన్వయం కాబట్టి రెండో పదం యుగ్మ భాషా భాగమైన క్రియా జన్య పదం (కృదంతం) కాని, సాధారణ విశేషణం కాని కావచ్చు.

**సాంస్కృతిక ఉదా॥**

| | | |
|---|---|---|
| శరాహతం | - | శరయు చేత ఆహతం |
| కవి రచితం | - | కవి చేత రచితం |
| భగవదర్పితం | - | భగవంతునికి అర్పితం |
| పదవీచ్యుతుడు | - | పదవి నుండి చ్యుతుడు |
| ఆకాశ పతితతం | - | ఆకాశం నుండి ఫతితం (పడింది) |
| రోగ పీడితుడు | - | రోగం వల్ల పీడితుడు |
| పండిత శ్రేష్ఠుడు | - | పండితులలో శ్రేష్ఠుడు |
| జలమగ్నం | - | జలము నందు మగ్నం |

పై ఉదాహరణలలో మొదటిపదం కారక వృత్తం కలిగి ద్వితీయ పదంతో అన్వయిస్తుంది. కాబట్టి ఇవి కారక తత్పురుష సమాసాలు

బుద్ధి తక్కువ - బుద్ధి చేత తక్కువ అయింది (తత్సమం)

అన్ను మిన్న - అన్నులలో మిన్న (ఆచ్ఛికం)

వరద బాధితులు - వరదల చేత బాధితులు (మిశ్రం)

**సాంస్కృతిక కారక తత్పురుషాలు :**

ఉదా॥ అగ్ని దగ్ధం, జలశూన్యం, విద్యాహీనుడు, శ్రీయుక్తుడు, రోగయుక్తుడు, శిరోధార్యం

రెండు నామాల సంయోగం వల్ల కూడా కొన్ని కారక తత్పురుష సమాసాలు ఏర్పడతాయి :

గంగా స్నానం - గంగయందు స్నానం

దేశభక్తి - దేశమందు భక్తి

ఆకాశ పతనం - ఆకాశం నుండి పతనం

వన భోజనం - వనములో భోజనం

చోర భయం - చోరుల వల్ల భయం

పుత్రశోకం - పుత్రుల మూలాన శోకం

విద్యాలయం - విద్య కొరకు ఆలయం

జ్వరౌషధం - జ్వరానికి ఔషధం

**ఉప పద తత్పురుషం :**

కొన్ని ప్రాతిపదిక శబ్దాలతో స్వతంత్ర స్థితిలేని కృదంతాలు చేరి ఏర్పడ్డ సమాసాలు ఉపపద తత్పురుషాలు. వీటిలో తొలిపదం ఉప పదం.

ఉదా॥ కుంభ + కార = కుంభకార (కుంభకారుడు) కుంభములు చేసేవాడు. కుమ్మరి. "కుంభ" ఉపపదం. "కార శబ్దం "కృ" ధాతు నిష్పన్నమైన అస్వతంత్ర శబ్దం

మరికొన్ని ఉదా ॥ మధుప, జలద

ఇలాంటివి సాంస్కృతికాలు

**ఏక దేశి సమాసం :**

నామ బోధితమైన వస్తువులోని ఒక భాగాన్ని తెలిసే పదం పూర్వ పదమై ఆనామంతో కలిసి ఏర్పడ్డ సమాసం ఏకదేశి సమాసం. ఇది కూడా ఒక తత్పురుష భేదమే.

ఉదా॥ పూర్వకాయం - కాయం యొక్క పూర్వభాగం

మధ్యాహ్నం - అహం (పగటి) మధ్యభాగం

కొన చేయి - చేతి కొన

శేష రాత్రం - రాత్రి శేష భాగం

నడురేయి - రేయి నడి భాగం

సామేను (సగం + మేను) = మేనిలో సగ భాగం

అరగన్ను - కంటిలో అర

**కొన్ని విశిష్ట సాంస్కృతిక తత్పురుషాలు :**

త్రిపద తత్పురుషం :

ఉదా॥ అ + కిం + చన = అకించన (ఏమి లేని వాడు)

అ + కుత + భయ = అకుతో భయ (దేని వల్లను భయం లేని వాడు)

ప్రప్రాది సమాసం :

ప్ర + ఆచార్య = ప్రాచార్య (ప్రకృష్ట ఆచార్యుడు)

ప్ర + పితామహ = ప్రపితామహ (ముత్తాత)

ప్ర + ప్రథమ = ప్ర ప్రథమ (మొట్టమొదటి)

**5.3.2. కర్మధారయ సమాసం :**

తత్పురుష సమాసం వలె కర్మధారయం కూడా సమాసంలోని ఉత్తర పదం అర్థం ప్రధానంగా కలది. ఇది తరచుగా విశేషణంతో నామం కలిసి ఏర్పడ్డ సమాసం. తొలి పదం ఆశ్రితం, రెండోవది అధికారి. తత్పురుషంలోని రెండు పదాలు రెండు భిన్న వస్తువుల్ని బోధించగా కర్మధారయంలోని రెండు పదాల్ని ఒకే వస్తువును బోధిస్తాయి. ఇదే దీని ముఖ్య లక్షణం. కాబట్టి దీనికి సమానాధికరణ తత్పురుషం అని పేరు కూడా వుంది.

సంస్కృతంలో కర్మధారయ సమాసాలలో ఉత్తర పదమైన నామం ఏ లింగమైనా పూర్వపదమైన ప్రాతిపదిక విశేషణం ఒకే రూపంలో వుంటుంది విగ్రహంలో నామ లింగాన్ని బట్టి విశేష రూపం మారుతుంది.

ఉదా॥ సుందర పురుషులు, సుందరనారి, సుందర గృహం, మహా రాజు, మహా రాజ్ఞి, మహా భాగ్యం

అచ్చ తెలుగు విశేషణాల వలె ఈ సాంస్కృతిక సమాసాలలోని విశేషణాల్ని అన్ని లింగాల్లోనూ ఒకే రూపంతో వుంటాయి.

**కర్మధారయ సమాసం - ఉప భేదాలు :**

అ) విశేషణ పూర్వ పద కర్మధారయం

ఆ) విశేషణోభయ పద కర్మధారయం

ఇ) నామ - ఉభయ పద కర్మ ధారయం

ఈ) విశేషణోత్తర పద కర్మ ధారయం

ఉ) సంభావనా పూర్వపద కర్మధారయం

ఊ) రూపక కర్మధారయం

ఋ) ఉపమాన పూర్వపద కర్మధారయం

ౠ) ఉపమానోత్తర పద కర్మ ధారయం

ఎ) కారక పూర్వ కర్మధారయం

ఏ) మధ్యమ పదలోపి కర్మ ధారయం

**అ) విశేషణ పూర్వ పద కర్మధారయం :**

దీనిలో తొలి పదం విశేషనం. రెండోవది నామం.

ఉదా॥ ధవళ వస్త్రం - ధవళమైన వస్త్రం

మరికొన్ని ఉదా॥ విశాల ఫాలం, వికసిత కుసుమం,

మధుర పానీయం, పరమానందం, మహా భాగ్యం

ఉత్తమ నటి. ఇవి సాంస్కృతికాలు

**అచ్చికాలు :**

| | | |
|---|---|---|
| ఉదా॥ పెద్ద పులి | = | పెద్ద + పులి (ఒక జాతి పులి) |
| చిరు తిండి | = | చిరుత + తిండి |
| తెల్ల గుర్రం | = | తెల్లని + గుర్రం |
| లేమాని | = | లేత + మాని |

సంఖ్యా వాచక విశేషణ పూర్వపదాలైనవి కూడా ఈ శ్రేణికి చెందిన కర్మ ధారయాలే

**సాంస్కృతికాలు :**

ఏక దినం, త్రిలోకములు, చతుర్వేదములు, నవగ్రహములు, దశ దిశలు, శత క్రతువులు, సహస్రనామాలు

**తత్సమ - ఆచ్చికాలు :**

| | | | |
|---|---|---|---|
| ఉదా॥ | ముల్లోకములు | = | మూడు + లోకములు |
| | ముజ్జగములు | = | మూడు + జగములు |
| | నలుగడలు | = | నాలుగు గడలు |
| | ఇరువైపుల | = | రెండు + వైపుల |

**మిశ్ర సమాసం :**

| | | |
|---|---|---|
| పంచ సిగలు | = | పంచ + సిగలు |

**సూచన :**

మూడు లోకములు, నాలుగు కడలు, పది దిక్కులు, మొదటి బహుమతి, నూరవ జయంతి, ఇవి సమాసాలు కావు పద బంధాలు.

పూరణ సంఖ్యా వాచక విశేషణ పూర్వ పదాలైన సమాసాలు కూడా కర్మధారయాలే.

**సాంస్కృతికాలు :**

ప్రథమ స్థానం, ద్వితీయ దివాసం, పంచమ వేదం, ఏకాదశ పరిచ్ఛేదం, వింశ తితమ శతాబ్ది

**ఆ) విశేషణోభయ పదకర్మ ధారయం :**

ఏక వస్తు బోధకాలైన రెండు విశేషణాలు కలిసి ఏర్పడ్డ సమాసం ఇది.

ఉదా॥ గానం మృదు మధురం

ఈ వాక్యంలో "మృదు మధురము" అనే సమాసంలోని మృదు, మధుర అనే రెండు విశేషణాలను "గానం" అనే నామాన్ని వ్యక్త పరుస్తుంది. ఈ సమాసం వాక్యంలో పూరకం

మరికొన్ని ఉదా॥ శ్యామ సుందరుడు, ఉచ్చనీచము,

నీలలో హితము, ఇవి సాంస్కృతికాలు.

ఆచ్చికాలు :

ఉదా॥ నిడువాలు (చూపులు) = నిడుపు, వాలు, అయిన

నును మెత్త (పానుపు) = నున్నని, మెత్తని

**ఇ) నామ - ఉభయ పద కర్మధారయాలు :**

రెండు నామాలు కలిసి ఏర్పడ్డ ఈ సమాసం ఒకే వ్యక్తిని గాని వస్తువును గాని బోధిస్తుంది.

ఉదా॥ రాజు + ఋషి = రాజర్షి (రాజు, ఋషి అయిన వ్యక్తి )

విద్వత్కవి (విద్వాంసుడు, కవి అయిన వ్యక్తి)

ఇలాగే బ్రహ్మర్షి, దేవర్షి, గాయక కవి

**ఈ) విశేషణోత్తర పద కర్మ ధారయం :**

దీనిలో మొదటి పదం నామం, రెండోవది విశేషణం.

ఉదా॥ పురుషోత్తముడు - ఉత్తముడైన పురుషుడు

నరాధముడు, పండిత శ్రేష్ఠుడు మొ॥

ఇలాంటి సమాసాలను కారక తత్పురుష సమాసాలుగా పేర్కొనవచ్చు.

ఉదా॥ పురుషోత్తముడు - పురుషులలో ఉత్తముడు

**ఉ) సంభవనా పూర్వ పద కర్మధారయం :**

వ్యక్తి వాచక నామంతో ఆ పేరు గల జాతి వాచక నామం సమసించగా ఈ సమాసం ఏర్పడుతుంది. విగ్రహ వచనంలో తొలి పదం మీద "అనే" అని చేర్చాలి.

ఉదా॥ హిమాలయ పర్వతం - హిమాలయం అనే పర్వతం

దశరథ మహారాజు - దశరథుడు అనే మహారాజు

మరికొన్ని ఉదా॥ పెద్దన కవి, గంగానది, పారిజాత వృక్షం, లండను నగరం, మామిడి చెట్టు మొ॥

**ఊ) రూపక కర్మ ధారయం :**

తొలి పదం బోధించే వ్యక్తి లేక వస్తువునందు, రెండవ పదం బోధించే వ్యక్తి లేక వస్తువు ధర్మం ఆరోపితమైతే ఆ సమాసం రూపక కర్మధారయం. ఇక్కడ రెండింటికిని అభేదం.

ఉదా॥ గురు దేవుడు - గురురూపుడైన దేవుడు. గురువు నందు దేవత్వం ఆరోపితం. గురువే దేవుడు

దుఃఖ సముద్రం (దుఃఖ రూపమైన సముద్రం), అజ్ఞా నాంధకారం, మృత్యు దేవత, సంసార సాగరం, పాప కూపం, మనో రథం, దిశాంగన, మొ॥ ఇవి సాంస్కృతికాలు

ఆచ్ఛికాలు :

మోముతామర, మై తీగ

**ఋ) ఉపమాన పూర్వపద కర్మ ధారం :**

ఈ సమాసంలో తొలి పదం ఉపమాన వాచకం, రెండవది ఉపమేయ వాచకం. సరిపోల్చబడ్డ వస్తువు ఉపమేయం (ఉపమించ దగినది). అది దేనితో సరిపోల్చబడునో అది ఉపమానం.

ఉదా॥ పద్మ ముఖం - పద్మం వంటి ముఖం

చిగురు మోవి, పసిడి మేను, వెన్నమనసు, ఇవి ఆచ్ఛికాలు

ఉపమాన వాచక పదంతో గుణ వాచక విశేషణం సమసించినా, అది కూడా ఈ రకం సమాసమే అవుతుంది.

ఉదా॥ మేఘశ్యాముడు - మేఘం వలె శ్యాముడు

నవనీత కోమలం - నవనీతమువలె కోమలమైంది (హృదయం)

సుధామధురం - సుధ వలె మధురం (మాట)

**ౠ) ఉపమానోత్తర పద కర్మధారయం :**

దీనిలో ఉత్తర పదం ఉపమాన వాచకం. మొదటి పదం ఉపమేయ వాచకం. దీనినే "ఉపమిత సమాసం" అని కూడా అంటారు.

ఉదా॥ ముఖ పద్మం - పద్మం వంటి ముఖం

పాదకమలములు, తనూలత, కవి కుంజరం,

చెక్కటద్దం, మేను తీగ మొ॥

**ఎ) కారక పూర్వ పద కర్మధారయం :**

దీనిలో తొలి పదం కారకం. రెండోవది విశేషణం.

ఉదా॥ పరమ రమణీయం - ఎంతో రమణీయమైంది.

అతి మనోజ్ఞ, అత్యంత మధురం, పరమోత్కృష్టం, ఈషదున్నతం మొ॥

వీటిలో తొలి పదాలు ఉత్తర పదాలైన విశేషణాల్ని వ్యక్తపరచే కారకాలు

**ఏ) మధ్యమ పదలోపి కర్మధారయం :**

ఇది రెండు వస్తువుల్ని బోధించే రెండు నామాలు కలియడం వల్ల ఏరపడ్డ సమాసం. ఆ వస్తువులకు గల సంబంధం తెలిపే కొన్ని పదాలు లోపించడం వల్ల ఏర్పడ్డాయి. కాబట్టి దీనికి ఈ పేరు వచ్చింది. లుప్త పదాలతో చేరిన తొలి పదం రెండవ పదానికి విశేషణం. దీనినే లుప్త పద కర్మధారయం అని కూడా అనవచ్చు.

| | | | |
|---|---|---|---|
| ఉదా॥ | ఛాయా తరువు | = | ఛాయను ఇచ్చే తరువు |
| | దధ్యోదనం | = | దధితో కూడిన ఓదనం (పెరుగన్నం) |
| | వనాగ్ని | = | వనంలో పుట్టే అగ్ని |

సంయుక్త సంఖ్యా వాచక పదాలు మధ్యమ పదలోపి కర్మ ధారయం

| | | | |
|---|---|---|---|
| ఉదా॥ | ద్వి + దశ | = | ద్వాదశ (రెండుతో కూడిన పది) |
| | పది + రెండు | = | పం(డ్రెండు, పన్నెండు (పదితో కూడిన రెండు) |

ఇలాంటివే అష్టాదశ, ద్వావింశతి, పద్దెనిమిది, ఇరవై రెండు మొ॥

**5.3.3. ద్విగు సమాసం :**

పూర్వ పదం సంఖ్యావాచక విశేషణమై ఉత్తర పదం నామమై వస్తువులన్నింటిని సమాహారంగా పేర్కొనే సమాసం ద్విగు సమాసం. సమాహారం అంటే మొత్తం. ఈ సమాసం ఏక వచనంలో వుంటుంది.

**సాంస్కృతికాలు :**

| | | | |
|---|---|---|---|
| ఉదా॥ | త్రిలోకి | = | త్రి + లోక (మూడు లోకాల మొత్తం) |
| | పంచవటీ | = | పంచవటముల సమాహారం |
| | సప్తాహ | = | సప్త అహముల మొత్తం |
| | చతుర్యుగ | = | నాలుగు యుగాల మొత్తం |
| | శతాబ్దీ | = | శత అబ్దాల మొత్తం |

వీనిలో కొన్నింటికి బహువచనాలు వున్నాయి.

ఉదా॥ రెండు శతాబ్దాలు

మూడు సప్తాహాలు

**ఆచ్చిక ద్విగువులు :**

| | | | |
|---|---|---|---|
| ఉదా॥ | ముచ్చిచ్చు | = | మూడు చిచ్చుల మొత్తం |

ఇలాగే ముత్త్రోవ, నలభై, ఇన్నూరు, ఇరుగడ, నలుగడ, ముప్పన్నె, ముప్పిరి, మొ॥

సమాహార అర్థం లేని సంఖ్యా వాచక విశేషణ పూర్వపద సమాసాలు ద్విగువులు కావు. అవి విశేషణ పూర్వ పద కర్మ ధారయాలు

ఉదా॥ త్రిలోకములు, ముల్లోకములు, నలుదెసలు, షష్ఠ సర్గం మొ॥

సంఖ్యా వాచక విశేషణంతో నామం చేరినా ఏక పదత్వ సిద్ధి లేనివి, సమాసాలు కావు. అవి నామ బంధాలు మాత్రమే

ఉదా॥ మూడు లోకములు, పదవ రోజు మొ॥

## 5.3.4. ద్వంద్వ సమాసం :

సమాసంలోని రెండు పదాల అర్థం ప్రధానంగా గలది ద్వంద్వం. సమ ప్రాధాన్యం కలిగి వేరొక పదంతో సమాన అన్వయం కలవై వేర్వేరు వస్తువుల్ని బోధించే రెండు పదాలు చేరి ఏరపడ్డ సమాసం ద్వంద్వ సమాసం. రెండింటి కన్నా ఎక్కువ పదాలు కలది బహుపద ద్వంద్వ సమాసం. ఈ సమాసంలో సంయోజకాలు లోపిస్తాయి. విగ్రహ వచనంలో వాటిని చెప్పాలి.

ఉదా॥ శివకేశవులు = శివుడును, కేశవుడును

బాల బాలికలు = బాలురును, బాలికలను

ద్వంద్వ సమాసం రెండు రకాలు :

ద్వంద్వ సమాసం రెండు రకాలు అ) ఇతరేతర ద్వంద్వం, ఆ) సమాహార ద్వంద్వం

**అ) ఇతరేతర ద్వంద్వం :**

ఒకే పదంతో అన్వయం కల అనేక సమసత్తాక పదాల కలయిక వల్ల ఏర్పడ్డ సమాసం ఇతరేతర ద్వంద్వం. ఇది బహు వచనాంతం.

స్త్రీ పురుషులు = స్త్రీలను, పురుషులను

సుఖ దుఃఖము = సుఖమును, దుఃఖమును

నలదమయంతులు = నలుడును, దయమంతి

అంద చందాలు = అందం, చందం

**బహుపద ద్వంద్వం :**

ధర్మార్థ కామ మోములు = ధర్మం, అర్థం, కామ, మోక్షం

**ఆచ్ఛికాలు :**

తల్లిదండ్రులు, కూరగాయలు, అన్నదమ్ములు రాకపోకలు, వెలుగు చీకట్లు, మంచి చెడ్డలు మొ॥

తత్సమ ద్వందం = సిరి సంపదలు

**ఆ) సమాహార ద్వంద్వం :**

సమాస గత పద బోధిత వస్తువుల మొత్తం అర్థమైనప్పుడు సమాసం ఏక వచనాంతమై సమాహార ద్వంద్వం అనబడుతుంది.

**సాంస్కృతికాలు :**

ఉదా॥ సాంస్కృతికాలు : పాణిపాదం = పాణి పాదాల మొత్తం

రథ గజ తురగ పాదాతం = రథములు, గజములు, తురగములు, పాదాతములు (పదాతి సేవలు) వీటి మొత్తం

అహోరాత్రం = అహం (పగలు) రాత్రి - వీటి మొత్తం

అహర్నిశం = అహం, నిశ - వీటి మొత్తం

**ఆచ్ఛికాలు :**

ఉదా॥ కూరగాయ (కూరగాయల మొత్తం)

ఇలాగే కూడు గుడ్డ, రేపగలు మొ॥

**5.3.5. బహువ్రీహి సమాసం :**

అన్య పదార్థ ప్రధానం బహువ్రీహి. అంటే సమాసగత పదాలు బోధించే వస్తువులను గాక వేరొక వస్తువును బోధించేది బహువ్రీహి సమాసం. బహు + వ్రీహి = బహు వ్రీహి (ఎక్కువ ధాన్యం). ఈ అర్థంలో ఇది కర్మధారయ సమాసం. బహు = ఎక్కువ, వ్రీహి = ధాన్యం కలవాడు. ఈ అర్థంలో ఈ సమాసం బహుత్వాన్ని గాని వ్రీహిని గాని బోధించక వేరొక వ్యక్తిని బోధిస్తున్నది. కాబట్టి ఇది అన్య పదం అర్థం ప్రధానంగా కలది. ఇలాంటి సమాసాలన్నింటికి బహువ్రీహి అనే పేరు పెట్టడమైంది.

ఉదా॥ నీలవేణి = నీలమైన వేణి కలది (స్త్రీ)

దశరథుడు = దశ (పది) రథాలు కలవాడు (ఒక రాజు)

**బహువ్రీహులు - ఉపభేదాలు :**

తత్పరుష సమాస భేదాల్ని బట్టి సంబంధ, కర్మ, కారక, బహువ్రీహులుగా ఏర్పడతాయి. కర్మధారయ భేదాల్ని బట్టి విశేషణ, ఉపమాన, రూపక, మధ్యమ పదలోపి బహువ్రీహులు ఏర్పడతాయి.

**1. తత్పురుష సమాస భేదాలను బట్టి బహువ్రీహులు :**

**అ) సంబంధ బహువ్రీహి :**

ఉదా॥ పీతాంబరుడు = తన అంబరము పీతమైనవాడు (విష్ణువు)

చక్రపాణి = తన పాణియందు చక్రం కలవాడు (విష్ణువు)

చంద్రమౌళి = తన మౌళియందు చంద్రుడు కలవాడు (శివుడు)

ఖడ్గ హస్తుడు = తన హస్తమందు ఖడ్గం కలవాడు

విగ్రహంలో సమాస పద బోధిత వస్తువును తెలిపే "తన" శబ్దం సంబంధ వాచక విభక్తిలో వున్నందున ఇవి సంబంధ బహువ్రీహులు

**ఆ) కర్మబహువ్రీహి :**

ఉదా॥ ఆరూఢ వానరం = తన్ను ఆరోహించిన వానరం కలది (వృక్షం)

ప్రాప్తయౌవనుడు = తన్ను పొందిన యౌవనం కలవాడు (పురుషుడు)

విగ్రహంలో "తన్ను" అనే కర్మ వాచక విభక్తి వుండడం వల్ల ఇవి కర్మ బహు వ్రీహి సమాసాలు

**ఇ) కారక బహు వ్రీహి :**

ఉదా॥ కృతకార్యుడు = తన చేత కృతమైన కార్యం కలవాడు

లబ్ధకాయుడు = తన చేత లబ్ధమైన కాయం (కోరిక) కలవాడు

దత్త ధనుడు = తనకు దత్తమైన ధనం కలవాడు

పతిత పత్రము (వృక్షం) = తన నుండి పతితమైన పత్రములు కలది. ఆకులురాలిన చెట్టు

ప్రఫుల్లకమలము (కాసారం) = తనయందు ప్రఫల్లయులైన కమలములు కలది.

విగ్రహంలో "తన" శబ్దం చేతకు, నుండి అందు అనే విభక్తి ప్రత్యయ, వైభక్తి కాలు రావడం చేత ఇవి కారక బహువ్రీహి సామాలు.

**2. కర్మధారయ భేదాన్ని బట్టి బహువ్రీహులు :**

**అ) విశేషణ బహువ్రీహి :**

ఉదా॥ మధురవాణి = మధురమైన వాణి కలది స్త్రీ

మందమతి = మందమైన మతి కలవాడు

విశాల ఫాలుడు = విశాలమైన ఫాలం కలవాడు

**ఆ) ఉపమాన బహువ్రీహి :**

ఉదా॥ పద్మలోచనుడు = పద్మముల వంటి లోచనములు కలవాడు

ఇలాగే చంద్రముఖి, పాషాణ హృదయుడు, వజ్రదేహుడు మొ॥

**ఇ) రూపక బహువ్రీహి :**

ఉదా॥ యశోధనుడు = యశం అనే ధనం కలవాడు

తపోబలుడు, విద్యాధనుడు మొ॥

**ఈ) మధ్య పదలోపి బహువ్రీహి :**

సమాస గత పదాల నడుమ విభక్తి, వైభక్తి కాలే కాక ఇతర పదాలు లోపించినది, కలవాడు, కలది, అనే అర్థం కలది, మధ్యమ పదలోపి బహువ్రీహి సమాసం.

ఉదా॥ గజాననుడు గజాననం వంటి ఆననం కలవాడు

పికవాణి, మృగనేత్రి (మృగనేత్ర) మొ॥

**మరికొన్ని విశిష్ట బహువ్రీహులు :**

**అ) నఞ బహువ్రీహి :**

ఉదా॥ అనంతుడు (న+అంత) = అంతం లేనివాడు

అద్వితీయం, అనాథ (నాథుడు లేని స్త్రీ)

**ఆ) దిగంతరాళ బహువ్రీహి :**

ఉదా॥ దక్షిణ పూర్వం = దక్షిణమునకు పూర్వమునకు మధ్యనున్న దిక్కు, ఆగ్నేయం

పశ్చిమోత్తరం = పశ్చిమోత్తరముల మధ్య నున్న దిక్కు, వాయవ్యం

**ఇ) వ్యతీహార బహువ్రీహి :**

ఉదా॥ ముష్టాముష్టి (ముష్టీ ముష్టి = ముష్టి + ముష్టి "ముష్టి" అంటే పిడికిలి. పరస్పరమైన పిడికళ్ల గ్రుద్దులాట కలది. అటువంటి యుద్ధం బహాబాహీ, బాహూ బాహవి, కచాకచి, కేశాకేశి

**ఈ) సహార్థక బహువ్రీహి :**

ఉదా॥ "సహ", అనే అర్థం కల "స" అనే ఉపసర్గ కల్పం (సంస్కృత అవ్యయం)తో ఏర్పడ్డ సమాసం

సపుత్రుడు = పుత్రులతో కూడినవాడు

సబంధుమిత్రుడు = పుత్రులతో కూడినవాడు సబంధుమిత్రుడు, సార్థకం మొ॥

**ఉ) సమానార్థక బహువ్రీహి :**

స = సమానం. ఈ అర్థంలో "స" శబ్దంతో కూడి ఏర్పడిన బహువ్రీహి ఇది.

ఉదా॥ సగోత్రుడు = సమాన గోత్రం కలవాడు

సవర్ణములు = సమాన వర్ణములు గలవి

సపత్ని = సమాన పతిగల స్త్రీ

**ఊ) సంఖ్యోత్తరపద బహువ్రీహి :**

రెండో పదం సంఖ్యా వాచకమైన బహువ్రీహి.

ఉదా॥ ఉపదశం = దశ సంఖ్యకు సమీపంలో వుంది, తొమ్మిది లేక పదకొండు

### 5.3.6. కారకీ భావ సమాసం :

కారక కల్పమైన ఉపసర్గాది పదాంశంగాని, పదంగాని, రెండవ పదమైన నామంతో కలిసి ఏర్పడ్డ సమాసం ఏకంగా కారక కల్పమై క్రియతో అన్వయించితే దానికి కారకీ భావ సమాసం అని పేరు. దీనిలో తరచుగా మొదటి పదం ప్రధానం. దానికి రెండవ పదం ఆశ్రితం. కనుక ఇది పూర్వపద ప్రధానం.

ఉదా॥ ఈ పేదవాడికి యధాశక్తి సాయపడండి.

ఈ వాక్యంలో యధాశక్తి కారకకల్పం. "సాయపడండి" అనే క్రియను వ్యక్తపరుస్తుంది. యథాశక్తి = శక్తి ఎంతో అంత = శక్తికి తగినట్టు అని అర్థం. "శక్తి" అనే నామం "యధా" అనే కారకం మీద ఆధారపడి దానికి ఆశ్రితమై వుంది. కాబట్టి "యధాశక్తి" కారకీ భావ సమాసం.

అలుక్ - సమాసాలు :

"లుక్" అంటే లోపం. విభక్తి, వైభక్తి కాది లోపం గల సమాసాలు లుక్ సమాసాలు. అవి ఇంత వరకు తెలుసుకున్నాం.

విభక్తి, వైభక్తి కాది లోపం లేనివి అలుక్స సమాసాలు. విభక్తి ప్రత్యమంలో కూడిన తొలి పదంతో రెండవ పదం కలిసి ఏర్పడ్డ సమాసాలు ఇవి. పదాల రెంటిండికి ఏక పదత్వ సిద్ధి వుంటుంది. ఇవి సాంస్కృతికాలు. కాబట్టి వీటిలో లోపించినవి సంస్కృత విభక్తులు.

తెలుగులో అలుక్స మాసల సంఖ్య స్వల్పమైనవి. తలంబ్రాలు = తలను పోసికొన్న ప్రాలు. బియ్యము (ఇక్కడ కర్మవాచక విభక్తి "ను" లోపించలేదు.

| | | |
|---|---|---|
| ఊరబంది (ఊరను + పంది) | = | ఊరియందు తిరిగే పంది |
| ఊరబిచ్చుక | = | ఊరిలో ఉండే పిచ్చుక |

**ఆధార గ్రంథాలు :**

**1. తెలుగు :**


1. ఆధునిక తెలుగు వ్యాకరణం - ఎన్. శివరామమూర్తి
2. ఆధునిక తెలుగు వెన్నెలకంటి వ్యాకరణం - వెన్నెలకంటి ప్రకాశం
3. ఆధునిక తెలుగు భాషా నిర్మాణం - శివుని రాజేశ్వరి
4. ఆధునిక ప్రామాణికాంధ్ర వ్యాకరణం - వజ్ఝల వేంకటేశ్వర్లు
5. ఆధునిక భాషా శాస్త్రం - వెలమల సిమ్మన్న
6. ఈనాడు భాషా స్వరూపం - బూదరాజు రాధాకృష్ణ
7. తెలుగు దారి - వెల్చేరు నారాయణరావు
8. తెలుగులో వెలుగులు - చేకూరి రామారావు
9. తెలుగు భాషా చరిత్ర (సంపాదకులు) - భద్రిరాజు కృష్ణమూర్తి
10. తెలగు భాషా చరిత్ర - వెలమల సిమ్మన్న
11. తెలుగు భాషా తత్త్వం - కొమర్రాజు లక్ష్మణరావు
12. తెలుగు భాషా శాస్త్రవేత్తలు - వెలమల సిమ్మన్న
13. తెలుగు భాషా స్వరూపం - బూదరాజు రాధాకృష్ణ
14. తెలుగు కావ్యం - చేకూరి రామారావు
15. ప్రౌఢ వ్యాకరణం - బహుజనపల్లి సీతారామయ్య
16. బాల వ్యాకరణం - చిన్నయ సూరి
17. బాల వ్యాకరణం - శాస్త్రీయ వ్యాఖ్య - వెలమల సిమ్మన్న, గుమ్మా సాంబశివరావు
18. భాషా తపస్వి గిడుగు - వెలమల సిమ్మన్న
19. భాషానువర్తనం - చేకూరి రామారావు
20. వ్యావహారిక భాషా వ్యాకరణం - వడ్లమూడి గోపాలకృష్ణయ్య

21. శబ్ద బ్రహ్మ చిన్నయ సూరి (అముద్రితం) - వెలమల సిమ్మన్న, గుమ్మా సాంబశివరావు

22. సంధి - వెలమల సిమ్మన్న

**2. ఆంగ్లం :**

1. A Grammar of Modern Telugu - Bh. Krishna Murthy
2. Sandhi Balavyakaranam - J. Pratap Reddy.

**పాఠం - 6**

# వాక్య నిర్మాణం

**విషయసూచిక**


**6.1.** వాక్యం

**6.2.** వాక్య నిర్మాణం అంటే ఏమిటి

**6.3.** వాక్యం - నిర్వచనం

**6.4.** వాక్యం - సంస్కృత వ్యాకరణాలు

**6.5.** వాక్యం - తెలుగు వ్యాకరణాలు

**6.6.** వాక్యం - ఆంగ్ల ప్రభావం

**6.7.** వాక్యం - చేకూరి రామారావు

**6.8.** పరివర్తన వ్యాకరణం

**6.9.** వాక్యం - లక్షణాలు

**6.10.** వాక్యం - స్వరూపం

**6.11.** వాక్యం - నియమాలు

**6.12.** వాక్య నిర్మాణ సంబంధాలు


**1. తెలుగు వాక్యం భేదాలు :**

1. ప్రౌఢ వ్యాకరణం - వాక్య భేదాలు
2. రూపాన్ని బట్టి వాక్య భేదాలు
3. అర్థాన్ని బట్టి వాక్య భేదాలు
4. క్రియను బట్టి వాక్య భేదాలు

## 6.1. వాక్యం (Sentence) :

'వచ్' ధాతువు నుంచి వాక్యం ఏర్పడింది. 'వచించునది' వాక్యం అని అర్థం. ఏ భాషలోనైనా చాలా ముఖ్యమైన అంశం వాక్యం. తన మనోభావాల్ని, అభిప్రాయాల్ని, సిద్ధాంతాల్ని స్పష్టంగా ఇతరులకు తెలియజేయడానికి, ఇతరుల అభిప్రాయాల్ని, భావాల్ని తెలుసుకోవడానికి వాక్యం బాగా వుపయోగపడుతుంది. ప్రతీ భాషకు ఒక పద్ధతి, ఒక నియమావళి, ఒక సంప్రదాయం ఒక నిర్మాణం వుంటుంది. దాన్నిబట్టే ఆ భాషలో వాక్యనిర్మాణం వుంటుంది.

## 6.2. వాక్యనిర్మాణం అంటే ఏమిటి :

ఒక వాక్యంలో వివిధ పదాలు ఏవిధంగా పరస్పరం కలిసి వాక్యం ఏర్పడిందని చర్చించేది వాక్య నిర్మాణం.

## 6.3. వాక్యం - నిర్వచనం :

1. ప్రాచీన వ్యాకరణాలు
2. భాషాశాస్త్రజ్ఞులు

### 1. ప్రాచీన వ్యాకరణాలు :

ప్రాచీన వ్యాకరణాలు, సంపూర్ణార్థాన్ని ఇచ్చేవి వాక్యాలు అని నిర్వచించాయి. అయితే ఈ నిర్వచనం అంత సంతృప్తి కరంగా లేదు. ఎందుకంటే ఒకోసారి ఒక పదం కూడా సంపూర్ణార్థాన్నిస్తుంది. ఏక పద వాక్యాలు కూడా తెలుగు భాషలో చోటు చేసుకున్నాయి.

ఉదా : ప్రశ్న : వారు ఎప్పుడు వస్తారు ?

జవాబు : రేపు

ఇక్కడ 'రేపు' అనేది ఒక పదం. అంతేకాదు ఇది వాక్యం కూడా. కాబట్టి పై నిర్వచనం అసమగ్రమైందిగా భావించవచ్చు.

తెలుగు భాషలో ఒక్కోసారి ఒకే అక్షరం కూడా వాక్యంగా నిలుస్తుంది. అంతేకాదు సంపూర్ణార్థాన్ని కూడా ఇస్తుంది.

ఉదా॥ లే, రా, పో.

పైన చెప్పిన లే, రా, పో మొదలైన అక్షరాలు వాక్యాలుగా వ్యవహారంలో వుండడాన్ని మనం గమనించవచ్చు.

### 2. భాషా శాస్త్రజ్ఞులు :

ఒక సంపూర్ణ భావాన్ని వ్యక్తీకరిస్తూ రెండు విరామాల మధ్య వున్న ఉచ్చారణ వాక్యం అని భాషాశాస్త్రజ్ఞులు అభిప్రాయపడ్డారు. కేవలం పదాల వల్ల భావాల్ని స్పష్టంగా చెప్పలేం. పదాల 'సముదాయం' వాక్యమని సాధారణంగా మనం చెప్పినా ఆ పదాలు ఎలా వుండాలి, ఏ క్రమంలో వుండాలి, ఎలా వుంటే బాగుంటుంది అనేది ఇక్కడ ప్రధానమైన విషయం.

అంచేతనే భావం కలిగి వుండాలనీ, ఒక పద్ధతి ప్రకారం వుండాలనీ, పరిమితమైన ఉచ్చారణ కలిగి వుండాలనీ చెప్పడం జరిగింది. రెండు విరామాలు అంటే రెండు ఫుల్‌స్టాపలని మనం గ్రహించాలి.

## 6.4. వాక్యం - సంస్కృత వ్యాకరణాలు :

సంస్కృత వ్యాకరణాలు వాక్యరచనకు ఎక్కువగా ప్రాముఖ్యం చూపలేదు. పాణిని తన 'అష్టాధ్యాయి' వ్యాకరణంలో కూడా వాక్యానికి ఇవ్వవలసినంత ప్రాధాన్యత ఇవ్వలేదు. భర్తృహరి తన 'వాక్యపదీయము' లో వాక్య రచనపై చర్చ చేశాడు. 'వాక్యపదీయము' లో "వాక్యకాండ"' చోటుచేసుకుంది.

## 6.5. వాక్యం - తెలుగు వ్యాకరణాలు :

తెలుగు వ్యాకరణాల్లో వాక్య స్వరూపం గూర్చి కానీ, వాక్య నిర్మాణ రీతిని గూర్చి కానీ ప్రత్యేకంగా చర్చించినట్లు ఎక్కడా మనకు కన్పించదు. ప్రాచీన వ్యాకర్తలైన మూలఘటిక కేతన, అప్పకవి మొదలైన వారి దగ్గర నుంచి బాలవ్యాకరణం (1858) రాసిన పరవస్తు చిన్నయసూరి (1806 నుంచి 1862) వరకు గల వ్యాకర్తలు రాసిన అందరి వ్యాకరణాలు సునిశితంగా పరిశీలిస్తే ఎవ్వరూ ఎక్కడా వాక్యరచనా విధానం గూర్చి పెద్దగా పట్టించుకోలేదన్న విషయం మనకు స్పష్టమౌతుంది. ఒక్క ప్రౌఢ వ్యాకరణం (1885) లో మాత్రమే బహుజనపల్లి సీతారామాచార్యులు (1827 - 1891) వాక్య పరిచ్ఛేదం అనే పేరుతో ఒక పరిచ్ఛేదాన్ని రాశాడు. తెలుగు వాక్యానికి సంబంధించిన చర్చ ఈ పరిచ్ఛేదం లోనే కన్పిస్తుంది. ప్రౌఢ వ్యాకరణం మీద ఆంగ్ల వ్యాకరణాల ప్రభావం బాగా కన్పిస్తుంది. అయితే ఇది కూడా కావ్యభాషకు మాత్రమే పరిమితమైందన్న విషయాన్ని మనం గుర్తుంచుకోవాలి. సామాన్య జనవ్యవహారంలో వున్న భాషను గూర్చి మన వ్యాకరణాలు పట్టించుకోలేదు.

## 6.6. వాక్యం - ఆంగ్ల ప్రభావం - నోమ్ ఛామ్స్కి :

వాక్య నిర్మాణాన్ని ఆంగ్లంలో "Syntax" అని అంటారు. "Syntax" అనే పదం "Syn, Taxim" అనే రెండు లాటిన్ పదాల కలయిక వల్ల ఏర్పడింది. "Syn" అంటే Together with, Taxim అంటే "Arrangement or Order" అని అర్థం. మొత్తం మీద "Syntax" అంటే "The Scientific method of sentence construction and its study" అని అర్థం.

పాశ్చాత్య దేశాల్లో భాషా శాస్త్రానికి సంబంధించి శబ్ద పరిణామం (Phonetic Change), అర్థ పరిణామం (Semantic Change), మాండలికాలు (Dialects), మొదలైన అంశాలపై విపులంగా, వివరంగా, విస్తారంగా, విస్తృతస్థాయిలో పరిశోధనలు జరిగాయి. అయితే వాక్య రచనా విధానంపై అనుకున్నంత పరిశోధన జరగలేదు. బ్లూమ్ఫీల్డు, గ్లీసన్, హాకెట్టు, హాల్, లాంగేకర్ మొదలైన ప్రముఖ భాషా శాస్త్రవేత్తలు ఇతర అంశాలపై ప్రత్యేకమైన దృష్టిని సారించినట్లు వాక్యనిర్మాణంపై దృష్టి పెట్టలేదు. ఆ కారణంగా పాశ్చాత్య దేశాల్లో వాక్య రచనా విధానంపై చెప్పుకోతగ్గ విశేషమైన కృషి జరగలేదు.

అమెరికా దేశానికి చెందిన సుప్రసిద్ధ ఆధునిక భాషా శాస్త్రజ్ఞుడు నోమ్ ఛామ్స్కి (Noam Chomsky) స్థాపించిన పరివర్తన వ్యాకరణం (Transformational Grammar) భాషలో వాక్య నిర్మాణ పరిశోధనకు ఎనలేని ప్రాముఖ్యాన్ని ఇచ్చింది. నోమ్ ఛామ్స్కి వాక్యంపై అత్యుత్తమ మైన పరిశోధన చేసి ప్రపంచంలో ప్రముఖ విమర్శకుల ప్రశంసల్ని అందుకున్నాడు.

1957లో నోమ్ ఛామ్స్కి రాసిన "Syntactic Structure" అనే గ్రంథంతో 'పరివర్తన వ్యాకరణం' ప్రారంభమైంది. ఈ వ్యాకరణం ఒక భాషలోని ఒక రకమైన వాక్యానికీ, మరో రకమైన వాక్యానికీ గల పరస్పర సంబంధాన్ని తెలియచేయడానికి వుపయోగపడుతుంది. పరివర్తన వ్యాకరణం భాషలోని ఏ సాధువాక్యాన్ని (Grammatical Sentence) అయినా సూత్రాల ద్వారా ఉత్పత్తి చేయగలదు, కాబట్టి దీన్ని ఉత్పాదక వ్యాకరణం (Generative Grammar) అని కూడా అంటారు. ఛామ్స్కి 1965 లో "Aspects of the theory of Syntax" అనే గ్రంథం కూడా రాశాడు.

## 6.7. వాక్యం - పరిశోధన - ఆచార్య చేకూరి రామారావు :

ఆధునిక యుగంలో భాషాశాస్త్రం బాగా అభివృద్ధి చెందిన తర్వాతనే తెలుగు వాక్యంపై పరిశోధనలు జరిగాయి. భాషాశాస్త్ర రంగంలో చెప్పుకోదగ్గ పరిశోధన చేశారు ఆచార్య చేకూరి రామారావు (1934-) గారు. తెలుగు వాక్యనిర్మాణాన్ని శాస్త్ర దృష్టితో సునిశితంగా పరిశీలించి, తెలుగు భాషా శాస్త్ర పరిశోధనాన్ని కొత్త పుంతలు తొక్కించిన పరమ ప్రామాణిక పరిశోధక మార్గదర్శకులు చేకూరి వారు. ఒక్క వాక్యంలో ఆయన ప్రతిభాప్రజ్ఞా పాటవాల్ని చెప్పాలంటే ఇతర భాషా శాస్త్ర పరిశోధకుల కంటే తెలుగు భాషా పరిశోధకులు ఏమాత్రం తీసిపోరని నిరూపించిన పరిశోధక ప్రవీణులు రామారావుగారు.

చేకూరి వారు 'తెలుగు నామ్నీకరణాలపై పరివర్తన శాస్త్ర అధ్యయనం'. (A transformational study of Telugu nominates) అనే అంశంపై పరిశోధన చేసి 1968లో అమెరికాలోని కార్నెల్ యూనివర్సిటీ నుంచి పిహెచ్.డి. డిగ్రీని పొందారు. ఒక వాక్యాన్ని కొన్ని మార్పులతో వాక్యంలో కర్తృ కర్మ పదస్థానాల్లో వుపయోగించే పద్ధతిని నామ్నీకరణం అని అంటారు. తెలుగులో గల విషయార్థక, సందేహార్థక, ఇత్యర్థక, కాంక్షార్థక, వ్యాపారార్థక, లుప్త విభక్తిక నామ్నీకరణాన్ని గూర్చి విపులంగా వివరంగా తన సిద్ధాంత గ్రంథంలో వివరించారు. నోమ్ ఛామ్స్కి భాషా శాస్త్ర రంగంలో ప్రవేశపెట్టిన 'పరివర్తన వ్యాకరణ' (Transformational Grammar) విధానానికి చెందింది ఈ పరిశోధన.

అంతేకాక తెలుగుభాషలోని వాక్యనిర్మాణ రీతిని గూర్చి, వాక్య స్వరూపాన్ని - గూర్చి ఎనలేని పరిశోధన చేసి 'తెలుగు వాక్యం' అనే గ్రంథాన్ని రాసి విమర్శకుల మన్ననల్ని వీరు పొందారు. ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ వారు 1975లో ఈ గ్రంథాన్ని ముద్రించారు. తెలుగులో వాక్య నిర్మాణంపై వచ్చిన మొట్టమొదటి మంచి గ్రంథం ఇది. చేకూరి రామారావు గారినే 'చేరా' గా వ్యవహరిస్తారు. ఈయన కూడా 'చేరాతలని' పత్రికల్లో అనేక భాషా సాహిత్య వ్యాసాల్ని రాసి ప్రముఖుల ప్రశంసల్ని పొందారు.

## 6.8. పరివర్తన వ్యాకరణం (Transformational Grammar) :

'పరివర్తన వ్యాకరణం'లో ప్రధానంగా మూడు అంశాలు వున్నాయి. 1. వాక్య నిర్మాణం (Syntax Structure), 2. అర్థ నిర్మాణం (Sementic Structure), 3. వర్ణ నిర్మాణం (Phonological Structure. వాక్య నిర్మాణాన్ని గూర్చి వివరంగా చర్చించబడింది.

## 6. 9. వాక్యం - లక్షణాలు :

ప్రౌఢవ్యాకరణం - బహుజనపల్లి సీతారామాచార్యులు

'వాక్యమునా యోగ్యతా కాంక్షా సహితంబగు నర్థముగల యాసత్తి, యుక్త పద సముదాయంబు'

(ప్రౌఢ వ్యాకరణం : వాక్యపరిచ్ఛేదం - 1)

యోగ్యత, ఆకాంక్ష, ఆసత్తి అనే మూడు లక్షణాలతో కూడుకున్న సమగ్రమైన, అర్థవంతమైన పదాల సముదాయమే వాక్యమని అర్థం.

**1. యోగ్యత (Compatibility)**

పదాల యొక్క అర్థాలకు పరస్పర సంబంధంలో ఎలాంటి బాధ కలగకపోవడాన్ని యోగ్యత అంటారు. దీన్ని ఆంగ్లంలో "Agreement" అనీ, "Concord" అనీ, "Congreence" అనీ అంటారు.

ఉదా॥ 'నిప్పు చేత తడుపుచున్నాడు'.

ఇది వాక్యమే కాని యోగ్యత లేని వాక్యం. కారణం తడపడానికి వుపయోగించ వలసింది నీరు కాని నిప్పు కాదు. కాబట్టి. 'నీటి చేత తడుపుచున్నాడు' అని అనాలి కాని 'నిప్పుతో తడుపుచున్నాడు' అని అనటం వీలు పడదు.

**2. ఆకాంక్ష :**

వాక్యాన్ని ప్రారంభించి తర్వాత పదాన్ని కానీ, విశాలమైన భావాన్ని కానీ, గ్రహించాలని శ్రోత మనస్సులో కలిగే భావ గంభీరమైన ఉత్కంఠనే, కోరికనే ఆకాంక్ష అని అంటారు.

ఉదా॥ : శ్రోతకు అర్థంకాక ఏదో ప్రశ్న వేయడానికి ప్రయత్నం చేస్తాడు. 'రాముడు వచ్చాడు' అని చెప్పితే ఆ ఆకాంక్ష తీరుతుంది. అలాకాక సంబంధం లేని పాడిపాడి మాటలు చేర్చి మాటలాడితే అది వాక్యం కాదు.

**3. ఆసత్తి :**

ఆసత్తి అంటే పదాల చేరిక. పదాలు ఒక క్రమం ప్రకారం వుంటే అదే ఆసత్తి. అప్పుడే ఆ వాక్యం పరిపూర్ణమైందిగా భావించవచ్చు. ఒక పదాన్ని ఒకప్పుడు మరో పదాన్ని మరో అప్పుడు చెప్పితే, ఆ పదాలకు సన్నిహిత సంబంధం వుండదు. వాక్యంలో వుండవలసిన పదాల క్రమం సరిగా లేకపోతే సమన్వయం కుదరదు.

ఉదా॥ ఈరోజు 'దేవదత్తుడు' అనిచెప్పి మరో రోజున 'హంస' అని చెప్పి వేరోరోజున 'కొట్టాడు' అని చెప్పితే పదాల క్రమం ఒక పద్ధతిలో వుండదు. కాబట్టి వాక్యంలో ఆసత్తి అనేది ఒక ముఖ్యమైన అంశం అని మనం గ్రహించాలి.

మొత్తం మీద తేలిన సారాంశం ఏమంటే ఒక విషయాన్ని తెలియచేసే పదాల సమాహారమే వాక్యం.

## 6.10. వాక్యం - స్వరూపం :

బహుజనపల్లి సీతారామాచార్యులు 'విషయ బోధకంబు వాక్యం' అని అన్నారు. ప్రధానంగా వాక్యంలో రెండు అంశాలు వుంటాయి. ఒక విషయాన్ని బోధించేటప్పుడు ఈ రెండు అంశాలు చోటుచేసుకుంటాయి. ఒకటి ఉద్దేశ్యం (Subject) రెండు

విధేయం (Predicate). దేన్ని ఉద్దేశించి (వ్యక్తి, వస్తువు) చెప్తామో అది ఉద్దేశ్యం. దేన్ని చెప్తున్నామో అది విధేయం. వాక్యంలో మొదటి భాగం ఉద్దేశ్యం. రెండో భాగం విధేయం. ఈ రెండింటి మధ్యలో వాక్యంలో ప్రాథమిక విభజన వుంటుంది.

"there must be something to talk about and something must be said about this subject of discourse once it is selected. This distinction is of such fundamental importance that the vast majority of languages have emphasized it by creating some sort of formal barrier between the two terms of the proposition"

అని ఎడ్వర్డ్ సపిర్ ఉద్దేశ్యం, విధేయం - అనే రెండంశాల యావశ్యకతను గూర్చి తెలిపాడు. ఇతడు ఉద్దేశ్య విధేయాల స్వరూప స్వభావాన్ని తెల్పుచూ "The subject of discourse is a noun. As the most common subject of discourse is either a person or a thing, the noun clusters about defined concepts of that order. As the thing predicated of a subject is generally an activity in the widest sense of the word, a passage from one moment of existence to another, the form which has been set aside for the business of predicating, in other words, the verb, clusters about concepts of activity"

ఉదా॥ :

1. 'రాముడు తెచ్చాడు'.

ఇక్కడ 'రాముడు' అనేది ఉద్దేశ్యం. అంటే ఆ వాక్యంలో రాముని గూర్చి చెపుతున్నామని అర్థం. 'తెచ్చాడు' అనేది విధేయం. ఇందులో కర్త, క్రియలు రెండు మాత్రమే వున్నాయి.

2. 'రాముడు సీతను తెచ్చాడు'

ఇందులో 'రాముడు' ఉద్దేశ్యం. 'సీతను తెచ్చాడు' అనేది విధేయం. కర్త (Subject), కర్మ (Object) క్రియ (Verb) లు మూడు కలిసిన వాక్యం ఇది. తెలుగు వాక్య స్వరూపం సామాన్యంగా కర్త, కర్మ, క్రియ అనే క్రమం కలిగి వుంటుంది.

3. 'రాముడు' రావణుని సంహరించి సీతను తెచ్చాడు'.

ఈ వాక్యంలో 'రాముడు' అనేది ఉద్దేశ్యం. తక్కినదంతా విధేయం. కాబట్టి వాక్యంలో ఉద్దేశ్యం, విధేయం అనే విభజన తప్పనిసరిగా వుంటుందని మనం గ్రహించాలి.

## 6.11. వాక్యం - నియమాలు :

కొన్ని పదాలు కలిసి ఒక వాక్యంగా ఏర్పడడంలో ప్రతి భాషలోనూ కొన్ని నియమాలు, సూత్రాలు, సిద్ధాంతాలు వుంటాయి.

ఉదా॥ : మీ ఆఫీసు నేను చూశాను

నేను చూశాను మీ ఆఫీసు

చూశాను నేను మీ ఆఫీసు

నేను మీ ఆఫీసు చూశాను

మీ నేను చూశాను ఆఫీసు

పై ఉదాహరణల వల్ల తేలింది ఏమంటే ఒక పద్ధతి ప్రకారం, ఒక నిర్దిష్ట క్రమంలో వాక్యాలు వుంటేనే అవి సాధువాక్యాలు అవుతాయి. ఈ విషయంలో ఒక భాషకీ మరో భాషకీ చాలా మార్పులున్నాయి.

తెలుగులో భాషలో 'వేటగాడు పులిని చంపాడు' అన్నా, 'పులిని చంపాడు వేటగాడు' అన్నా, ఒకే అర్థం వస్తుంది. ఆంగ్లంలో అలాకాదు. "The hunter Killed the Tiger" అనే వాక్యంలో పదాలు మార్చి "The Tiger Killed the hunter" అనే పూర్తిగా వ్యతిరేకమైన అర్థం వస్తుంది. ఈ భేదానికి మూలకారణం తెలుగు భాషలో ద్వితీయా విభక్తి ప్రత్యయం వుండడం ఆంగ్ల భాషలో లేకపోవడం,

## 6.12. వాక్యనిర్మాణ సంబంధాలు (Synatactic Relations) :

వాక్యంలో పదాలకి వున్న పరస్పర సంబంధం ప్రధానంగా మూడు రకాలు. 1. స్థాన సంబంధం. 2. యోగ్యతా సంబంధం. 3. ఆదేశ సంబంధం. ఈ మూడింటిని కలిపి వాక్య నిర్మాణ సంబంధాలు (Syntactic Relations) అని అంటారు.

### 1. స్థాన సంబంధం (Positional Relation) :

కొన్ని పదాలు కలిసేటప్పుడు అవి నిర్దిష్ట క్రమంలో స్థానాలు మార్చడానికి వీలు లేకుండా వుండడం స్థాన సంబంధం. కొన్ని రకాల పదాల కలయికను మాత్రమే వ్యాకరణం ఒప్పు కుంటుంది. దానికి వ్యాకరణ సమ్మతి (Grammaticality) అని అంటారు. వ్యాకరణ సమ్మతి లేని రూపాల్ని ఇలా ★ గుర్తు చేసి సూచిస్తారు.

ఉదా ॥ : నా కొత్త పెన్ను
కొత్త నా పెన్ను ★
రెండు పెద్ద కుర్చీలు
పెద్ద రెండు కుర్చీలు ★

### 2. యోగ్యతా సంబంధం (Relation of Co-occurrence) :

వాక్యంలో ఒక రకమైన పదం కొన్ని రకాల పదాలతో మాత్రమే కలుస్తుంది. అలా, కాకుండా మరికొన్ని రకాల పదాలు దానికి చేరిస్తే ఆ వాక్యం వింత అర్థాన్ని ఇవ్వడమో, లేక అది అంగీకార యోగ్యం కాకపోవడమో జరుగుతుంది. దీన్నే యోగ్యతా సంబంధం అంటారు.

ఉదా॥ : మాలిని పాటలు పాడుతుంది.
బీరువా పాటలు పాడుతుంది ★
భారతి ఆటలు ఆడుతుంది.
టేబులు ఆటలు ఆడుతుంది. ★

**3. ఆదేశ సంబంధం (Relation of Substitutability) :**

ఒక వాక్యంలో ఒకే పదం స్థానంలో ఇంకో పదాన్ని కానీ, పదాల్ని కానీ వుంచటం సాధ్యమైతే అలాంటి పదాల పరస్పర సంబంధాన్ని ఆదేశసంబంధం అంటారు.

ఉదా : ఆ.......................... పెద్దవి

(ఈ ఖాళీలో మంచాలు, ద్వారాలు, తలుపులు మొదలైనవి రాయవచ్చు. పాడాడు, తిన్నాడు, రాశాడు మొదలైనవి రాయకూడదు).

## I. తెలుగు వాక్యం - భేదాలు :

**1. ప్రౌఢ వ్యాకరణం - వాక్యభేదాలు :**

ప్రౌఢవ్యాకర్త బహుజనపల్లి సీతారామాచార్యులు వాక్యాన్ని రెండు విధాలుగా వర్గీకరించాడు. 'సంపూర్ణమసంపూర్ణమని వాక్యంబుద్వివిధంబు' (వాక్య పరిచ్ఛేదం - 7). ఒకటి సంపూర్ణ వాక్యం. రెండు అసంపూర్ణ వాక్యం.

**ఎ. సంపూర్ణ వాక్యం (Complete Sentence) :**

సమాపక క్రియగల వాక్యం సంపూర్ణ వాక్యం.

ఉదా॥ : వానలు కురిశాయి.

**బి. అసంపూర్ణ వాక్యం (Incomplete Sentence) :**

అసమాపక క్రియ వుంటే అది అసంపూర్ణ వాక్యం.

ఉదా॥ : వానకురిస్తే ..... (పంటలు పండుతాయి)

ఇక్కడ అసంపూర్ణ వాక్యంలో వాక్యానికి ప్రధానమైన ఆకాంక్ష లేదు.

**రూపం - అర్థం - క్రియ ప్రాధాన్యం - వాక్య భేదాలు :**

రూపాన్నిబట్టి, అర్థాన్ని బట్టి, క్రియా ప్రాధాన్యాన్ని బట్టి వాక్యాన్ని కొన్ని విధాలుగా వింగడించవచ్చు.

ఎ. రూపాన్ని బట్టి వాక్యం - భేదాలు

బి. అర్థాన్ని బట్టి వాక్యం - భేదాలు

సి. క్రియా ప్రాధాన్యాన్ని బట్టి వాక్యం - భేదాలు

**2. రూపాన్ని బట్టి వాక్యం - భేదాలు :**

రూపాన్ని బట్టి వాక్యాన్ని మూడు రకాలుగా విభజించవచ్చు. ఆంగ్ల వ్యాకరణాన్ని దృష్టిలో పెట్టుకొని మన భాషా శాస్త్రజ్ఞులు ఈ విభజన చేశారు.

I. సామాన్య వాక్యం (Simple Sentence)

II. సంశ్లిష్ట వాక్యం (Complex Sentence)

III. సంయుక్త వాక్యం (Compound Sentence)




## I. సామాన్య వాక్యం (Simple Sentence)

ఒక సమాపక క్రియ (Finite Verb) మాత్రమే కలిగింది సామాన్య వాక్యం. ఇందులో అసమాపక క్రియ (Infinite Verb) లకు ఏమాత్రం అవకాశం వుండదు.

ఉదా॥ నేను పుస్తకం చదివాను

తెలుగు వాక్య నిర్మాణంలో ఒక ప్రత్యేక లక్షణం చోటు చేసుకుంది. అది ఏమంటే ఏ భాషలోనైనా క్రియా సహిత వాక్యాలుండడం సహజం. కాని తెలుగులో క్రియా రహిత వాక్యాలు కూడా వుండడం ప్రత్యేకత.

**సామాన్య వాక్యం - విభజన :**

సామాన్య వాక్యం మరల రెండు రకాలు 1. క్రియా సహిత వాక్యాలు (Verble Sentences) 2. క్రియా రహిత వాక్యాలు. (Verbless Sentences) :

**1. క్రియా సహిత వాక్యాలు (Verble Sentences) :**

క్రియతో కూడుకున్నవి క్రియా సహిత వాక్యాలు.

ఉదా॥ పునీత్ నిద్రించాడు.

విద్యాసాగర్ కమ్మగా పాడుతాడు.

జీవన్‌సాగర్ పాఠం చెప్పుతున్నాడు.

విశాల్ జవాబులు రాస్తున్నాడు.

రామన్ పుస్తకం చదువుచున్నాడు.

**2. క్రియా రహిత వాక్యాలు (Verbless Sentences) :**

క్రియలు లేని వాక్యాలు క్రియా రహిత వాక్యాలు. ఒకే విషయాన్ని బోధించే రెండు నామాల్ని ఒకచోట చేరిస్తే క్రియా రహిత వాక్యాలు ఏర్పడతాయి.

తెలుగులో క్రియారహిత వాక్యాలే ఎక్కువగా కన్పిస్తాయి. సౌలభ్యం కొరకు తన అభిప్రాయాల్ని భావాల్ని సాధ్యమైనంత త్వరగా తక్కువ అక్షరాలతో వ్యక్తం చేయడానికి మనిషి ప్రయత్నంచేస్తాడు. కాబట్టి క్రియా రహిత వాక్యాలు అన్ని భాషల్లోనూ చోటుచేసుకున్నాయి.

ఉదా॥ : అంబేద్కర్ మహామేధావి

ఆమె గుణవతి

వాడు బాలుడు

అది ఆవు

క్రియా సహిత వాక్యాలు మళ్లీ రెండు రకాలు 1. కర్త సహిత వాక్యాలు, 2. కర్తృ రహిత వాక్యాలు

**1. కర్త సహిత వాక్యాలు :**

కర్త సహిత వాక్యాలు క్రియల్ని బట్టి మళ్లీ మూడు విధాలు. 1. అకర్మక వాక్యం 2. సకర్మక వాక్యం 3. ప్రేరణ వాక్యం.

i. అకర్మక వాక్యం (Intransitive Sentence)

అకర్మక వాక్యాల్లో కర్మ వుండదు. కర్మ యొక్క ఆకాంక్ష లేనిది అకర్మకాలు. ప్రశ్నలు వేయడానికి వీలుపడని క్రియలు అకర్మకాలు.

ఉదా॥ : ప్రశాంత్ వచ్చాడు

బాలుడు కాలు జారి పడ్డాడు

ఇటు చూడు

వాడు చదువలేడు

ii. సకర్మక వాక్యం (Transitive Sentence) :

సకర్మక వాక్యాల్లో కర్మ వుంటుంది. కర్మ యొక్క ఆకాంక్ష వున్నవి సకర్మకాలు. ప్రశ్నలు వేయడానికి వీలున్న క్రియలు సకర్మకాలు.

ఉదా॥ : ప్రియాంక అన్నం వండింది.

ఈ దృశ్యం చూడు

వాడు ఉత్తరం చదివినాడు

ఆయన అనేక కష్టాలు పడ్డాడు.

iii. ప్రేరణ వాక్యం (Causitive Sentence) :

ప్రేరణ వాక్యాల్లో కర్త ప్రేరణ వుంటుంది. ఒక కార్యం ఒకరిచే చేయించడం ప్రేరణం.

ఉదా॥ ఆమె అతని చేత రాయించింది. వాడు అతన్ని కొట్టించాడు.

**2. కర్తృ రహిత వాక్యాలు** (Activeless Sentence) :

కర్తృ రహిత వాక్యాల్లో 'వుంది' అనే క్రియారూపం వుంటుంది.

ఉదా॥ : నాకు బాధగా వుంది

వాడికి ఆహ్లాదకరంగా వుంది.

II. సంశ్లిష్ట వాక్యం (Complexe Sentence) :

సమాపక క్రియ, అసమాపక క్రియ రెండు కలిసి వున్న పద సముదాయం సంక్లిష్ట వాక్యం.

ఉదా॥ : భర్త చూస్తుండగానే భార్యపై అత్యాచారం జరిగింది,

ఈ వాక్యంలో 'జరిగింది' అనేది సమాపక క్రియ. 'చూస్తుండగా' అనేది అసమాపక క్రియ. కాబట్టి ఇది సంక్లిష్ట వాక్యం.

సంక్లిష్ట వాక్యాల్లో శత్రర్థకం, చేదర్థకం, అవ్యర్థకం, క్త్వార్థకం అనే నాలుగు ప్రధాన పాత్ర వహిస్తాయి.

**1.** శత్రర్థకం (Present Participle)

క్రియకు 'తూ' ప్రత్యయం (Preposition) చేరడం వల్ల శత్రర్థక రూపాలు ఏర్పడతాయి.

ఉదా॥ : కృష్ణమూర్తి పాడుతూ నాట్యం చేస్తాడు

మన్మధరావు తింటూ మాటలాడు తాడు.

అరుణ టి.వి. చూస్తూ చదువుతుంది.

మాళవిక సినిమా చూస్తూ నవ్వుతుంది.

**2.** చేదర్థకం (Conditional) :

ధాతువుకి తే, ఐతే ప్రత్యయాలు చేరిస్తే చేదర్థక క్రియలు ఏర్పడతాయి. ఒక వ్యాపారం మీద ఆధారపడి ఇంకో వ్యాపారం జరిగేటప్పుడు ఈ వాక్యాలు వుపయోగిస్తారు.

ఉదా॥ దళిత రాజ్యం వస్తే దేశం బాగుపడుతుంది.

వ్యావహారిక భాష అయితే ఆమోదయోగ్యం.

చీకటి పడితే దొంగల భయం.

వరదలు వస్తే పంటలకు నష్టం.

**3.** అప్యర్థకం (Concessive) :

ధాతువుకు 'ఇనా' ప్రత్యయం చేరడం వల్ల అప్యర్థక క్రియలు ఏర్పడతాయి. రెండు వ్యాపారాల్లో వైరుధ్యాలు వున్నప్పుడు మాత్రమే ఈ వాక్యాలు వాడుతారు.

ఉదా॥ మద్యనిషేధం పెట్టినా ఫలితం లేదు

ఆ మాష్టారు పాఠం చెప్పినా అర్థం కాదు.

వాడు ఆహ్వానించకపోయినా హాజరవుతాడు.

**4. క్త్వార్థకం** (Past Participle) :

'ఇ' వర్ణకం క్త్వార్థకం.

ఉదా॥ : శిరీష ఇంటికి వెళ్ళి వంట వండింది.

సుధీర్ ఆఫీసుకు వెళ్ళి ఫైల్స్ చూశాడు.

పార్వతి స్కూల్‌కి వెళ్ళి పాఠాలు చెప్పింది.

రాజేష్ ఆసుపత్రికి వెళ్ళి రోగుల్ని చూశాడు.

III. సంయుక్త వాక్యం (Compound Sentences) :

రెండుకాని అంతకంటే ఎక్కువకాని సమాన ప్రతిపత్తి గల వాక్యాలు కలిసి ఏకవాక్యంగా ఏర్పడితే అది సంయుక్త వాక్యమవుతుంది. దీన్నే మహావాక్యం అని కూడా అంటారు.

ఆంగ్లంలో రెండు వాక్యాల మధ్య అనుసంధానం, And, But, Or, So, While మొదలైన అనుసంధాయక (Co-ordination) పదాల వల్ల కలుగుతుంది. హిందీలో ఔర్, యా, మగర్, జో మొదలైనవి ఇలాంటివే. తెలుగులో పై ఆంగ్ల భాషా పదాలకు సమానార్థకాల్ని సూచించే పదాలున్నాయి. కాని, అయితే, ఇలాంటి కొన్ని అవ్యయాలు రెండు వాక్యాల్ని అనుసంధిస్తాయి.

సంయుక్త వాక్యాల్ని మూడు రకాలుగా విభజించవచ్చు. 1. సంకలన సంబంధం, 2. వికల్ప సంబంధం, 3. వైరుధ్య సంబంధం.

**1. సంకలన సంబంధం :**

కొన్ని సామాన్య వాక్యాల్ని ఒకేసారి వుపయోగించేటప్పుడు వాటి మధ్య వున్న సంబంధం సంకలన సంబంధం అవుతుంది.

ఉదా ॥ : రాజు కవిత్వం రాస్తాడు, నాటకాలు రాస్తాడు, వ్యాసాలు రాస్తాడు, ఉపన్యాసాలిస్తాడు, ఉద్యమాల్లో తిరుగుతాడు,

విజయ నాట్యం చేస్తుంది. పాటలు పాడుతుంది, నవలలు రాస్తుంది, కథలు రాస్తుంది.

**2. వికల్ప సంబంధం :**

ఇందులో నామబంధాలకు 'ఓ' శబ్దం చేరుతుంది.

ఉదా॥ ఆనందో జగదీషో వస్తాడు

రామకృష్ణ ఉద్యోగమో, వ్యాపారమో చేస్తున్నాడు.

శ్వేతో, స్వాతో వస్తుంది.

వివేక్ డాక్టరో, ఇంజినీరో చేస్తున్నాడు.

**3. వైరుధ్య సంబంధం :**

రెండు వాక్యాలు ప్రతిపాదించే విషయాల మధ్య సంబంధం వైరుధ్య సంబంధం. రెండు వాక్యాల మధ్య, కాని, అయితే, వస్తాయి.

ఉదా॥ పేరుకు మాత్రం స్వామీజీ కాని, పెద్ద గూండా.

వాడు మంచి పాలకుడు కాని, గర్వం ఎక్కువ.

పాపారావు అవినీతిపరుడు, అయితే నీతి గూర్చి మాటలాడుతాడు.

**3. అర్థాన్ని బట్టి వాక్యం - భేదాలు :**

అర్థాన్ని బట్టి వాక్యాన్ని 7 రకాలుగా వర్గీకరించవచ్చు.

1. వాస్తవికతా బోధకాలు
2. ప్రశ్నార్థకాలు
3. ప్రార్థనాద్యర్థకాలు
4. ఇచ్ఛా బోదకాలు
5. అనుమానార్థకాలు
6. సంభావనార్థకాలు
7. వ్యంజకార్థకాలు

**1. వాస్తవికతా బోధకాలు :**

ఒక వాస్తవికమైన సంఘటనను బోధించేవి వాస్తవికతా బోధకాలు

ఉదా॥ ఆకాశంలో పక్షులు ఎగురుతున్నవి
రంగడు నిన్న బడికి పోలేదు.

**2. ప్రశ్నార్థకాలు :**

ప్రశ్నలు వేసే వాక్యాలు ప్రశ్నర్థాకాలు వీటిలో రెండు ఉపభేదాలున్నాయి.

అ. "అవును" లేక "లేదు", "కాదు" అనేవి జవాబులుగా వచ్చే ప్రశ్నవాక్యాలు ఒక తెగ. వాస్తవికతా బోధక వాక్యాల చివర "ఆ" లేక "ఏమి", "ఏమిట్ని" అనే ప్రశ్నవాచక కారకాలు చేర్చుట వల్ల ఇవి ఏర్పడతాయి.

ఉదా॥ నీవు పాఠం చదివినావా ?

వారు మీ ఇంటికి నిన్న రాలేదా ?

వాడు ఈ సంగతి మీకు చెప్పేదేమిటి ?

వాడు అంత ధనవంతుడేమి ?

ఆ. "అవును", "కాదు" అనే జవాబులకు వీలు ఇవ్వని ప్రశ్న వాక్యాలు రెండవ తెగ. ఇవి ప్రశ్న వాచక సర్వనామ విశేషణ, కారకాల సహాయంన ఏర్పడతాయి.

ఉదా॥ ఈ గ్రంథం ఎవరు రచించినారు ?
ఏ పుస్తకం నీకు కావాలి ?
అక్కడ ఎందురు కూలీలు పనిచేస్తున్నారు ?
వాడు ఎప్పుడు వస్తాడు ?

ప్రశ్న వాచక వాక్యాల చివర ప్రశ్న చిహ్నం వుంటుంది.

**3. ప్రార్థనాద్యర్థకాలు :**

ప్రార్థన, ఆదేశం మొదలైన వాటిని బోధించే వాక్యాలు ప్రార్థనాద్యర్థకాలు. వీటిలో ఉద్దేశ్యం మధ్యమ పురుషంలోనే వుంటుంది. తరచుగా ఉద్దేశ్యపదం లోపిస్తుంది.

ఉదా॥ (నీవు) ఇటురా (మీరు) నా మాట వినండి

సీతా (నీవు) ఒక మంచి పాట పాడుదూ

(మీరు) రెండు ప్రశ్నలకు మాత్రమే జవాబు వ్రాసేది.

నన్ను ఇంటికి పోనీ

జరిగినది ఏమిటో ఆయనను చెప్పనియ్యండి

మనం మొక్కలను నాటుదాము.

**4. ఇచ్ఛాబోధకాలు :**

వక్త ఇచ్ఛాను బోధించే వాక్యాలు ఇచ్ఛాబోధకాలు. ఇవి అన్ని పురుషాలలో వుంటాయి. ప్రార్థన, ఆజ్ఞ, శుభేచ్ఛా (ఆశీస్సు), దూషణ (శాపం), విధి, ఈ అర్థ విశేషాల్ని తెలుపుతాయి.

ఉదా॥ రేపటి సభకు అందరును విచ్చేయుదురుగాక (విచ్చేయాలి)
విద్యార్థులు తమ తమ వ్రాత పరికరాలను తామే తెచ్చుకొందురుగాక (తెచ్చుకోవాలి)
భగవంతుడు మిమ్ము సర్వదా కాపాడుగాక (కాపాడాలి)
నీవు శిలవు ఐపోదువుగాక (ఐపోవాలి)
నేను ఈ పనిని స్వయంగా చేయుదును గాక

నీ జిహ్వా పడిపోను

నా కళ్ళు కాల

**5. అనుమానార్థకాలు :**

సందేహాస్పదమైన ఊహను బోధించేవి అనుమానార్థకాలు. ఈ వాక్యాలలోని క్రియలు అనుమానార్థక రీతిలో వుంటాయి.

ఉదా॥ పుస్తకం ఎక్కడికీ పోదు బీరువాలోనో, పెట్టెలోనో వుంటుంది.

అతను నేను పంపిన సొమ్ము నిన్ననే అందుకొని వుంటాడు.

వాడు రేపు రావాలి.

**6. సంభావనార్థకాలు :**

కారణ భూతమైన ఒక సంఘటన జరిగే పక్షంలో జరిగేటట్టు ఊహించిన మరొక సంఘటనను బోధించే వాక్యాలు సంభావనార్థకాలు

ఉదా॥ తన వద్ద డబ్బు వుంటే నేడు నాకు ఇచ్చును

ఆయనకు శస్త్ర చికిత్స జరిగితే బ్రతికి ఉండును

**7. వ్యంజకార్థకాలు :**

ఆశ్చర్యాది తీవ్ర మనోభావాల్ని బోధించేవి వ్యంజాకర్థకాలు. వ్యంజకార్థక పదాల సహాయంన ఏర్పడతాయి.

ఉదా॥ ఆయన ఏమి ఉపన్యసించి పోయినాడు

ఆ భోక్త ఎంత తిన్నాడు

నేను ఎన్ని కష్టాలకు లోను కావలసి వచ్చినది

ఈ రోగం వల్ల మీరు ఎంత చిక్కి పోయినారు.

ఎటువంటి విషాద సంఘటన.

ఈ వాక్యాల చివర వ్యంజక చిహ్నం వుంటుంది.

అన్ని రకాల వాక్యాల్ని అర్థాన్ని బట్టి అస్త్యర్థకాలు గానూ, నాస్త్యర్థకాలు గానూ పేర్కొనవచ్చు.

అ) అస్త్యర్థకాలు, ఆ) నాస్త్యర్థకాలు

**అ) అస్త్యర్థకాలు :**

ధాతువు యొక్క సహజమైన అర్థం కలవి అస్త్యర్థకాలు.

ఉదా॥ సంపద వలన సౌఖ్యం కలుగుతుంది.

నాకు ఈ శిక్ష ఎందుకు విధించినారు ? ఇటు చూడండి

మీరు తప్పక ఈ సభకు రావాలి

రాత్రి వర్షం వస్తుంది

తంతి వార్త అందితే వాడు వచ్చును.

అమె ఎంత శ్రావ్యంగా పాడింది.

ఆ) నాస్త్యర్థకాలు :

వ్యతిరేకార్థం కలవి నాస్త్యర్థకాలు

ఉదా॥ వాడు తల్లిదండ్రుల మాట వినడు

జీవహింస చేయకు

దీని నుండి తప్పించుకొనే మార్గం లేదా ?

నన్ను ఎవరును నిర్భందించకుందురు గాక

వాడు పుస్తకం తీసి వుండడు

తగిన చికిత్స జరిగితే ఆయన మరణించకపోవును.

ఎన్ని సార్లు నీకు నేను చెప్పలేదు ?

**క్రియల వాఖ్యాన్ని బట్టి వాక్యం :**

క్రియల వాచ్యాన్ని బట్టి వాక్యాన్ని మూడు రకాలుగా పేర్కొనవచ్చు. అ) కర్త్రర్థక వాక్యాలు, ఆ) కర్మార్థక వాక్యాలు, ఇ) భావార్థకాలు

**అ) కర్త్రర్థక వాక్యాలు :**

ఉద్దేశ్యం క్రియా బోధిత వ్యాపారకర్తను పేర్కొన్న వాక్యం కర్త్రర్థకం

ఉదా॥ 1975లో ప్రభుత్వం వారు ఈ వంతెన నిర్మించారు.

**ఆ) కర్మార్థక వాక్యాలు :**

ఉద్దేశ్యం క్రియాబోధిత వ్యాపార ఫలాన్ని పొందిన వ్యక్తి వస్తువులను పేర్కొన్న వాక్యం కర్మర్థకం.

ఉదా॥ 1975లో ప్రభుత్వం వారి చేత ఈ వంతెన నిర్మించబడింది.

ఇ) భావార్థకాలు :

ఉద్దేశ్యం క్రియా భావాన్ని బోధించే వాక్యం భావార్థకం

ఉదా॥ 1975లో ప్రభుత్వం ఈ వంతెనను నిర్మించడం జరిగింది.

వివిధ వాక్యాల క్రియలు వివిధ రీతుల్లో వుంటాయి. వాస్తవికతా బోధక, ప్రశ్నార్థక, వ్యంజకార్థక వాక్యాల క్రియలు వాస్త వార్థకరీతులో వుంటాయి. ప్రార్థనాద్యర్థక, ఇచ్ఛాబోధక వాక్యాల క్రియలు విధ్యాద్యర్థక రీతులో వుంటాయి. అనుమానార్థక వాక్యాల క్రియలు అనుమానార్థక రీతులోనూ, సంభావనార్థక వాక్యాల క్రియలు సంభావనార్థక రీతిలోను వుంటాయి.

**రచనా విధానాన్ని బట్టి వాక్యం :**

రచనా విధానాన్ని బట్టి వాక్యాన్ని నాలుగు రకాలుగా వర్గీకరించవచ్చు. అ) సరళ వాక్యం, ఆ) జటిల వాక్యం, ఇ) సంయుక్త వాక్యం, ఈ) ద్వంద్వ వాక్యం.

అ) సరళ వాక్యం :

అసమాపక క్రియా ఘటితాలైన పదబంధాలు (జటలు, జటాబంధాలు) లేని, ఒకే ఉద్దేశ్యం, ఒకే ఆఖ్యాతం (సమాపక క్రియ) గల వాక్యం సరళ వాక్యం.

ఉదా॥ తుఫాను దెబ్బవల్ల పెక్కు వేల ప్రజలు మరణించారు. మనదేశంలో చాలా మందికి చదవడం రాయడం రాదు.

ఆ) జటిల వాక్యం :

ఒకటి గాని, ఒకటి కన్నా ఎక్కువ గాని జటిల లేక జటాబంధాలు వుండి, ఒక ఉద్దేశ్యం, ఒకే అఖ్యాతం (సమాపక క్రియ) గల వాక్యం జటిల వాక్యం ఉదా॥ ప్రధానమంత్రి ఆసీనుడు కాగా ప్రజలు హర్షధ్వానాలు చేశారు. వాల్మీకి రాసిన రామాయణానికి పెక్కు అనువాదాలు వెలసినవి విద్యార్థులు మాటిమాటికి సమ్మెలు చేయడం హర్షించదగ్గ విషయంకాదు.

ఇ) సంయుక్త వాక్యాలు :

ఒకటి కాని, ఒకటి కన్నా ఎక్కువ కాని, ఆశ్రిత ఉపవాక్యాలు ఒక ప్రధాన ఉపవాక్యం గల వాక్యాన్ని సంయుక్త వాక్యం అని అంటారు.

ఉదా॥ మీరు ఎప్పుడు బయలుదేరుతారో ముందుగా రాయండి నా మాట వింటివా, బాగుపడతావు.

ఏదినీకు ఇష్టమో దానినే తీసుకో

ఈ) ద్వంద్వ వాక్యాలు :

రెండు కాని, రెండింటి కన్నా ఎక్కువ కాని, ప్రధాన ఉపవాక్యాలు కలిసి ఏర్పడ్డ వాక్యం ద్వంద్వ వాక్యం

ఉదా॥ త్వరగా రండి, సినిమాకు పోదాం

అతడు పెద్ద పెద్ద పరీక్షలు ప్యాసయినాడు, కాని ఇంత వరకు ఉద్యోగం దొరకలేదు

సృష్టిలో ప్రతి పాణి పుట్టుతుంది, పెరుగుతుంది, క్షీణిస్తుంది, తుదకు నశిస్తుంది.

**క్రియా ప్రాధాన్యాన్ని బట్టి వాక్యం - భేదాలు :**

వాక్యాన్ని క్రియా రూపస్థితిని బట్టి మూడు విధాలుగా వర్గీకరించవచ్చు.

**1. కర్తృ ప్రధాన వాక్యం :**

ఇందులో క్రియా పదం కర్తకు ప్రాధాన్యం ఇస్తుంది.

ఉదా॥ రాముడు శంబూకుణ్ణి చంపాడు

**2. కర్మ ప్రధాన వాక్యం :**

దీనిలో క్రియా పదం కర్మకు ప్రాముఖ్యం ఇస్తుంది.

ఉదా॥ శంబూకుడు రామునిచేత చంపబడ్డాడు.

**3. భావ ప్రధాన వాక్యం :**

భావక్రియను వుపయోగించి చెప్పడం భావ ప్రధాన వాక్యం

ఉదా॥ మీరాకచే సర్వ సౌభాగ్యాలు రావడం మొదలైనాయి.

**ఆధార గ్రంథాలు :**

**1. తెలుగు :**

1. ఆధునిక తెలుగు వ్యాకరణం - ఎన్. శివరామమూర్తి

2. ఆధునిక తెలుగు వెన్నెలకంటి వ్యాకరణం - వెన్నెలకంటి ప్రకాశం

3. ఆధునిక తెలుగు భాషా నిర్మాణం - శివుని రాజేశ్వరి

4. ఆధునిక ప్రామాణికాంధ్ర వ్యాకరణం - వజ్ఝల వేంకటేశ్వర్లు

5. ఆధునిక భాషా శాస్త్రం - వెలమల సిమ్మన్న

6. ఈనాడు భాషా స్వరూపం - బూదరాజు రాధాకృష్ణ

7. తెలుగు దారి - వెల్చేరు నారాయణరావు

8. తెలుగులో వెలుగులు - చేకూరి రామారావు

9. తెలుగు భాషా చరిత్ర (సంపాదకులు) - భద్రిరాజు కృష్ణమూర్తి

10. తెలుగు భాషా చరిత్ర - వెలమల సిమ్మన్న

11. తెలుగు భాషా తత్త్వం - కొమర్రాజు లక్ష్మణరావు

12. తెలుగు భాషా శాస్త్రవేత్తలు - వెలమల సిమ్మన్న

13. తెలుగు భాషా స్వరూపం - బూదరాజు రాధాకృష్ణ

14. తెలుగు కావ్యం - చేకూరి రామారావు

15. ప్రౌఢ వ్యాకరణం - బహుజనపల్లి సీతారామయ్య

16. బాల వ్యాకరణం - చిన్నయ సూరి

17. బాల వ్యాకరణం - శాస్త్రీయ వ్యాఖ్య - వెలమల సిమ్మన్న, గుమ్మా సాంబశివరావు

18. భాషా తపస్వి గిడుగు - వెలమల సిమ్మన్న

19. భాషానువర్తనం - చేకూరి రామారావు

20. వ్యావహారిక భాషా వ్యాకరణం - వడ్లమూడి గోపాలకృష్ణయ్య

21. శబ్ద బ్రహ్మ చిన్నయ సూరి (అముద్రితం) - వెలమల సిమ్మన్న, గుమ్మా సాంబశివరావు

22. సంధి - వెలమల సిమ్మన్న

**2. ఆంగ్లం :**

1. A Grammar of Modern Telugu - Bh. Krishna Murthy

2. Sandhi Balavyakaranam - J. Pratap Reddy.

పాఠం - 7

# ఉప వాక్య భేదాలు

విషయసూచిక

7.1. ఉపవాక్య భేదాలు

7.1.1. నామ - ఉపవాక్యాలు

7.1.2. వివేషణ - ఉపవాక్యాలు

7.1.3. కారక - ఉపకావ్యాలు

7.2. జటా భేదాలు

7.2.1. నామ జటలు

7.2.2. విశేషణ జటలు

7.2.3. కారక జటలు

## 7.1. ఉపవాక్య భేదాలు :

ఉపవాక్య భేదాలు మూడు వున్నాయి. అవి ఇవి :

1. నామ - ఉపవాక్యాలు
2. విశేషణ - ఉపవాక్యాలు
3. కారక - ఉపవాక్యాలు

### 1. నామ ఉపవాక్యాలు :

ఒక సంయుక్త వాక్యంలో స్వకీయమైన ఉద్దేశ్య, ఆఖ్యాతాలు కలద్దై, నాయంవలె ఉపయోగపడే ఆశ్రిత ఉపవాక్యం "నామ ఉపవాక్యం".

నామ ఉపవాక్యాలు నాయంవలె ఐదు విధాలైన వృత్తాల్ని నిర్వహిస్తాయి. అ) ఉద్దేశ్యం, ఆ) కర్మ, ఇ) సహగామి, ఈ) పూరకం, ఉ) వైభక్తిక మూలం

అ) ఉద్దేశ్యం :

ఈ దిగువ వాక్యాల్లో నిలువు గీతకు ముందు వున్నవి నామ ఉపవాక్యాలు. పరమందువున్న ప్రధాన ఉప వాక్యాల్లోని క్రియలకు ఉద్దేశ్యాలు.

ఉదా : అతడు తండ్రి మాటకు ఎదురు చెప్పడని / మాకు తెలుసు వాడే హత్య చేశాడాన్నది / నమ్మతగ్గ విషయం కాదు సభ ఎప్పుడు జరుగుతుందో / ఇంకా నిశ్చయించబడలేదు.

ఆ) కర్మ :

ఈ క్రింది వాక్యాలలో పూర్వ భాగాలు నామ ఉపవాక్యాలు. పరపందువున్న ప్రధాన ఉప కార్యాల్లోని క్రియలకు కర్మలు.

ఉదా॥ అతడు తండ్రి మాటకు ఎదురు చెప్పడని / మేము ఎదురుగుదుము మీరు ఎప్పుడు వస్తారో / ముందుగా రాయండి పిల్లలు ఎంత ఉత్సాహంతో ఆడుతున్నారో / చూడండి భగవంతుడు మీకు ఆయురారోగ్య ఐశ్వర్యాలు ప్రసాదించుగాక అని / నేను మిమ్మల్ని ఆశీర్వదిస్తున్నాను.

ఇ) సహగామి :

ఈ దిగువ వాక్యాలలో నిలువు గీత ముందు వున్నవి నామ - ఉప వాక్యాలు. అవ్యవహిత పరమందు వున్న నామాలకు (చివర వాక్యంలో సర్వనామానికి) సహగాములు.

ఉదా॥ వారి ఇద్దరికి పెళ్ళి అవుతుంది అనే / నమ్మకం నాకు లేదు ఆయువకుడు తన భార్యను తానే కాల్చి చంపాడన్న వార్త నిజం కాదు వారు యుద్ధానికి దిగుతారంటూ / నిశ్చయం లేదు ఇన్నాళ్ల అతడు ఎందుకు జవాబు రాయలేదో / దానికి కారణం నేను ఊహించలేకున్నాను.

ఈ) పూరకం :

ఈ దిగువ ఒక్కొక్క వాక్యంలో నిలువు గీత తర్వాత వున్న వాక్య భాగ నామ - ఉప వాక్యం “అవును'' అనే అధ్యాహార్య క్రియకు ఉద్దేశ్య సంబంధ పూరకం.

ఉదా॥ నా అభిప్రాయం / వారు మనం పెట్టే షరతుకు ఒప్పుకోరని ముఖ్యంగా గమనించవలసిన విషయం / తుఫానులో మరణించగా మిగిలిన గ్రామీణ ప్రజలు అన్న వస్త్రాలు లేక అలమటిస్తున్నారన్నది.

మొదటి వాక్యంలో సంయోజకం “అని'' రెండో వాక్యంలో సంయోజకం “అన్నది''.

ఉ) వైభక్తిక మూలం :

ఆపదలలో బంధువులు ఆదుకొంటారు అన్న దాని లో నాకు విశ్వాసం లేదు

పై వాక్యంలో "ఆపదలో బంధువులు ఆదు కొంటారన్నది" నామ-ఉపవాక్యం అన్నది సంయోజకం. దీని మీద "లో" అనే వైభక్తికం చేరేముందు "అన్నది" "అన్నదాని" గా మారింది. ఈ నామ-ఉపవాక్యం "లో" అనే వైభక్తి కానికి మూలంలేక ఆశ్రితం.

మరికొన్ని ఉదా॥

ఈ రోజున నాకు వెయ్యి రూపాయలు అప్పు దొరకుతుందా, లేదా అన్న దాని / మీద రేపటి నా ప్రయాణం ఆధారపడివుంది.

వాడు అమెరికాలో ఉద్యోగం చేస్తున్నాడని / తప్ప వానిని గురించి నాకు మరొక విషయం తెలియదు.

**7.1.2. విశేషణ - ఉపవాక్యాలు :**

ఒక సంయుక్త వాక్యంలో స్వకీయమైన ఉద్దేశ్య - ఆ ఖ్యాతాలు కలదై విశేషణం వలె ఉయోగపడే ఆశ్రిత ఉపవాక్యం విశేషణ - ఉపవాక్యం అనబడుతుంది.

విశేషణ ఉపవాక్యం తరచుగా ఆపేక్షిక సర్వనామంతోగాని, ఆపేక్షిక విశేషణంతో గాని మొదలవుతుంది. ఇది ప్రధాన ఉప వాక్యానికి ముందే వుండి, దానిలోని అనుగామి సర్వ నామాన్ని లేక, అనుగామి విశేషణ పూర్వ నామ బంధాన్ని వ్యక్తపరుస్తుంది. విశేషణ ఉపవాక్యం వెనుక 'ఓ' అనే అనుసంధి సంయోజకం వుంటుంది.

ఉదా॥ ఏది నీకు ఇష్టమో దానినే కోరుకో (ఆ. సర్వనామం) ఏ జాతిపిత భారత స్వాతంత్ర్యం సంపాదించి పెట్టెనో / ఆ గాంధి పేరు వినని వారు వుండరు (ఆ. విశేషణం)

మొదటి వాక్యంలోని విశేషణ - ఉపవాక్యం "దానినే" అనే అనుగామి సర్వనామాన్ని, రెండో వాక్యంలోని విశేషణ ఉ పవాక్యం 'ఆ గాంధి' అనే నామ బంధాన్ని వ్యక్త పరుస్తాయి.

పద్య కవితలో "ఓ" అనే సంయోజకం తరచుగా లోపిస్తుంది. ఒకొక్కప్పుడు విశేషణ ఉప వాక్యం ప్రధాన ఉపవాక్యం తర్వాత వస్తుంది.

అప్పుడప్పుడు ఆపేక్షిక కారకాలతో విశేషణ ఉపవాక్యాలు ప్రారంభం  కావడం కద్దు.

ఉదా॥ ఎక్కడ జలసస్య ఫల సమృద్ధి వుండునో అట్టి ప్రదేశాలలోనే జన సంఖ్య హెచ్చు (ఆ. కారకం)

కొన్ని విశేషణ ఉప వాక్యాల్లో ఒకటికన్నా హెచ్చు ఆపేక్షిక భాషా భాగాలు వుంటాయి.

ఉదా॥ ఎవడు ఎటువంటి మనులు ఆచరించునో వాడు అటువంటి ఫలమునే పొందును (ఆ. సర్వనామం, ఆ. విశేషణం)

కొన్ని విశేషణ ఉప వాక్యాలకు సంబంధించిన అనుగామి సర్వనామం లోపించడం కద్దు.

ఉదా॥ ఎవరు రాదలచుకున్నారో / రానే వచ్చారు.

ఈ వాక్యంలో నిలువు గీత ముందు వున్న విశేషణ ఉపవాక్యం లోపించిన "వారు" అనే అనుగామి సర్వ నామాన్ని వ్యక్త పరుస్తుంది.

**7.1.3. కారక - ఉపవాక్యాలు :**

సంయుక్త వాక్యంలో స్వకీయమైన ఉద్దేశ్య, ఆఖ్యాతాలు కలద్దై, కారకవృత్తం నిర్వహించే ఆశ్రిత ఉపవాక్యాన్ని కారక -ఉపవాక్యం అంటారు

కారక ఉప వాక్యాలు ఇతర ఉపవాక్యాలలోని క్రియలను తరచుగా వ్యక్తపరుస్తాయి. అప్పుడప్పుడు కారకాలను వ్యక్త పరుస్తాయి. అయితే విశేషణాల్ని వ్యక్తపరచవు. ఈ విషయాన్ని జాగ్రత్తగా గమనించాలి.

ఉదా॥ నా మాట వింటివా । బాగు పడతావు

ఇంతటి ప్రయోజకుడవైనావని / నేను ఆనందిస్తున్నాను

మరునాడు పెళ్ళి అవుతుంది అనగా / తొలి రోజున మగ పెళ్ళి వారు తరలి వెళ్ళినారు.

నేను స్టేషనులో కాలు పెట్టానో, లేదో, రైలు కదలింది.

అధికారం ఎక్కడ వుంటుందో / అక్కడ అహంకారం తలెత్తుతుంది.

ఇక్కడ మొదటి నాలుగు ఉదాహరణలలో నిలువు గీతల ముందు వున్న కారక - ఉపవాక్యాలు తర్వాత ప్రధాన - ఉప వాక్యాలలోని క్రియలను వ్యక్తపరుస్తాయి.

చివరి వాక్యంలోని "ఎక్కడ" అనే ఆపేక్షిక కారకంతో ప్రారంభమైన, కారక ఉపవాక్యం ప్రధాన ఉపవాక్యంలోని "అక్కడ" అనే అనుగామి కారకాల్ని వ్యక్తపరుస్తుంది.

కారక ఉప వాక్యాలు కొన్ని అనుబంధి సంయోజకాల ద్వారా ప్రధాన ఉప వాక్యాలతో గాని, ఇతర ఉప వాక్యాలతో గాని అనుబద్ధం అవుతాయి అనుబంధి సంయోజకాలు :

ఆ, అని, అనగా, ఓ, అంటే కనుక, కాబట్టి

**మరికొన్ని ఉదా ॥**

అతని నేరం రుజువైనది కాబట్టి (కనుక) / అతనికి కారాగార శిక్ష విధించడమైనది.

అకస్మాత్తుగా సంపత్తి సంక్రమించింది అంటే / మనిషి గర్వం పొందడం సహజం

ఆయన ఎంత దుర్భలంగా వున్నాడంటే / నేల మీద అడుగు తీసి అడుగు పెట్టలేదు.

**అర్థాని బట్టి బహు ప్రకారాలైన కారక ఉపవాక్యాలు :**

అర్థాన్ని బట్టి బహు ప్రకారాలైన కారక ఉప వాక్యాలున్నాయి. అని ఇవి :

| | | | |
|---|---|---|---|
| అ. | సమయ బోధకాలు | ఉ. | విరోధ వాచకాలు |
| ఆ. | స్థాన వాచకాలు | ఊ. | పరిణామ వాచకాలు |
| ఇ. | కారణ వాచకాలు | ఋ. | పరిమాణ వాచకాలు |
| ఈ. | సంకేతబోధకాలు | ౠ. | ప్రకార వాచకాలు |
| | | ఎ. | నిమిత్త బోధకాలు |

**అ) సమయ బోధకాలు :**

మగ పెళ్ళివారు రేపు వస్తారు అనగా / తొలినాడే కన్యాదాత వారి విడిదికై అన్ని ఏర్పాటు చేసినాడు

ఎప్పుడు సంపద కలుగునో / అప్పుడే బంధువులు వస్తారు ఎప్పుడెప్పుడు ధర్మగ్లాని సంభవించునో /

అప్పుడప్పుడు భగవంతుడు ధర్మ సంస్థాపనకై అవతరిస్తాడు. ఏ రోజున నాకు తంతి అందిందో / నాడే నేను విమానంలో బయలు దేరి వెళ్ళాను.

ఎంత కాలం సూర్య చంద్రులు ప్రకాశించగలరో / అంతకాలం మీ కీర్తి అతని మీద నిలుచుగాక

నేను గుమ్మం దిగాను / వాడు ఎదురైనాడు నేను స్టేషనులో కాలు పెట్టానో, లేదో, రైలు కదిలిపోయింది.

పై ఉదాహరణల్లో మొదటి వాక్యంలో "అనగా" అనే సంయోజకం భవిష్యత్కాల సూచకం. చివరి రెండు వాక్యాలలోనూ ఆశ్రిత ప్రధాన ఉపవాక్యాలలోని క్రియ బోధిత వ్యాపారాలు రెండును ఏకకాలమందే జరిగాయి.

**ఆ) స్థాన వాచకాలు :**

ఉదా॥ ఎక్కడ నీరు నిండునో / అక్కడ కప్పలు చేరును

ఎచ్చట ఒకప్పుడు సముద్రం వుండేదో / అచ్చట ఇప్పుడు భూమి ఏర్పడింది.

ఎక్కడ నుండి తమరు వస్తున్నారో / అక్కడికే మేము పోతున్నాము.

ఎంత దూరం బంగారు లేడి పారిపోయిందో / అంత దూరం శ్రీరాముడు దానిని అనుగమించాడు.

**ఇ) కారణ వాచకాలు :**

ఉదా॥ వాళ్ళ అబ్బాయి రాత్రి, పగలు కష్టపడి చదివాడు కనుక / మొదటి తరగతిలో ప్యాసయ్యాడు

వారు శ్రీమంతులు కాబట్టి / వారిని కరువు బాధించదు నీవు కొడుకును కన్నావని / మేము ఎంతో సంతోషించాము.

ఎండ ఎంత తీవ్రంగా కాస్తున్నదంటే / వీధులలో ఎక్కడా మనుష్య సంచారం లేదు.

అతడెంతటి ఆరోగ్య వంతుడో గాని / ఒకనాడును జిర్రున చీది ఎరుగడు

సూచన : కనుక, కాబట్టి అనే సంయోజకాల స్థానే కావున, కాన, అనే పదాలు కూడా వస్తాయి.

**ఈ) సంకేత బోధకాలు :**

ఉదా॥ మీరు మరికొంత పరిశ్రమించారంటే / మీకు తప్పక విజయం చేకూరుతుంది.

ఆ మాయావి మాటలు వాడు విన్నాడా / తప్పక మోసపోతాడు లాభం వచ్చుగాక, నష్టం వచ్చుగాక / నేను ఈ వ్యాపారం మానను ఎన్ని కష్టాలు రానీ / వాడు చేపట్టిన కార్యం విరమించడు.

సూచన : "సంకేతం" అంటే "షరతు" అన్నమాట. చివరి రెండు వాక్యాల్లో కారక - ఉపవాక్యాల తుదిని సంయోజకాలు లేవు.

"ఏని" సంయోజకంతో ఏర్పడ్డ సంకేత బోధక కారక - ఉపవాక్యాలు ప్రాచీన భాషలో వున్నాయి. దీనికి బదులు "తే" ప్రత్యయాంతకారక జటా ప్రయోగమే నేటి వ్యవహారంలో వుంది.

ఉదా॥ దైవము అనుకూలించుకొని ప్రయత్నము ఫలించగలదు (ప్రాచీన ప్రయోగం)

దైవం అనుకూలిస్తే ప్రయత్నం ఫలిస్తుంది (నేటి వాడుక)

**ఉ) విరోధ వాచకాలు :**

ఉదా॥ అతడు ఏదోమాట సాయం చేస్తాడు తప్ప / అత్యవసరమైన ధన సహాయం మాత్రం చేయ్యడు

అతని డబ్బు బంధువులు తిన్నారు తప్ప / అవసాన కాలంలో అతని దరికి రాలేదు

ఆ దంపతులు ఎన్నో వ్రతాలు ఆచరించారే కాని / వారికి సంతానం కలుగలేదు.

పై వాక్యాల్లో "తప్ప", "కాని" అనే సంయోజకాలు విరోధ సూచకాలు. ఒకటి జరిగినందువల్ల సహజంగా జరుగవలసింది జరుగక పోవడమే విరోధం.

**ఊ) పరిణామ వాచకాలు :**

ఉదా॥ మీరు మృత్యు ముఖం నుండి బయటపడ్డారంటే / అది మీ అదృష్టం

అతనికి ఉద్యోగం లభించలేదంటే / అందుకు రాజకీయ పరిస్థితులే కారణం

పై వాక్యాల్లో కారక - ఉపవాక్యంలో చెప్పబడ్డది "పరిణామం". అంటే ఫలితం అన్నమాట

**ఋ) పరిమాణ వాచకాలు :**

ఉదా॥ మానవుడు ఎంత ఎక్కువ ధనం సంపాదించునో / వాని ఆశ అంత పెరుగును.

పై వాక్యంలో నిలువు గీతముందు వున్న కారక ఉపవాక్యం ప్రధాన ఉపవాక్యంలోని "అంత" అనే కారకాన్ని వ్యక్తపరస్తుంది. ఇది "పెరుగుట" యొక్క పరిమాణాన్ని (తీవ్రతను) సూచిస్తుంది.

**ఋ) ప్రకార వాచకాలు :**

ఉదా॥ మిన్ను విరిగి మీద పడుతుందేమో అన్నట్లు / ఉరుములతోను, మెరుపులతోను మేఘాలు క్రమ్ముతున్నవి.

ఇందలి ఉపవాక్యం మేఘాలు ఎట్లు క్రమ్ముతున్నవో తెలుపుతున్నది.

**ఎ) నిమిత్త బోధకాలు :**

ఉదా॥ జబ్బు వేగంగా కుదరాలి అని / అతడు ఉత్తమ వైద్య చికిత్సకై వెల్లూరు ఆసుపత్రిలో చేరాడు.

తిండి గింజల దిగుబడి ఎక్కువ కావాలి అని / వ్యవసాయదారులు క్రొత్త పద్ధతులు అవలంభిస్తున్నారు.

పై వాక్యాల్లో ఉపవాక్యాల నిమిత్తం లేక, ప్రయోజనాలు తెలుపుతున్నాయి.

## 7.2. జటా భేదాలు :

జాటా భేదాలు మూడు విధాలు

1) నామ జటలు 2) విశేషణ జటలు 3) కారక జటలు

ఉద్దేశ్య, కర్మ, కారక, పూరకం లన్నింటితో గాని, కొన్నింటితో గాని, కనీసం ఒక్కటితో గాని అసమాపక క్రియ చేరుటవల్ల ఏర్పడే పద బంధం లేక ఉక్తికి "జట" అని పేరు.

### 7.2.1. నామ జటలు :

నామవృత్తం నిర్వహించేవి నామ జటలు. ఇవి నామాలవలె జటిల వాక్యాంలో ఉద్దేశ్య, కర్మ, పూరక, సహగామి, వైభక్తిక మూలాలుగా ఉపయోగపడతాయి.

క్రియా నామాల "ఉ", "అడము" అనే ప్రత్యయాలు, క్రియా విశేషణాల చివర చేరే "వాడు", "వారు", "ది", "వి" అనే ప్రత్యమాలు, "అ" ప్రత్యమం, ఈ జటల చివరలో వుంటాయి.

ఉదా॥ విద్యార్థులు సమ్మెలు చేయుట / హర్షించతగ్గ విషయం కాదు (ఉద్దేశ్యం)

వార్తలు చదువుతున్నది / రాజ్యలక్ష్మి (ఉద్దేశ్యం)

ధరలు పెరిగిపోవుటను / అరికట్టాలి (కర్మ)

అడుసు త్రొక్క / నేల (ఉద్దేశ్యము)

మౌనం వహించడమే / సగం అంగీకరించుట (ఉద్దేశ్యం, పూరకం)

తండ్రి హఠాత్తుగా మరణించడం / తో కొడుకుల నడమ కలహాలు బయలు దేరినవి (వైభక్తిక మూలం)

నామ జటలు సహ గాములుగా ఉపయోగపడడం తరచుగా వ్యవహారంతో కన్పించదు.

ఉదా॥ 1. తుఫానులో వేలకు వేలు ప్రజలు మరణించడమనేది మిక్కిలి హృదయ విదారకమైన విషయం.

ఈ వాక్యంలో "తుఫానులో.... మనేది" నామబంధం. ఉద్దేశ్యం. దీనిలోని "తుఫానులో వేలకు వేలు ప్రజలు మరణించడం" నామ జట. ఇది "అనేది" అనే క్రియా నామానికి సహగామి

2. వాడు గెలుపొందడం సంగతి అటుండనీ

ఈ వాక్యంలో వాడు "గెలుపొందడం" అనే నామజట "సంగతి" అనేనామానికి సహగామి.

3. మనం వారిని బ్రతిమాలడం అనే ప్రశ్న లేనే లేదు.

ఈ వాక్యంలో "మనం వారిని బ్రతిమాలడం" అనే నామ జట "ప్రశ్న" అనే నామానికి సహగామి. ఇలాంటి చోట్ల "అనే" లేక "అన్న" సంయోజకమై రెండింటిని కలుపును. సహగామి నామ ఉపవాక్యాలతో సహగామి నామ జటలను సరిపోల్చి చూచేది.

### 7.2.2. విశేషణ జటలు :

క్రియా విశేషణ ఘటితాలై విశేషణ వృత్తం నిర్వహించే జటలు విశేషణ జటలు. ఇన, ఏ, అని, వర్ణకాంతాలైన క్రియా విశేషణాలతో ఇవి ఏర్పడుతాయి.

విశేషణ జటలకు నామాలు లేదా సర్వనామాల ముందే ప్రయోగం. అవి పరమందు వున్న నామ, సర్వ నామాల్ని వ్యక్తపరుస్తాయి. ఈ క్రింది జటిల వాక్యాల్లో నిలుపు గీతలకు ముందు వున్నవి విశేషణ జటలు.

ఉదా॥ కవిత్రయముచే రచించబడిన / భారతం తెలుగున ఆది కావ్యం

జీవితంలో సుఖలేశం ఎరుగని / ఆమె దురవస్థ వర్ణనాతీతమైంది.

మీరు చేసే / ప్రసంగం నాకు బోధపడలేదు

ఒకొక్కపుడు విశేషణ జటలు వైభక్తికాలకు ఆశ్రితాలై వుంటాయి.

ఉదా॥ మద్యపానం విరమించిన / తర్వాత అతని ఆరోగ్యం మెరుగైనది

విద్య సంపాదించే / టందుకు అధ్యయనసాయం కావాలి

అతడు మృదంగం వాయించే / టప్పటి అతని శిరశ్చాలన వైఖరి నన్ను ఎంతో ఆకర్షించింది.

వైభక్తిక ఘటిత జటా బంధాలు కారక బంధాలుగాని, విశేషణ బంధాలు గాని కావచ్చు. పై వాక్యాల్లో మొదటి రెండూ కారకబంధాలు. చివరిది విశేషణబంధం.

### 7.2.3. కారక జటలు :

క్రియా కారక ఘటితాలైన కారకవృతం నిర్వహించే జటలు కారక జటలు. ఇ, తు, అక, అ, గా, తే, దే, ఇనా, అక, వర్ణకాంత అసమాసక క్రియలతో ఈ జటలు ఏర్పడతాయి. కారక జట మిగిలిన వాక్య భాగం అని ఏదో ఒక క్రియను వ్యక్త

పరుస్తాయి.

ఉదా॥ ఇ - వైద్యుడు వచ్చి రోగిని పరీక్షించాడు. పాము కరిచి బాలుడు మరణించాడు.

తు - భోజనం చేస్తూ మాటాడడం మంచిది కాదు

అక - మేము ఎవరితోనూ మాటాడక కూర్చున్నాము. వానలు కురవక పంటలు పండవు.

అ - నాకు అన్నం తినబుద్ధి పుట్టలేదు.

గా - ఇంకా సభ జరుగుతుండగా నేను లేచి వచ్చాను.

తే - ఆమె పాట పాడితే రాళ్ళు కరిగిపోతాయి.

దే - బస్సు ఆగనిదేదిగ రాదు. పెద్దమ్మాయి పెళ్ళి కుదరనిదే రెండువ అమ్మాయి పెళ్ళి ఎలా జరుగుతుంది?

ఇనా - నేను ఎంత చెప్పినావాడు నా మాట వినిపించుకోడు

ఆక - దీపాలు వెలిగించాక వారు సభ ప్రారంభించారు.

**కారక ఉపవాక్యాల వలె బహు ప్రకారాలైన కారక జటలు :**

కారక ఉప వాక్యాల వలె బహు ప్రకారాలైన కారక జటలు వున్నాయి అవి ఇవి

అ. సమయ బోధకాలు

ఆ. కారణ వాచకాలు

ఇ. సంకేత బోధకాలు

ఈ. నిమిత్త వాచకాలు

ఉ. ప్రకార వాచకాలు

ఊ. విరోధ వాచకాలు

**అ) సమయ బోధకాలు :**

ఉదా॥ ఆయన రోడ్డు మీద నడుస్తూ తెలివి తప్పి పడిపోయాడు

నేను బజారుకుపోయి కూరగాయలు కొన్నాను.

సూర్యుడు అస్తమించాక మేము ఇంటికి బయలుదేరాము.

**ఆ) కారణ వాచకాలు :**

ఉదా॥ గుండెపోటు వచ్చి అతడు వెంటనే మరణించాడు.

ఆ సంవత్సరం వర్షాలు పడక పంటలు పాడైనవి

నేను వుండగా నీకు ఏమి భయం

**ఇ) సంకేత బోధకాలు :**

ఉదా॥ తీగ లాగితే డొంక అంతా కదులుతుంది

శాంతము లేక సౌఖ్యము లేదు

నిప్పులేనిదే పొగ పుట్టదు.

**ఈ) నిమిత్త వాచకాలు :**

ఉదా॥ ఆ దుష్టుడు ఆ అబలను బలాత్కరించ సాహసం చేశాడు

ఉత్తమ శస్త్ర చికిత్స చేయించుకొన అతడు మదరాసు వెళ్ళాడు.

సూచన : నిమిత్త అర్థంలో "అ" వర్ణ కాంత క్రియా ప్రయోగం కన్న వైభక్తి కోక్తుల ప్రయోగం హెచ్చుగా కనిపిస్తుంది.

**ఉ) ప్రకార వాచకాలు :**

ఉదా॥ ఆయన పాదయాత్ర చేసి యావద్భారత దేశం పర్యటించారు.

వారు మాతో చెప్పక వెళ్ళిపోయినారు.

**ఊ) విరోధవాచకాలు :**

ఉదా॥ తల్లిదండ్రులు అంగీకరించనిదే వాడు తాను ప్రేమించిన అమ్మాయిని పెళ్ళి చేసుకున్నాడు

చింత చచ్చినా పులుపు చావదు

వాడు ఎన్ని విధాల ప్రయత్నించినా ఉద్యోగం లభించలేదు.

## ఆధార గ్రంథాలు :

**1. తెలుగు :**


1. ఆధునిక తెలుగు వ్యాకరణం - ఎన్. శివరామమూర్తి
2. ఆధునిక తెలుగు వెన్నెలకంటి వ్యాకరణం - వెన్నెలకంటి ప్రకాశం
3. ఆధునిక తెలుగు భాషా నిర్మాణం - శివుని రాజేశ్వరి
4. ఆధునిక ప్రామాణికాంధ్ర వ్యాకరణం - వజ్ఝల వేంకటేశ్వర్లు
5. ఆధునిక భాషా శాస్త్రం - వెలమల సిమ్మన్న
6. ఈనాడు భాషా స్వరూపం - బూదరాజు రాధాకృష్ణ

7. తెలుగు దారి - వెల్చేరు నారాయణరావు

8. తెలుగులో వెలుగులు - చేకూరి రామారావు

9. తెలుగు భాషా చరిత్ర (సంపాదకులు) - భద్రిరాజు కృష్ణమూర్తి

10. తెలగు భాషా చరిత్ర - వెలమల సిమ్మన్న

11. తెలుగు భాషా తత్త్వం - కొమర్రాజు లక్ష్మణరావు

12. తెలుగు భాషా శాస్త్రవేత్తలు - వెలమల సిమ్మన్న

13. తెలుగు భాషా స్వరూపం - బూదరాజు రాధాకృష్ణ

14. తెలుగు కావ్యం - చేకూరి రామారావు

15. ప్రౌఢ వ్యాకరణం - బహుజనపల్లి సీతారామయ్య

16. బాల వ్యాకరణం - చిన్నయ సూరి

17. బాల వ్యాకరణం - శాస్త్రీయ వ్యాక్య - వెలమల సిమ్మన్న, గుమ్మా సాంబశివరావు

18. భాషా తపస్వి గిడుగు - వెలమల సిమ్మన్న

19. భాషానువర్తనం - చేకూరి రామారావు

20. వ్యావహారిక భాషా వ్యాకరణం - వడ్లమూడి గోపాలకృష్ణయ్య

21. శబ్ద బ్రహ్మ చిన్నయ సూరి (అముద్రితం) - వెలమల సిమ్మన్న, గుమ్మా సాంబశివరావు

22. సంధి - వెలమల సిమ్మన్న


**2. ఆంగ్లం :**


1. A Grammar of Modern Telugu - Bh. Krishna Murthy
2. Sandhi Balavyakaranam - J. Pratap Reddy.

పాఠం - 8

# తెలుగు భాషా పరిణామం

## విషయసూచిక

8.1. భాష

8.2. ప్రపంచ భాషలు

8.3. భారతీయ భాషలు

8.4. ద్రావిడ భాషలు

8.5. తెలుగు భాష

8.6. తెలుగు భాషా పరిణామం

8.7. లిపి

8.8. శాసనాలు

8.9. కావ్య భాష

8.10. ప్రామాణిక భాష

8.11. మాండలిక భాష

8.12. వ్యావహారిక భాష

## 8.1. భాష :

భాష వాగ్రూప మైంది, భావ ప్రకటన సాధనల్లో భాష అతి ముఖ్యమైంది. అత్యంత శక్తివంతమైంది కూడా. సమాజంలో మానవులు తమ భావాల్ని ఇతరులకు తెలియజేయడానికీ, ఇతరుల భావాల్ని తాము తెలుసుకోవడానికి నిత్యం వ్యవహరించే ఉచ్చారణ సాధనమే భాష ప్రపంచంలో భాష లేని మనవ సమాజం లేదు.

## 8.2. ప్రపంచ భాషలు

ప్రపంచంలోని వివిధ ప్రాంతాల్లో వివిధ జాతులవారు భిన్న భిన్న భాషలు మాట్లాడుతున్నారు. ప్రస్తుతం ప్రపంచ వ్యవహారంలో వున్న భాషలు సుమారు 6,000. ప్రపంచంలోని జనాభా సంఖ్య ఇంచుమించు 720 కోట్లు పైన, ప్రపంచ

భాషలన్నింటినీ భాషావేత్తలు స్థూలంగా నాలుగు రకాలుగా వర్గీకరించారు. 1. వంశానుగుణ వర్గీకరణం లేక జాత్యాశ్రిత వర్గీకరణం (Geneological or Genetic Classification) 2. పదాంశ వర్గీకరణం లేక నిర్మాణాశ్రిత వర్గీకరణం (Morphological or Typological Classification), 3. భౌగోళిక వర్గీకరణం (Geographical Classification), 4. ధ్వనాత్మక వర్గీకరణం (Phonological Classification). ఇందులో వంశానుగుణ వర్గీకరణంలో ప్రముఖంగా "ద్రావిడ భాషలు" చోటు చేసుకున్నాయి.

## 8.3. భారతీయ భాషలు :

భారతదేశంలో 1652 భాషలు వున్నాయి. జనసంఖ్య 121 కోట్లు. మన రాజ్యాంగంలో ఎనిమిదో షెడ్యూల్లో ప్రస్తుతం 22 భాషలు మాత్రమే చోటు చేసుకున్నాయి. వీటినే మనం రాజ్యాంగం గుర్తించిన అధికారభాషలుగా వ్యవహరిస్తున్నాం. భారతీయ భాషల్ని భాషావేత్తలు నాలుగు రకాలుగా వర్గీకరించారు. 1. ఇండో - ఆర్యన్ భాషా కుటుంబం (Indo-aryan Family of Languages), 2. ద్రావిడ భాషా కుటుంబం (Dravidian Family of Languages), 3. ఆస్ట్రోఏషియాటిక్ కుటుంబం (Astro - Asiatic Family of Languages), 4. టిబెట్ - బర్మన్ భాషా కుటుంబం (Tibetion - Barma Family of Langaages). భారతీయ భాషా వర్గీకరణంలో "ద్రావిడ భాషా కుటుంబం" ప్రధానంగా గుర్తించబడింది.

ప్రపంచభాషకుటుంబాల్లోనూ, భారతీయ భాషా కుటుంబాల్లోనూ, భాషా శాస్త్రజ్ఞుల చేత ఒక ప్రత్యేక కుటుంబంగా పరిగణించబడి విశ్వవ్యాప్తిగా వున్న అతి పెద్ద భాషా కుటుంబం "ద్రావిడ భాషా కుటుంబం".

## 8.4. ద్రావిడ భాషలు :

"ద్రావిడ భాషలను" భారత దేశంలో సుమారు 24 కోట్ల మంది వ్యవహరిస్తున్నారు. ముఖ్యంగా దక్షిణ భారత దేశమంతటా ఈ ద్రావిడ భాషలు వ్యాపించి వున్నాయి. దాదాపు మూడు వేల సంవత్సరాల ప్రాచీన సుదీర్ఘ చరిత్ర గల భాషా కుటుంబం "ద్రావిడ భాషా కుటుంబం".

ద్రావిడ భాషలన్నింటికీ మూలమైన మూల ద్రావిడ భాష (Photo Dravidian Language) ఒకటి వుండేదని భాషా శాస్త్రజ్ఞులు ఊహించారు. ఈ భాషకు సంబంధించిన వారు సింధునదీ లోయ ప్రాంతంలో వ్యాపించి వుండేవారిన చారిత్రక పరిశోధకులు భావిస్తున్నారు. ఈ మూలద్రావిడ భాషలు కన్నవారు కానీ, విన్నవారు కానీ ఎవరూ లేరు. ప్రస్తుతం వాడుకలో వున్న ఈ ద్రావిడ భాషల స్వరూప స్వభావాల్ని బట్టి వీటికి మూలమైన భాష ఈ రకంగా వుండ వచ్చుననే ఊహల వల్ల ఈ మూలద్రావిడ భాష పునర్నిర్మితభాష (Reconstructed Language) గా మనం వ్యవహరిస్తున్నాం.

ద్రావిడ భాషల్ని ముఖ్యంగా మూడు ఉప కుటుంబాలుగా విభజించారు. ఈ మూడు ఉప కుటుంబాల నుంచి మరల 23 భాషలుగా విడవడ్డాయి. 1. ఉత్తర ద్రావిడ భాషలు (North Dravidian Languages). ఇవి మూడు. 1. బ్రాహుయి 2. మాల్తో 3. కురుఖ్. 11 మధ్య ద్రావిడ భాషలు (Central dravidian Lan- guages) ఇవి పన్నెండు. 1. తెలుగు, 2. గోండీ, 3. కొండ, 4. పెంగో, 5. మండ, 6. కుయి, 7. కువి, 8. కొలామీ, 9. నాయకీ, 10. పర్జీ, 11. గదలు, 12. ఒల్లారి. 111. దక్షిణ ద్రావిడ భాషలు. ఇవి ఎనిమిది (South Dravidian Languages). 1. తమిళం, 2. మలయాళం, 3. కన్నడం, 4. తుళు, 5. కొడగు, 6. కోత, 7. తొద, 8. బడగ.

పైన చెప్పిన ద్రావిడ భాషలే కాక 2 వేల మంది వ్యవహర్తలున్న బూర్గండి, 4. వేల మంది వ్యవహర్తలున్న ఇరుల, 6 వేల మంది వ్యవహర్తలుగా కొరవ, 9 వేలమంది వ్యవహర్తలుగున్న కురబ, కైకాడి. 15 వేల మంది వ్యవహర్తలున్న యెరువ, 70 వేల మంది వ్యవహర్తలున్న యెరుకల మొదలైన భాషలు నీలగిరి కొండల పరిసర ప్రాంతాల్లో వ్యవహరించబడు తున్నాయని ప్రముఖ భాషా వేత్త డా? ఆంద్రోనోవ్ (Dr. M.S. Andronov) గుర్తించాడు. అంతే కాకధంగర్, ఆవుతె, ఇంది, ఆవె, కసుర, సవర, పొత్తంగా, పోయ మొదలైన భాషలు వ్యహారంలో వున్నాట్లు అనేకమంది భాషా శాస్త్రజ్ఞులు పేర్కొన్నారు. అయితే ఇవి అన్నీ ప్రత్యేక భాషలా? లేక మాండలికాలా? అనే విషయం ఇంకా స్పష్టంగా తేలలేదు. ఉత్తమ పరిశోధనవల్ల ఈ విషయం బయటపడుతుంది.

ఆంధ్రప్రదేశ్ విస్తీర్ణత ఇంచుమించు 2,77,000 చదరపు కిలో మీటర్లు. జన సంఖ్య సుమారు ఎనిమిది కోట్లు. మొత్తం దేశ వ్యాప్తంగా వున్న జనాభాని బట్టి తెలుగు భాష, భారతీయ భాషల్లో ద్వితీయ స్థానాన్నిపొందింది. హిందీ భాష ప్రథమ స్థానాన్ని ఆక్రమించింది. 23 జిల్లాల్ని కలిగిన సువిశాల రాష్ట్రం ఆంధ్రప్రదేశ్, ఆంధ్ర రాష్ట్రానికి ఈశాన్య దిశలో ఒరిస్సా, ఉత్తరాన మధ్య ప్రదేశ్, పశ్చిమాన మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలూ, దక్షిణంలో తమిళనాడు, తూర్పున బంగాళాఖాతం ఎల్లలుగావున్నాయి. ఈ భాషకు ఒరియా, హిందీ, కన్నడం, తమిళం, మహారాష్ట్ర భాషలు పొరుగు భాషలుగా వున్నాయి.

తెలుగు భాషమీద సంస్కృత భాషా ప్రభావం బాగా కన్పిస్తుంది. ఈ భాష సంస్కృతం నుండి పుట్టిందనే వాదన పూర్వం వుండేది. పాశ్చాత్యులు తెలుగు భాషపై విస్తృతంగా విశేషమైన పరిశోధనలుచేసి సంస్కృత భాష నుంచి తెలుగు భాష పుట్టలేదని సోపపత్తి కంగా నిర్ధారించారు. తెలుగు భాషపై అధ్యయనం చేసిన పాశ్చాత్య భాషావేత్తల్లో ఎల్లిస్, రాస్కు, కాల్డ్వెల్, గ్రియర్సన్, స్టెనోకోనో మొదలైన వారు ప్రముఖులు.

మధ్య ద్రావిడ భాషా కుటుంబంలో 12 భాషలు వున్నాయి. ఈ పన్నెండు భాషల్లోనూ తెలుగు భాషదే అగ్రస్థానం. ఈ భాషల్లో తెలుగు భాష ఒక్కటే నాగరిక భాష, మధ్య ద్రావిడ భాషలో ఒక్క తెలుగు భాషలోనే సాహిత్యం, వ్యాకరణాలు, నిఘంటువులు చోటు చేసుకున్నాయి.. నిర్మాణ విశేషాల్ని బాగా పరిశీలిస్తే తెలుగు భాషకు గోండి, మండ, పెంగో, కుయి, కువి మొదలైన మధ్య ద్రావిడ భాషలతో ఎన్నో పోలికలు సుస్పష్టంగా కన్పిస్తున్నాయి. అందుచేతనే నిర్మాణాన్ని బట్టి తెలుగు భాష మధ్య ద్రావిడ భాషా కుటుంబానికి చెందుతుంది.

## 8.5. తెలుగుభాష :

"ఆంధ్రప్రదేశ్" రాష్ట్రాన్ని ఆంధ్ర దేశమనీ, తెలుగు దేశమనీ, తెలుగువాడు అనీ, తెలుగు దేశమనీ వ్యవహరిస్తున్నారు. ఆంధ్ర ప్రదేశ్లోని ప్రజలు మాట్లాడే భాష తెలుగు. తెలుగు భాషను అనేక పేర్లతో పూర్వం పిలిచేవారు. పోర్చుగీసువారు తెలుగువారిని "జెంతియో'' (Gentio) అనీ, తెలుగు భాషను "జెంతూ (Gentoo) అనీ పిలిచేవారు. తమిళ, కన్నడ భాషల్లోని ప్రాచీన గ్రంథాల్లోనూ, శాసనాల్లోనూ వడుగ, వడగ, తెలింగ, తెలుంగు అనే విధంగా పేర్లు కన్పిస్తాయి. విదేశీయులు కొందరు. తెలుగు వాళ్ళను "తెలుగూస్'' అనేవారు. అయితే పూర్వం నుండి తెలుగు భాషకు పర్యాయ పదాలుగా ఆంధ్రం, తెలుగు, తెనుగు పదాలు వాడుకలో / వున్నాయి. ఈ మూడు పదాల్ని నేడు సమానార్ధకాలుగానే వాడుతున్నారు. వీటిలో ఆంధ్ర శబ్దం సంస్కృత పదం. తెలుగు, తెనుగు పదాలు అచ్చ తెలుగు పదాలు. ఈ మూడింటిలో చాలా ప్రాచీనమైన పదం ఆంధ్రం.

## 8.6. తెలుగు భాషా పరిణామం

3000 వేల సంవత్సరాల సుదీర్ఘ చరిత్ర కలిగిన "తెలుగు భాషా చరిత్ర" 7 పరిణామాన్ని నాలుగు రకాలుగా ప్రముఖ భాషావేత్త ఆచార్య భద్రిరాజు కృష్ణమూర్తిగారు వర్గీకరించారు.

1. క్రీ.పూ. 200 - క్రీ.శ. 500, 2. క్రీ.శ. 500-1100, 3. క్రీ.శ. 1100-1400, 4. క్రీ.శ. 1400 - 1900.

## 8.7. లిపి :

తెలుగు దేశంలో అశోకుని పూర్వం నుంచే లిపి ఉంది. ఈ "శాసనలిపి" అశోక శాసనాల లిపికి సన్నిహితంగా వుంది. విమర్శకులు ఈ లిపిని "బ్రాహ్మీలిపి" అని పేర్కొన్నారు. ఈ "బ్రాహ్మీ లిపి" భారతదేశంలో "చిత్రలిపి"తో రూపుదాల్చిందని సర్కనింగ్ హెరీమ్ అభిప్రాయపడ్డాడు. అయితే డేవిడ్ డిరింజర్, జార్జ్ బ్యూలర్ మొదలైనవారు. "బ్రాహ్మీలిపి", "ఈజిప్టు చిత్ర లిపి" నుంచి ఆవిర్భ వించిన పోనీషియస్ లిపి నుంచి పుట్టిందని అభిప్రాయపడ్డారు. ఏది ఏమైనా ఎక్కువ మంది విమర్శకుల అభిప్రాయం ప్రకారం భారతదేశంలోని లిపులన్నీ "బ్రాహ్మీలిపి" నుండి పుట్టినవే, క్షుణ్ణంగా, తులనాత్మకంగా, నిశితంగా పరిశీలిస్తే ఇంచుమించు వెయ్యి సంవత్సరాలకు పైగాగల "లిపి పరిణామచరిత్ర"లో తెలుగు లిపి ధ్వనివిధేయం అనీ, ఉచ్చారణకు అనుగుణమైనదనీ, విస్తృత పరిధి కలదని స్పష్టమవుతుంది.

## 8.8. శాసనాలు :

ధర్మార్థకామమోక్షాల్లో ధర్మం చాలా ముఖ్యమైంది. మనరాజనీతి ప్రకారం రాజు ధర్మ పరిరక్షకుడు. రాజులు, రాణులు, సేనాపతులు దానంచేయడంవల్ల వారికి, వారి ప్రియప్రజలకు కలిగే ప్రయోజనాల్ని తెలిపి, ఏ సమయంలో ఏ దానం ఎలాచేయబడిందో శాసనాలు వివరిస్తాయి. దానశాసనాలు, విజయ శాసనాలు. సాంస్కృతిక, చారిత్రక విషయాలకు గనులు. ఈ శాసనాలు ఆనాటి భాషా స్వరూప ప్రతిబింబాలు. శాసన భాషా పరిణామాన్ని నాలుగు విధాలుగా వర్గీకరించవచ్చు క్రీ.పూ. 200-క్రీ.శ. 1100 మధ్యకాలంలో 269 శిలా తామ్ర శాసనాలు వచ్చాయి. 1100-1399 మధ్య కాలంలో సుమారు 2000 తెలుగు శాసనాలు ప్రచురించబడ్డాయి. 1400 - 1599 మధ్యలో ఇంచుమించు మూడు వందల శాసనాలు వెలువడ్డాయి. 1600-1899 మధ్య కాలంలో కుతుబ్ షాహీల పరిపానలో వచ్చిన శాసనాలు బాగా కన్పిస్తున్నాయి. మొఘల్ వంశీయుల ప్రతినిధుల శాసనాలు ఈ యుగంలో కనబడుతున్నాయి. ఆంగ్లపదాలు ఈ యుగశాసనాల్లో కనబడుతున్నాయి. ఈ కాలపు శాసన భాషకు చారిత్రక ప్రాధాన్యం వుంది. అంతేకాదు తెలుగు భాష ఆధునిక స్వరూపాన్ని ఈ యుగంలోనే సంతరించుకుంది. ఈ శాసనాల వల్ల తెలుగు భాషా పరిణామాన్ని తెలుసుకోవచ్చు.

## 8.9. కావ్య భాష :

తెలుగు సాహిత్యంలో మనకు లభిస్తున్నంత వరకు మొట్టమొదటి గ్రంథం "భారతం". ఈ గ్రంథం సంస్కృత భారతానికి అనువాదం. దాన్ని అనువదించినవాడు నన్నయ, అంటే తొలి తెలుగు అనువాద కవి నన్నయ అన్నమాట. నన్నయ కాలం క్రీ.శ. 1020-1060. నన్నయ, భారతంలోని కొంత భాగాన్ని మాత్రమే రాశాడు. మిగిలిన భాగాన్ని తిక్కన, ఎర్రన పూరించారు. ఈ ముగ్గురిని కవిత్రయమని పిలుస్తారు. కవిత్రయ కాలం 11-14 శతాబ్దాల నడుమ. నన్నయ, తిక్కనకు

మధ్యలో శివ కవులు వున్నారు. కావ్య భాషలో 14-16 శతాబ్దాల నడుమ ఎక్కువ భేదాలు లేవు. అందుచేతనే భాషా శాస్త్రజ్ఞులు క్రీ. శ. 1000 నుంచి 1600 వరకు 'కవిత్రయ భాషా యుగంగా వ్యవహరించారు. కవిత్రయ కావ్య భాషలోని శైలికి అనంతర కావ్య భాషలోని శైలికి చాలా తేడా కన్పిస్తుంది. "తెలుగు భాషా చరిత్ర"లో 1600-1900 మధ్యకాలం పరిణామాత్మకమైంది. ఈ కాలంలో అనేక నూతన సాహితీ ప్రక్రియలు వెలువడ్డాయి. భౌగోళికంగానూ, రాజకీయంగానూ ఈ కాలంలో అనేక మార్పులు చోటు చేసుకున్నాయి. ఈ ప్రభావం కావ్యభాషపై పడింది.

## 8.10. ప్రామాణిక భాష :

11వ శతాబ్ది నుంచి 19వ శతాబ్ది ఆరంభం వరకు గ్రాంధిక భాషకే ఎక్కువ ప్రాముఖ్యం ఇచ్చారు. తర్వాత వ్యావహారిక భాషకు ప్రాధాన్యం ఇచ్చారు. 19,20 శతాబ్దాల్లోని ఆంగ్ల భాషాధ్యయనం, వచన వాఙ్మయ వ్యాప్తి, ఇంకా అనేక కారణాల వల్ల ప్రామాణిక భాష వ్యాప్తిలోకి వచ్చింది. ఈ వ్యాప్తికి కారకులైనవారు ప్రధానంగా గిడుగు రామమూర్తి, గురజాడ అప్పారావుగార్లు. వీరే కాక కథలు, నవలలు, వ్యాసాలు, సాంఘిక నాటకాలు, వార్తాపత్రికలు మొదలైనవి ప్రామాణిక భాషాభివృద్ధికి ఎనలేని కృషిచేశాయి. ఈ పరిణామం హర్షించదగ్గది.

అభివృద్ధి చెందని చిన్నచిన్న భాషా ప్రాంతాల్లో మాండలికాలు వున్నప్పటికీ, నాగరికత, సంస్కృతి, అభివృద్ధి చెందిన భాషా సంఘాల్లో ప్రామాణిక భాషను తప్పనిసరిగా వాడుతున్నారు. చాలా 'ప్రాచీన కాలం నుంచి పాడి పంటలకూ, సిరి సంపదలకూ నిలయమైన గుంటూరు, కృష్ణా, జిల్లాల్లో రాజ్య స్థాపనలు కూడా జరిగాయి. ఆంధ్రప్రదేశ్లో ఈ జిల్లాలకు సంబంధించినవారే కవులు, రచయితలు ఎక్కువగా వున్నారు. వీరు పుంఖాను పుంఖాలుగా తమ రచనల్ని ప్రామాణిక భాషలో రాశారు. రాస్తున్నారు.

ప్రామాణిక భాషలో కూడా కొన్ని ప్రాంతీయ భేదాలు చోటుచేసుకున్నాయి. ఇలా ప్రాంతీయ భేదాలు వున్నప్పటికీ అవి నిత్య వ్యవహారం వల్ల అందరికీ అర్థమవుతూ వుంటాయి. మొత్తం మీద ఆధునిక వచన రచనల్లోనూ, రేడియో, సినిమా, టి.వీ. మొదలైన ప్రజలవ్యవహార సాధనాల్లోనూ, పత్రికా, పరిపాలనా రంగాల్లోనూ, పాఠ్య పుస్తక రచనల్లోనూ, విద్య, వాణిజ్య, సాంస్కృతిక రంగాల్లోనూ, ఒకటేమిటి అన్ని రంగాల్లోనూ గుంటూరు, కృష్ణా, ఉభయగోదావరి జిల్లాల్లోని భాషే వ్యవహరించబడుతుంది. అందుచేత ఈ జిల్లాల్లోని భాష ఆంధ్రప్రదేశ్లో ప్రామాణిక భాషగా వుంది.

భాషా ప్రామాణీకకరణం వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయి. అందులో ముఖ్యమైన ప్రయోజనం భాషకు ఏకరూపత కలుగుతుంది. ఒక్క మాటలో చెప్పాలంటే ఎవరి భాషను ఇతరులు ఎక్కువగా ఆదరిస్తారో, ఎవరి భాషను అధికంగా ఇతరులు అనుసరిస్తారో, అనుకరిస్తారో, ఎవరి భాష అర్థబోధనలో క్లేశకంగా వుండదో, అలాంటి భాష ప్రామాణిక భాష అలాంటి భాష మతానికీ, కులానికీ ప్రాంతీయ భేదాలకూ లోనుకాక అతీత మైనదిగా వుంటుంది. నేడు సమాచార మాధ్యమం వల్ల అంటే రేడియో, టి.వీ. సినిమా, పత్రికలు, ఇంటర్ నెట్ మొదలైన సాధనాలు భాషలకు ఏకరూపతను సాధించి భాషా ప్రామాణీకీకరణకు ఎంతగానో తోడ్పడుతున్నాయి.

ఆంధ్రప్రదేశ్లోనూ బయట కూడా గుంటూరు, కృష్ణా జిల్లాలకు చెందిన వారు ఎక్కువగా దూరదర్శన్లోనూ, రేడియో, సినిమా రంగాల్లోనూ, ఇంకా వివిధ పరిశ్రమల్లోనూ, రచనా రంగంలోరూ. కళారంగాల్లోనూ ఒకటేమిటి అన్ని రంగాల్లోనూ

అధిక సంఖ్యలో వున్నారు. కాబట్టి వీరి భాషను ఇతరులు ఎక్కువగా ఆదరిస్తున్నారు. అనుకరిస్తున్నారు. అంచేత ఈ జిల్లాల్లోని శిష్టుల భాష "ప్రామాణిక భాష'' అయింది.

## 8.1.. మాండలిక భాష :

సమాజంలో సాంఘిక జీవనం భాష వల్లే సాధ్యపడుతుంది. మనిషి మానవ భాషను సహజంగానే నేర్చుకుంటాడు. ఒక వ్యక్తి ఏ భాషా సమాజంలో పుట్టి, పెరిగి, అభివృద్ధి చెందుతాడో ఆ సమాజానికి అనుగుణంగా ఆ భాష అలవడుతుంది. ఆ భాషలోనే తన ప్రతిభా ప్రజ్ఞా పాటవాల్ని చూపిస్తాడు. అయితే ప్రత్యేకమైన అధ్యయనంవల్ల ఇతర భాషల్ని క్షుణ్ణంగా నేర్చుకుంటాడు. సమాజంలో భిన్న సంస్కృతికి చెందిన వారు. భిన్న కులాల, మతాల వారు కలిసి మెలిసి జీవిస్తారు. వీళ్లందరినీ ఒకటిగా చేసి సాంఘిక జీవనంలో సన్నిహితుల్ని చేసేది భాష ఒకటి మాత్రమే.

భాష నిత్యం పరిణామం చెందుతూనే వుంటుంది. భాష సజీవ వ్యవస్థకు చెందింది. కాబట్టి మార్పు అనేది భాషకు సహజం. ప్రాంతీయ, సామాజిక, చారిత్రక, వృత్తి, కాల భేదాల్ని బట్టి ఒకే భాష విభిన్న రకాలుగా వ్యవహరించబడితే, ఆ భాషలో మాండలికాలు ఏర్పడతాయి. ఈ విధమైన మాండలికాలు ప్రపంచ భాషలన్నింటిలోనూ వుంటాయి.

## 8.12. వ్యావహారిక భాష :

వ్యావహారిక భాష అనగానే మనకు గుర్తుకు వచ్చేది గిడుగు రామమూర్తిగారు. సాహితీ వ్యాసంగంలోనూ, నూతన విద్యారంగంలోనూ, గ్రాంథిక భాషను వాడకుండా వ్యావహారిక భాషను వాడాలన్న మహోద్యమానికి తమ జీవితాన్ని అంకితం చేసిన ధన్యజీవి గిడుగువారు. వాడుక భాషోద్యమానికి సారథ్యం వహించిన మహానుభావుడు ఆయన. ప్రారంభంలో రామమూర్తి గారు సంప్రదాయ పండితులతో, గ్రాంథిక భాషావాదులతో ఎన్నో తగాదాలుపడ్డారు. అవమానాలు భరించారు. వాడుక భాషలోనే ప్రజల వ్యవహారాలన్నీ జరగాలనేది గిడుగువారి లక్ష్యం. చివరకు రామమూర్తిగారు తాను అనుకున్న పని చేసి విజయం సాధించారు. ప్రముఖుల మన్ననల్ని ప్రశంసల్ని అందుకున్నారు. అందరితో 'శభాష్' అనిపించుకున్నారు. గిడుగువారు 'పిడుగు' అయ్యారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నియమించిన పింగళి లక్ష్మీకాంతం కమిటీవల్ల, ఆంధ్ర విశ్వకళాపరిషత్ నియమించిన ఎమ్.ఆర్. అప్పారావు కమిటీవల్ల, వేంకటేశ్వర విశ్వవిద్యాలయం వారి ప్రాచ్యభాషా పండిత పరిషత్వల్ల, తెలుగు పత్రికలవల్ల, ఆకాశవాణి వల్ల, సినిమా రంగంవల్ల. అనేక అభ్యుదయ సంఘాలవల్ల, నేడు అన్ని రంగాల్లోనూ, అన్ని విశ్వవిద్యాలయాల్లోనూ, చివరకు చిన్న పిల్లల వాచకాల రచనల్లోనూ వ్యావహారిక భాష బాగా చోటు చేసుకుంది. ఇంతటి విజయానికి మూల స్తంభమైన వ్యావహారిక భాషోద్యమకర్త మహామేధావి గిడుగు రామమూర్తి పంతులుగారు చిరస్మరణీయులు.

ఆధునిక తెలుగు కోసం నిరంతరం కృషి చేసిన మహనీయులు గిడుగు రామమూర్తి వ్యావహారిక భాషా గొప్పతనాన్ని గూర్చి గిడుగువారు చెపుతూ....

"స్వభాష స్వగృహం వంటిది'. స్వేచ్ఛగా మనము మన ఇంటిలో వున్న ప్రతి వస్తువు ఎక్కడ ఏ మూల వున్నదో చీకటి లోనైనా తెలుసుకోగలిగినట్లే స్వభాషలో మన అభిప్రాయములు మన ఊహలు స్వేచ్ఛగా తెలియజేయగలము''.

అని వెల్లడించారు. వ్యావహారిక భాష అపరిమిత ప్రయోజనం కలది. నవ్య సాహిత్యం లేకుంటే లోక సంగ్రహం జరగదు. లోకం వృద్ధి పొందదు. ఉత్సాహం తో పనిచేయండి విజయం తప్పదని ఉద్యమాన్ని నడిపిన మహామనిషి ఆదర్శమూర్తి గిడుగు రామమూర్తి పంతులుగారు.

విద్యాలయాల్లో వ్యావహారిక భాషను బోధనా భాషగా చేయాలనే గిడుగువారి ప్రధాన లక్ష్యం ఆయన జీవితకాలంలో నెరవేరలేదు. మరో వారం రోజుల్లో చనిపోతారు అనగా 1940 జనవరి 15వ తేది సాయంత్రం 5 గంటలకు మద్రాసులోని 'ప్రజామిత్ర' కార్యాలయంలో పత్రికా రచయితల్ని సమావేశపరచి గిడుగువారు తమ చివరి సందేశాన్ని తెలియజేశారు. ఈ సభకు తాపీ ధర్మారావు, న్యాపతి నారాయణమూర్తి లాంటి ప్రముఖ పత్రికా సంపాదకులు హాజరయ్యారు. ఆ సభలో విశ్వవిద్యాలయాల వారి చేత, వ్యావహారిక భాషను అంగీకరింపజేసే బాధ్యతను, గిడుగు వారు పత్రికా ప్రతినిధులకు అప్పచెప్పారు. ఈ సభలో రామమూర్తి గారు సుమారు రెండు గంటలపాటు, తక్కువ స్వరంతో ఉపన్య సించారు. తాను ప్రారంభించిన వ్యావహారిక ఉద్యమం ఫలితాన్ని తన జీవితకాలం లో తాను చూడలేకపోతున్నానని విచారాన్ని వ్యక్తం చేశారు.

'ప్రజామిత్ర' ఆఫీసులో 15-1-1940లో తెలుగు లోకానికి 'తుది విన్నపం' చేశారు గిడుగు వారు.

"యూనివర్సిటీలున్ను ప్రభుత్వ విద్యాశాఖ వారున్ను మాత్రం ఇంకా అనుగ్రహించలేదు. 25 సంవత్సరములు క్రిందట ఈ రెండు సంస్థల వారున్ను, వాడుక భాష గ్రహించవలెనని చూచినప్పుడు నా వాదం తెలుగువారు గ్రహించలేకపోవడం చేతను, అలజడి ఎక్కువయింది. అందుచేత ఆ సంస్థలు వారు దానిని గ్రహించలేదు. ఇప్పుడు తెలుగువారు నా వాదం గ్రహించినారు కనుక ఆ సంస్థల వారు గ్రహించి ఆమోదించేట్లున్ను, ఆచరణలో పెట్టేటట్లున్ను చేయవలసిన భారం మీది. ఆ పని మీకు అప్పగించి నేను విరమిస్తున్నాను - 'సెలవు'"

అని చివరి ఉపన్యాసం ఇచ్చారు.

ఈ సభకు హాజరైన సుప్రసిద్ధ పత్రికా సంపాదకులు వ్యావహారిక భాషావాద లక్ష్యాల్ని నూటికి నూరుపాళ్లు విజయవంతం అయ్యేలా చూస్తామని, అంతేకాక దీని కోసం తమ శక్తియుక్తుల్ని, వినియోగించి కృషి చేస్తామని గిడుగు రామమూర్తి గారికి హామీ ఇస్తూ ఒక శపథం చేశారు. అయినప్పటికీ 30 సంవత్సరాల తర్వాత అంటే 1973 సంవత్సరం నాటికి పూర్తిగా ఆంధ్రప్రదేశ్లో అన్ని రంగాల్లో వ్యావహారిక భాష వాడడం జరిగింది. 1973 నాటికి అన్ని విశ్వవిద్యాలయాలు వ్యావహారిక భాషను విద్యార్థులు వుపయోగించవచ్చునని తీర్మానించడంతో గిడుగువారు లక్ష్యం సంపూర్ణంగా నెరవేరింది. గిడుగువారు సత్యాన్వేషిగా, వాక్యుద్ధాలు చేశారే తప్ప ఆయనకు శత్రువులు ఎవ్వరూ లేరు. ఆయన అందరికీ మంచి మిత్రులు, ఆయన అజాతశత్రువు. సహృదయ సార్వభౌముడు, ఆదర్శమూర్తి.

1955లో మద్రాస్ విశ్వవిద్యాలయంలో 'తెలుగు బోర్డు ఆఫ్ స్టడీస్' వారు వ్యావహారిక భాషా పదప్రయోగాల్ని అంగీకరించారు. 1965 వరకూ ఆంధ్రప్రదేశ్లోని విశ్వవిద్యాలయాలు వ్యావహారిక భాషవైపు చూడనైనా లేదు. ఇది విచారించదగ్గ విషయం. 1965లోనే విశ్వవిద్యాలయ పాఠ్యగ్రంథాల్లోని శైలి వ్యావహారిక భాషలో వుండవచ్చునని భద్రిరాజు కృష్ణమూర్తి గారు అభిప్రాయపడ్డారు. ఈ విషయంలో ఏకాభిప్రాయం కోసం పింగళి లక్ష్మీకాంతం గారి అధ్యక్షతన ఒక సమావేశం జరిగింది. రాను రాను వ్యావహారిక భాష అన్ని రంగాల్లోను చోటు చేసుకుంది. పి. హెచ్.డి. చేసే విద్యార్థులు తమ పరిశోధనా గ్రంథాల్ని వ్యావహారిక భాషలో రాయడానికి శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం వారు 1969లో అనుమతించారు. 1973లో ఆంధ్ర

విశ్వకళాపరిషత్వారు వ్యావహారిక భాషను ఆమోదించారు. వ్యావహారిక భాషను ఆమోదించే విషయంలో ఆంధ్రప్రదేశ్లోని విశ్వవిద్యాలయాలకు 1955వ సంవత్సరంలో మద్రాస్ విశ్వవిద్యాలయం ఆదర్శంగా నిలిచింది. 1911 లో గిడుగు రామమూర్తిగారు ప్రారంభించిన వ్యావహారిక భాషోద్యమం 1973 నాటికి విజయవంతమైంది. రాష్ట్ర ప్రభుత్వమూ, రాష్ట్రంలోని వివిధ విశ్వవిద్యాలయాల కృషి వల్ల మహోద్యమంగా నడిచిన వ్యావహారిక భాషా వివాదానికి 1973 నాటికి తెరపడింది. సనాతన పండితులు, సంప్రదాయ వాదులు, గ్రాంథిక భాషావాదులు ఇక్కడ ఒక విషయం గుర్తుంచుకోవాలి. మార్పును ఎవరు వ్యతిరేకించినా, ఎందరు వ్యతిరేకించినా, కాలప్రవాహాన్ని, భాషా ప్రవాహాన్ని ఎవరూ ఆపలేరు. ఆపడం ఎవరి తరమూ కాదు. గ్రాంథిక భాషావాదులు అజ్ఞానంతో వాదించారు. అది కేవలం "పిడివాదం'" మాత్రమే. అంచేతనే వారి వాదం కాలప్రవాహంలో కొట్టుకుపోయింది. వాళ్లుకూడా తమ వాదం తప్పు అని తెలుసుకొని తలవంచు కున్నారు. చివరకు పశ్చాత్తాప పడ్డారు కూడా.

అనువాద ఆది కవి నన్నయ మొదలుకొని, నేటి వరకు వచ్చిన తెలుగు సాహిత్య భాషలో క్రమ పరిణామ వికాసాన్ని జాగ్రత్తగా విశ్లేషిస్తే మనకు ఒక విషయం చాలా స్పష్టంగా తెలుస్తుంది. ప్రజలు నిత్యం వ్యవహారాల్లో మాట్లాడుకొనే భాషకు భిన్నంగా దీర్ఘ సమాసాల్తో సంస్కృత పదభూయిష్టంగా తెలుగుభాష ప్రారంభమైంది. మన కావ్యాల్లో కఠినమైన గ్రాంథికభాష చోటుచేసుకుంది. ఒక్క మాటలో చెప్పాలంటే "గొడ్డు గ్రాంథిక భాష" కావ్యాల్లో వుంది. ఇలాంటి గ్రాంథిక భాష క్రమక్రమంగా సరళ గ్రాంథిక భాషగా మారింది. తర్వాత ప్రజలు నిత్యం మాటలాడుతున్న వ్యావహారిక భాష చోటుచేసుకుంది. మొదట వ్యావహారిక భాషను వ్యతిరేకించిన మహామహాపండితులు క్రమక్రమంగా నిజాన్ని నిలకడగా తెలుసుకొని వ్యావహారిక భాషను సమర్థించడం ప్రారంభించారు. అంతేకాకుండా వ్యావహారిక భాషలో రచనలు చేయడం మొదలుపెట్టారు. ఇలా రచనలు చేసినవారిలో మొదట చెప్పుకోదగ్గవారు కందుకూరి వీరేశలింగంగారు. వీరు 1918 నాటికి గిడుగువారితో అనేక విషయాలు కూలంకషంగా చర్చించి వారి వాదాన్ని ఆమోదించారు. 1919 ఫిబ్రవరి 28వ తేదీన "వర్తమానాంధ్ర భాషా ప్రవర్తక సమాజానికి అధ్యక్షస్థానం స్వీకరించారు. ఇదేవిధంగా చెళ్ళపిళ్ళ వెంకటశాస్త్రి), అక్కిరాజు ఉమాకాన్తం, మొదలైనవారు. వ్యావహారిక భాషను సపోర్టు చేయడమే కాక రచనలు కూడా చేసి ఉద్యమానికి ఊపిరి పోశారు. తాపీ ధర్మారావు గారు గిడుగువారి శిష్యుడు. ప్రారంభంలో ధర్మారావు గారు గ్రాంథికవాది. గిడుగు ప్రభావంతో వ్యావహారికవాది అయ్యారు. వ్యావహారిక భాషలో రచనలు చేశారు. "జనవాణి" పత్రికలో వ్యావహారిక భాషను మొట్టమొదట ప్రవేశపెట్టిన ఘనత తాపీ ధర్మారావు గారికి దక్కుతుంది. గుడిపాటి వెంకటాచలం, విశ్వనాథ సత్యనారాయణ, అడివి బాపిరాజు, కృష్ణశాస్త్రి, చింతా దీక్షితులు, మల్లాది రామకృష్ణశాస్త్రి, శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి, గోపీచంద్ మొదలైనవారు నవలలు, కథలు వ్యాసాలు, చక్కని వ్యావహారిక భాషలో రాసి ప్రజల మెప్పును పొందారు.

గురజాడ అప్పారావు గారు మాండలికభాషలో "కన్యాశుల్కం" అనే అద్భుతమైన నాటకాన్ని రాశారు. తెలుగు సాహిత్యంలో ఈ నాటకం పెద్ద సంచలనం రేకెత్తించింది. ఈ నాటకంపై విమర్శలు, ప్రతి విమర్శలు వచ్చాయి. ఏది ఏమైనా ప్రజల వాడుక భాషలో నాటకం రాసిన గురజాడ అప్పారావు గారు మొనగాడు. విజయనగరం జిల్లా మాండలికం ఈ నాటకంలో చోటుచేసుకుంది. "ముత్యాల సరాలు" "నీలగిరి పాటలు" లాంటి రచనల ద్వారా అప్పారావు గారు కవిత్వ భాషగా కూడా వ్యావహారిక భాషకు వున్న శక్తిని నిరూపించారు.

నండూరి సుబ్బారావు గారు అచ్చమైన గ్రామీణ వాతావరణంతో, చక్కని గ్రామీణ భాషలో "ఎంకి పాటలు" రాశారు. ఈ పాటలు కూడా సాహిత్య లోకంలో పెద్ద వివాదాన్ని రేకెత్తించాయి. సుబ్బారావుగారు ఉదాత్త ప్రణయ కావ్యాన్ని అందరికీ

అర్థమయ్యేవిధంగా బ్రహ్మాండంగా రాశారు. మాధవపెద్ది గోఖలే, పోరంకి దక్షిణామూర్తి, రావిశాస్త్రి మొదలైనవారు మాండలిక భాషలో నవలలు, కథలు రాసి, వాటికి సాహిత్య భాషా గౌరవాన్ని తెచ్చిపెట్టారు.

వివిధ విశ్వవిద్యాలయాలు వ్యావహారిక భాషను చాలా ఆలస్యంగా ఆమోదించాయి. అదైనా చాలాబాధతో. దీనికి కారణం ఆయా విశ్వవిద్యాలయాల్లో ఇప్పటికీ చక్కని వ్యావహారిక భాషలో రాయలేని ఆచార్యులు వున్నారు. ఇది విచారించదగ్గ విషయం. గిడుగువారి ప్రభావంతో పత్రికలు, రేడియోలు, సినిమాలు వ్యావహారిక భాషను ఆమోదించాయి. చాలా మంది రచయితలు, కవులు, తమ గ్రంథాల్ని వ్యావహారిక భాషలో రాశారు. ఒక్క మాటలో చెప్పాలంటే విశ్వవిద్యాలయాల్లో బోధనా భాష కావడానికి ముందే, వ్యావహారిక భాష తెలుగులో సాహిత్యభాషగా స్థిరపడింది. ఇది హర్షించదగ్గ విషయం.

**ఆధార గ్రంథాలు :**

**1. తెలుగు :**

1. ఆధునిక తెలుగు వ్యాకరణం - ఎన్. శివరామమూర్తి
2. ఆధునిక తెలుగు వెన్నెలకంటి వ్యాకరణం - వెన్నెలకంటి ప్రకాశం
3. ఆధునిక తెలుగు భాషా నిర్మాణం - శివుని రాజేశ్వరి
4. ఆధునిక ప్రామాణికాంధ్ర వ్యాకరణం - వజ్ఝల వేంకటేశ్వర్లు
5. ఆధునిక భాషా శాస్త్రం - వెలమల సిమ్మన్న
6. ఈనాడు భాషా స్వరూపం - బూదరాజు రాధాకృష్ణ
7. తెలుగు దారి - వెల్చేరు నారాయణరావు
8. తెలుగులో వెలుగులు - చేకూరి రామారావు
9. తెలుగు భాషా చరిత్ర (సంపాదకులు) - భద్రిరాజు కృష్ణమూర్తి
10. తెలగు భాషా చరిత్ర - వెలమల సిమ్మన్న
11. తెలుగు భాషా తత్త్వం - కొమర్రాజు లక్ష్మణరావు
12. తెలుగు భాషా శాస్త్రవేత్తలు - వెలమల సిమ్మన్న
13. తెలుగు భాషా స్వరూపం - బూదరాజు రాధాకృష్ణ
14. తెలుగు కావ్యం -చేకూరి రామారావు
15. ప్రౌఢ వ్యాకరణం - బహుజనపల్లి సీతారామయ్య
16. బాల వ్యాకరణం -చిన్నయ సూరి

17. బాల వ్యాకరణం - శాస్త్రీయ వ్యాఖ్య - వెలమల సిమ్మన్న, గుమ్మా సాంబశివరావు

18. భాషా తపస్వి గిడుగు - వెలమల సిమ్మన్న

19. భాషానువర్తనం - చేకూరి రామారావు

20. వ్యావహారిక భాషా వ్యాకరణం - వడ్లమూడి గోపాలకృష్ణయ్య

21. శబ్ద బ్రహ్మ చిన్నయ సూరి (అముద్రితం) - వెలమల సిమ్మన్న, గుమ్మా సాంబశివరావు

22. సంధి - వెలమల సిమ్మన్న

**2. ఆంగ్లం :**

1. A Grammar of Modern Telugu - Bh. Krishna Murthy
2. Sandhi Balavyakaranam - J. Pratap Reddy.

పాఠం - 9

# తెలుగు భాష ఆధునికీకరణ - ఆవశ్యకత పద్ధతులు - సమస్యలు

## విషయసూచిక

9.1. తెలుగు భాష

9.2. తెలుగు భాష ఆధునికీకరణ

## 9.1. తెలుగు భాష :

ఒక జాతి ఒక సమాజం తరతరాలుగా ప్రోదిచేసుకొని నిరంతరం అభివృద్ధి పరచుకొన్న అత్యంత విలువైన సామాజిక, సాంస్కృతిక, భౌతిక వారసత్వ సంపద భాష. శూరుల పుట్టుక, దేవతల పుట్టుక, ఏరుల పుట్టుక తెలుసుకోవడం ఎవడి తరమూ కాదన్నది మహాభారతం సూక్తి. అలాగే భాషల జన్మ రహస్యం కూడా అంతే.

ఏ భాషైనా ప్రజల సామూహిక అవసరాలకోసం మాత్రమే పుడుతుంది. సృష్టి ఆదినుంచి వున్న భాష జానపద సాహిత్యంలో వుంది. మనజాతి జీవనాడులన్నీ జానపదుల్లో చక్కగా ఒదిగిపోయాయి. ఈ జానపద సాహిత్యం లిఖిత సాహిత్యం కంటే ముందే వుంది. జానపద సాహిత్యంలోని భాష నూటికి నూరుపాళ్ళు వ్యావహారిక భాష. అంటే మనిషి పుట్టినాదిగా మొట్టమొదటిగా మాటలాడిన భాష వ్యావహారికి భాష అన్నమాట. ఈ మాండలిక భాషే అసలు సిసలైన ప్రజలు వాడుక భాష. సహజ సిద్ధమైన భాషకు మాండలికాలు ప్రథమ సోపానాలు. భాషకు మూల స్థంబాలు మాండలికాలు. అదే నిజమైన తెలుగు భాష. అదే సజీవమైన తెలుగు భాష. అదే జీవద్భాషకూడా.

ప్రజల వాడుక భాషను అంటే వ్యవహారిక భాషను ప్రారంభం నుంచి పండితులు చిన్న చూపు చూశారు. చిన్నచూపు కాదు అసలు చూపేలేదు. ఒక్క మాటలో చెప్పాలంటే ఆనాటి పండితులకు భాషా దృష్టి, భాషా అవగాహన, భాషానైపుణ్యాలు లేవు. అంచేత ప్రజల వాడుక భాషను గౌరవించలేకపోయారు. ఆ భాషా రుచిని ఆహ్వానించలేకపోయారు. మీదుమిక్కిలి తిరస్కరించారుకూడా. సంస్కృతానికి పెద్దపీటవేశారు. భాష ప్రజలదే కాని పండితులదు కాదు. ఈ విషయాన్ని పండితులు గుర్తించలేకపోయారు. కొందరు పండితులకు తమ తప్పు దిద్దుకునే సంస్కారం కూడా లేదు. సంస్కృత నాటకాల్లో పండితులు ఉన్నత పాత్రలకు "సంస్కృతం", నీచ పాత్రలకు అప్పటి ప్రజల భాష అయిన "ప్రాకృతం" వాడారు. ఇక్కడ మనం నిశితంగా పరిశోధన చేస్తే తేలిన సారాంశం ఏమంటే ప్రజల వాడుక భాష అయిన "ప్రాకృత భాష"ను పండితులు అసలు పట్టించుకోలేదు. అంతే కాదు అనాగరికభాషగా గుర్తించి, ముద్రవేసి, మరీ కావాలని ప్రజల భాషను అవమానించారు. అంటే మొత్తం మీద ప్రజల భాషను సంస్కృతపండితులు లెక్కలోకి తీసుకోలేదన్న మాట. సంస్కృతంలో సంప్రదాయ పద్ధతిలో, సనాతన రచనా విధానంలో పండిత భాషలో రాసిన వారినే నాటక కర్తగా, కవిగా, రచయితగా గుర్తించారు. అంటే సంస్కృత పండితులచే "ప్రాకృతం" అనాగరిక భాషగా గుర్తింపు పొందింది. ఇక్కడ ప్రజల వాడుక భాషకు అన్యాయం జరిగిందన్నమాట. ప్రజల భాషకు పట్టంకట్టలేకపోయారు పండితులు. ఆనాదినుంచి ప్రజల వాడుక భాషకు న్యాయం జరగలేదన్నమాట.

కోట్లాది ప్రజలు వాడుక భాషలో తెలుగులో మాట్లాడుతున్నా, జానపదుల్లో దేశీయ సాహిత్యం ఎంతగా అభివృద్ధి చెందినా, అది అంతా పండితుల దృష్టిలో అశాస్త్రీయం. సహజమైన ఆ పదజాలమంతా పండితుల దృష్టిలో చిల్లి గవ్వకు కూడా పనికిరాలేదు. వాళ్ళదృష్టిలో, సంస్కృత పదాలన్నీ శాస్త్రీయం. పరమ పవిత్రం కూడా.. కాని ప్రజల భాషకు ఆ గౌరవం లేదు. దేశి పదాలను దేశీ సాహిత్యాన్ని గాసట బాసటగా భావించిన పండితులు ఆ పద సాహిత్యాన్ని, దేశి సాహిత్యాన్ని నామరూపాలు లేకుండా చేశారు.

భారతదేశంలో మొట్టమొదటి సారిగా బుద్ధుడు "పాళీ" భాషలో బౌద్ధ ధర్మాన్ని ప్రచారం చేశాడు. "పాళీ" భాష సంస్కృత భాషలో ఒక మాండలిక వ్యావహారిక భాష. బుద్ధుడు 2500 సంవత్సరాల క్రితమే ధర్మ ప్రచారాన్ని బోధనలను ఆనాటి ప్రజల వాడుక భాష అయిన పాళీ, ప్రాకృత, భాషల్లో సాగించాడు. "భిక్షువులారా! మీరు వెళ్ళిన ప్రాంతంలోని ప్రజల భాష ఏదైతే వుందో ఆ భాషలోనే నా ధర్మాన్ని ప్రబోధించండి. తమ తమ భాషల్లోనే ప్రజలు ధర్మాన్ని వినాలి. మీకు అలాంటి అనుమతిని ఇస్తున్నాను. ప్రజల భాషే ధర్మ భాష. ప్రజల భాషే ప్రామాణిక భాష" అని బుద్ధుడు విడమర్చి చెప్పాడు.

ఎప్పుడైతే ప్రజల వాడుక భాషలో అన్నీ సజావుగా జరుగుతాయో అప్పుడే ప్రజాస్వామ్యం వర్ధిల్లుతుంది. ప్రజలకు న్యాయం జరుగుతుంది.. ఇదే విషయాన్ని బుద్ధుడు ఎన్నో సార్లు జనాలకు అర్థమయ్యే ప్రజల భాషలో సందేశం ఇచ్చాడు. సామాన్య ప్రజలందరూ బుద్ధుడి బోధనలను ఆదరించారు. ఇదే ప్రజలకు కావాలి. అటువంటి నాయకుడే ప్రజలకు కావాలి. నేడు ఇలాంటి ప్రజానాయకులు కరువయ్యారు. బుద్ధుడు, బౌద్ధ మత ప్రచారానికి ఆంధ్ర, తమిళాది ప్రాంతీయ వాడుక భాషలను వాడాలని హుకుం జారీచేశాడు. ప్రజల భాషకు వున్న బలం అది. ప్రజల భాషే ప్రజా నాయకులకు శరణ్యం. ఈ విషయాన్ని పాలకులు, అధికారులు తెలుసుకోవాలి.

బౌద్ధం భారతదేశం నుంచి కొన్ని కారణాలవల్ల దూరమయింది. క్రమ క్రమంగా పండిత భాష అయిన సంస్కృతానికే ఎక్కువ ప్రాముఖ్యం ఇచ్చారు పెద్దలు. అంటే ప్రజల భాషకు సంస్కృత పండితులు తిలోదకాలు ఇచ్చారన్నమాట. బుద్ధుడు మనిషిని ప్రేమించాడు. ప్రజల వాడుక భాషను ప్రేమించాడు. అందుకే బుద్ధుడు ప్రజల అభిమానాన్ని చాలా వేగంగా పొందగలిగాడు. ప్రజలకు అతి చేరువయ్యాడు. అందుకే గురజాడ "ఈ దేశంలోంచి బౌద్ధమతం మటుమాయమై పోయినప్పుడే ఈ దేశం మతవిషయకంగా ఆత్మహత్య చేసుకుంది" అని నొక్కి వక్కాణించారు.

తెలుగు భాషకు సంబంధించినంతవరకు ఆశ్చర్య కరమైన విషయం ఏమంటే 11వ శతాబ్దానికి ముందున్న భాషా సాహిత్యాలకు రాతలో సాక్ష్యం లభించక పోవడం. దీనిబట్టి తెలుగు వారు పరిశోధనలో ఎంతవెనకబడి వున్నారో తేటతెల్లమవుతుంది. ఈ విషయంలో ఇతర భాషలవారికన్నా మనం చాలా వెనకబడి వున్నాం. పండితార్భాటమే తప్ప పరిశోధన సున్న. నిశితంగా పరిశీలిస్తే అంతా డొల్ల తనమే.

తెలుగు సాహిత్యంలో నన్నయకు ముందు ఎంతోమంది కవులు వున్నారు. కాబట్టి నన్నయ ఆదికవి కాదు. - ఎన్నో పరిశోధనలు చేసి అసలు విషయాన్ని విమర్శకులు బయటపెట్టారు. నన్నయ తొలి తెలుగు అనువాద కవి మాత్రమే. ఆయన రాసిన "మహాభారతం" స్వతంత్ర కావ్యం కాదు. వ్యాసుడు సంస్కృతంలో రాసిన భారతాన్ని నన్నయ స్వేచ్ఛగా అనువాదం చేశాడు. ప్రముఖుల మెప్పును పొందాడు.

నన్నయ, నాటి ప్రజల భాషలో అంటే వాడుక భాషలో భారతాన్ని అనువదించలేకపోయాడు. ఆకాలంలో ప్రజల వాడుక భాషలో రాయలేకపోవడానికి మనం కారణాలు ఊహించలేనివి కాదు. ఇప్పటి రోజుల్లో ఆంగ్లమే తప్ప తెలుగు వాడకపోవటానికి ఏ ప్రభావ వ్యామోహాలు కారణాలు అవుతున్నాయో. అవే ఆనాడు తెలుగు భాషకు ఆటంకం కలిగించాయి. ప్రజల భాషకు ఆదినుంచి న్యాయం జరగడంలేదు.

నన్నయ తన గ్రంథంలో ఉపయోగించిన భాష ఎక్కువగా సంస్కృతం లేదా సంస్కృత సమాన తెలుగు భాష. అంటే నన్నయ భారతం ప్రజల భాషకు దూరం అయిందన్న మాట. సామాన్య జనాలకు, భారతం అర్థం కాదన్న మాట. కేవలం పండితులకోసమే భారతాన్ని నన్నయ అనువదించాడన్నమాట. ఇది వున్నమాట. అందరూ అన్నమాట. ఒక్క వాక్యంలో చెప్పాలంటే నన్నయ భారతం తెలుగు లిపిలో వుందికానీ అసలు సిసలు అయిన అచ్చమైన ప్రజల వాడుక భాషలో లేదు. మొత్తం మీద తేలిన సారాంశం ఏమంటే పండితుల కోసం మాత్రమే నన్నయ భారతాన్ని అనువదించాడు. ఈ విషయాన్ని పరిశోధకులు, విమర్శకులు ఎప్పుడో తేల్చి చెప్పారు. ఇందులో దాపరికం లేదు. అసలు విషయం ఏమంటే ఆకాలంలో సంస్కృత భాషలో కానీ లేదా సంస్కృత సమానమైన భాషలో రాసిన వారికే కవిగా గుర్తింపు వుండేది. అంతే కాదు రాజాశ్రయాలు, సన్మానాలు, బిరుదులు, అగ్రహారాలు, వగైరాలు వుండేవి. అందువల్ల కవులు ప్రజల వాడుక భాషకు తిలోదకాలు ఇచ్చి పండితుల భాషవైపు క్యూ కట్టారు. అలా ప్రజల భాషఅయిన తెలుగు భాషకు వేల సంవత్సరాలనుంచే అన్యాయం జరగుతూనే వుంది. ఇదినగ్న సత్యం.

ఒక గొప్ప కావ్యం అనువదించడానికి సంబంధించినంత భాష, నన్నయకు లభ్యమైందంటే అంతకు ముందు ఎన్నో వందల సంవత్సరాల నుంచి ఆభాష వుండాలి కదా! ఈ విషయాల్ని చాలాలోతుగా పరిశోధించాలి. రాజ రాజ నరేంద్రుడు తన ఆస్థానంలో అప్పటికే గొప్పరచనా విశారుదులైన కవులు వున్నారని చెప్పుకున్నాడు. అంటే నన్నయకు ముందు కవులు వున్నారన్నమాట అయితే ఆయా కవుల గ్రంథాలు అనేక కారణాలవల్ల కాలగర్భంలో కలిసిపోయాయి. ఎవ్వరికీ కన్పించకుండా, అందుబాటులో లేకుండా పోయాయి. పాత గ్రంథాలు కన్పించకపోవడానికి ఎన్నో కారణాలు వున్నాయి. ఏది ఏమైన నన్నయ పేరు మీద రాసిన “మహాభారతం” ఒక్కటే దొరికింది. అందుకే నన్నయే మొదటి అనువాద కవి అని విమర్శకులు అన్నారు. మహాభారతమే మొదటి గ్రంథం అన్నారు. ఇందులో ఏమాత్రం నిజం లేదు. నన్నయకు ముందు ఎందరో కవులు వున్నారు. ఎన్నో గ్రంథాలు వున్నాయి. నన్నయను “ఆదికవి” అనడంతో ఆయనకు కొన్ని వందల సంవత్సరాల ముందున్న కవుల చరిత్రకు మనం తెరవేసిన వారం అవుతాం. కాబట్టి నూటికి నూరుపాళ్ళు నన్నయను “ఆదికవి” అనడం తప్పువాదన. నన్నయకు మన పండితులు “ఆదికవి” బిరుదును తగిలించారు. వాళ్ళ అజ్ఞానమే తెలుగు భాషకు పెద్ద తలనొప్పి అయింది.

11వ శతాబ్దంలో నన్నయ భారతాన్ని చిక్కగా చక్కగా నైపుణ్యంగా రాశాడంటే అతనికి ముందు ఎన్నో వందల సంవత్సరాల భాషా సాహిత్యాలు వున్నాయి. ఇందుకు ఉదాహరణగా రాజ రాజ నరేంద్రుడు జరిపిన సాహిత్య సభలను ప్రస్తావిస్తూ నన్నయ భారతరచనకు తానే పొందుపరిచిన “అవతారిక” మనకు మంచి నిదర్శనం.

సంస్కృతంలో అలంకార శాస్త్ర గ్రంథాలు “గిలక” కలిగిన 50 మంది తెలుగు పండితులను నన్నయ ప్రస్తావించాడు. అంతే కాదు తనకుతానై నిర్వహించిన “సకల సూరి సభల” గూర్చి మన అందరికీ తెలిసిందే. నన్నయ కాలంలో విద్యా గోష్ఠులు జరిగే పండిత సభలున్నాయనీ, ఆ సభల్లో వివిధ రంగాల్లో ప్రతిభావంతులైనవారు ఎంతోమంది పాల్గొన్నారని నన్నయ చెప్పడం మనకు గుర్తు వుందికదా! వీళ్ళందరూ గొప్ప పండితులే. మంచికవులే.

నన్నయ సంస్కృతకవులైన వాల్మీకిని, వ్యాసుడిని భారతరచనలో తలచుకున్నాడు. తెలుగు కవుల పేర్లు నన్నయ ప్రాస్తావించలేదు. అలాగని కవులు లేరని కాదుకదా! నన్నయ తానే రాసుకొన్నట్లు "బహుభాషల బహువిధముల భారతకథను వినగలిగారని" నొక్కి వక్కాణించాడు.

నన్నయకు పూర్వం, నన్నయ కాలంలోనూ, తెలుగు కవులు లేరనీ, తెలుగు కవిత్వం లేదనీ, నన్నయ తోనే తెలుగు కవిత్వం పుట్టిందని కొందరు అపండితులు భావించారు. పండితులు వాళ్ళ స్వార్థంకోసం, వేరే వేరే ప్రయోజనాలకోసం కావాలని లేని పోని కల్లబొల్లి కథలు చెప్పి జనాలను నమ్మించారు. అసలు విషయం ఏమంటే నన్నయకు పూర్వమే కాదు, నన్నయకాలంలోని కవుల పేర్లను, వాళ్ళ కవిత్వాన్ని కొందరు పండితులు ఎవరకీ కనబడకుండా చేశారు. ఇందులో పెద్దకుట్ర దాగివున్నాదనేది పరిశోధకులు, విమర్శకులు చెప్పుతున్నదే. ఏదిఏమైనా నన్నయ ముందు, నన్నయకాలంలో కవులు వున్నారు. కవిత్వం వుంది. ఇది ఎవ్వరూ కాదనరాని సత్యం.

12వ శతాబ్దంలో పాల్కురికి సోమనాథుడు సనాతన సంస్కృత సంప్రదాయానికి ఎదురొడ్డి దేశీయ ఛందస్సులో "అచ్చ తెలుగు" కావ్యాలు రాశాడు. వాడుక భాషకు ప్రజల్లో విలువలేకపోవడాన్ని శివ కవులు ఎలుగెత్తి చాటారు. ప్రజల వాడుక భాష కోసం ప్రశ్నల వర్షం కురిపించారు. అచ్చంగా "జాను తెలుగు" లో అద్భుతమైన ఎన్నో సాహిత్య ప్రక్రియల్ని సృష్టించారు. ఎంతోమందికి ఆదర్శంగా తెలుగు సాహిత్యంలో నిలిచారు. తెలుగు సాహిత్య చరిత్రలో మొట్టమొదటి సారిగా ప్రజల భాషకు పట్టం కట్టిన కవులు శివకవులు అని చెప్పక తప్పదు. తమ భక్తి ఉద్యమాన్ని వాడుక భాషలో ప్రజల దగ్గరకు తీసుకెళ్ళిన ఘనత శివ కవులకు దక్కుతుంది.

పాల్కురికి సోమనాథుడు ప్రజలు పాటించే ధర్మాలు ప్రజల భాషలో లేకపోవడాన్ని చాలా తీవ్రంగా ఖండించాడు. తప్పు పట్టాడుకూడా. సోమనాథుడు లేవనెత్తిన ప్రజా ప్రశ్నలకు వెయ్యేళ్ళయినా ఇప్పటికీ సమాధానం చెప్పలేక పోతున్నాం అంటే ప్రజలు వాడుక భాష విషయంలో మనం చాలా వెనకబడి వున్నామన్నమాట. మనకు సిగ్గు చేటుగాలేదా!

పాల్కురి సోమనాథుడు చేసిన ప్రజలవాడుక భాషోద్యమం అనేక కారణాలవల్ల కాలక్రమంలో నీరుకారిపోయింది. తెలుగు భాష అంటే వాడుక భాషే కానీ, పండిత భాష కాదు. కానేరదు. మన పండితులకు ఆ భాషా దృక్పథంలేదు. అసలు విషయం ఏమంటే సాహిత్యమే భాష అనుకున్న మహాపండితులు ఎందరో వున్నారు. సాహిత్యం వేరు. భాష వేరు. రెండింటికీ తేడా వుందన్న విషయం కూడా వాళ్ళకు తెలియదు. ఎన్నో యేళ్ళ సంవత్సరాల నుంచి ఇలాంటి పండితుల వల్లే వాడుక భాషకు తీరని అన్యాయం జరిగింది. జరుగుతోంది. ఇదే విషయాన్ని గిడుగు రామమూర్తిగారు ఎన్నోసార్లు చెప్పారు.

13వ శతాబ్దంలో తిక్కన రాసిన భారతంలో తెలుగుదనం కన్పిస్తుంది. అయితే తిక్కన కూడా ప్రజల వాడుక భాషలో భారతాన్ని అనువదించలేకపోయాడు. 14వ శతాబ్దానికి చెందిన ఎర్రన. 15వ శతాబ్దానికి చెందిన శ్రీనాథుడు, పోతన రచనల్లో పండితుల భాష బాగా కన్పిస్తుంది. ఆ కాలంలోనే అన్నమయ్య ప్రజల భాషలో కీర్తనలు రాసి ప్రజలకు చేరువయ్యాడు.

16వ శతాబ్దంలో ప్రబంధ యుగంలో ముఖ్యంగా భాష విషయంలో పెద్దగా మార్పులు ఏమీ చోటు చేసుకోలేదు. శ్రీకృష్ణదేవరాయలు తెలుగు సాహిత్యానికి ఎనలేని సేవలు అందించాడు. తిక్కన ఎంత "తెలుగు దనం" చూపించినా, రాయలు "దేశభాషలందు తెలుగు లెస్స" అని ఎంత ఎలుగెత్తి చాటినా, ప్రజలవాడుక భాషకు ఎక్కడా పట్టం కట్టలేకపోయారు. వాడుక భాషలో రచనలు ఎవ్వరూ చేయలేదు.

17,వ శతాబ్దంలో వేమన ప్రజల వాడుక భాషలో ప్రజల మనిషిగా, మానవతా వాదిగా, బలంగా సామాజిక వస్తువును తీసుకొని కనీవినీ ఎరుగని అద్భుతమైన కవిత్వాన్ని సృష్టించాడు. ప్రజలకు దగ్గరయ్యాడు. ప్రజల పక్షపాతి అయ్యాడు. సామాన్య ప్రజలకు చేరువయ్యాడు. అందరికీ అర్థమైన విధంగా ప్రజల భాషలో పద్యాలు రాశాడు. వేమన లాంటి ప్రజాకవిని, మన పండితులు గుర్తించలేకపోయారు. ఇప్పటికీ పండింతులకు వేమన జీర్ణం కాలేదు.

18 శతాబ్దలో కూడా పండిత భాషే ఒంటికాలితో రాజ్యమేలింది. వీధినాటకాలు, యక్షనాగాలు అంతగా సాహిత్య గౌరవం పొందలేదు. 19వ శతాబ్దం ప్రారంభంలో వ్యావహారిక భాషలో అక్కడక్కడ "కాశీ రాజు పూర్వ దేశయాత్రలు'' లాంటి రచనలు వచ్చాయి. చిన్నయసూరి ఎప్పుడైతే తెలుగు సాహిత్య రంగంలోకి ప్రవేశించాడో అప్పుడే మరల పండిత భాష రోజు రోజుకు పుంజుకొని విజృంభించింది. "నీతి చంద్రిక''. లాంటి గ్రంథాలతో గ్రాంథిక భాష వీర విహారం చేసింది. అదెబ్బకు అక్కడక్కడ వున్న ప్రజల వాడుక భాషలో వున్న రచనలు కూడా కన్పించకుండా పూర్తిగా కనుమరగు అయ్యాయి. చివరకు పాఠ్యపుస్తకాల్లోనూ గ్రంథరచనల్లోనూ, ప్రజల వాడుక భాషను ఉపయోగించకూడదనే పరిస్థితికి వచ్చింది. తెలుగు భాష పరిస్థితి, గతి స్థితి ఇది. మొత్తం మీద తేలిన సారాంశం ఏమంటే వేయి సంవత్సరాల్లో ఎప్పుడూ వ్యావహారిక భాష సాహిత్య భాషగా, కావ్య భాషగా నోచుకోలేదు. అంతేకాదు. పాఠ్య గ్రంథాల భాషగానూ ఎక్కడ అమలుకాలేదు.

సమాజంలో, సాహిత్యం సజీవంగా వుండాలంటే రచనా భాష ఆయా ప్రాంతాల స్వభావాలకు అనుగుణంగా తప్పనిసరిగా వుండాలి. రచయిత సృష్టించిన పాత్రలు నిత్యమూ దైనందిన జీవితంలో మనకు తారసపడే విధంగా సహజంగా వుండాలి. అప్పుడే అతడు గొప్ప రచయితగా పేరు ప్రఖ్యాతులు గడిస్తాడు. ఎప్పుడో కొన్ని సంవత్సరాల క్రిందట భాష వాడినా, తాతలముత్తాల నాటి భాష వాడినా, అది సహజం అన్పించుకోదు. సమాజంలో లేని పాత్రల్ని సృష్టించి అంటే కృత్రిమ పాత్రలను సృష్టించి రచనలు చేస్తే ఎవ్వరూ చదవరు. మీదుమిక్కిలి హర్షించరు కూడా. ఆరచనలు సమాజానికి పనికిరావు. ఆ కవి వల్ల సమాజానికి లాభం కన్నా నష్టమే ఎక్కువుగా జరుగుతుంది.

మొత్తం మీద కవులు తమ ప్రతిభా పాటవాలు ప్రదర్శించారేకాని ప్రజల భాషలో రచనలు చేయలేకపోయారు. వాళ్ళ దృష్టిలో పాఠకులంటే రాజాస్థానాల్లో బ్రతుకుతున్న ఆ నలుగురు పండితులు మాత్రమే. కవులు పాండిత్య ప్రకర్షణకే ఎక్కువ విలువ ఇచ్చారు. అదే గొప్ప అనుకున్నారు. అందులోనే మునిగితేలారు. అందుకే తెలుగు కవులు, కావాలని సంస్కృత నాటకాలను కూడా ప్రబంధీకరించారు. కొత్తగా తెలుగులో సృజనాత్మకమైన నాటక సాహిత్యాన్ని సృష్టించలేకపోయారు. తమ రచనలు తమకోసం, తమలాంటి వారి ఆనందంకోసం, అనుకున్నారు కానీ జాతి మొత్తానికి ఆరచనలు ఉపయోగపడాలనీ, విజ్ఞానాన్ని వినోదాన్ని అందరికీ కలుగజేయాలనీ అనుకోలేదు. అంతదూర దృష్టికూడా మన కవులకు లేదు. అదే మన కవులలో వున్న ప్రధాన లోపం.

ప్రజల అభిమానం వల్లే కవికి కీర్తి ప్రతిష్ఠలు వస్తాయని కవులు గమనించలేకపోయారు. చుట్టు ప్రక్కల వున్న ఆ నలుగురు పండితులు మెచ్చుకుంటే సరిపడుతుందని అనుకున్నారు. అనలుగురుతోనే బాజా భజంత్రీలు ఆర్భాటాలు చేశారు. వాళ్ళదృష్టి చాలా చిన్నది. మనం చేసిన పని, జనాలందరికీ నచ్చితే జనరంజకత్వం అవుతుందని, దానివల్ల ఎనలేని పేరు ప్రఖ్యాతులు, గొప్ప గౌరవం వస్తాయని గ్రహించలేకపోయారు మన పండిత కవులు..

ఆయా కాలాల్లో ఎక్కువమంది కవులకు డబ్బు, హెూదా ప్రధానమైంది. డబ్బు ఏరాజు ఇస్తే ఆరాజుకు అడుగులకు మడుగులు ఒత్తుతూ వారికి అనుగుణంగా నడుచుకున్నారు. అవసరమైతే రాజుని పొగడ్తలతో ఆకాశానికి ఎత్తేశారు. ఆనాటి

పండిత కవులలో ఎక్కువమందికి ఒక సిద్ధాంతమంటూ ఏమీ కనబడదు. నీతి నియమాలకు, విలువులకు పెద్దగా పట్టించుకున్నట్లు దాఖలాలు లేవు. ఆ కారణంగా కవులు రాజుకు బాగా దగ్గరయ్యారు. ప్రజలకు దూరమయ్యారు. తాము రాసిన కావ్యాలవల్ల జనాలకు జ్ఞానం కలిగించాలనే గొప్ప మానవతా విలువులకు తిలోదకాలు ఇచ్చారు. కావ్యాల్లో విపరీతమైన వర్ణనలను, అలంకారాలను అవసరం లేకపోయినా కావాలని చొప్పించారు. దాని ఫలితంగా సాహిత్యం నిర్వీర్యమయిపోయింది. సాహిత్యానికి వున్న ప్రతిష్ఠ దిగజారిపోయింది. కవులు సమాజంలో చులకనయ్యారు. క్షీణయుగంలో ఈ పరిస్థితి మరీ ఎక్కువయింది. వందల యేళ్ళనుంచి సామాన్య జనాలకు తెలుగు భాష కేవలం మాట్లాడుకోవడానికీ, విని ఆనందించడానికే తప్ప మరెందుకూ పనికి రాకుండా పోయింది. పాలకుల భాషవేరు, పాలితుల భాష వేరుగా రూపుదిద్దుకున్నాయి.

దేశీయ పాలకులు ఆయా కాలాల్లో సంస్కృత భాషనో, ప్రాకృత భాషనో ఆశ్రయించారు. విదేశీ పాలకులు అరబిక్, ఇంగ్లీషు, భాషల్ని పాలనా భాషలుగా వాడారు. తెలుగు ప్రాంతాల్ని పాలించిన పాలకులు ఎప్పుడూ తెలుగు భాషను నిర్లక్ష్యం చేస్తూనే వున్నారు. ఒకరకంగా చెప్పాలంటే ఆపరిస్థితే ఏదో ఒక రూపంలో ఇప్పటికీ " కొనసాగుతూనే వుంది. ఈ పరిణామం చాలా విచారించదగ్గది.

తెలుగు వారి జన జీవితంలోకి సంస్కృతం, సాహిత్య రూపంలో, మంత్ర తంత్రాల రూపంలో అన్ని జీవన రంగాల్లోకి వేగంగా చొచ్చుకుపోయింది. చివరకు సంస్కృతం లేకపోతే తెలుగు భాషకు మనుగడ లేదనే స్థితికి వచ్చింది. సంస్కృతం నుండే తెలుగు పుట్టిందనే వాదన బలంగా బయలుదేరింది. పాశ్చాత్యుల పరిశోధనల వల్ల నిజాలు బయటపడ్డాయి. పండితుల వాదనకు తెరపడింది. సంస్కృతాధిపత్యాన్ని ఎదురించడం ఎన్నో యేళ్ళ సంవత్సరాల నుంచి జరుగుతూనే వుంది. "అచ్చ తెలుగు", జాను తెలుగు రచనలు ఎన్నో వచ్చాయి. తెలుగు భాష తన ఉనికిని తాను కాపాడుకుంది. ప్రజలకు చేరువయింది.

ఇలాంటి పరిస్థితుల్లో తెలుగు సాహిత్య రంగంలోకి అడుగు పెట్టారు "నవయుగ వైతాళికుడు" కందుకూరి. తనదైన శైలిలో నిబద్ధతతో సామాజిక సేవ చేశారు. ప్రజలందరికీ అర్థమైన విధంగా చెప్పడానికి ప్రయత్నించారు. కొంత వరకు విజయం సాధించారు. కందుకూరి దృష్టి ఎక్కువుగా సాహితీ ప్రక్రియలను విస్తరించడంలో ముందుకు వెళ్ళారు.

19వ శతాబ్దం చివరలో ప్రజల వాడుక భాషకు సాహిత్య గౌరవం తెచ్చిన ఘనత "యుగకర్త" గురజాడకు చెందుతుంది. ప్రజల భాషలో రచనలు చేసి, వాడుక భాషకు ఎనలేని కృషి చేశాడు. వేయేళ్ళ తెలుగు సాహిత్యంలో ఏ రచయితా చేయలేని ధైర్యం, సాహసం చేసిన వాడుక భాషా యోధుడు గురజాడ. చివరకు విజయం సాధించాడు. ప్రముఖుల మన్నలను పొందాడు.

20వ శతాబ్దంలో వాడుక భాషోద్యమానికి తన జీవితాన్ని త్యాగం చేసిన "భాషా తపస్వి" గిడుగు రామమూర్తి గారు. వాడుక భాషోద్యమ పితామహుడు ఆయన. వాడుక భాషలోనే ప్రజల వ్యవహారాలన్నీ జరగాలనేది గిడుగు వారి అభిప్రాయం. గురజాడ, గిడుగు ఇద్దరూ వాడుక భాష కోసం చేసిన కృషి అంతా ఇంతా కాదు. గిడుగు "లక్షణం" అయితే, గురజాడ "లక్ష్యం" అయ్యాడు.

నన్నయ మొదలు నేటి వరకు తెలుగు భాష క్రమ పరిణామ వికాసాన్ని జాగ్రత్తగా పరిశీలిస్తే మనకు ఒక విషయం చాలా స్పష్టంగా తెలుస్తుంది. ప్రజలు నిత్యమూ వ్యవహారంలో మాట్లాడుకొనే భాషకు భిన్నంగా తెలుగులో "కావ్య భాష" ప్రారంభమైంది. క్రమ క్రమంగా ప్రజలు నిత్యమూ మాటలాడుతున్న "ఆధునిక భాష" చోటుచేసుకుంది. భాష ఎప్పుడూ పరిణామం చెందుతుంది అనడానికి ఇది మంచి ఉదాహరణ. ఆధునిక భాషలో మన రచయితలు అన్ని ప్రక్రియల్లోను రాస్తూ వున్నారు. ఇది మంచి పరిణామాం.

## 2. తెలుగు భాష ఆధునికీకరణ:

ఆధునికపరిస్థితులకు, ఆధునికఅవసరాలకు, ఆధునికఆలోచనలకు ఆధునిక భాషలకు అనుకూలంగా భాషలో ఏర్పడే మార్పుల్ని 'ఆధునికీకరణ'' అని అంటారు. అంటే భాష మార్పుకు లోనైనప్పుడు కొత్త అవసరాలతో, కొత్త ధర్మాలతో, కొత్త బాధ్యతలతో, స్వయం సమృద్ధమవుతున్నదన్నమాట. ఇలా ఎప్పటికప్పుడు మార్పులు జరుగుతూ పరిపూర్ణత సాధించడమే "ఆధునికీకరణ''.

భాషా శాస్త్రం ప్రకారం భాషలన్నీ సమంగా శక్తిమంతమైనవే. దాని అర్థం మూలధాతువులో అంటే భాషా యంత్రాంగంలో పటిష్ఠమైన భాషలు, పేలవమైన భాషలు అనే భేదం ఉండదని, ఈ రకమైన అవగాహన ఈ శతాబ్దపు ప్రారంభంలో మాట్లాడే భాషలపై చేసిన పరిశోధనల మీద ఆధారపడి ఉంది. మాట్లాడే భాషకు ఉన్న అనేక పరిమితులలో స్టోరేజ్ పరిమితి ఒకటి. భాషలో వాక్యోత్పత్తి యంత్రాంగం - దాన్నే స్థూలంగా వ్యాకరణం అంటాం. - బహుశః అన్ని భాషలకు దాదాపు సమానం కావచ్చు. కానీ లిఖిత వ్యవస్థ ఉన్న భాషలలో స్టోరేజ్ ఫెసిలిటీ వల్ల మాట్లాడే భాషకన్న రాసే భాష సంపన్నమైనది. దీనికి కారణాలు ఊహించడం కష్టం కాదు. రాసే భాషలో లిఖిత వ్యాకరణాలు ఉంటాయి. వాటివల్ల పద వాక్యోత్పత్తి ప్రక్రియలను అధికోపయోగంలో పెట్టవచ్చు. రకరకాల కోశాలు ఉంటాయి. అవి పద సంపదను భద్రపరుస్తాయి. రాసే భాషలో భాషను వివిధ సందర్భాలలో ప్రయోగించిన పత్రాలు, గ్రంథాలుంటాయి. వాటివల్ల భాషను ప్రయోగించే విస్తృతావకాశాలు, సందర్భోచిత శైలీ భేదాలు'' అందుబాటులో కొస్తాయి

పై వివరణను బట్టి భాషా సమీకరణను గురించి కొన్ని విషయాలు తెలుసుకోవచ్చు... అవి ఇవి : 1. నవీకరణ అనేది లిఖిత భాషకు సంబంధించినది. 2. భాషాభివృద్ధికి నిల్వ వనరులు అవసరం. అవి రాసే భాషలోనే సాధ్యం. 3. అభివృద్ధి చెందిన సమాజాలలో భాషా ప్రయోగ సందర్భాలు పెరుగుతాయి. ప్రయోగరీతులు పెరుగుతాయి. పద సంపద పెరుగుతుంది. అర్థ నైశిత్యం, అర్థచ్ఛాయా భేదాలు పెరుగుతాయి. ఇట్లాంటి అవసరాలు పెరిగిన సమాజాన్ని అభివృద్ధి చెందిన సమాజమనీ, అట్లా అభివృద్ధి చెందిన సమాజానికి అనుగుణంగా పెరిగిన భాషలను అభివృద్ధి చెందిన భాషలని అంటాం.

ఆధునిక నాగరికతా దృష్టితో చూచినట్లయితే, అందులోను ప్రధానంగా ఆర్థిక, సాంకేతిక, అభివృద్ధి దృష్ట్యా చూస్తే, స్థూలంగా యూరోపియన్ భాషలు అభివృద్ధి చెందిన భాషలనీ, ఆధునికీకృత భాషలనీ గుర్తించగలం. ఆధునిక భారతీయ భాషలు ఈ విషయంలో వెనకబడి ఉన్నాయనేది స్పష్టమే. ఈ భాషల్లో ఒకటైన తెలుగు పరిస్థితి కూడా అంతే.

ప్రాచీనాంధ్రం ప్రధానంగా సాహిత్య భాష. మనకు సాంప్రదాయికంగా అందిన గ్రంథాలన్నీ అన్నీ కాకపోయినా చాలా వరకు సాహిత్య గ్రంథాలు. అందులోని భాషను కావ్య భాష అని పిలుస్తాం. ప్రాచీనాంధ్ర కావ్యభాషను ఆధునిక కాలంలో గ్రాంధిక భాషగా వ్యవహరించారు. ప్రాచీనాంధ్రంలో కావ్య భాషేతర సంప్రదాయరీతులు సంకీర్తనల్లోను, యక్షగానాల్లోను, ఆ తరువాత వచ్చిన స్థానిక చరిత్ర గ్రంథాలలోనూ కనిపిస్తాయి. ప్రధానమైనది కావ్య సంప్రదాయమే. ఇతర సంప్రదాయాలు కూడా కావ్య భాష నుంచి ఎంత దూరం జరిగినా కావ్యభాషను ప్రామాణికంగా ఎన్నుకున్నవే. ఇంకోరకంగా చెప్తే, కావ్యేతర సంప్రదాయాలు మాట్లాడే భాషకన్నా, కావ్యభాషకే సన్నిహితాలు.

సాహిత్యేతర రచనా సంప్రదాయాలు మనకు చాలాకొద్ది. తెలుగులో శాస్త్ర సంప్రదాయం అసలు లేనట్టే. లౌకిక సంప్రదాయాల్లో మనకు అందింది శాసన భాషా రచనా సంప్రదాయమే. ఆ శాసన భాషలోను కొన్ని పద్యాలు. వచన శాసనాల్లో

భాష ఏ విధంగానూ అభివృద్ధి చెందిన భాషా స్థితికి సంకేతం కాదు. అదీగాక ప్రాచీన సమాజంలో విస్తృతమైన భాషాస్థితీ, ఉన్నతమైన భాషాస్థితీ ఒక్క కావ్య భాషకే ఉన్నాయి.

రాజ్య పరిపాలన ఆంగ్లేయుల హస్తగతమైన తరువాత ముఖ్యంగా ప్రథమ భారత స్వాతంత్ర్య సమరంగా అభివర్ణిస్తున్న 1857 సంవత్సరపు తిరుగుబాటు తరువాత భారతదేశం ఒక ప్రత్యక్షపాలన కింద వచ్చి పాలన సంబంధమైన సంస్కరణలు చేయడానికి తగిన పరిస్థితులేర్పడ్డాయి. వాటిలో భాగంగానే సమాజ సంస్కరణలు కూడా మొదలైనాయి. దీంట్లో భాగంగా భాషా సంస్కరణ అవసరమైంది. మొత్తం సమాజం అభివృద్ధి చెందే క్రమంలో ఆధునికమయ్యే సమయంలో భాషా సంస్కరణావశ్యకతను తెలుగు మేధావులు కూడా గమనించారు. ఇందుకు ఒక బలమైన ఉదాహరణ సామినేని ముద్దు నరసింహం నాయనిగారి "హితసూచని" గ్రంథంలో సాంఘిక సంస్కరణలతో పాటు భాషా సంస్కరణావశ్యకతను తెలుగుదేశపు మేధావులు చాలాకాలం క్రితమే గుర్తించినట్లు గ్రహించగలం. ఈ భాషా సంస్కరణోద్యమాన్ని వ్యావహారిక భాషోద్యమం అని కూడా పిలుస్తారు.

ఆధునిక సమాజపు అవసరాలకు కావ్యభాష చాలదని అందరూ గ్రహించిందే. కావ్య భాష సాహిత్య రచనకు ఉద్దేశించింది. విస్తృత భాషా ప్రయోగంలో సాహిత్య భాష ఒకరీతి. అది అన్నిటికీ సరిపోతుందన్న భ్రమ వాటి భాషా వేత్తలకు ఎవరికీ లేదు. విస్తృతావసరాల కోసం సాహిత్యేతర భాష కావాలని వాటి పండితులందరూ గుర్తించారు. ఆ భాష ఎట్లా వస్తుందనే దాని మీదనే అభిప్రాయ భేదాలు. ఒక వర్గం పండితులు ఆ రకపు ఆధునిక భాష ప్రాచీన భాషని సంస్కరించుకోవడం ద్వారా తయారు చేసుకోవచ్చునన్నారు. వారిని గ్రాంధిక భాషా వాదులన్నారు. మరికొందరు పండితులు ఆధునిక రచనా భాష ఆధునిక వ్యవహార భాష నుంచే రావలసి ఉంది - అని వాదించారు. వీరిని వ్యావహారిక భాషావాదు లన్నారు. గ్రాంధిక భాషావాదులు కూడా భాషా సంస్కరణను కోరిన వారే అన్న సంగతి మనం తరచూ మరచిపోతుంటాం. రెండు వాదాల వారు సంస్కరణ ప్రియులే. దేన్ని ఎలా సంస్కరించాలనే దగ్గరే భేదం. గ్రాంధిక భాషా వాదులు వ్యవహారం నుంచి భాషను స్వీకరించక తప్పదు. వ్యావహారిక భాషా వాదులు భాషకున్న విస్తృతావసరాల దృష్ట్యా ప్రాచీన భాషాపదాలను కొన్ని వాక్యరీతులను త్యాగం చేయలేరు. గ్రాంథిక, వ్యావహారిక భాషావాదుల మధ్య - తీవ్రవాదుల్ని వదలివేస్తే - ప్రధాన భేదం ప్రయాణపు దిశ మాత్రమే. దీన్నే ఓరియంటేషన్ భేదం అనవచ్చు.

ఒక కాలంలో ఈ విషయాలను ఒప్పించడానికి సాధ్యం కాలేదు. గ్రాంథిక వ్యావహారిక భాషావాదులు ఆయుధాలు లేని పోరాటం చేశారు. ఈ పోరాటంలో కొక్కొండ వెంకట రత్నం, జయంతి రామయ్య, పానుగంటి లక్ష్మీనరసింహారావు మొదలైనవారు గ్రాంధిక భాషావాదంలో ప్రముఖులుగా కనిపిస్తారు. వీరికి కాకినాడ ఆంధ్ర సాహిత్య పరిషత్తు వారి అండ బాగా ఉండేది. విక్రమదేవ వర్మ లాంటి ఇతర సంస్థానాధీశులు కూడా గ్రాంధిక భాషా వాదాన్ని సమర్ధించారు. గిడుగు రామమూర్తి, గురజాడ అప్పారావు, బుర్రా శేషగిరి రావు వంటి వారు వ్యావహారిక భాషావాదాన్ని తీవ్రంగా ప్రచారం చేశారు.

వ్యావహారిక భాషోద్యమానికి ఆనాటి భాషా శాస్త్ర దృక్పథం చాలా తోడ్పడింది. గత శతాబ్దపు చారిత్రక భాషా శాస్త్రవేత్తలు భాషా పరిణామ సిద్ధాంతాన్ని ప్రచారం చేశారు. దాని వల్ల భాషలో మార్పు అనివార్యం అనే విషయం స్థాపితమైంది. అందుకే వ్యావహారిక భాషా వాదుల వ్యాసపరంపరలో ఎక్కడో ఒక చోట 'భాష మారుతుంది' అనే వాక్యం కనబడుతుంది. ఇది చారిత్రక భాషాశాస్త్ర ప్రభావం. గిడుగు రామమూర్తిగారు 1910-12 సంవత్సరాలలో విశాఖపట్నంలో ఉపాధ్యాయ పరిషత్లో ఇచ్చిన ఉపన్యాసాల్లో ఈ విషయాన్నే నొక్కి చెప్పారు. ఆధునిక భాషా శాస్త్రజ్ఞులు పాశ్చాత్యుల వలస వాదంలో భాగంగా

ఆయా దేశాలలో లిఖితస్థితి లేని అనేక భాషలను అధ్యయనం చేశారు. ముఖ్యంగా ఆఫ్రికన్ భాషల మీద అమెరికన్ - ఇండియన్ భాషల మీదా ఈ పరిశోధన విస్తృతంగా జరిగింది. దీని వల్ల భాషలను గురించిన శాస్త్రీయ అవగాహన పెరగడంతో పాటు మాట్లాడే భాషకు కూడా పటిష్ఠమైన వ్యాకరణ వ్యవస్థ ఉంటుందని పరిశోధకులకు అర్థమైంది. గిడుగు రామమూర్తిగారు 1911 ప్రాంతానికే సవర భాషకు వాచకాలు రచించారని, 1931కి సవర భాషకు వ్యాకరణం రచించారనీ తెలుసుకుంటే, భాషాశాస్త్ర దృక్పథ . ప్రభావం వ్యావహారిక భాషావాదంపై ఏ విధంగా పడిందీ అర్థమవుతుంది. ఆధునిక భాషా శాస్త్ర పాఠ్య గ్రంథాలలో భాషకు ఇచ్చిన నిర్వచనాలన్నీ మాట్లాడే భాషను దృష్టిలో పెట్టుకుని ఇచ్చినవేనని మనం గ్రహించాలి. ఈ శతాబ్దపు పూర్వార్థ భాగంలో వీర గ్రాంథిక భాషా వాదులు ఉండేవారు. ప్రతి రచనా కావ్యభాషలాగే ఉండాలనే వారు. ఇప్పుడు వీరి వ్యవహారిక భాషావాదులున్నారు. రాసింది ప్రతిదీ మాట్లాడినట్లే ఉండాలంటారు. ఈ రెండూ తీవ్రవాదాలు మాత్రమే కాదు. ఏ మాత్రమూ ఆచరణ సాధ్యం కాని భ్రమలు. భాషా వృద్ధికి ప్రధానంగా కావలసింది భాషా ప్రయోగ విస్తృతి. అంటే అన్ని రంగాలలోను, అవసరమైన అన్ని సందర్భాలలోను తెలుగు భాషను ఉపయోగించడం. ఒకప్పుడు కావ్య భాషే అన్ని రచనా భేదాలకు పనికివస్తుందని కొందరనుకున్నట్లుగా నేడు పత్రికా భాషే అన్నిటికీ పనికి వస్తుందనుకునేవారు ఉన్నారు. ఇందుకు భాషా వ్యవస్థా నిర్మాణంలో వివిధ సమాచార ప్రసారంలో వీరికున్న అదృశ్యాధికారం కారణం. ఈ పరిస్థితికి పటిష్ఠమైన విద్యా వ్యవస్థ (ఎకడమిక్ స్ట్రక్చర్) లేకపోవడం ఒక కారణం. తెలుగులో శాస్త్ర రచన అంతగా పెరగలేదు. శాస్త్ర రచనకు భాషా నిర్దిష్టత అవసరం. ఇది రచన ద్వారా కొంత సాధ్యం.

పరిభాషను రకరకాల కోశాల రూపంలో నిర్దేశించుకోవడం అవసరం. రకరకాల కోశాలంటే, వివిధ శాస్త్ర పరిభాషా నిఘంటువులు. వివిధ అర్థచ్ఛాయలను సోదాహరణంగా వివరించే ప్రయోగ కోశాలను తెలుగులో ఏర్పరచుకోవలసి ఉంటుంది. ఇవిగాక అనేక శాస్త్రాలలోను వివిధ సందర్భాలలో వాడే భాషా భేదాలను నిరూపించే వ్యాకరణ గ్రంథాలు కావలసినదే. ఇవన్నీ జరిగిన నాడు తెలుగు భాష ఆధునికావసరాలకు తగిన భాష అవుతుంది. ఇతర భాషల సంగతి ఏమోకాని, తెలుగులో ఇట్లాంటి పనులు జరగడానికి తగిన వనరులున్నా, అంతగా జరుగుతున్నట్లు కనబడడం లేదు. తెలుగు ఎకాడమీ, తెలుగు విశ్వవిద్యాలయం వంటి సంస్థలు అన్ని రాష్ట్రాలకూ లేవు. ఈ వనరులన్నీ ఉపయోగించుకొని అవసరమైన కోశ వ్యాకరణాల నిర్మాణం జరిగితే తెలుగు భాషను ఆధునికం చేయడం కష్టమేమీ కాదు భాషానువర్తనం కాదు''. (భాషానువర్తనం - చేకూరి రామారావు)

ఆంగ్లేయుల ప్రభావంతో తెలుగు భాష అనేక మార్పులకులోనైయింది. ఆధునికయుగంలో నవల, కథ, వ్యాసం, నాటకం, పత్రికారచన . లేఖనం, మొదలైనవి ఆంగ్ల ప్రభావంతో వచ్చినవే. అచ్చుయంత్రం మొదలుకొని ఎన్నో రంగాల్లో ఆంగ్ల ప్రభావం మనమీద వుంది. విద్యాపరంగా సాంస్కృతికపరంగా మనకు ఎంతో మేలు జరిగింది. శాస్త్రం, ఆరోగ్యం, చరిత్ర, భూగోళం మొదలైన అనేక గ్రంథాలు అచ్చు అయ్యాయి. ఇలా ఎన్నో విధాలుగా తెలుగు భాష సర్వతోముఖాభివృద్ధి జరిగింది. దీనంతటికీ పాశ్చాత్యులే కారణం.

నన్నయ కాలంనుంచి 19వ శతాబ్ది దాకా తెలుగు సాహిత్యాన్ని నిశితంగా పరిశీలిస్తే ప్రధానంగా కనబడేది గ్రాంధికశైలి. తెలుగుభాషలో ఆధునికీకరణ దశలో జరిగిన మొట్టమొదటి పెద్ద మార్పు గ్రాంథిక భాషాస్థానంలో వ్యవహారిక భాషగా మార్పుచెందడం. ఈ మార్పుకు లేక పరిణామానికి భాషా ఉద్యమాలు బాగా తోడ్పడ్డాయి. ఈపరిణామాన్ని మనం ఆధునికీకరణగా తీసుకోవచ్చు.

తెలుగు భాషపై ఆంగ్ల ప్రభావం బాగా కన్పిస్తుంది. ఆంగ్ల భాషా ప్రభావం వల్లే తెలుగులో గ్రాంథిక భాష వ్యవహారికభాషగా ముర్పుచెందిందని చెప్పకతప్పదు. తెలుగులో మొట్టమొదటగా ఆధునికీకరణ వైపు దృష్టి మళ్ళించినవారు గిడుగురామమూర్తి, గురజాడఅప్పారావుగార్లు. ఆంగ్లంలో Old English, Middle English, Moderen English తెలుగుభాషలో అనేక మార్పులు చోటుచేసుకొని ఆధునికీకరణ సంతరించుకుంది.

"ఆధునికీకరణలో సులభీకరణ ఒక ప్రధానంశం. ఈ సులభీకరణ తెలుగు భాషకు సంబంధించినంత వరకు కుంఫిణీ యుగంలోనే మొదలైంది. పత్రికల స్థాపనలో ఈ సులభీకరణ అనివార్యమైంది. గిడుగు వ్యావహారికోధ్యమం దీనికో నిర్దిష్టమైన రూపాన్ని ఇచ్చింది. వ్యావహారిక భాషోద్యమం గ్రాంథిక భాషకు వ్యతిరేకంగా మొదలైనట్లు పైకి కనబడ్డా నిజానికి అది సులభీకరణ గమ్యంగా సాగిందని భావించవచ్చు. సులభీకరణలో అంతర్గతంగా ఉన్న అంశం మౌఖిక భాషకూ లిఖిత భాషకూ ఉన్న దూరాన్ని తగ్గించటం. ఆధునికీకరణ సంతరించుకుంటున్న దశలో భాష ఉపరిస్వరూపం మాత్రమేకాక అంతర్గత నిర్మాణంలోనూ మార్పులు సంభవిస్తాయి. ప్రధానంగా ఆధనికీకరణ 1) కొత్తపదాల కల్పన, 2) నూతన రచనా విధానం, 3) లేఖన విధానం అనే అంశాలకు సంబంధించి ఉంటుంది." (తెలుగుభాష - ప్రాచీనత - ఆధునికీకరణ - పుట.92).

ఆధునిక యుగంలో చరిత్ర, భూగోళం, ఆరోగ్యం, భౌతిక, రసాయనిక, జీవశాస్త్రం మొదలైన అంశాలపై అనేక వ్యాసాలు వచ్చాయి. "పురుషార్ధ ప్రదాయిని", "సకల విద్యాభివర్ధని" మొదలైన పత్రికలు జ్యోతిశాస్త్రం, వైద్యశాస్త్రం, ప్రకృతిశాస్త్రం గూర్చి వివరించాయి. పత్రికా పితామహులు కందుకూరి వీరేశలింగంగారు ఖగోళం, భూగోళం, ప్రకృతి మొదలైన విషయాలపై అనేక వ్యాసాలు రాశారు. ఈ కాలంలోనే సరళమైన గ్రాంథికభాషలో రచనలు వచ్చాయి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 1967లో తెలుగు అకాడమీ ఏర్పాటు చేసింది. ప్రాథమిక స్థాయి నుంచి డిగ్రీ వరకు వివిధ రకాల పాఠ్య పుస్తకాల్ని ముద్రించింది. వివిధ భాషల్లో నిఘంటువుల్ని తయారు చేయించింది. నూతన పారిభాషిక పదాలు తయారు చేయించింది. సైన్సు, టెక్నాలజీ రంగాల్లో కూడా అనేక పాఠ్య గ్రంథాలు వచ్చాయి. కొత్త పదాల కల్పనలోనూ శాస్త్రసంబంధమైన రచనలల్లోనూ, తెలుగు అకాడమీ కృషి అమోఘం.

"శాఖోపశాఖలుగా ఉన్న విజ్ఞాన శాస్త్రాలూ, సాంఘిక శాస్త్రాలూ, సాంకేతిక విజ్ఞానం మొదలైన వాటిని తెలుగు వచనంలో రాయవలసి వచ్చేటప్పటికి దానికి అనుగుణంగా తెలుగును ఆధునికం చేయవలసి వచ్చింది. అదివరకు ఏకవి ప్రయోగాలలోనూ కనపడని అనేక నూత్న పదాలను సృష్టించవలసి వచ్చింది. అంటే కొత్త అవసరాలకు కావలసిన కొత్త మాటలను కల్పించుకోవలసి వచ్చింది. భాష నవీకరణ అంటే ఇదే". (నండూరి రామమోహనరావు- తెలుగు నవీకరణ జనవరి 1982.)

ఆధునిక ప్రతికల్లోనూ ప్రసార సాధనాల్లోనూ భాష ఆధునీకరణ అయింది. వార్తా పత్రికలూ, రేడియో, టెలివిజన్, ఇంటర్న్ లాంటివి నిర్వహిస్తున్న పాత్ర ప్రశంసనీయమైంది. ఆధునిక ప్రామాణిక భాషలో పత్రికలు నడుపుతున్నారు. పత్రికలు మాండలికాలకు ప్రముఖపాత్ర ఇస్తున్నాయి. ఈ పరిమాణం హర్షించదగ్గది.

"పత్రికా రచన ఒక చేతిమీదుగా సాగదు. సంపాదకులు, ఉపసంపాదకులు, ప్రత్యేక వ్యాస రచయితలు, వ్యాఖ్యాతలు ఇలా ఎందరో రకరకాల రచనలు - చేస్తూ ఉంటారు. కొన్ని వ్యాసాలు, సంపాదకీయాలు, గ్రామాల నుంచి విలేఖరులు పంపేవార్తలను మినహాయిస్తే ఎక్కువ భాగం ఇంగ్లీషు నుంచి తెలుగులోకి తర్జుమా చేసిన వార్తలు, వ్యాసాలే. మన ఉపసంపాదకులు హడావుడిగా స్వల్ప వ్యవధానంలో ఇంగ్లీషు వార్తలను తెలుగులోకి అనువాదం చేస్తారు. వాళ్ల అనువాదాల్లో కొన్ని పడికట్టు రాళ్లలాంటి ప్రయోగాలూ, పదబంధాలూ స్థిరపడిపోయాయి. ఒక్కొక్కమారు గ్రామాల్లో ఉండే విలేఖరులు వార్తలను గబగబా

ఇంగ్లీషులోకి తర్జుమా చేసుకుని టెలిగ్రాము ద్వారా పంపుతారు. పత్రికా కార్యాలయంలో ఉప సంపాదకులు ఆ ఇంగ్లీషు తర్జుమాను మళ్లీ తెలుగులోకి మలుస్తారు. ఈ విధంగానే పి.టి.ఐ.,యు.ఎన్.ఐ.లాంటి వార్తా సంస్థలు పంపే జాతీయ, అంతర్జాతీయ ఇంగ్లీషు వార్తలను ఉపసంపాదకులు తెలుగులోకి అనువదిస్తారు. ఇంగ్లీషులో పత్రికలకు శైలీ పత్రాలున్నాయి. 'ఈనాడు' మినహా తెలుగు పత్రికలకు అలాంటివి లేవు. అయినా పత్రికా రచయితల భాషలో కొన్ని నిర్దిష్ట పద్ధతులు ఏర్పడ్డాయి. కొత్త భావాలకు కొత్తమాటలు ఏర్పడ్డాయి. తెలుగు పత్రికల్లోనూ, రేడియో, టి.వి.,ప్రసారాల్లోనూ కొత్త మాటలూ, వాక్యనిర్మాణాలు వచ్చాయి''. (తెలుగుభాష - ప్రాచీనత - ఆధునికీకరణ. పు.96)

ఆధునిక ప్రచార సాధనాల్లో తెలుగుభాష బాగా అభివృద్ధి చెందింది. ఈ కారణంగా సాంఘిక, రాజకీయ, శాస్త్ర, సాంకేతిక రంగాల్లో కొత్త కొత్త భావాలు ఆలోచనలు వచ్చాయి. ఈభావాల్ని ఆలోచనల్ని అభిప్రాయాల్ని సామాన్యజనాల్లోకి తీసుకోని వెళ్ళడానికి ఆధునిక ప్రచార సాధనాలు ఎంతగానో తోడ్పడ్డాయి. ఈ సమయంలో తప్పనిసరిగా పరిభాషా కల్పన అవసరమైంది.

**ఆధార గ్రంథాలు :**

**1. తెలుగు :**


1. ఆధునిక తెలుగు వ్యాకరణం - ఎన్. శివరామమూర్తి
2. ఆధునిక తెలుగు వెన్నెలకంటి వ్యాకరణం - వెన్నెలకంటి ప్రకాశం
3. ఆధునిక తెలుగు భాషా నిర్మాణం - శివుని రాజేశ్వరి
4. ఆధునిక ప్రామాణికాంధ్ర వ్యాకరణం - వజ్ఝల వేంకటేశ్వర్లు
5. ఆధునిక భాషా శాస్త్రం - వెలమల సిమ్మన్న
6. ఈనాడు భాషా స్వరూపం - బూదరాజు రాధాకృష్ణ
7. తెలుగు దారి - వెల్చేరు నారాయణరావు
8. తెలుగులో వెలుగులు - చేకూరి రామారావు
9. తెలుగు భాషా చరిత్ర (సంపాదకులు) - భద్రిరాజు కృష్ణమూర్తి
10. తెలగు భాషా చరిత్ర - వెలమల సిమ్మన్న
11. తెలుగు భాషా తత్త్వం - కొమర్రాజు లక్ష్మణరావు
12. తెలుగు భాషా శాస్త్రవేత్తలు - వెలమల సిమ్మన్న
13. తెలుగు భాషా స్వరూపం - బూదరాజు రాధాకృష్ణ
14. తెలుగు కావ్యం - చేకూరి రామారావు

15. ప్రౌఢ వ్యాకరణం - బహుజనపల్లి సీతారామయ్య

16. బాల వ్యాకరణం - చిన్నయ సూరి

17. బాల వ్యాకరణం - శాస్త్రీయ వ్యాఖ్య - వెలమల సిమ్మన్న, గుమ్మా సాంబశివరావు

18. భాషా తపస్వి గిడుగు - వెలమల సిమ్మన్న

19. భాషానువర్తనం - చేకూరి రామారావు

20. వ్యావహారిక భాషా వ్యాకరణం - వడ్లమూడి గోపాలకృష్ణయ్య

21. శబ్ద బ్రహ్మ చిన్నయ సూరి (అముద్రితం) - వెలమల సిమ్మన్న, గుమ్మా సాంబశివరావు

22. సంధి - వెలమల సిమ్మన్న

**2. ఆంగ్లం :**

1. A Grammar of Modern Telugu - Bh. Krishna Murthy
2. Sandhi Balavyakaranam - J. Pratap Reddy.

పాఠం - 10

# తెలుగులో మాండలికాలు

## విషయసూచిక


10.1. మండలమంటే ఏమిటి

10.2. మాండలికమంటే ఏమిటి

10.3. మాండలిక భాష - పర్యాయపదాలు

10.4. మాండలిక భాష - పరిశోధన

10.5. మాండలికాలు - ప్రధాన లక్షణాలు

10.6. మాండలికాలు ఏర్పడే తీరు

10.7. మాండలికాలు - ప్రయోజనాలు

10.8. మాండలికాలు - పరిశీలనా పద్ధతులు

10.9. వ్యవహార భేదక రేఖలు

10.10. మాండలిక పటాలు

10.11 తెలుగు భాష - వ్యావహారిక మండలాలు


## తెలుగులో మాండలికాలు

భావ వాగ్రూపమైంది. భావ ప్రకటన సాధనాల్లో భావ అతి ముఖ్య మైంది. అత్యంత శక్తిమంతమైంది కూడా. సమాజంలో మానవులు తమ భావాల్లి ఇతరులకు, తెలియజోయడానిక్తి ఇతరుల భావాల్లి తాము తెలుసుకోనడానికీ నిత్యం వ్యవహరించే ఉచ్చారణ సాధనమే భాష ప్రపంచంలో భాషలేని మానవ సమాజం లేదు. ఇంచుమించు ప్రపంచంలో 5000 భాషలు వున్నట్లు భాషాశ్యాస్రజ్ఞల అంచనా. అసలు మానవ సమాజంలో సాంఘిక జీవనం భాషవ్వో సాధ్యపడుతుంది. మనిషి భాషను సహజంగానే నేర్చుకుంటాడు. ఒక వ్యక్తి ఏ భాషా సమాజంలో వుట్టి పెరిగి అభివుద్ది చెందుతాడో ఆ సమాజానికి అనుగుణంగా ఆ భాన అలవడుతుంది. ఆ భాషలోనే తన ప్రతిభా ప్రజ్ఞా పాటవాల్ని చూపిస్తాడు. అయితే ప్రత్యేకమైన అధ్యయనం వల్ల ఇతర భాషల్ని క్షుణ్ణంగా నేర్చుకుంటాడు. సమాజంలో భిన్న సంస్కృతికి చెందినవారు భిన్న కులాల, మతాల వారు కలిసి మెలిసి జీవిస్తారు. వీళ్ళందరినీ ఒకటిగా చేసి సాంఘిక జీవనంలో సన్నిహితుల్ని చేసేది భాష ఒకటి మాత్రమే.

భాష నిత్యం పరిణామం చెందుతూనే వుంటుంది. భావ నజీన వ్యవస్థకు చెందింది. కాబట్టి మార్పు అనేది భాషకు సహజం. ప్రాంతీయ, సామాజిక చారిత్రక వృత్తి కాల భేదాల్ని బట్టి ఒకే భాష విభిన్న రకాలుగా వ్యవహరించ బడితే, ఆ భాషలో మాండలికాలు ఏర్పడతాయి. ఈవిధమైన మాండలికాలు ప్రపంచ భాషలన్నింటిలోనూ వుంటాయి.

## 10.1. మండలమంటే ఏమిటి ?

మండలమంటే దేశ భాగమని అర్థం. ఒకజాతి ప్రజల్నికానీ, సంఘాన్ని కానీ, మండలమని పిలుస్తారు. మండలానికి 'జిల్లా', 'రాశి', 'సమూహం', 'గుంపు' అనే అర్థాలు కూడా వున్నాయి. నిర్ణీత జనసముదాయానికి లేదా పరిమిత వ్యవహార ప్రాంతానికి మండలమని పేరు. 'మండలం' అనేది సంస్కృత పదం.

## 10.2. మాండలికమంటే ఏమిటి ?

మండల సంబంధమైంది మాండలికం. ఒకే భాషకు చెందిన భిన్న భిన్న ప్రాంతాల్లోని భేదాల్ని మాండలికాలుగా పిలుస్తారు. ఒకే భాషకు ప్రజల వ్యవహారంలోనూ, పదాల్లోనూ, వాటి ఉచ్చారణలోనూ, ప్రత్యయాల్లోనూ, పదాల అర్థాల్లోనూ, వ్యాకరణంలోనూ వాక్యరచనలోనూ, భేదాలు వుంటాయి. ఒకే భాషకు వున్న ఇలాంటి భేదాల్ని 'మాండలికాలు' అని అంటారు.

శబ్దరత్నాకరం, సూర్యరాయాంధ్ర నిఘంటువుల్లో 'మాండలికం' అనే పదం చోటు చేసుకోలేదు. కాబట్టి ఈ పదాన్ని ఆధునిక పదంగా మనం భావించవచ్చు. 'మాండలికం'ను వేదం వేంకటరాయశాస్త్రి గారు 'మాండలిక భాష' అని వ్యవహరించారు. గిడుగు రామమూర్తి పంతులు గారు 'మాండలికం', 'మాండలీయక భాష' అని అన్నారు. మొత్తం మీద మాండలిక భాష అంటే నిర్ణీతమైన మండలంలో ప్రధాన భాషలో భాగమై, ఆ భాష కంటే కొంత వేరై వెలుగొందేది. భాష విశాలమైంది. మాండలిక భాష పరిమితమైంది.

భాషా వ్యవహర్తల్లో ఎక్కువ స్థాయిలో వున్నవారి మాండలిక భాషను "ప్రామాణిక మాండలికం" (Standard Dialect) అని అంటారు. తక్కువ స్థాయిలో వున్నవారి మాండలిక భాషను 'న్యూనప్రామాణిక మాండలికం" (Sub- Standard Dialect) అని అంటారు. దీనికి సంబంధించి కొందరు భాషాశాస్త్రవేత్తల అభిప్రాయాలు పరిశీలిద్దాం.

### 1. హేమనీ :

"Sub divisions of a language are referred to as dialects"

- Historical Linguistics an Introduction P.3

### 2. ఆచార్య పి.యస్.సుబ్రమణ్యం :

ఒకే భాషకు ప్రజల వ్యవహారంలో పదాలలోనూ, వాటి ఉచ్చారణలోనూ, ప్రత్యయాలలోనూ, పదాల అర్థాలలోనూ, భేదాలు వుండి ఆ భాషలో రకాలు వుంటాయి. ఒకే భాషకు వున్న ఇలాంటి రకాల్ని "మాండలికాలు" (Dialects) అని అంటారు.

- ఆధునిక భాషాశాస్త్ర సిద్ధాంతాలు - పుట 159.

## 10.3. మాండలిక భాష - పర్యాయపదాలు :

మాండలిక భాషకు 'ఉపభాష', 'ప్రాదేశికభాష', 'ప్రాంతీయభాష' అనే పర్యాయపదాలు (Synonyms) కూడా వున్నాయి. మాండలిక భాషను ఆంగ్లంలో 'డైలక్ట్' (Dialect) అని అంటారు. భాషలో వుండే ప్రాంతీయమైన భేదాల్ని అధ్యయనం చేయడాన్ని Dialectology అని అంటారు. ఈ "Dialect" అనే ఆంగ్ల పదం ఫ్రెంచి "Dialecte" అనే పదం నుంచి ఏర్పడింది. ఫ్రెంచి "Dialecte" అనేపదం లాటిన్ "Dialectus" నుండి వచ్చింది. "Dialectus" లాటిన్ పదం "Dialektos" అనే గ్రీకు పదం నుంచి వచ్చింది.

## 10.4. మాండలిక భాష - పరిశోధన :

పాశ్చాత్య దేశాల్లో ప్రారంభంలో 1881 లో జర్మనీ భాషకు చెందిన భాషా భేదాల్ని గూర్చి జార్జ్ వెంకర్ అనే ప్రముఖ భాషావేత్త మొదటిగా కృషి చేశాడు. అయితే ఆయన అధ్యయనం శాస్త్రీయ రీతిలో కొనసాగలేదు. పెక్కుమంది భాషావేత్తల కృషి ఫలితంగా 1943 నాటికి విదేశాల్లో మాండలిక భాషలపై విశేష పరిశోధన జరిగింది. తర్వాత మాండలిక పటాలు ప్రకటించ బడ్డాయి.

ప్రపంచ భాషల్లో మాండలిక భాషా పరిశోధన ఎక్కువగా ఇంగ్లాండులో జరిగింది. భారతదేశంలో మొట్టమొదటిసారిగా మాండలిక పరిశీలన జరిపిన ఘనత కేరళ రాష్ట్రానికి దక్కుతుంది. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్లోనూ, ఇతర ప్రాంతాల్లోనూ అన్ని విశ్వవిద్యాలయాల్లోనూ మాండలికాల మీద పరిశోధన జరిగింది. జరుగుతుంది.

## 10.5. మాండలికాలు - ప్రధాన లక్షణాలు :

1. ప్రధాన భాషలో, ప్రామాణిక భాషలో భాగంగా వుండటం.
2. భాషా వ్యవహర్తల మధ్య పరస్పర అవగాహన (Intelligibility) క్షమత్వం కోల్పోకుండా వుండడం.
3. పరిమిత ప్రదేశంలో అంటే నిర్ణీత ప్రాంతాల్లో మాత్రమే వ్యవహరించడం.
4. ముద్రించిన ప్రామాణిక సాహిత్యం లేకపోవడం.
5. న్యూనప్రామాణికం (Sub-standard) గా వుండడం.
6. కొన్ని పదాల్లో క్రియారూపాల్లో ప్రాంతీయ వైలక్షణ్యం పాలు ఎక్కువగా వుండడం.
7. పరిసర భాషల్లోని పదాల్ని గ్రహించి, ప్రామాణిక పదాలకు బదులుగా వాడడం.
8. క్రమక్రమంగా ప్రధాన భాషతో అంటే ప్రామాణిక భాషతో దగ్గరకు రావడానికి ప్రయత్నించడం.

## 10.6. మాండలికాలు ఏర్పడేతీరు :

మాండలిక భాషలు ఆవిర్భావానికి కాలక్రమంగా భాషల్లో కలిగే మార్పులు, భాషా వ్యవహర్తలు వలసపోవటం, ప్రధాన కారణాలుగా కన్పిస్తున్నాయి. మాండలిక భాషలు ప్రదేశాన్ని బట్టి, కాలాన్ని బట్టి ఏవిధంగా ఏర్పడ్డాయో ఇండో-

యూరోపియన్ భాషల్ని, ద్రావిడ భాషల్ని పరిశీలించిన తర్వాత మనకు అర్థమవుతుంది.

మూలభాషల (Proto-Languages) లోని మాండలికత వల్లే భిన్న భాషలు ఏర్పడ్డాయని భాషాశాస్త్రజ్ఞుల అభిప్రాయం. ద్రావిడ భాషా వ్యవహర్తలు క్రీ.పూ. 3000 సంవత్సర కాలం నుంచి ఉత్తర భారతదేశం నుంచి మధ్య భారతదేశానికి తర్వాత దక్షిణ భారతదేశానికి వచ్చారు. మూలద్రావిడ భాషలో ప్రధానంగా ఉత్తర ద్రావిడ భాషలు, మధ్య ద్రావిడ భాషలు, దక్షిణ ద్రావిడ భాషలు అనే మూడు మాండలికాలు ఏర్పడ్డాయి. ఒకే భాషా కుటుంబానికి చెందిన భాషలైనప్పటికీ ఇద్దరు వ్యక్తుల మధ్య మాట్లాడేటప్పుడు ఏ మాత్రమూ అవగాహన లేకపోతే వారు మాట్లాడే భాషల్ని భిన్న భాషలు గానే భావించాలి. ఈ రీతిగా ఒకే భాష పలుభాషలుగా మారడానికి అవకాశం వుంది. శబ్దార్థ పరిణామాలు భిన్నభాషల ఆవిర్భావానికి కారణాలయ్యాయి. ఈవిధంగా ఏర్పడిన ఈ కింది ద్రావిడ భాషల్ని చూడండి.

**ఏ. ఉత్తర ద్రావిడ భాషలు :**

1. బ్రాహుయీ, 2. కుడుఖ్, 3. మాల్తో

**బి. మధ్య ద్రావిడ భాషలు :**

1. తెలుగు, 2. గోండీ, 3. కొండ, 4. పెంగ్, 5. మండ, 6. కూయి, 7.కువి, 8. కోలామీ, 9. నాయకీ, 10. పర్జీ, 11. గదబ, 12. ఒల్లారి.

**సి. దక్షిణ ద్రావిడ భాషలు :**

1. తమిళం, 2. కన్నడం, 3. మలయాళం, 4. కొడుగు, 5. తుళు, 6. కోత, 7. తొద, 8. బడగ.

ఒకే మూలద్రావిడ భాష కాలక్రమేణా మాండలికాలుగా విడివడిన కారణంగా 23 ద్రావిడ భాషలుగా ఏర్పడడం ప్రత్యేక విశేషం.

**భాషలో మాండలికాలు ఏర్పడడానికి కొన్ని ప్రధానమైన కారణాలున్నాయి. అవి ఇవి:**

1. వ్యవహర్తల సంఖ్య పెరగడం.
2. వ్యవహార ప్రాంతం పెరగడం. వ్యవహార ప్రాంతం విస్తృతి వల్ల భాషా వ్యవహర్తల మధ్య భాషా వైరుధ్యం కలిగి, భిన్న మాండలికాలు ఏర్పడతాయి.
3. మాతృ భాషా ప్రాంతం నుంచి దూరం అవడం.
4. కొత్తగా విస్తరించిన ప్రాంతాల్లో కొత్త భాషలతో కలియడం.
5. నూతన ప్రాంతాల్లోని వాతావరణం, శీతోష్ణస్థిత్యాది పరిస్థితుల్లో భేదాల వల్ల కొత్త భావాల్ని బోధించే పదాల్ని కొత్తగా సృష్టించడం లేక స్థానిక భాషల్లోని పదాల్ని ఆదానం చేసుకోవటం, లేక పాత మాటలనే కొత్త అర్థాలతో వుపయోగించడం మొదలైన ప్రయత్నాల వల్ల కొత్త కొత్త పదాలు ఏర్పడడం.

6. నగరాలు, రాజధానులుగా ఏర్పడడం, ఆ నగర భాష ప్రామాణికం కావడం.

7. ప్రజల విద్యా సంస్కారాదుల్లో భేదం వుండడం.

8. ఒకే భాషా ప్రాంతం రాజకీయంగా భిన్న సీమలుగా విడగొట్టబడడం వల్ల కూడా మాండలికాలు ఏర్పడ్డాయి. ఉదాహరణకు రాయలసీమ, సర్కారు, తెలంగాణా ప్రాంతాలు.

9. భిన్న వృత్తుల్ని అవలంబిస్తూ వుండడం.

10. వ్యవసాయ, చేనేత, జాలరి, కుమ్మరి, కమ్మరి మొదలైన వృత్తుల వారు వాడుకునే పనిముట్లనూ, చేసే పనులనూ, బోధించే పదాలు ఆయా వృత్తులకూ, ఆయా ప్రాంతాలకూ పరిమితమై వుండడం.

11. బ్రహ్మాండమైన పర్వత శ్రేణులు, నదులు, అడవులు మొదలైనవి రాకపోకలకు ప్రతిబంధకాలై భాషా వ్యవహారంలో భేదాలకు కారణం అవడం.

12. ఆంధ్రదేశానికి పొరుగున వున్న తమిళనాడు, మహారాష్ట్ర, ఒరిస్సా, కర్ణాటక దేశాలతో భౌగోళికమైన సరిహద్దులు స్పష్టంగా లేకపోవడం.

13. ఒకే ప్రాంతంలోని ప్రజలు విభిన్నమైన సాంఘిక, ఆర్థిక పరిస్థితులకు చెందిన వారై వుండడం.

14. ప్రాచీన కాలంలో రాకపోకలకు సరైన సదుపాయాలు లేకపోవడం కారణంగా భాషా వ్యవహర్తల పరస్పర సంబంధాలు సన్నగిల్లి భాషా వ్యవహారంలోని సమరూపత లోపించి మాండలికాలు ఏర్పడతాయి.

15. ఒక ప్రాంతానికి వలసవెళ్ళి, స్థిరపడితే పరిస్థితులకు అనుగుణంగా భాష మారుతుంది. భాషా వ్యవహర్తలు వలస వెళ్ళేటప్పుడు ఆయా ప్రాంతాల్లో వేరే విధంగా వున్న వాతావరణం, జంతువులు, పక్షులు, చెట్లు స్వీయ భాషను ప్రభావితం చేస్తే మాండలికాలు ఏర్పడ్డాయి.

16. భాష మార్పుకులోనుకావడం సహజం. భాషలో శబ్దార్థాలు మార్పులు చోటుచేసుకుంటాయి. భిన్న ప్రాంతాల ప్రజల భాషలో శబ్దార్థాల పరిణామం చెందిన కారణంగా ఒకే భాషలో భిన్న మాండలికాలు ఏర్పడతాయి.

17. రాజకీయ కారణాల వల్ల కూడా మాండలికాలు ఏర్పడతాయి. నిజాం పాలకుల పరిపాలన వల్ల తెలంగాణా ప్రాంతంలో నసీబు, జమానా, గల్లీ, దోస్తి లాంటి పదాలు చేరడం వల్లే తెలంగాణా మాండలికాలు ఏర్పడ్డాయి.

18. ఇప్పుడు మనకు వున్న రేడియోలు, టి.వి.లు, వార్తాపత్రికలు, సినిమాలు, టెలిఫోన్లు మున్నగు ఆధునిక సౌకర్యాలు పూర్వం లేవు. కాబట్టి సమాచారం చేరవేతలోని (%ణఊర్ఘుఅఎవ%) అసౌకర్యాల వల్ల కూడా మాండలికాలు ఏర్పడతాయి.

## 10.7. మాండలికాలు - ప్రయోజనాలు :

మాండలికాల వల్ల అనేక ప్రయోజనాలున్నాయి.

1. మాండలికాలు భాషకు సజీవ చిహ్నాలు. జీవభాషకు మార్పులు సహజం. కాబట్టి ఈ మార్పు వల్ల భాషా రూపాన్ని గ్రహించడమే మాండలికాల ప్రత్యేకతగా చెప్పవచ్చు.

2. భాషా స్వరూపాన్నే కాక భాషాచరిత్రను కూడా మాండలికాల వల్ల తెలుసుకోవచ్చు.

3. మాండలిక పరిశోధన వల్ల ప్రత్యేక నిఘంటు నిర్మాణం చేయవచ్చు.

4. ఒకే పదానికి గల ఉచ్చారణ, అర్థభేదాల్ని సులభంగా గుర్తించవచ్చు.

5. ఒక కాలంలో ఏకరూపంగా వున్న పదాలు కాలక్రమంలో భిన్న రూపాలుగా స్థిరపడతాయన్న విషయాన్ని తెలుసుకోవచ్చు.

6. మాండలికాల వల్ల ప్రాచీన గ్రంథాల్లో వచ్చిన పదాలకు స్పష్టార్థ నిరూపణ సాధ్యమవుతుంది.

7. ప్రాచీన కవి రాసిన రచనల్లోని పదాల్ని ఆధారంగా చేసుకొని ఆ కవి ఏ ప్రాంతానికి చెందినవాడో స్పష్టంగా తెలుసుకోవచ్చు. కవులు వాడిన మాండలికాల్ని బట్టి వారు ఏ ప్రాంతానికి చెందిన వారో నిర్ధారించవచ్చు.

   ఉదాహరణకు 'గునపం', 'గెడ్డపార' పదాలు పింగళి సూరనకు ముందున్న కవులు ఎవ్వరూ ప్రయోగించలేదు. ఇవి గోదావరి మాండలిక పదాలు. తిక్కన, భారతంలో 'మోట' అనే అర్థంలో 'కపిల' అనే పదాన్ని వాడాడు. 'కపిల' పదం నెల్లూరు ప్రాంతంలో వ్యవహారంలో వుంది.

8. మాండలిక పదాల్ని బట్టి ప్రజలు ఏయే దిక్కులుగా వలస పోయింది మనం ఊహించవచ్చు. ఉదా? భాగవతకర్త పోతనలో రాయలసీమ పదాలు కన్పించడం.

9. ఒక ప్రాంతంలో వ్యవహారంలో లేని పదాల్ని మాండలిక వ్యవహార ప్రాంతం నుంచి సమకూర్చుకోవడం ద్వారా ప్రధాన భాషను సుసంపన్నం చేయవచ్చు.

10. మాండలికాల ద్వారా సాంఘిక, రాజకీయ చరిత్రకూ భాషకూ వున్న పరస్పర సంబంధాన్ని తెలుసుకోవచ్చు. మాండలిక పద వ్యాప్తిని అనుసరించి సాంఘిక రాజకీయ హేతువుల్ని కూడా గ్రహించవచ్చు.

11. గ్రాంథిక రూపాలు మాండలికాలు గానూ, మాండలికాలు గ్రాంథిక రూపాలుగానూ, మారుతాయి.

12. రానురాను మాండలికాలు , ప్రామాణిక భాషలో ప్రవేశించాక కాలక్రమేణా నశిస్తాయి.

13. మాండలిక పరిశీలన వల్ల భాషకు ఎంతో మేలు జరుగుతుంది. ఈ మాండలికాలు భాషకు, వైవిధ్యాన్ని, సౌందర్యాన్ని పెంపొందిస్తాయి.

## 10.8. మాండలికాలు - పరిశీలనా పద్ధతులు :

మాండలిక పరిశీలనా పద్ధతులు ఇవి :

ఎ. ఏదో ఒక పదాన్ని తీసుకొని ఆ అర్థంలో మిగిలిన ప్రాంతాల వారు ఏమని వాడుతున్నారో అని పరిశీలించడం.

బి. దేశమంతటా ఒకే శబ్దం ఉచ్చారణ భేదాలతో వున్న వాటిని గ్రహించడం

సి. వ్యాకరణ ప్రక్రియల్ని వాటి విశేషాల్ని సేకరించడం.

**ఎ. ఏదో ఒక పదాన్ని తీసుకొని ఆ అర్థంలో మిగిలిన ప్రాంతాల వారు ఏమని వాడుతున్నారో అని పరిశీలించడం**

ఒకే అర్థం తీసుకొని మిగిలిన ప్రాంతాల్లో ఆ పదానికి ఏ మాట వాడుతారో ప్రతీ పల్లెకీ తిరిగి సేకరించడం. 'నాగలి' అంటే పొలం దున్నే పనిముట్టు. దీనికి నాంగలి, నాగెలు, నాగేలు 'మడక' అనే పదాలు వ్యవహారంలో వున్నట్లు పరిశోధన వల్ల తేటతెల్ల మవుతుంది. పైన చెప్పిన మాటల్లో 'మడక' అనే పదం తప్ప మిగిలిన పదాలన్నీ ఇంచుమించు రూపాంతరాలు. అంటే చారిత్రకంగా ఒకే ప్రాచీన శబ్దం నుంచి ఏర్పడినవని నిర్ధారించవచ్చు. 'నాంగేల్' అనేది ప్రాచీన రూపం. 'మడక'' దానికి పర్యాయపదం.

మాండలిక భాషా భేదాలు సాధారణంగా శబ్దార్థాల్లోని పరిణామాల్ని బట్టి కొత్త రూపాన్ని పొందుతుంటాయి. ఒకే పదం భిన్న కాలాల్లో భిన్న మండలాల్లో అర్థపరిణామం చెందుతుంది. ఉదాహరణకు 'కంపు' అనే పదానికి 'సుగంధం' అని ప్రాచీన అర్థం అయితే నేడు 'సుగంధం' అనే అర్థంలో కాక 'దుర్గంధం ' అనే అర్థంలో వాడబడుతుంది.

'చీర' అంటే వస్త్రమని ప్రాచీన అర్థం. నేడు ఆడువారు మాత్రమే కట్టుకొనే 'కోక' అని నవీనార్థం.

'తగవు' అనే మాటకు న్యాయమని, ధర్మమని ప్రాచీన అర్థం. నేడు న్యాయం కోసం జరిగే పోట్లాట అనీ, ధర్మనిర్ణయం కోసం జరిగే వివాదమనీ అర్థం.

'రేపు' అంటే ప్రాతఃకాలమని ప్రాచీన అర్థం. నేడు 'రేపు' అంటే 'మరుసటి రోజు' అని అర్థం.

'వగలు' అంటే రీతులు అని ప్రాచీన అర్థం. నేడు 'ఒయ్యారం' అని అర్థం. 'చేను' అంటే 'పైరు' లేక 'పంట' అని తీర ప్రాంతపు వారు వ్యవహరిస్తున్నారు. 'పొలం' అని పశ్చిమాంధ్రవారు వాడుతారు.

'పప్పులు' అంటే పప్పుధాన్యాలని కోస్తావారు వ్యవహరిస్తారు. 'వేయించిన సెనగ పప్పు' అనే అర్థంలో గ్రామీణులు వాడుతున్నారు. కంది, పెసర, మినప మొదలైన వాటిని 'పప్పు' అని ఉత్తరమండలాల వారు వ్యవహరిస్తున్నారు. రాయలసీమలో కొన్ని ప్రాంతాల్లో ఇదే వ్యవహారంవుందని తెలుస్తుంది. 'బేడ'లు అంటే రాయలసీమలో 'పప్పులు' అని అర్థం.

'బేడలు' అంటే నయాపైసలు రాకపూర్వం వుండే మానం రెండణాలు అని సర్కారు మండలాల వారి వ్యవహారం. రూపాయలు, అణాలు, కానులు, దమ్మిడీలు, వుండే మానం. ఇప్పుడు వ్యవహారంలో లేదు.

**బి. ఆంధ్రదేశమంతటా ఒకే పదం ఉచ్చారణ భేదాలతో వున్న వాటిని గ్రహించడం :**

1. పన్ని - పన్నె - పన్య - పైన
2. నాగలి - నాగల - నాంగలి - నాగెలి - నాగేలి - నాగేలీ
3. బొత్తం - బొత్తాను - బొత్తాం - బొత్తాయి
4. తిరగమోత - తిరగమాత - తిరగబోత - తిరగబాత

**సి. వ్యాకరణ ప్రక్రియల్ని - వాటి విశేషాల్ని సేకరించడం :**

1. క్రియారూపాల్లో మాండలిక భేదం గుర్తించడం

2. వ్యతిరేకార్థకంలో భిన్న మండలాల్లో భిన్న రూపాలు చాలా స్పష్టంగా కన్పిస్తున్నాయి.

3. భావార్థకాల్లో గుంటూరు ప్రాంతానికి ఇతర ప్రాంతానికి చాలా తేడాలు కన్పిస్తున్నాయి.

4. ఇంకా నామవాచకాల్లో, సర్వనామాల్లో, అవ్యయాల్లో భిన్న మండలాల్లో భేదం కన్పిస్తుంది.

పైన చెప్పిన మాండలిక పరిశీలనా పద్ధతుల ద్వారా భిన్న మండలాల్లో వున్న ఒకే పదం ఏయే రూపాల్లో వుందో తెలుసుకోవడానికి అవకాశం వుంది. మాండలిక పరిశీలన వల్ల భాషకు ఎనలేని మేలు జరుగుతుంది.

## 10.9. వ్యవహార భేదకరేఖలు (Isoglosses) :

తెలుగుభాషలో జరిగిన మాండలిక పరిశీలన ఇప్పటివరకు ప్రధానంగా పదాల వాడుక లక్ష్యంగా జరిగిందే కాని భాషా మండలాలు నిరూపించే ఉద్దేశంతో చేసింది కాదు. వృత్తుల్లో వున్న పదాల్ని కోశస్థం చేసే దృష్టితో చేసింది. కాబట్టి మాండలిక పరిశీలన స్థూల దృష్టితో చేసింది మాత్రమే అనే విషయం మనం గుర్తుంచుకోవాలి. ఈ రీతిగా గీసిన పటాల్లో వాడుక మారిన ప్రతిచోట గుర్తులు మార్చాలి. ఇలాంటి గుర్తులన్నింటినీ ఒకవైపుకు వచ్చేటట్లు ప్రత్యేకంగా వేరుచేసి పటంలో గుర్తించి, గీసిన గీతనే 'వ్యవహార భేదకరేఖ' (Isogloss) అని అంటారు. ఒక విలక్షణ ఉచ్చారణ లేక పదమో వ్యాపించిన ప్రాంతాల నుండి వేరుచేసే రేఖనే 'వ్యవహార భేదకరేఖ' అని అంటారు.

ఉదాహరణకు ఆంధ్రప్రదేశ్ పటంలో 'పేడ'ను 'పెండ' అని వ్యవహరించే తెలంగాణా ప్రాంతాన్ని ఒక గీత వల్ల మిగిలిన ప్రాంతాల నుంచి వేరుచేసి చూపించవచ్చు. ఇది ఒక వ్యవహార భేదక రేఖ.

ఆచార్య భద్రిరాజు కృష్ణమూర్తి గారి ఆధ్వర్యంలో రూపొందించబడిన వృత్తి పదకోశం తెలుగులో వ్యవహార భేదకరేఖల్ని (Isoglosses) గుర్తించడానికి వుపయోగపడుతుంది. వ్యవహారభేదక రేఖలు భాషా స్వరూపాన్ని తెలుసుకోవడానికి పనికి వస్తాయి.

## 10.10. మాండలిక పటాలు (Dialect Atlas) :

ప్రాంతీయ భేదాల్ని క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాత మాండలికాల్ని జాగ్రత్తగా గుర్తించి, ఏదో ఒక వర్గానికి చెందిన వారి వాడుకకు సంబంధించిన పదాల వివరాలు, ఒక పద్ధతి ప్రకారం సేకరించాలి. ఇలా సేకరించిన వాడుక పదాలకు ఒక్కొక్క దానికి ఒక్కొక్క సంకేతం పెట్టుకొని, ఆంధ్రప్రదేశ్ పటంలో గుర్తించాలి. వాడుక మారినచోట, తప్పనిసరిగా సంకేతం మారుతుంది. రీతిగా సిద్ధం చేసుకున్న పటాల్ని మాండలిక పటాలు (Dialect Atlas) అంటారు. మాండలిక పటాలు వృత్తి పదకోశాల్లోనూ, 'తెలుగు భాషా చరిత్ర'' లోనూ చోటుచేసుకున్నాయి.

పదాలు ప్రధానంగా గీచిన పటాల్ని "Word Atlas' అనీ, ధ్వనులు ప్రధానంగా గీచిన పటాల్ని "Phonotic Atlas' అనీ, వ్యాకరణ విశేషాలు లక్ష్యంగా గీచిన పటాల్ని, "Grammatical Atlas'' అని అంటారు.

## 10.11. తెలుగు భాష-వ్యావహారిక మండలాలు-ఆచార్య భద్రిరాజు కృష్ణమూర్తి '

ప్రముఖ భాషాశాస్త్రజ్ఞులు ఆచార్య భద్రిరాజు కృష్ణమూర్తి గారు 'తెలుగునాడు'ను వివిధ వృత్తిపరమైన పదకోశ పరిశోధన ఆధారంగా, నాలుగు భాషా వ్యావహారిక మండలాలుగా విభజించారు.

ఎ. పూర్వమండలం / కళింగ ప్రాంతం /

బి. మధ్యమండలం / కోస్తా ప్రాంతం /

సి. దక్షిణమండలం / రాయలసీమ ప్రాంతం /

డి. ఉత్తరమండలం / తెలంగాణా ప్రాంతం /

### ఎ. పూర్వమండలం / కళింగ ప్రాంతం :

శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం మూడు జిల్లాలు 16వ శతాబ్దం వరకు కళింగ రాజ్యంలో భాగంగా వున్నాయి. కళింగుల దేశం కాబట్టి దీనికి కళింగ దేశమని పేరు వచ్చింది. కళింగ ప్రాంతాన్ని పూర్వ మండలంగా పిలుస్తారు. ఈ జిల్లాల్లోని భాష ఈనాటికీ మిగిలిన తెలుగుదేశంలోని జిల్లాల్లోని భాష కంటే విలక్షణంగా వుంటుంది. దీనికి కారణం ఒరియా భాషా ప్రభావం ఎక్కువగా వుండడమే.

పూర్వమండలంలోని భాష ఇతర మండలాల్లోని భాషకన్నా, విలక్షణంగా ప్రత్యేకంగా వుంటుంది. కళింగ ప్రాంతంలో 'తూము' అనే మాటకు బదులుగా 'మదుం' అని వ్యవహరిస్తారు. 'కాడి' ని 'పూజ/పూదు' అని అంటారు. 'కఱ్ఱు' ను 'నక్కు' అని అంటారు. 'సజ్జల'ను 'గంటి/గంటె' అని అంటారు. పశువుల్ని ఈ ప్రాంతంలోని వారు 'సొమ్ములు' అని అంటారు. 'సొమ్ము' అంటే ఐశ్వర్యం, ధనం అనే అర్థాలు ఇతర మండలాల్లో వున్నాయి. ప్రాచీన కాలంలో ద్రావిడులకు పశుసంపదే మూలం. 'సొమ్ము'లు అనే విషయం మన అందరికీ తెలిసిందే. కాబట్టి సొమ్ములు అంటే పశువులనే అర్థం నేటికీ పూర్వమండలంలో వుంది. 'కలుపు' ను కళింగ ప్రాంతంలో 'గాబు' అని వ్యవహరిస్తారు. తలుపుకు వేసుకొనే గొళ్లేం/ "గొళ్ళెం/ను 'గొలుసు' అంటారు. 'చేను'కు చుట్టూ వేసే కంచెను 'ఎలుగు' అంటారు. 'దువ్వెన'ను పూర్వమండలంలో పైన/ పన్ని/పన్నె అని అంటారు. ఇలా పూర్వమండలానికి ఇతర మండలాలకు తేడాలు చాలా స్పష్టంగా కన్పిస్తాయి.

#### 1. క్రియాపదాలు :

కళింగ ప్రాంతంలో క్రియాపదాల్లో మాండలిక భేదం సుస్పష్టంగా కన్పిస్తుంది. ఈ మండలంలోని మాండలిక పదాలకు ఇతర మండలంలోని పదాలకు తేడా పరిశీలించండి.

| ఉదా॥ పూర్వమండల భాష | | మధ్యమండల భాష |
|---|---|---|
| (కళింగ జిల్లాల భాష) | | (కోస్తా జిల్లాల భాష) |
| వెళ్ళొచ్చీశాడు/వచ్చీశాడు | - | వచ్చేడు |
| తెచ్చీశాడు | - | తెచ్చేడు |
| ఇచ్చీశాడు | - | ఇచ్చేడు |

| | | |
|---|---|---|
| చేసేశాడు | - | చేసేడు |
| కట్టేశాడు | - | కట్టేడు |

**2. ధ్వనుల మార్పులు :**

| | | | |
|---|---|---|---|
| ఉదా॥ | మన్వరాలు | - | మనవరాలు |
| | పిల్లేదు | - | పిలవలేదు |
| | కడత | - | కణత |
| | మిర్వకాయ | - | మిరపకాయ |
| | సెక్రం | - | చెక్రం / చక్రం |
| | కల్లేదు | - | కలవలేదు |
| | సేలా | - | చాలా |
| | వడుకు | - | వణుకు |

**3. పిలుచు, కలుసు క్రియలు కొందరి వ్యవహారంలో వ్యతిరేకార్థక ప్రత్యయంలో పిల్, కల్‌గా వుంటాయి.**

| | | | |
|---|---|---|---|
| ఉదా॥ | పిల్ - లేదు | - | పిలవలేదు |
| | కల్ - లేదు | - | కలవలేదు |
| | పిలను | - | పిలవను |
| | కలను | - | కలవను |
| | పిలొద్దు | - | పిలవొద్దు |
| | కలొద్దు | - | కలవొద్దు |

4. పూర్వమండంలో అవశిష్ట రూపాలు చోటుచేసుకున్నాయి.

| | | | |
|---|---|---|---|
| ఉదా॥ | మట్టు | - | తొక్కు |
| | నూలు | - | నువులు |
| | బైసి | - | సిగ్గు |

**5. కళింగ ప్రాంతంలోని మాండలిక పదాలు పరిశీలిస్తే కొన్ని ప్రత్యేకతలు చాలా స్పష్టంగా కన్పిస్తాయి.**

ఉదా॥ ఎ. పూర్వమండలంలో దూరాన్ని సూచించడానికి 'అల్లక్కడ' అని అంటారు. దగ్గర సూచించడానికి 'ఇల్లిక్కడ' అని వ్యవహరిస్తారు.

బి. కళింగ ప్రాంతంలో 'ఆవల' అనడానికి 'అవతల' అని అంటారు. 'ఈవల' అనడానికి 'ఇవతల' అని వ్యవహరిస్తారు.

సి. సంఖ్యా వాచకాల్లో 'వంద'కు బదులుగా 'నూరు' అనే పదాన్ని వాడతారు. 'నూరు' అనేది అచ్చ తెలుగుపదం.

డి. కళింగ ప్రాంతంలో 'నేను' అనే సర్వనామానికి 'నాను' అని వాడతారు.

ఇ. ఈ మండలంలో ద్వితీయ విభక్తికి బదులుగా షష్ఠీ విభక్తిని వాడతారు.

ఉదా॥ నీకు రమ్మన్నారు / నిన్ను రమ్మన్నారు /

దేవుడికి ఎంత ప్రార్థించినా / దేవుణ్ణి ఎంత ప్రార్థించినా/

**6. పూర్వ మండలంలోని పదాల్ని, పదబంధాల్ని పరిశీలిస్తే చాలా వింతగా వుంటుంది. ఇతర మండలాల్లోని వారికి ఈ పదాలు అర్థం కావు.**

ఉదా॥

| పూర్వ మండల పదం | | అర్థం |
|---|---|---|
| మెతుకులు, బువ్వ | - | అన్నం |
| మార్పులు | - | పెద్ద చేపలు |
| మిట్టలు | - | చిన్న చేపలు |
| చితకలు, నీసు | - | మాంసం |
| ఈరకత్తి | - | వియ్యపురాలు |
| పల్లకో | - | మాట్లాడకు |
| నెయ్యిలు | - | పేలాలు |
| చీనీ | - | పంచదార |
| జిబ్బి | - | అనవం వార్చేటప్పుడు వుపయోగించే వెదురుపుల్లలతో అల్లిన వెడల్పయిన మూకుడు |
| పెన (డ) క | - | ఇంటి పైభాగం |
| కంప | - | కొబ్బరి చీపురు |
| కమాను | - | కేంపు |
| కునికెయ్యడం | - | చచ్చిపోవడం |
| కోనారి | - | యాదవ/గొల్ల |

| | | |
|---|---|---|
| గల్లా | - | కిరోసిన్ పంప్ |
| గొల్లు | - | అల్లరి |
| దుక్కిపూయు | - | బండికి ఎడ్లు కట్టడం |
| నాగులు | - | చెవులకు పెట్టుకునే ఆభరణం |
| పలకర్ర | - | పళ్ళు తోముకొనే పుల్ల |
| భోజీ | - | విందు భోజనం |
| వలం | - | లావు |
| అప్ప | - | అక్క |
| అప్పసం తీయు | - | పొలంలో నీరు పోవడానికి కాలువ తీయడం |
| అరక | - | మంచం |
| ఇందల | - | ఇందులో |
| ఇకటం | - | పరాచికం |
| ఇడుకొను | - | ఉంచుకోవడం |
| ఇర్తి | - | వృత్తి |
| ఊజు | - | చేపలు పట్టుకొనే ఊత |
| ఎడ్లు | - | గొడ్లు / ఎద్దులు |

**7. పూర్వమండలంలో ఒరియా పదాలు :**

పూర్వమండల ప్రాంతం ఒరిస్సా రాష్ట్రానికి దగ్గరగా వుండడం వల్ల అనేక ఒరియా పదాలు ఈ ప్రాంతంలో చేరాయి. ఉదా? కంబారి, బుగత, భోగట్టా మొదలైన పదాలు ఈ విధంగా చేరినవే.

**బి. మధ్య మండలం / కోస్తా ప్రాంతం :**

తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, కృష్ణా, గుంటూరు, జిల్లాలోని తెలుగుభాషను మధ్యమండల భాషగా వ్యవహరిస్తారు.

ఉదా॥ వచ్చేడు, ఇచ్చేడు, కొట్టేడు, కాడి, ఏడికర్ర, ఆనప/బ/కాయ, మోట, తూము, కాడి, నాగలి, కర్రు, పేడ, చక్రం, గోంగూర, కలుపు, దువ్వెన, పప్పులు, పునాది, పశువులు, గేదె / బర్రె మొదలైన పదాలు ఈ మండలానికి చెందినవే.

ఈ ప్రాంతం తెలుగుదేశంలో సుభిక్ష ప్రాంతమై సస్యశ్యామల శోభితమై సిరి సంపదలతో వెలుగొందుతున్న కారణంగా ఈ మాండలిక భాష తెలుగుదేశం లో ప్రామాణిక భాషగా వెలుగొందుతుంది. ఈ మాండలిక భాషలోని పదాలు, పద సంపుటాలు, చలనచిత్రాల్లోనూ, టి.వి.ల్లోనూ, వార్తాపత్రికల్లోనూ, కథల్లోనూ, నవలల్లోనూ, వుపయోగించబడుతున్నాయి. ఈ మండల భాషపై సంస్కృత భాషా ప్రభావం బాగా కన్పిస్తుంది. తెలుగులో తొలి అనువాద కవి అయిన నన్నయ ఈ ప్రాంతానికి చెందినవాడే. అంటే మహాభారతం మధ్యమండలం నుంచి వచ్చిందన్నమాట. ఇతర మాండలిక భాషా వ్యవహర్తల కంటే ఈ మండలంలోని భాషా వ్యవహర్తల వ్యవహారంలో సంస్కృత పదాల ప్రాచుర్యం ఎక్కువగా కన్పిస్తుంది.

**1. క్రియా రూపాలు :**

| ఉదా॥ మధ్య మండలం | | ఇతర మండలం |
|---|---|---|
| తిట్టేడు | - | తిట్టినవాడు/తిట్టినాడు |
| పోయేడు | - | పోయినాడు |
| కొట్టేడు | - | కొట్టినాడు |
| తెచ్చేడు | - | తెచ్చినాడు |
| చేసేడు | - | చేసినాడు |
| గెంతేడు | - | గెంతినవాడు |

**2. బహువచన రూపాలు :**

| | | |
|---|---|---|
| రోకలి + లు | - | రోకండ్లు |
| పుండు + లు | - | పుండ్లు |
| బండి + లు | - | బండ్లు |
| తిరగలి + లు | - | తిరగండ్లు |

మొదలైన బహువచన రూపాలకు బదులుగా రోకళ్ళు, పుళ్ళు, బళ్ళు, తిరగళ్ళు అనే రూపాలు మధ్య మండలంలో కన్పిస్తాయి.

**3. అచ్చతెలుగు పదాలు :**

తూర్పుమండలంలో బాల్చీ, బాల్టీ అని వాడుతుండగా మరికొన్ని మండలాల్లో బొక్కెన అని వ్యవహరిస్తుండగా, ఈ మధ్య మండలంలో 'చేద' అనే అచ్చ తెలుగు పదాన్ని వాడుతారు.

**సి. దక్షిణ మండలం / రాయలసీమ ప్రాంతం /**

అనంతపురం, కడప, కర్నూలు, చిత్తూరు, ప్రకాశం, నెల్లూరు, జిల్లాల్ని దక్షిణ మండలంగా పిలుస్తారు. తెలుగుదేశంలోని దక్షిణ మండలాన్ని శ్రీకృష్ణదేవరాయలు పరిపాలించిన కారణంగా 'రాయలసీమ' అని వ్యవహరిస్తారు.

రాయలసీమ ప్రాంతంలో 'మోట'ను 'కపిల'గా వ్యవహరిస్తారు. 'కాడి'ని 'కాడిమాను / కాడి' మానుగానూ, 'నాగలి' ని 'నాగేలి/మడక' గానూ, ఏడికర్రను నొగ/నగ గానూ, సజ్జలను సద్దలుగానూ, పప్పులను 'బేడ' లుగానూ, గోంగూరను గోగాకుగానూ, పునాదిని గునాది/ బునాది గానూ, గొళ్ళేన్ని చిలుకుగానూ, గేదెను ఎనుముగానూ, పులిహోరను చిత్రాన్నంగానూ వ్యవహరిస్తారు.

**1. బహువచన రూపాలు :**

ఈ మండలంలోని బహువచన రూపాలు ప్రామాణిక తెలుగు కంటే ప్రత్యేకమైన విశిష్టమైన లక్షణాలు కలిగి వుంటాయి.

| ఉదా॥ ప్రామాణిక తెలుగు | | దక్షిణ మండలం |
|---|---|---|
| ఏరు + లు < ఏళ్ళు | - | ఏర్లు |
| ఊరు + లు < ఊళ్ళు | - | ఊర్లు |
| ఇల్లు + లు < ఇళ్ళు | - | ఇండ్లు |
| గోరు + లు < గోళ్ళు | - | గోర్లు |
| చెల్లెలు + లు< చెల్లెళ్ళు | - | చెల్లెండ్రు |

**2. సంఖ్యావాచకాలు :**

| ఉదా॥ ప్రామాణిక తెలుగు | | దక్షిణ మండలం |
|---|---|---|
| 1000 వెయ్యి | - | వేయి / వెయ్యి |
| 500 అయిదొందలు | - | ఐన్నూరు |
| 400 నాలుగొందలు | - | నన్నూరు |
| 300 మూడొందలు | - | మున్నూరు |
| 200 రెండొందలు | - | ఇన్నూరు |

**3. దక్షిణ మండలంలో శ - స భేదం పాటించకుండా ఇంచుమించు సకారంగానే వ్యవహరిస్తారు.**

| ఉదా॥ ప్రామాణిక తెలుగు | | దక్షిణ మండలం |
|---|---|---|
| శీతాకాలం | - | సీతాకాలం |

| | | |
|---|---|---|
| శుక్రవారం | - | సుక్రవారం |
| శనివారం | - | సెనివారం |

**4. నూరు - 100**

మధ్య మాండలికంలో 'వంద' అని వ్యవహరిస్తుండగా ఈ దక్షిణ మండలంలో 'నూరు' అని వాడతారు.

**5. క్రియా రూపాలు :**

| | | |
|---|---|---|
| ఉదా॥ | వెళ్ళినాడు | ఇచ్చినాడు |
| | కట్టినాడు | చంపినాడు |
| | నవ్వినాడు | చూపినాడు |
| | తెచ్చినాడు | తెచ్చినాడు |
| | వచ్చినాడు | చేసినాడు |

**6. దక్షిణమండలంలో**

| | | | |
|---|---|---|---|
| | వ్యతిరేక క్రియారూపాలు | | అర్థం |
| ఉదా॥ | లేకుండా వుండింది | - | లేదు |
| | చెప్పబడితే | - | చెప్పాల్సిన అవసరం లేదు |
| | చెప్పంది ఏమీ లేదు | - | చెప్పకూడనిది ఏమీ లేదు |
| | లేకుండా పోతే | - | లేకపోతే |
| | తినేది కాదు | - | తినడం కాదు |

**7. పదప్రయోగాల్లో దక్షిణమండలంలోని ప్రత్యేకత :**

| | | | |
|---|---|---|---|
| ఉదా॥ | పొద్దు | - | రోజు, దినం |
| | విసురురాయి / విసుర్రాయి | - | తిరగలి |
| | జల్ల | - | అబద్ధం |
| | సపారు | - | చిన్న గుడిసె |
| | మారుముట్లు | - | పనిముట్లు |

**8. దక్షిణమండలంలోని పదాలు ఇతర మండలం వ్యవహర్తలకు అర్థం కావు.**

| ఉదా॥ దక్షిణ మండలంలోని పదాలు | | అర్థం |
|---|---|---|
| సాబాగా | - | సరిగా |
| కువ్వాడం | - | పక్షపాతం |
| యాసిరిక | - | చేజారు |
| శరాయింపు | - | విరక్తి |
| కడ్యాయం | - | తప్పనిసరి |
| సంగ్యాలు | - | ఆచారాలు |
| ములాజ | - | సిఫార్సు |
| అల్లాడించు | - | బాగాతిను |

**9. నైసర్గికంగా ఈ ప్రాంతం సన్నిహితం కాబట్టి దక్షిణమండలంపై తమిళ కన్నడ భాషా ప్రభావం బాగా కన్పిస్తుంది.**

**i. తమిళ పదాలు :**

సివిల్ కేసెస్ వచ్చి నేను చూస్తాను /తెలుగు/

సివిల్ కేసెస్ నందునాన్ సాప్పేన్ /తమిళం/

**ii. కన్నడ పదాలు :**

| ఉదా॥ కన్నడ పదం | దక్షిణ మండల భాష | అర్థం |
|---|---|---|
| బేడ | బేడ | పప్పులు |
| కెలస | కెలసనం | పని |
| బీగం | బీగ | తాళం |
| కంబర | కంబార | కమ్మర |
| హోన్ | హొన్ను | బంగారం |
| ఎంౘకాయి | ఎంౘకాయి | పీత |
| ఈలకత్తి | ఈలకత్తి | కత్తిపీట |
| ఉగ్గాణీ | ఉగ్గాణీ | పోపు |
| హాళి | హాళి | క్రమం |

**డి. ఉత్తర మండలం / తెలంగాణా ప్రాంతం :**

జిల్లాల భాషను ఉత్తర మండలంగా పేర్కొంటారు. తెలంగాణా జిల్లాల్లోని తెలుగుభాష ఉర్దూ ప్రభావానికి లోనై, ప్రత్యేక మాండలిక భాషగా రూపుదిద్దుకుంది. ఉదాహరణకు పెండ/పేడ/, దుబ్బనేల/ఇసకనేల/, పుంటికూర/గోంగూర.

**1.** క్రియా రూపాలు :

ఉత్తర మండలంలోని క్రియా పదాలు ప్రామాణిక తెలుగు క్రియా పదాల కంటే భిన్నంగా వుంటాయి.

| | ఉత్తర మండలంలోని క్రియా రూపాలు | | ప్రామాణిక తెలుగు క్రియారూపాలు |
|---|---|---|---|
| ఉదా॥ | కట్టిండు | - | కట్టేడు |
| | వచ్చిండు | - | వచ్చేడు |
| | తెచ్చిండు | - | తెచ్చేడు |
| | ఇచ్చిండు | - | ఇచ్చేడు |

**2.** వర్తమానార్థక క్రియలు :

ఉదా॥ వస్తాండు / వస్తుండు / వాడు /

వసాతన్న / వస్తన్న / నేను /

వస్తాన్నం / వస్తన్నం / మేం/

వస్తాన్నయ్ / వస్తన్నయ్ / అవి

**3.** నామ విభక్తులు :

ఉదా॥ అందుకొరకు

ఎక్కడ నుంచి

వాని దగ్గరకు

వండ్ల వరకైనా

**4.** తద్ధర్మ భవిష్యదర్థక క్రియల్లోని రూపభేదాలు :

| | | |
|---|---|---|
| ఉదా॥ | వస్త | వస్తరు |
| | వస్తడు | వస్తది |
| | వస్తయ్ | వస్తవ్ |

**5. ఉత్తర మండలంలో అపదాది దీర్ఘాచ్చు చాలా వరకు హ్రస్వం అవుతుంది:**

| | | | |
|---|---|---|---|
| ఉదా॥ | వస్తాడు | - | వస్తడు |
| | చెప్తా | - | చెప్త |
| | అంటారు | - | అంటరు |

**6. ఉత్తరాంధ్ర జానపదుల భాష :**

| | | | |
|---|---|---|---|
| ఉదా॥ | వాన | - | ఆన |
| | ప్రభుత్వం | - | పెబుత్వం |
| | ఒకవేళ | - | ఒకేల |
| | లక్షణం | - | లచ్చనం |
| | ఇప్పుడు | - | యిప్పుడు |

| | | | |
|---|---|---|---|
| **7.** | **తెలంగాణా పదాలు** | | **ప్రామాణిక తెలుగు** |
| ఉదా॥ | కాని | - | కాడి |
| | తమిదె | - | చోడి |
| | చిట్టి | - | చిలాప |
| | గారె / గిర్త | - | చక్రం |
| | పాలె | - | మేడి |
| | పుంటికూర | - | గోంగూర |
| | పెండ | - | పేడ |

**8.** **ఉత్తర మండలంలో నిజాం నవాబుల పరిపాలన చాలాకాలం జరిగింది. ఆ కారణంగా ఉత్తర మండలంలో అనేక ఉర్దూ పదాలు చేరాయి.**

| | | | |
|---|---|---|---|
| | ఉత్తర మండలంలో / తెలంగాణా ప్రాంతం / వాడుకలో వున్న ఉర్దూపదాలు | | అర్థం |
| ఉదా॥ | సలామ్ | - | నమస్కారం |
| | షా | - | చక్రవర్తి |

| | | |
|---|---|---|
| కాఫిర్ | - | నాస్తికుడు |
| అఫ్‌సోస్ | - | విచారం |
| గులామ్ | - | బానిస |
| బేఫికర్ | - | నిశ్చింత |
| ఆఫీకు | - | నల్లమందు |
| ఫౌజ్ | - | సేన |

ఈవిధంగా తెలుగుభాషలో నైసర్గిక, రాజకీయ, సామాజికాది విషయాల వల్ల ఏర్పడిన మాండలికాల స్వరూపం, భాషలో వైవిధ్యం తెలుస్తుంది.

## ఆధార గ్రంథాలు :

**1. తెలుగు :**

1. ఆధునిక తెలుగు వ్యాకరణం - ఎన్. శివరామమూర్తి
2. ఆధునిక తెలుగు వెన్నెలకంటి వ్యాకరణం - వెన్నెలకంటి ప్రకాశం
3. ఆధునిక తెలుగు భాషా నిర్మాణం - శివుని రాజేశ్వరి
4. ఆధునిక ప్రామాణికాంధ్ర వ్యాకరణం - వజ్ఝల వేంకటేశ్వర్లు
5. ఆధునిక భాషా శాస్త్రం - వెలమల సిమ్మన్న
6. ఈనాడు భాషా స్వరూపం - బూదరాజు రాధాకృష్ణ
7. తెలుగు దారి - వెల్చేరు నారాయణరావు
8. తెలుగులో వెలుగులు - చేకూరి రామారావు
9. తెలుగు భాషా చరిత్ర (సంపాదకులు) - భద్రిరాజు కృష్ణమూర్తి
10. తెలగు భాషా చరిత్ర - వెలమల సిమ్మన్న
11. తెలుగు భాషా తత్త్వం - కొమర్రాజు లక్ష్మణరావు
12. తెలుగు భాషా శాస్త్రవేత్తలు - వెలమల సిమ్మన్న
13. తెలుగు భాషా స్వరూపం - బూదరాజు రాధాకృష్ణ
14. తెలుగు కావ్యం - చేకూరి రామారావు

15. ప్రౌఢ వ్యాకరణం - బహుజనపల్లి సీతారామయ్య

16. బాల వ్యాకరణం - చిన్నయ సూరి

17. బాల వ్యాకరణం - శాస్త్రీయ వ్యాఖ్య - వెలమల సిమ్మన్న, గుమ్మా సాంబశివరావు

18. భాషా తపస్వి గిడుగు - వెలమల సిమ్మన్న

19. భాషానువర్తనం - చేకూరి రామారావు

20. వ్యావహారిక భాషా వ్యాకరణం - వడ్లమూడి గోపాలకృష్ణయ్య

21. శబ్ద బ్రహ్మ చిన్నయ సూరి (అముద్రితం) - వెలమల సిమ్మన్న, గుమ్మా సాంబశివరావు

22. సంధి - వెలమల సిమ్మన్న

**2. ఆంగ్లం :**

1. A Grammar of Modern Telugu - Bh. Krishna Murthy
2. Sandhi Balavyakaranam - J. Pratap Reddy.

పాఠం - 11

# మాండలిక భేదాలు

## విషయసూచిక

11.1. మాండలిక భేదాలు

11.2. మాండలికాలు - వర్గీకరణ

11.2.1. ప్రాంతీయ మాండలికం

11.2.2. సామాజిక మాండలికం

11.2.3. చారిత్రక మాండలికం

11.2.4. జీవశాస్త్రానుసార మాండలికం

ఒకే భాష అది వ్యవహరించబడే భౌగోళిక స్థితిగతుల్నిబట్టి, దాన్ని వ్యవహరించే మనుష్యుల వివిధ స్థాయిల్ని బట్టి భిన్నత్వాన్ని సంతరించుకోగా, ఆ భిన్నత్వాన్ని పరిశీలించే శాస్త్రమే మాండలిక భాషా విజ్ఞానం. ఒక మండలం లోని భిన్న జనుల స్థాయి, స్త్రీ పురుషుల, వయస్కుల, పిల్లలు నేర్చుకునే ప్రారంభ దశ వారి భాష, వృత్తి, సంఘపరమైన వ్యావహారిక పదాల్ని మాండలిక భాషా భేదాల్ని అధ్యయనం చేయడమే మాండలిక భాషా విజ్ఞాన లక్ష్యం.

తెలుగు భాషను మాతృభాషగా సుమారు ఎనిమిదికోట్ల మంది మాట్లాడుతున్నారు. ఆంధ్రప్రదేశ్కు చెందిన అన్ని ప్రాంతాల్లోనూ నేడు ప్రధానంగా మాట్లాడబడేది ఒకే (తెలుగు) భాష అయినప్పటికీ ఇందులో ఏక రూపత లేదు. వ్యాకరణంలో, వాక్యనిర్మాణంలో, పదాల్లో, పదాల అర్థాల్లో, ప్రత్యయాల్లో, ఉచ్చారణలో, ఒకటేమిటి అన్నింటిలోనూ, అనేక భేదాలు కన్పిస్తున్నాయి. ఒకే పదార్థాన్ని సూచించడానికి భిన్న మండలాల్లో వేర్వేరు మాటల్ని వుపయోగిస్తున్నారు. ఈ భిన్న పదాలు ఒకటి కంటే ఎక్కువగా వుండవచ్చు. భాషా వ్యవహర్తల్లోని భిన్న భిన్న వృత్తుల్ని బట్టి ప్రాంతీయ భేదాల్ని బట్టి స్త్రీ పురుష భేదాల్ని బట్టి, సంఘంలోని స్థాయిని బట్టి, చదువును బట్టి, సంస్కారాన్ని బట్టి, ప్రాంతీయ భేదాలు ఏర్పడి మాండలికాలు. ఏర్పడతాయి.

## 11.1. మాండలికాలు - భేదాలు :

1. వివిధ ప్రాంతాల్లోని మాండలిక భేదాలు
2. క్రియారూపాల్లో మాండలిక భేదాలు
3. భావార్థక "ట" ప్రత్యయం "డ" గా మారడం
4. ఒకే భావాన్ని సూచించడానికి ప్రయోగించే భిన్న పద సముదాయాన్ని బట్టి కూడా మాండలికాల భేదాల్ని గుర్తించవచ్చు.

5. ఒకే శబ్దం ఉచ్చారణ భేదాల్లో వుండడం
6. వ్యతిరేకార్థంలో మాండలిక భేదాలు
7. సమానార్థకంలో వాడుతున్న పర్యాయపదాల వల్ల కూడా మాండలిక భేదాలు ఏర్పడతాయి.
8. పరిసర భాషా ప్రభావం వల్ల కూడా మాండలిక భేదాలు ఏర్పడతాయి.

**1. వివిధ ప్రాంతాల్లోని మాండలిక భేదాలు :**

| పూర్వమండలం | దక్షిణ మండలం | ఉత్తర మండలం | మధ్య మండలం |
|---|---|---|---|
| కళింగ ప్రాంతం | రాయలసీమ ప్రాంతం | తెలంగాణా ప్రాంతం | ఇతర కోస్తా జిల్లాలు |

**i. వ్యవసాయ పదాలు :**

| | | | |
|---|---|---|---|
| లాంగలం | నాగలి | నాగేలి / మడక | నాగలి |
| నక్కు | కర్రు | కర్రు | కర్రు |
| మేడి | మేడితోక | పాలె | మేడి |
| మోట | కపిల | మోట | మోట |
| మదుం | తూము | తూము | తూము |
| గబు | కలుపు | కలుపు | కలుపు |
| సొమ్ములు | నగలు | పశువులు | నగులు / డబ్బు |
| గేద | ఎనుము | పశువు | గేదె / బర్రె / గొడ్డు |
| పేడ | పేడ | పెండ | పేడ |

**ii. చేనేత పదాలు :**

| | | | |
|---|---|---|---|
| రాట్నం | రాట్నం / రాటకం | రాట్నం | ర్నాటం |
| పోము | పోగు | పోగు | పోగు |

**iii. ఇల్లుకు సంబంధించిన పదాలు:**

| | | | |
|---|---|---|---|
| గొలుసు | చిలుకు | గొండ్లెం | గొళ్ళెం |
| గునంప | గడ్డపార | గడ్డపార | గడ్డపార / గునపం / గడ్డపలుగు |
| పునాది | గునాది / బునాది | పునాది / బునాది | పునాది |
| చూరు | చూరు | చూరు | చూరు |
| ఎలుగు | కంచె | కంచె | కంచె / దడి |

**2. క్రియా పదాల్లో మాండలిక భేదాలు :**

| 1 | 2 | 3 | 4 |
|---|---|---|---|
| పూర్వ మండలం<br>కళింగ ప్రాంతం | దక్షిణ మండలం<br>రాయలసీయ ప్రాంతం | ఉత్తర మండలం<br>తెలంగాణా ప్రాంతం | మధ్య మండలం<br>ఇతర కోస్తా జిల్లాలు |
| వచ్చేశాడు | వచ్చినాడు | వచ్చిండు | వచ్చేడు |
| తెచ్చేశాడు | తెచ్చినాడు | తెచ్చిండు | తెచ్చేడు |
| ఇచ్చేశాడు | ఇచ్చినాడు | ఇచ్చిండు | ఇచ్చేడు |
| చేసేశాడు | చేసినాడు | చేసిందు | చేసేడు |
| కట్టేశాడు | కట్టినాడు | కట్టిండు | కట్టేడు |

**3. భావార్థక "ట" ప్రత్యయం "డ" గా మారడం :**

భావార్థక "ట'' ప్రత్యయం గుంటూరు మండలంలో విన్పిస్తూ వుండగా "డ'' గా మిగిలిన ఆంధ్రప్రాంతాల్లో పిలుస్తున్నారు ఈ రకమైన భేదం చాలా స్పష్టంగా కనబడుతుంది.

| గుంటూరు మండలం | ఇతర ఆంధ్రప్రాంత మండలాలు |
|---|---|
| తినటం | తినడం |
| కనటం | కనడం |
| చూడటం | చూడడం |
| చెప్పటం | చెప్పడం |
| నడవటం | నడవడం |
| పోవటం | పోవడం |
| వెళ్ళటం | వెళ్ళడం |
| వినటం | వినడం |
| పాడటం | పాడడం |
| అడగటం | అడగడం |
| చేయటం | చేయడం |
| కోయటం | కోయడం |

**4. ఒకే భావాన్ని సూచించడానికి ప్రయోగించే భిన్న పద సముదాయాన్ని బట్టి కూడా మాండలికాల భేదాల్ని గుర్తించవచ్చు:**

భిన్న మాండలికాల వారు ఒక సమానార్థకాన్ని తెలియజేయడానికి వేరు వేరు పదాలు వుపయోగిస్తారు.

ఉదా॥ అల్లుని తోలుకొని వస్తా (తెలంగాణా)

అల్లుని తీసుకుని వస్తా (ఇతర ఆంధ్రప్రాంతం)

**5. ఒకే శబ్దం, ఉచ్చారణ భేదాల్లో వుండడం :**

ఉదా॥ 1. గుండీ - బొత్తం - బొత్తాం - బొత్తాను - బొత్తాయి

2. బకెట్ - బకెట్టు - బాల్టీ - బాల్సా - బాల్చీ - బాల్టు

3. దువ్వెన - పన్ని - పన్నుం పన్య పైన

**6. వ్యతిరేకార్థంలో మాండలిక భేదాలు :**

ఉదా॥ కట్టకు, చెప్పకు, తినకు, వినకు, రాకు

| | | | |
|---|---|---|---|
| 1. కట్టకు : | కట్టబాక | - | కట్టబాకు |
| | కట్టబోక | - | కట్టబోకు |
| | కట్టమాక | - | కట్టవాక |
| 2చెప్పకు : | చెప్పబాక | - | చెప్పబాకు |
| | చెప్పబోకు | - | చెప్పబోక |
| | చెప్పమాక | - | చెప్పవాక |
| | చెప్పాక | - | చప్పాకు |
| 3. తినకు : | తినబాక | - | తినబోకజి |
| | తినబాకు | - | తినబోకు |
| | తినమాక | - | తినవాక |
| | తినాక | - | తినాకు |
| 4. వినకు : | వినబాక | - | వినబోక |
| | వినబోకు | - | వినబోకు |
| | వినమాక | - | వినమాక |
| | వినాక | - | వినాకు |

| | | | |
|---|---|---|---|
| 5. రాకు : | రాబాక | - | రాబాకు |
| | రాబోక | - | రాబోకు |
| | రామాక | - | రావాక |
| | రాక | - | రాకు |

**7. సమానార్థకాల్లో వాడుతున్న పర్యాయపదాల వల్ల కూడా మాండలిక భేదాలు గుర్తించవచ్చు:**

ఉదా॥ 1. దేవాలయం కోవెల - గుడి - మందిరం

2. పాదరక్షలు - చెప్పులు - జోళ్ళు - పాంకోళ్ళు

3. గేద - ఎనుం - ఎనుంగొడ్డు - బఱ్ఱె

**8. పరిసర భాషా ప్రభావం వల్ల కూడా మాండలిక భేదాలున్నాయి :**

ప్రతిభాష సైనా పరిసరభాషా ప్రభావం స్పష్టంగా కనబడుతుంది. ఇందులో ఏ భాషకు మినహాయింపు లేదు. ఆంధ్రప్రదేశ్ సరిహద్దుల్లో ఐదు రాష్ట్రాలున్నాయి. దక్షిణాదిన తమిళనాడు, పడమర కర్ణాటక, ఉత్తరాదిన మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఒరిస్సా రాష్ట్రాలున్నాయి. తెలుగు భాషకు తమిళం, కన్నడం, మరాఠీ, ఒరియా భాషలు పరిసరభాషలు. తెలుగు భాష మీద పరిసర భాషల ప్రభావం బాగా కనబడుతుంది.

**i. తమిళపదాలు :**

చిత్తూరు, నెల్లూరు జిల్లాలు తమిళనాడుకి దగ్గరగా వుండడం వల్ల ఈ జిల్లాల్లోని తెలుగుభాషలో తమిళ పదాలు చేరాయి.

| | | |
|---|---|---|
| ఉదా॥ | సాంబారు (పులుసు) | తలకాని (దిండు, తలగడ) |
| | సాపాటు (భోజనం) | వరుమానం(ఆదాయం, రాబడి) |
| | పోకిరి (వెధవ) | వాయాడి (వదురుబోతు) |
| | కంజాం (పిసినారి) | ఎక్కచక్కెం(అధికంగా, ఎక్కువగా) |

**ii. కన్నడ పదాలు :**

అనంతపురం, కర్నూలు, మహబూబ్నగర్ జిల్లాలు కర్ణాటక రాష్ట్రానికి సరిహద్దు ప్రాంతాలు కాబట్టి తెలుగు భాషలో చాలా కన్నడపదాలు చేరాయి. కన్నడ ప్రభావం, ఉచ్చారణలో, పదజాలంలో, పదబంధాల్లో చివరికి వాక్యరచనలో కూడా కన్పిస్తుంది.

| | | |
|---|---|---|
| ఉదా॥ | పుంటికూర (గోంగూర) | ఉద్దర, ఉద్దులు (మినుములు) |
| | బాడుగ (అద్దె) | ఓలిగలు (బొబ్బట్లు) |

| | |
|---|---|
| బాలేపండు (అరటిపండు) | జౌళి (గోరుచిక్కుడుకాయ) |
| మడక (నాగలి) | అంగడి (కొట్టు) |

### iii. మరాఠీ పదాలు :

అదిలాబాద్, నిజామాబాదు జిల్లాలు మహారాష్ట్ర సరిహద్దుల్లో వున్నాయి. కాబట్టి మరాఠీ పదాలు తెలుగులోకి వచ్చాయి.

ఉదా॥ చెకకాబండి (గూడుబండి)

గిరిక (బావిగిలిక)

గుంగురు (మువ్వ)

జానెం / జాడు (గడ్డికుప్ప)

పాలె (మేడి)

### iv. ఒరియా పదాలు :

విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలు ఒరిస్సా రాష్ట్రానికి సరిహద్దుల్లో వున్నాయి. కాబట్టి అనేక ఒరియా పదాలు ఆ ప్రాంతంలోని తెలుగు భాషలో ప్రవేశించాయి.

| ఉదా॥ | | |
|---|---|---|
| | బేపి (కుక్క) | కంబారి (కింకరి, పాలేరు) |
| | పెయ్య (దూడ) | బుగత (యజమాని) |
| | ఉభాల (ఊడ్పులు) | పైన (దువ్వెన) |
| | భోగట్టా (సమాచారం) | రేక (చేద) |
| | బంద (చిన్న చెరువు) | పకాలి (వేడిగంజి అన్నం) |
| | పరుడు (నిచ్చెన) | కోనారి (యాదవ / గొల్ల) |

ఈవిధంగా పరిసరభాషల ప్రభావం వల్ల తెలుగు భాషలో అనేక మాండలికాలు చేరాయి.

## 11.2. మాండలికాలు - వర్గీకరణ :

ఒక ప్రాంతాన్ని సమగ్రంగా నిశితంగా పరిశీలించాలంటే ఆ ప్రాంత భౌగోళిక, చారిత్రక, సాంఘిక భాషా మాండలిక విషయాల్ని తెలుసుకోవాలి. మాండలికాల్ని ప్రాంతీయ, సామాజిక, చారిత్రక, జీవశాస్త్రానుసారాలు (వయో, లింగ, భేద) అనే నాలుగు విధాలుగా వర్గీకరించవచ్చు.

### 11.2.1. ప్రాంతీయ మాండలికం (Regional Dialect) :

ప్రజల మధ్య వ్యవహార ప్రాబల్యం సన్నగిల్లడం వల్ల ప్రాంతీయ (ప్రాదేశిక) మాండలికాలు ఏర్పడతాయి. వీటినే స్థలమాండలికాలు అని కూడా అంటారు. వ్యక్తులు పుట్టి, పెరిగిన ప్రాంతాల ఆధారంగా ఏర్పడిన మాండలికాలు స్థలమాండలికాలు. ఈ స్థల మాండలికాలు భౌగోళిక కారణాల వల్ల ఏర్పడతాయి. రాజకీయ, సాంస్కృతిక, వాణిజ్యాదిరంగాల్లో ఏర్పడిన కొన్ని పదాలు రవాణా సౌకర్యాల వల్ల నగరాలకు, గ్రామాలకు చేరుతాయి. ప్రకృతి సహజసిద్ధమైన పర్వతాలు, నదులు వంటి అవరోధాలున్న ప్రాంతాలకు రాకపోకలు లేకపోవడం వల్ల ఆ ప్రాంతాల్లో కొత్త పదాలు చేరే అవకాశం లేదు. అలాంటి ప్రాంతాల్లో ప్రాచీన కాలంలోని పదాలే వుంటాయి. అంటే సర్వసాధారణమైన సామాజిక భాష కంటే భిన్నమైన భాష వుంటుందన్న మాట. ఇలాంటి వాటినే స్థలమాండలి కాలంటారు. వాటిని ఇలా పరిశీలించవచ్చు.

| 1 | 2 | 3 | 4 |
|---|---|---|---|
| పూర్వ మాండలిక | దక్షిణ మాండలికం | ఉత్తర మాండలికం | మధ్య మాండలికం |
| /కళింగప్రాంతం/ | /రాయలసీమ ప్రాంతం/ | /తెలంగాణాప్రాంతం/ | /ఇతర కోస్తాలు/ |
| చోడి | రాగి | తమిదె | తమిదె |
| గంటి | సజ్జ / సొద్ద | సజ్జ | సజ్జ |
| గోంగూర / జనపకూర | గోగాకు | పుంటికూర / పుంటుకూర | గోంగూర |
| ఆనపకాయ | సొరకాయ / ఆనబకాయ | ఆనెగెంకాయ | సొరకాయ / ఆనపకాయ |

### 11.2.2. సామాజిక మాండలికం (Social Dialects) :

సాంఘికంగా ప్రతిబింబించే భాషా భేదాల్ని సాంఘిక భేదాలు అంటారు. సాంఘికంగా ఏర్పడిన ఈ భాషాభేదాల్ని సాంఘిక వ్యవహార భేదాలు అంటారు. ఈ సాంఘిక వ్యవహార భేదాలనే సాంఘిక మాండలికాలు అని వ్యవహరిస్తారు. సాంఘిక మాండలికం అని కూడా దీన్ని అంటారు. వ్యక్తుల సముదాయమే సంఘం. సాంఘికంగా ప్రతిబింబించే సామాజిక వ్యవహార భేదాలనే సామాజిక మాండలికాలుగా పిలుస్తారు. జీవద్భాషకు మార్పు సహజం. ఈ మార్పు కారణంగా బహురూపత, వైవిధ్యం ఏర్పడతాయి. సాంఘిక మాండలికాల్లో సామాజిక వ్యవస్థలో వున్న ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక పరమైన మార్పులు వ్యవహారపు మాటల్లో ప్రతిఫలిస్తాయి. భాషా వ్యవహారాల్ని చక్కగా పరిశీలిస్తే వ్యవహర్తల సాంఘిక హెూదాని నిర్ధారించవచ్చు. ఈ సామాజిక మాండలికం మూడు విధాలుగా విభజించవచ్చు.

1. వర్గమాండలికం, 2. కుల/వర్ణమాండలికం, 3. వైయక్తిక మాండలికం.

#### 1. వర్గ మాండలికం (Class Dialects) :

ఒక వర్గానికి సంబంధించిన వ్యవహారాల్లో ఈ మాండలికాలు వుంటాయి.

ఇవి మరల నాలుగు రకాలు. 1. ఆదాయాన్ని బట్టి మాండలికం, 2. విద్యను బట్టి మాండలికం, 3. నిరక్షరాస్య మాండలికం, 4. వృత్తిని బట్టి మాండలికం.

**i. ఆదాయాన్ని బట్టి మాండలికం :**

ఆదాయాన్ని బట్టి మాండలికాలు రెండు రకాలు. ఎ. అధికారాన్ని బట్టి మాండలికం, బి. అల్పాదాయాన్ని బట్టి మాండలికం.

**ఎ. అధికారాన్ని బట్టి మాండలికం :**

దీనికి సంబంధించి అధికార భాషను ఎక్కువగా వాడతారు. సమాజంలో నాగరికులుగా చలామణి అవుతారు. పరిభాషలో ఆంగ్ల పదాలు విరివిగా చోటు చేసుకుంటున్నాయి.

ఉదా॥ పార్టీ, లంచ్, డిన్నర్, కిచెన్, మటన్, కర్రీ, టిఫిన్, మీల్సు

**బి. ఆదాయాన్ని బట్టి మాండలికం :**

సాధారణంగా చిన్న రైతులు, కూలీలు, రిక్షా తొక్కేవాళ్ళు ఈ మాండలికాన్ని వాడుతారు.

| | | |
|---|---|---|
| చందమామ | - | చందమామ |
| రిచ్చా | - | రిక్షా |
| లచ్చ | - | లక్ష |
| బిచ్చం | - | బిక్షం |
| కోక | - | చీర |
| రైక | - | రవిక |
| బువ్వ | - | భోజనం |

**ii. విద్యనుబట్టి మాండలికం :**

ఈ మాండలికాలు రెండు రకాలు. ఎ. విద్యాధికుల మాండలికం, బి. విద్యార్థుల మాండలికం

**ఎ. విద్యాధికుల మాండలికం**

ఉన్నత విద్యను అభ్యసించిన తర్వాత చాలా మందిలో భాష మారుతుంది.

ఉదా॥ అమూల్యం, శిఖరాగ్రం, ఓ.కే. అచ్చా, హృదయం, ఉన్నతం.

బి. విద్యార్థుల మాండలికం :

విద్యార్థులు తమ తోటి విద్యార్థులతో మాటలాడినప్పుడు ప్రత్యేకమైన కొన్ని మాటల్ని వుపయోగిస్తారు.

ఉదా॥ అంతసీన్లేదు, కాకా, బట్టి, బోర్, ఐరన్ లెగ్.

**iii.** నిరక్షరాస్యతను బట్టి మాండలికం :

| | | | |
|---|---|---|---|
| ఉదా॥ | పిజ్జి | - | (ఫిజ్జ్) |
| | కూటరు | - | (స్కూటర్) |
| | ఇసక | - | (ఇసుక) |
| | డూటి | - | (డ్యూటీ) |
| | ఎంటిక | - | (వెంట్రుక) |
| | ఇస్కూలు | - | (స్కూలు) |
| | కూకో | - | (కూర్చో) |
| | రాతిరి | - | (రాత్రి) |

**iv.** వృత్తిని బట్టి మాండలికం :

కమ్మరి, కుమ్మరి, వడ్రంగి, వ్యవసాయం మొదలైనవారు వృత్తికి సంబంధించిన అనేక పదాల్ని వాడుతారు.

అ. వ్యవసాయవృత్తిగా గల వాళ్ళ మాండలికం :

| | | | |
|---|---|---|---|
| ఉదా॥ | మెట్ట | - | మెట్టపొలం |
| | తొలిగాబు | - | తొలికలుపు |
| | గుత్త | - | భూస్వామికి డబ్బుకానీ, పంటకానీ ఇంత ఇచ్చేటట్లు అని ముందుగా చేసుకొనే ఒప్పందం. |

ఆ. కమ్మరం, వడ్రంగి వృత్తిగా గలవాళ్ళు కొయ్యబండిలో వాడిన వివిధ భాగాల్ని వివిధ మాండలిక మాటలతో పిలుస్తారు:

| | | | |
|---|---|---|---|
| ఉదా॥ | ఆకులు | - | బండిచక్రానికి బద్దల్లావున్న కొయ్యల్ని 'ఆకులు' అంటారు. |
| | కుండ | - | బండిచక్రం మధ్యలో గుండ్రంగా వుండి ఆకులు అమరి వుండే గుండ్రని కొయ్యను 'కుండ' అని అంటారు. |

## 2. కుల / వర్ణ మాండలికం (Caste Dialect)

వ్యక్తులు పుట్టి పెరిగిన కులాలు ఆధారంగా ఏర్పడిన మాండలికాలు కుల మాండలికాలు. మానవుడు సంఘజీవి. సంఘాన్ని విడిచిపెట్టి మానవుడు తన జీవితాన్ని కొనసాగించలేడు. వీలుపడదు కూడా. నేడు మన సమాజంలో అనేక కులాల వారు, వృత్తుల వారు నివసిస్తున్నారు. ఒక్కొక్క కులానికీ, ఒక్కొక్క వృత్తికీ తనకంటూ ఒక ప్రత్యేకమైన జీవనసరణి వుంటుంది. అందువల్ల వాళ్ళు మాటలాడేటప్పుడు ఇతర కులాల వారు వాడని ప్రత్యేకమైన మాండలికాలు వాడతారు. ఆ మాండలిక పదాలు ఇతర వర్గాల వారికి అర్థం కావు కూడా.

భారతదేశంలో కుల వ్యవస్థ వుండడం వల్ల కుల మాండలికాలు చోటు చేసుకున్నాయి. ప్రపంచంలో ఏ భాషలో కూడా కుల మాండలికాలు లేవు ఒక్క భారతదేశంలో తప్ప. అయితే ఉత్తర భారతదేశంలో మాండలికాల విభజన వేరు. దక్షిణ భారతదేశంలో మాండలికాల విభజన వేరు. ఉత్తర భారతదేశంలో అగ్రవర్ణాల మాండలికం, దళితజన మాండలికం అనే రెండు మాండలికాలు వున్నాయి. దక్షిణ భారతదేశంలో బ్రాహ్మణ, బ్రాహ్మణేతర, దళితజన అనే మూడు మాండలికాలు చాలా స్పష్టంగా కన్పిస్తున్నాయి.

ఒకే ప్రాంతానికి చెందిన వ్యక్తుల వ్యవహారంలో కుల వృత్తులకు సంబంధించిన భేదాలు ఉచ్చారణలోనూ, పదప్రయోగాల్లోనూ కన్పిస్తాయి. మనదేశంలో అనేక కుల, మత, వర్గ భేదాలున్నాయి. తెలుగుదేశంలో విభిన్న కులాల, వర్గాల వారి వల్ల కొన్ని ఆచారాలు, కట్టుబాట్లు అవాంతర భేదాలతో ఆయా కుల వర్గాల వారి వ్యవహారంలో భిన్నత్వం ఏర్పడింది. ఇలా ఏర్పడే వాటిని మాండలికాలంటారు. భిన్న కులాల్లో పుట్టినవారు భిన్న రీతుల్లో మాట్లాడతారు. కొన్ని కులాల వారు మాట్లాడితే ఇతర కులాల వారికి అర్థం కాదు. బ్రాహ్మణుల భాషా వ్యవహారానికీ, ఇతరుల భాషా వ్యవహారానికీ చాలా భేదాలు కన్పిస్తాయి.

వైదిక బ్రాహ్మణులు 'వయం దేవస్య' ఎక్కడ ? అంటే మిగిలిన కులాల వారికి తెలియదు. 'వయం దేవస్య' పదానికి భోజనం అని అర్థం. ఇంకో బ్రాహ్మణునికి (పురోహితులు) మాత్రమే ఈ అర్థం గోచరిస్తుంది. ఇది కేవలం సాంకేతికమైన భాష.

*ఇరువురు వైదిక బ్రాహ్మణుల సంభాషణ ఇలా వుంటుంది.*

*"వయం దేవస్య" ఎక్కడ ?*

*"దేవావై" లో*

*"తేజోవా" ఏమన్నా వుంటుందా ?*

*"ప్రక్రాంతం" కదూ ! తప్పకుండా వుంటుంది.*

పై సంభాషణలోని నాలుగు వాక్యాల్లో నాలుగు సాంకేతిక శబ్దాలు చోటుచేసుకున్నాయి. 'వయందేవస్య భోజనమ్''' అని శ్రుతి. 'దేవావై సత్రమాసత''' అని నిగమం. 'తేజోవా ఆజ్యం'' అని సంహిత. 'ప్రక్రాన్తమ్ శ్రాద్ధకర్మ కరిష్యే'' అని తద్దిన మంత్రం. ఈ నాలుగు వాక్యాలు సాధారణంగా జన వ్యవహారంలో ఈ రీతిగా వుంటాయి.

*"భోజనమెక్కడ"*

*"సత్రంలో"*

*"నెయ్యి ఏమన్నా వుంటుందా?"*

శ్రాద్ధకర్మ (తద్దినం) కదా ! తప్పనిసరిగా నెయ్యి వుంటుంది.

బ్రాహ్మణుల తిట్లలో ఇతర కులాల తిట్లలో గల భేదాలు చాలా స్పష్టంగా కన్పిస్తాయి. బ్రాహ్మణులు అప్రాచ్యపు వెధవ, త్రాష్టుడా, శుంఠ లాంటి పదాలు వాడతారు. ఇదే విధంగా కమ్మరి, వడ్రంగి, బెస్త, చర్మకారులు, స్వర్ణకారులు మొదలైన వృత్తిపని వాళ్ళ భాషలో చాలా ప్రత్యేకతలు కన్పిస్తాయి.

తెలుగుభాషలోని కుల మాండలికాల్ని మూడు రకాలుగా విభజించవచ్చు:

1. బ్రాహ్మణ మాండలికం, 2. బ్రాహ్మణేతర మాండలికం, 3. దళితజన మాండలికం.

### 1. బ్రాహ్మణ మాండలికం :

మన సమాజంలో కొన్ని వేల సంవత్సరాల నుంచి బ్రాహ్మణులు అగ్రవర్ణాలుగా పిలవబడ్డారు. అందువల్లే వారి మాండలికాలు తక్కినవారి కన్నా భిన్నంగా వుంటాయి.

ఉదా॥ ఉదయం, తీర్థం, తద్దినం, దద్ధోజనం, పులిహోర, వేడినీళ్ళు, ఈరోజు మడి, జంధ్యం, పోపు, ఊరగాయ, ఇంటి వద్ద / దగ్గర.

### 2. బ్రాహ్మణేతర మాండలికం :

బ్రాహ్మణులు కాని వారు బ్రాహ్మణేతరులు. వీరి మాండలికాల్లో అబ్రాహ్మణ మాండలికాలు వుంటాయి.

ఉదా॥ ఇంటికాడ ఉడుకునీళ్ళు

ఇయ్యాల పొద్దున

మధ్యాన్నం రాతిరి

తాలింపు పచ్చడి

### 3. దళిత జన మాండలికం :

దళిత జనులు మాట్లాడేభాషలో అనేక మాండలికాలు వున్నాయి.

ఉదా॥ కౌసు (మాంసం) యాశకాలు (వేషాలు

కూర (అంటే మాంసం అని అర్థం) అరంజోతి (అరుంధతి)

ఎకసెకం (ఎగతాళి) ఆసికం (హాస్యం)

ఆరె (చెప్పులు కుట్టే సాధనం)

**3. వైయక్తిక మాండలికం (Individual Dialect) :**

కొన్ని ప్రత్యేక సందర్భాల్లో ఒక వ్యక్తి భాష మిగిలిన వ్యక్తుల భాష కన్నా వేరుగా వుంటుంది. ఒక్కొక్క వ్యక్తికి వుండే ప్రత్యేకమైన భాషని లేదా మాండలికాల్ని వైయక్తిక మాండలికాలంటారు. అంతేకాక పిల్లలతో, వైద్యులతో, అధికారులతో, అనధికారులతో, మిత్రులతో, స్త్రీలతో, నౌకర్లతో భిన్న విధాలుగా మాట్లాడుతారు. దీనికి మూలకారణం ఆ వ్యక్తి నివసిస్తున్న సాంఘిక పరిస్థితులు అన్న విషయం మనం మరచిపోకూడదు. అవన్నీ ఆ వ్యక్తి యొక్క విభిన్న మాండలికాలుగా గుర్తించవచ్చు. సంతోషం, కోపం, ఆశ్చర్యం మున్నగు సందర్భాల్లో వైవిధ్యాన్ని బట్టి, వ్యక్తుల వయో, లింగ, గౌరవ, ప్రతిష్ఠాది స్థాయిని బట్టి, వైయక్తిక మాండలికాలు ఏర్పడతాయి.

వైయక్తిక మాండలికాలు పుట్టుకకు అనేక కారణాలు కన్పిస్తున్నాయి.

- ✪ వ్యక్తిగతమైన ఉచ్చారణ లోపం.
- ✪ భిన్న ప్రాంతాల్లో వున్న భిన్న భాషలతో సంసర్గం కలిగి వుండడం లేదా భిన్న భాషా లక్షణాలున్న స్వీయ భాషా వ్యవహర్తలతో సంపర్కం కలిగి వుండటం.
- ✪ ఒక వ్యక్తి అన్యభాషా ప్రాంతాల్లో దీర్ఘకాలం వుండి తిరిగి మాతృభాషా ప్రాంతానికి రావటం.
- ✪ వ్యక్తి జీవన ప్రవంతికి కలిగే మార్పు.

వైయక్తిక మాండలికాలు కూడా స్థిరంగా వుండవు.

ఉదా॥ 1. పిల్లల్ని పిల్చే సందర్భంలో .
ఒరే చిన్నా, భోజనానికి రా.

2. పెద్దల్ని పిల్చే సందర్భంలో -
నాన్నగారూ భోజనానికి రండి.

3. నయాన చెప్పే సందర్భంలో -
కాలం వృధా చేయక చదువుకో మంచి మార్కులొస్తాయి.

4. మందలింపుగా పలికే సందర్భంలో -

కాలం వృధా చేయకు. బాగా చదివితేనే మంచి మార్కులొస్తాయి. ఈవిధంగా వ్యక్తుల స్థాయిని బట్టి, సందర్భాన్ని బట్టి, ప్రతి మనిషి మాట్లాడే వైయక్తిక భాషలో మాండలికాలు వుంటాయి.

**3. చారిత్రక మాండలికం (Historical Dialect) :**

చారిత్రక ఆధారాల్ని బట్టి ఒకే కాలంలో వున్న రూపాలకు కాలాంతరంలో ఏర్పడ్డ తుల్య రూపాలకు మధ్య చాలా తేడాలున్నాయి. ఈ భేదాలు ప్రాచీన భాష నుంచి ఆధునిక భాష వరకు ఎలా పరిణమించాయో తెలుసుకోవచ్చు. ఈ భేదాలనే చారిత్రక మాండలికాలు అంటారు.

ఉదాహరణకు 'వాడు' అనే పదం అవన్జు-వాన్జు-వాండు, వాడుగా రూపాంతరం చెందింది. 'తూర్పు' అనే పదం తూఱుపు, తుఱుగు, తూపు తూర్పుగా రూపాంతరం చెందింది.

**4. జీవశాస్త్రానుసార మాండలికం :**

ఈ మాండలికం రెండు రకాలుగా వుంటుంది. 1. వయస్సును బట్టి ఏర్పడ్డ మాండలికం. 2. లింగభేదం బట్టి ఏర్పడ్డ మాండలికం.

**1. వయస్సును బట్టి ఏర్పడ్డ మాండలికం :**

పిల్లలు, యువకులు, వృద్ధులు మాట్లాడే భాషలో అనేక మాండలికాలు వున్నాయి.

**i. పిల్లల మాండలికం :**

ఉదా॥ బువ్వ /అన్నం/, పాచి /పాలు/, లాల /నీళ్లు/

బూచి /దెయ్యం/

**ii. యువకులు మాటలాడే మాండలికం :**

ఉదా॥ ఫిగర్ బాగుంది, లైనేశాడు, మొనగాడు, సోగ్గాడు బీటుకొడుతున్నాడు, అంతసీనులేదు

**iii. వృద్ధులు మాట్లాడే మాండలికం :**

ఉదా॥ దుడ్డుకర్ర, గోసి, పిల్లకుంక, పిల్లకాకి,

**2. లింగభేదం వల్ల ఏర్పడ్డ మాండలికం :**

పురుషుల భాషకు, స్త్రీల భాషకు చాలా తేడా కన్పిస్తుంది.

**i. పురుషులు మాట్లాడే మాండలికం :**

ఉదా॥ నా జోలికి రాకు

ఎన్ని గుండెలు వాడికి

అంత మొనగాడా ?

వాడి అంతు చూస్తా.

**ii. స్త్రీలు మాట్లాడే మాండలికం :**

ఉదా॥ నిండు మనిషి కావడం (నెలతప్పడం)

నీ ఆకు చించ (తిట్టు)

గుడిసేటు (తిట్టు)

జిమ్మపడిపోను (తిట్టు)

ఈ విధంగా తెలుగులో మాండలికాల్ని వర్గీకరించి అధ్యయనం చేయవచ్చు.

## ఆధార గ్రంథాలు :

**1. తెలుగు :**


1. ఆధునిక తెలుగు వ్యాకరణం - ఎన్. శివరామమూర్తి
2. ఆధునిక తెలుగు వెన్నెలకంటి వ్యాకరణం - వెన్నెలకంటి ప్రకాశం
3. ఆధునిక తెలుగు భాషా నిర్మాణం - శివుని రాజేశ్వరి
4. ఆధునిక ప్రామాణికాంధ్ర వ్యాకరణం - వజ్ఝల వేంకటేశ్వర్లు
5. ఆధునిక భాషా శాస్త్రం - వెలమల సిమ్మన్న
6. ఈనాడు భాషా స్వరూపం - బూదరాజు రాధాకృష్ణ
7. తెలుగు దారి - వెల్చేరు నారాయణరావు
8. తెలుగులో వెలుగులు - చేకూరి రామారావు
9. తెలుగు భాషా చరిత్ర (సంపాదకులు) - భద్రిరాజు కృష్ణమూర్తి
10. తెలగు భాషా చరిత్ర - వెలమల సిమ్మన్న
11. తెలుగు భాషా తత్త్వం - కొమర్రాజు లక్ష్మణరావు
12. తెలుగు భాషా శాస్త్రవేత్తలు - వెలమల సిమ్మన్న
13. తెలుగు భాషా స్వరూపం - బూదరాజు రాధాకృష్ణ
14. తెలుగు కావ్యం - చేకూరి రామారావు
15. ప్రౌఢ వ్యాకరణం - బహుజనపల్లి సీతారామయ్య
16. బాల వ్యాకరణం - చిన్నయ సూరి
17. బాల వ్యాకరణం - శాస్త్రీయ వ్యాఖ్య - వెలమల సిమ్మన్న, గుమ్మా సాంబశివరావు
18. భాషా తపస్వి గిడుగు - వెలమల సిమ్మన్న

19. భాషానువర్తనం - చేకూరి రామారావు

20. వ్యావహారిక భాషా వ్యాకరణం - వడ్లమూడి గోపాలకృష్ణయ్య

21. శబ్ద బ్రహ్మ చిన్నయ సూరి (అముద్రితం) - వెలమల సిమ్మన్న, గుమ్మా సాంబశివరావు

22. సంధి - వెలమల సిమ్మన్న

**2. ఆంగ్లం :**

1. A Grammar of Modern Telugu - Bh. Krishna Murthy
2. Sandhi Balavyakaranam - J. Pratap Reddy.

పాఠం - 12

# అనుకృతి వాక్యాలు

"తెలుగు వాక్యం" అనేది పరిశోధన గ్రంథంలో ఆచార్య చేకూరి రామారావుగారు వాక్యంలోని రకాల్ని ముఖ్యంగా సామన్య వాక్యాలు, సంశిష్ట వాక్యాలు, అనుకృతి వాక్యాలు సంయుక్త వ్యాక్యాలుగా వర్గీకరించారు. మరలా అందులోని అంతర్భాగాల్ని గూర్చి చాలా విపులంగా విశదీకరించారు. ప్రస్తుతం అనుకృతి వాక్యాలు గూర్చి పరిశీలిద్దాం.

ఒకసారి ప్రయోగించిన భాషాంశాలు మరోమారు ప్రయోగిస్తే అనుకృతి అవుతుంది. ఈ అనుకృతిని కూడా నామ్నీకరణంగా భావించవచ్చు. అయితే మామూలు నామ్నీకరణాల కన్నా, అతి విస్తృతమైన పరిధి కలది అనుకృతి. అందువల్లే అనుకృతిని వేరుగా చెప్పవలసి వచ్చిందని చేకూరి రామారావుగారు అన్నారు. అనుకృతి అంశానికి అవధులు లేవు. అనుకృతాంశం ఏదైనాకావచ్చు. అనుకృతాంశానికి భాషా పరిధి కూడా లేదు. ఏ భాషాంశాన్ని అయినా ఇంకో భాషలోకి అనుకరించవచ్చు. భాషాంశాలనే అనుకరించాలని ఏమీ నియమ నిబంధనలు లేవు. ఏ అంశాన్ని అయినా అనుకరించవచ్చు. ఉదాహరణకు కుక్క భౌ, భౌ మని అరుస్తున్నది. గజ్జెలు ఘల్లు ఘల్లు మంటున్నాయి మొదలైన వాక్యాలు అనుకరణ వాక్యాలే.

అనుకరణ రెండు రకాలుగా వర్గీకరించవచ్చు. ఒకటి ప్రత్యక్షానుకృతి. రెండు పరోక్షానుకృతి. వున్నవి ఉవన్నట్లు అనుకరించి చెప్పితే అది ప్రత్యక్షానుకృతి. అనుకృతాంశంలోని విషయాన్ని మాత్రమే అనుకరించి చెప్పితే అది పరోక్షానుకృతి. అనుకృతిని, శబ్దానికి మాత్రమే పరిమితం చేస్తే ప్రత్యక్షానుకృతిని శబ్ద ప్రధానమని (Code Centred), పరోక్షానుకృతిని అర్థ ప్రధానమని (Information Centred) చెప్పవచ్చు. దేశ, కాల, శబ్ద, భాషా నిరవధికత ప్రత్యక్షానుకృతికే వర్తిస్తుంది. పరోక్షానుకృతికి కొన్ని పరిమితులు వున్నాయి.

పరోక్షానుకృతి తప్పని సరిగా భాషాంశమై వుండాలి. అనుకృతాంశం అనుకరించే భాషలో వ్యక్తీకృతం కావాలి. అనుకృతాంశాన్ని వాక్యపరంగానే వ్యాఖ్యానించాలి. అయితే ఆ వాక్యం సామాన్య సంశ్లిష్ట, సంయుక్త వాక్యాల్లో ఏదైనా కావచ్చు. సంయుక్త వాక్యాల్లో సంశ్లిష్ట వాక్యాలు, మళ్ళీ వాటిల్లో సామాన్య వాక్యాలు ఇమిడి వుండవచ్చు. కాబట్టి అనుకృతాంశం అనంతమైన ఏకవాక్యం కావచ్చు. ఏక భాషా, ఏక వాక్య పరిమితి వున్నది పరోక్షానుకృతి.

తెలుగులో ప్రత్యక్ష పరోక్షానుకృతులు రెండింటిల్లోను "అని" అనే రూపం ప్రయుక్తమవుతుంది. ఇది అనుధాతువు నుంచి నిష్పన్నమైన క్త్వార్థక క్రియతో రూపంలో సమానం. అయితే ప్రయోగంలో రెండింటినీ వేరు చేయవచ్చు.

ఉదా :

1. మాపక్కింటావిడ ఉత్త పుణ్యానికి నానా మాటలు అనిపోయింది.
2. రెండు రెళ్ళు నాలుగన్నందుకు గుండాలు గండ్రాళ్ళు విసిరే దేశం అని శ్రీశ్రీ రాశారు.
3. క్రమ క్రమాగత చైతన్య ధనుష్ప్రాణులు ప్రజలు నేడు అని అన్నాడు కుందుర్తి.

పై వాక్యాల్లో ఒకటిలో "అని" అనుకరణంలో వచ్చిన శబ్దం కాదు "పక్కింటావిడ" అనే కర్తతో అన్వయించే క్రియ.

రెండులో లిఖిత రూపమైన భాషానుకృతి వుంది. మూడులో వాగ్రూపమైన భాషానుకృతి వుంది. ఒకటిలో "అని"కి అనకుండా "అనే" వ్యతిరేక రూపం వుంది. రెండు, మూడులలో "అని"కి అలాంటి రూపం లేదు. రెండు, మూడు, వాక్యాల్లో అని శ్రీశ్రీ విమర్శించాడు, అని కుందుర్తి ఉద్ఘాటించాడు అని చేరిస్తే అనూదితాంశాల మీద వ్యాఖ్యాన ప్రాయంగా వుంటాయి.

1. అనుకృతాంశంలో వక్తృ శ్రోతలను సూచించే పదాలుగాని, ఇతరాంశాలు గాని లేనప్పుడు ప్రత్యక్షానుకృతిలో వున్న సర్వనామాలు పరోక్షానుకృతిలో కొన్ని మార్పులు పొందుతాయి. ఈ కింద ఇచ్చిన ఉదాహరణ వాక్య సమూహాల్లో అలాంటి వాక్యాల్ని మనం గమనించవచ్చు.

ఉదా॥

అ) 1. నేను నీతో "నేను వస్తాను" అన్నాను.
నేను నీతో (నేను) వస్తానన్నాను.

2. నేను అతనితో "నేను వస్తాను" అన్నాను.
నేను అతనితో (నేను) వస్తానన్నాను.

ఆ) 1. నువ్వు నాతో "నువ్వు కొట్టావు" అన్నావు.
నువ్వు నాతో నేను కొట్టానన్నావు.

2. నువ్వు అతనితో "నువ్వు కొట్టావు" అన్నావు.
నువ్వు అతనితో అతను కొట్టాడన్నావు
నువ్వు అతనితో తను కొట్టాడన్నావు.

ఇ) 1. అతను నాతో "నేను ఉంటాను" అన్నాడు.
అతను (నాతో) అతను ఉంటానన్నాడు.
అతను (నాతో) తను ఉంటానన్నాడు.

2. అతను "నీతో నేను ఉంటాను" అన్నాడు.
అతను నీతో అతను ఉంటానన్నాడు.
అతను (నీతో) తను ఉంటానన్నాడు.

3. నువ్వు అతనితో "నేను వస్తాను" అన్నావు.
నువ్వు అతనితో నువ్వు వస్తానన్నావు.

ఈ) 1. అతను నాతో "నువ్వ అడిగావు" అన్నాడు.

అతను నాతో నేనడిగానన్నాడు.

2. అతను నీతో "నువ్వు అడిగావు" అన్నాడు.

అతను (నీతో) నువ్వు అడిగావన్నాడు.

ఇలా అనుకృతి వాక్యాల్లో అనేక మార్పులు చోటు చేసుకుంటాయి.

2. అనుకృత వాక్య భేదాల్ని బట్టి పరోక్షానుకరణంలో కొన్ని మార్పులు జరుగుతాయి.

ఉదా॥ 1. సుజాత సుబ్బారావుతో "నువ్వు మాయింటికి రా" అన్నది.

2. సుజాత (సుబ్బారావుతో) సుబ్బారావును తన ఇంటికి రమ్మన్నది.

ఇందులో జరిగిన మార్పులు ఇవి :

1. పరోక్ష విధిలో విధి క్రియకు మ కా రా గ ం జరిగింది.

రా + మ్ > రమ్మ

2. అనుకృత వాక్యంలో కర్తకు ప్రధాన వాక్యంలో అముఖ్యకర్మ ఆదేశం అయింది.

3. కర్తృపదంగా గ్రహించినది ప్రథమ పురుష నామం కాబట్టి 'మా'కు "తన" అనే శబ్దం ఆదేశం అయింది.

4. కర్తృపదం గ్రహించిన సుబ్బారావు అనే నామానికి ద్వితీయా విభక్తి చేరింది.

పరోక్ష విధిలో గమనించవలసిన ఇంకో చిన్న విశేషం వుంది. ప్రత్యక్ష విధిలో ఏకబహువచన భేదం క్రియలో వ్యక్తమవుతుంది.

ఉదా॥ "రా, "రాండి"

పరోక్ష విధిలో ఏక వచన బహువచనాలు రెండింటిలోనూ ఒకే క్రియ రూపం వుంటుంది.

ఉదా॥ "అతన్ని రమ్మని చెప్పు"

"వాళ్ళని రమ్మని చెప్పు"

పరోక్ష విధి క్రియలో లింగ పురుష భేదం వ్యక్తం కాదు.

3. ప్రశ్నార్థకాది వాక్యాల్లో ఇంతకు ముందు పేర్కొన్న కర్తృపద పరివర్తనాది మార్పులు తప్ప వేరే మార్పులు జరగవు. కాకపోతే ప్రధాన క్రియ అనుధాతు నిష్పన్నం కాక, అడుగులేక ప్రశ్నను సూచించే అలాంటి క్రియ ఏదన్నా వుంటుంది.

ఉదా॥

అ) 1. "నువ్వు ఎక్కడికి వెళ్తున్నావు" అని అన్నాడు.

2. నేనెక్కడిక వెళ్తున్నానని అడిగాడు.

ఆ) 1. "నువ్వ రేపొస్తావా" అని అన్నాడు.

2. నేను రేపు వస్తానా - రేపు వస్తానేమో అని అడిగాడు

పై వాక్యాల్లో ప్రత్యక్ష పరోక్షానుకరణాలు రెండింటిలోనూ "అడుగు" క్రియను ప్రయోగించవచ్చు. అయితే పరోక్షానుకరణలో "అను" క్రియా ప్రయోగం వుండదు. ఆ ప్రశ్నకు "ఏమో" ఆదేశం వికల్పంగా అవుతుంది.

ప్రథమ, మధ్యమ పురుష సర్వ నామాలున్న క్రియా రహిత వాక్యాలను అనుకరించేటప్పుడు కూడా ఇంతకు ముందు పేర్కొన్న విధంగానే సర్వనామాల్లో మార్పులు జరుగుతాయి.

ఉదా॥

అ) 1. అతను "నేను విప్లవ కవిని" అన్నాడు.

2. అతను తను విప్లవ కవిని అన్నాడు.

3. అతను తను విప్లవ కవినని చెప్పాడు.

ఆ) 1. అతను నాతో "నువ్వు అభ్యుదయ కవివి" అన్నాడు.

2. అతనునాతో నేను అభ్యుదయ కవిని అన్నాడు.

3. అతను నన్ను అభ్యుదయ కవి అన్నాడు.

ఇ) 1. నువ్వు అతనితో "నువ్వు జాతీయ కవి" అన్నావు.

2. నువ్వు అతనితో అతను జాతీయ కవి అన్నావు.

3. నువ్వు అతన్ని జాతీయ కవి అన్నావు.

ఈ) 1. నువ్వు నాతో "నేను ప్రపంచ కవిని" అన్నావు.

2. నువ్వు నాతో నువ్వు ప్రపంచకవినన్నావు.

3. నువ్వు నాతో నువ్వు ప్రపంచ కవినని చెప్పావు.

ఉ) 1. నువ్వు "నాతో నువ్వు కవివి" కాదు అన్నావు.

2. నువ్వు నాతో నేను కవిని కాదన్నావు.

3. నువ్వు నన్ను కవి కాదన్నావు.

5. పైన మనుష్య వాచక నామం ముఖ్య కర్మ పదంగా గ్రహించ గలిగిన క్రియగా "అను" వివరించబడింది. మనుష్యేతర వాచక, శబ్దాల్లో కూడా ఇలా ప్రక్రియను చూపించవచ్చు.

ఉదా॥

అ) 1. నువ్వు "అది దొంగ కుక్క" అన్నావు.

2. నువ్వు దాన్ని దొంగ కుక్క అన్నావు.

ఆ) 1. నువ్వు "అది పనికిమాలిన డిగ్రీ" అన్నావు.

2. నువ్వు దాన్ని పనికిమాలిన డిగ్రీ అన్నావు.

దీన్ని బట్టి కర్త్రుద్ధరణ శబ్ద కర్మేతర ధాతువులు వున్నప్పుడే జరుగుతుందని "అను" శబ్ద కర్మకంగానూ, శబ్దేతర కర్మకంగానూ గుర్తించవలసి వుంటుందని మనం చెప్పవచ్చు.

కేవల శబ్ద కర్మ ధాతువులను వాక్యాల్లో ప్రయోగించలేము. అంటే నువ్వు దాన్ని దొంగ కుక్క అని చెప్పావు, నువ్వు దాన్ని పనికిమాలిన డిగ్రీ అని చెప్పావు, అనే వాక్యాలు వ్యాకరణ సమ్మతం కాదన్నమాట. అనుకృతి వాక్యాలు క్రియా రహిత వాక్యాలయినప్పుడే ఈ కర్త్రుద్ధారణ కన్పిస్తుంది. ఈ రకపు వాక్యాల్లో రెండోదళం మొదటి దళానికి విశేషణ సమం కావటం ఇందుకు కారణం కావచ్చు.

అనుకరణగా స్పష్టంగా చెప్పడానికి వీల్లేని వాక్యాల్లో కూడా "అని" ప్రయోగం కన్పిస్తుంది. అనుకృతాంశానికి నైక స్థితి వున్నప్పుడే అనుకరణ అంటాం. అలాంటప్పుడు ప్రధాన వాక్యంలో శబ్దకర్మ ధాతువులుంటాయి. అలా కాకుండా ఒక విషయం భాషీకరించిన ప్రథమ స్థితిలోనే "అని" ప్రయోగమవుతుంది. అలాంటిదాన్ని భాషానుకరణగా కాక విషయానుకరణగా గ్రహించాలి. దీన్నే విషయార్థక నామ్మీకరణమని పూర్వం వ్యవహరించానని చేకూరి రామారావుగారు అన్నారు. ఇందులో భౌతిక ప్రపంచంలో జరిగిన విషయాలు గాని, మనః ప్రపంచంలో సంభావ్య విషయాలు గాని అనుకృతమవుతాయి. ఈ అనుకృతాంశాలు జ్ఞానార్థక క్రియలలో ప్రయుక్తమవుతాయి.

ఉదా॥

1. పెరిగిన ధరలు ఎప్పుడూ తగ్గవని నాకు తెలుసు

2. విశాఖపట్టణంలో ఉప్పు పండుతుందని నేనెరుగుదును.

3. కొద్ది రోజుల్లో ఎన్నికలు జరుగుతయ్యనివిన్నాను.

మూడులో "విను" శబ్ద కర్మ ధాతువుగా గ్రహిస్తే, ఆ వాక్యాన్ని విన్నానని, జ్ఞానార్థక ధాతువుగా గ్రహిస్తే ఆ విషయాన్ని శ్రవణేంద్రియం ద్వారా గ్రహించాను అని అర్థాలు.

7. విషయార్థంలో వచ్చే నామ్మీకరణాలు విధి, ప్రశ్నార్థక వాక్యాలకు సాధ్యం కావు. నామ్నీకృత వాక్యాలు అనుకొను, ఆశించు, ఎరుగు, తెలియు, విను, వంటి, బుద్ధి, జ్ఞానార్థక ధాతువులు క్రియలున్న వాక్యాల్లో గర్భితాలై వుంటాయి. "అని"తో వున్న వాక్యాలేవీ సాధారణ క్రియా రహిత వాక్యాలతో ప్రయుక్తం కావు. అయితే ఈ కింది వాక్యాల్లో ప్రయోగాల్ని గమనించండి.

ఉదా॥

1. సామ్యవాదానిదే అంతిమ విజయమని నా నమ్మకం.

2. ఈ దేశం బాగుపడుతుందని నా ఆశ.

3. ఎన్నికల ద్వారా సోషలిజం రాదని కొందరి అభిప్రాయం.

పై వాక్యాల్లో నా నమ్మకం, నా ఆశ, కొందరి అభిప్రాయం అనే పదబంధాలు నామబంధాలు. అయితే వాటిని నేను నమ్ముతున్నాను. నేను ఆశిస్తున్నాను, కొందరు అభిప్రాయపడుతున్నారు అనే వాక్యాల నుంచి క్రమంగా నిష్పన్నం చేయాలి.

8. "అని"తో వున్న విషయార్థక నామం వుండు క్రియాయోగంలో కాంక్షార్థకమవుతుంది.

ఉదా॥ నాకు ఇవాళ సినిమాకు వెళ్ళాలని వుంది.

దీనిలో నిర్మాణాన్ని ఈ కింది విధంగా చూపించవచ్చు.

ఉదా॥ 1. నాకు ఒక కోరిక వుంది - గర్భివాక్యం

2. నేను ఇవాళ సినిమాకు వెళ్ళాలి - గర్భవాక్యం.

గర్భవాక్యంలో కాంక్షార్థక నామం స్థానంలో సంపూర్ణ వాక్యం ప్రయోగించవచ్చు. ఈ వాక్యం ఆ కోరికను స్పష్టపరుస్తుంది. అలా ప్రయోగించేటప్పుడు అని చేరుతుంది. గర్భివాక్యంలోకు బంధంతో సమబోధకమైనప్పుడు గర్భవాక్యంలో కర్తలోపిస్తుంది. ఇలా సమబోధకం కానప్పుడు ఈ లోప కార్యం జరగదు.

ఉదా॥ (నాకు (మా ఆవిడ సినిమాకు వెళ్ళాలని) వుంది)

అనే వాక్యంలో గర్భవాక్యకర్త లోపించదు.

9. గర్భివాక్యంలో వెళ్ళాలి అనే క్రియకు మూలరూపం వెళ్ళ+వలయు. అదే కొన్ని వ్యాకరణ కార్యాల వల్ల ఆలి, ఆల అని మారింది. ఇదే అర్థంలో ఈ కింది వాక్యాల్ని కూడా ప్రయోగించవచ్చు.

ఉదా॥ నాకు ఇవాళ సినిమాకు వెళదామని వుంది

ఇక్కడ "దాం" అనే క్రియాంత ప్రత్యయం వ్యస్తంగా ఉభయ ప్రార్థనంలో వస్తుంది.

ఉదా॥ మనం ఇవాళ సినిమాకు వెళదాం.

ఇది ఉభయ ప్రార్థనం కాదు. అందువల్ల గుప్త నిర్మాణంలో ఉభయ ప్రార్థన క్రియను ప్రతిపాదించే వీలులేదు. గర్భివాక్యంలో "కు" బంధంతో గర్భవాక్యంలో కర్త సమబోధకమైనప్పుడు వికల్పంగా "దాం" అనే రూపాన్ని సూత్రం ద్వారా ఆదేశంగా తెచ్చుకోవటమే మార్గం. సమబోధకం కానప్పుడు ఈ ఆదేశం జరగదు. ఉదాహరణకు ఈ కింది వాక్యం వ్యాకరణ విరుద్ధం.

ఉదా॥ నాకు మా ఆవిడ సినిమాకు వెళ్ళాం అని వుంది.

అని ప్రయోగించిన వాక్యాలన్నింటినీ విశేషణాలుగా చేసి వాక్య విషయాన్ని సూచించే నామాల ముందు ప్రయోగించవచ్చు. అనుధాత నిష్పన్నమైన అన్న అనే, అనే విశేషణ రూపాలు అనుబంధాలుగా చేరి కావ్యాన్ని విశేషణాలుగా మారుస్తాయి. వాక్య విషయాన్ని సూచించే మాటలు, విషయం, సంగతి, మాట, ప్రశ్న, సందేహం, విశేష్యాలుగా ప్రయుక్తమవుతాయి.

"అని"తో వున్న వాక్యాలను అంటే చేర్చి చేదర్థకంగానూ, "అన్నా" చేర్చి అప్యర్థకంగానూ, "అని" చేర్చి క్త్వార్థకం గానూ, అంటూ చేర్చి శత్రర్థకంగానూ ప్రయోగించవచ్చు. వాక్యానికి "అని" అనే అవ్యయాన్ని చేరిస్తే నామం అవుతుందని స్థూలంగా చెప్పవచ్చు. ఇలా అను అనే ధాతువు చేరుతుందనటం వల్ల సాధారణంగా ధాతువునుంచి నిష్పన్నమయ్యే వివిధ అసమాపక క్రియా రూపాలను సాధించటం ప్రయోజనం.

ఉదా॥

1. వాడు వచ్చాడంటే బుర్ర రామ కీర్తన పాడిస్తాడు.
2. వాడు వస్తాన్నాడంటే అందరికీ హాయి.
3. చుట్టాలు వస్తారంటే బస్తీ వాళ్ళు భయపడతారు.
4. తన్నానంటే మూతిపళ్ళు రాలుతాయి.
5. నేనీపని చేస్తున్నానంటే నా సొంతం కోసం కాదు
6. నేను పాఠం చెప్పుతానంటే పిల్లలు పారిపోతారు.

కాంక్షార్థంలో అంటే ప్రయోగించి చేదర్థకం చెయ్యవచ్చు.

ఉదా॥ 1. సినిమాకు వెళ్దామంటే పైసల్లేవు

2. సినిమాకు వెళ్ళాలంటే పైసల్లేవు

అప్యర్థక రూపాలు కూడా ఈ కాంక్షార్థంలోనే సాధ్యమవుతున్నాయి.

ఉదా॥ 1. ఉద్యోగస్థులకు నెలాఖర్లో కావాలన్నా 10 రూ. దొరకవు

2. కాఫీ తాగుదామన్నా నా దగ్గర పావలా లేదు

3. టీచరు వచ్చాడన్నా పిల్లలు క్లాసుకిరారు.

11. మరికొన్ని వాక్యాల్ని పరిశీలిద్దాం.

ఉదా॥ 1. మంచి కూరల్లేవని భోజనం మానేశాను.

2. జీడిపప్పు లేదని ఉప్మా రుచిగా లేదు.

3. యజమాని వచ్చాడని కుక్క తోకాడిస్తుంది.

4. నువ్వు తొందరగా వచ్చావని రైలు లేటుగా వచ్చింది.

5. ఈ సంవత్సరం అదునుకు వర్షాలు కురిసినయ్యని పంటలు బాగా పండినాయి.

పై వాక్యాల్ని నిశితంగా పరిశీలిస్తే "అని" అక్కడ హేత్వర్థంలో ప్రయోగించబడిందని సులభంగా గ్రహించవచ్చు. "అని"కి పూర్వం వున్న వాక్యాల్ని కారణమని, పరంలో వున్న వాక్యాల్ని కార్యవాక్యమని స్థూలంగా చెప్పవచ్చు.

పై వాక్యాల్లో కొన్ని వ్యాకరణ సమ్మతం కాలేకపోతున్నాయి. ఒకటి, రెండు వాక్యాల్ని పోల్చి చూస్తే కార్యవాక్యంలో మనుష్య వాచక శబ్దం కర్తగా వున్నప్పుడే వ్యాకరణ సమ్మతమవుతుందని చెప్పవచ్చు. కార్యవాక్యంలో మనుష్యేతర ప్రాణ వాచక శబ్దం వున్నా మూడో వాక్యం వ్యాకరణ సమ్మతంగా కన్పిస్తుంది. ఐదో వాక్యంలో ప్రాణి వాచక శబ్దం కార్యవాక్యానికి కర్తగా వున్నా వ్యాకరణ సమ్మతమయింది. అందువల్ల ఈ మూడింటిని పోల్చి చూస్తే కార్యవాక్యంలో జంగమ ప్రాణి వాచక శబ్దం కర్తగా వుండాలని ప్రతిపాదించవచ్చు. నాలుగో వాక్యంలో వాక్యం అమోదయోగ్యంగా కన్పించినా వ్యాకరణ సమ్మతం కాదు. రైలు బండికి ప్రాణి వాచకత్వం ఆరోపించడం వల్ల ఈ వాక్యం తయారయింది.

12. ఈ కింది వాక్యాల్లో ప్రాణి వాచక శబ్దాలు కర్తలుగా లేకపోయినప్పటికీ వ్యాకరణ సమ్మతాలే.

ఉదా॥ 1. నేను ఆలస్యంగా ఇంటికి వస్తానని మా ఆవిడకి కోపం

2. ఇంట్లో పని ఎక్కువయిందని మా ఆవిడకి విసుగు

3. పిల్లలు సరిగ్గా చదువుకోవడం లేదని మా ఆవిడకి దిగులు

పై వాక్యాల్లో ప్రధాన వాక్యాల ఆఖ్యాతాలు (Predicates) క్రియలు కావు. కాని వాటిని "పడు" అనే అనుబంధ క్రియను చేర్చి, క్రియలుగా మార్చవచ్చు. ఇలా మార్చినప్పుడు "కు" బంధంతో వున్న నామం ఆ క్రియకు కర్తగా మారుతుంది. కర్తృ విహీన వాక్యాలను కర్తృసహిత వాక్యాల నుంచి నిష్పన్నం చేస్తే ఇంతకు ముందు చేసిన సూత్రీకరణ సరిపోతుంది. లేకపోతే గుప్త నిర్మాణంలో కర్త్రను భోక్తృ సంబంధాలున్నప్పుడు ఈ రకమైన హేత్వర్థబోధ జరుగుతుందని చెప్పాలి. ఈ వాక్యాల్లో ఆఖ్యాతాలు మనఃస్థితి బోధకాలు. వాటిని క్రియలుగా మార్చినప్పుడు మనః పరిణామ బోధకాలవుతాయి.

మనఃస్థితి బోధకాఖ్యాతాలున్నప్పుడల్లా ఇలా హేత్వర్థం వస్తుందని చెప్పలేం.

ఉదా॥ 1. లాటరీలో డబ్బు వస్తుందని సుబ్బారావుకు ఆశ.

2. విప్లవం వస్తుందని విరసం కవులకు నమ్మకం.

పై వాక్యాల్లో హేత్వర్థం లేదు. అనికి పూర్వమున్న వాక్యాలకు ఆశ. నమ్మకం అనే ఆఖ్యాతాలకు దగ్గరి సంబంధం వుంది. ఉదాహరణకు ఈ కింది వాక్యాలుపై వాక్యాలతో సమానార్థకాలు.

ఉదా॥ 1. సుబ్బారావుకు లాటరీలో డబ్బు వస్తుందనే ఆశ వుంది.

2. విరసం కవులకు విప్లవం వస్తుందనే నమ్మకం వుంది.

ఈ రెండు వాక్యా సమూహాల్లోనూ సుబ్బారావుకున్న ఆశ స్వభావం, విరసం కవులకున్న నమ్మకం వ్యక్తమవుతున్నది.

14. హేత్వర్థం వచ్చిన వాక్యాల్లో జంగమ ప్రాణి వాచక శబ్దం అనుభోక్తగానూ వుండడం గమనించాం. అలా వున్న ఈ అర్థం రాని మనఃస్థితి బోధక వాక్యాలను గమనించాం. మరికొన్ని వాక్యాల్లో ప్రాణివాచక శబ్దాలు కర్తలుగా వున్నా, హేత్వర్థం రాకపోగా వ్యాకరణ విరుద్ధాలు అవుతున్నాయి.

ఉదా॥ 1. ఆధునిక ఆయుధాలు లేవని మన సైనికులు ఓడిపోయారు.

2. వాళ్ళమ్మ కోడిగుడ్లు పెట్టలేదని కిష్టప్ప చిక్కిపోయాడు.

3. మందు తాగాడని మా వాడికి జర్వం తగ్గింది.

4. డాక్టర్ పెన్సిలిన్ ఇంజిక్షన్ ఇచ్చాడని రోగి చనిపోయాడు.

ఈ పై వాక్యాల్లో మనుష్య వాచక శబ్దం కర్తగా కాని, అనుభోక్తగా కాని వుంది. అయినా వ్యాకరణ విరుద్ధాలయినాయి. ఈ వాక్యాల్లో ఓడిపోవు, చిక్కిపోవు, జ్వరం తగ్గు, చనిపోవు, అనే వ్యాపారాలు ఆ వాక్యాల కర్త్రనుభోక్తకు స్వాధీనంలో లేవు. ఆఖ్యాతాలకు స్వాధీనత, నిరధీనత అనే అంశాలను ప్రతిపాదించాలని ఈ వాక్యాలు నిరూపిస్తున్నాయి. ఈ స్వాధీనతా నిరధీనతాంశాలు అన్ని క్రియలకు స్థిరం కాదు.

ఉదా॥ 1. గిరిల్లాలు గెలవాలని ప్రభుత్వ సైనికులు ఓడిపోయారు.

ఈ వాక్యంలో ఓడిపోవడం ఇచ్ఛాపూర్వకంగా జరిగింది. ఇచ్ఛాపూర్వకంగా చేసిన వ్యాపారాలన్నీ కర్తృ స్వాధీనంలో వుంటాయి. కాబట్టి పై వాక్యం వ్యాకరణ సమ్మతమైంది.

15. దీన్ని బట్టి "అని"తో వున్న వాక్యం హేత్వర్థం కావాలంటే పరవాక్యంలో జంగమ ప్రాణి వాచక శబ్దం కర్త్రను భోక్తల స్థానంలో వుంది. అక్యాతంలో వ్యాపారం ఆ ప్రాణికి స్వాధీనంలో వుండాలని సూత్రించుకోవచ్చు. కాని ఈ కింది వాక్యం ఇందుకు విరుద్ధంగా కన్పిస్తుంది.

ఉదా॥ 1. ఉపన్యాసకులు రాలేదని సభ వాయిదా పడింది.

ఈ పై వాక్యంలో సభ ప్రాణి వాచక శబ్దం కాదు. అయినా పై వాక్యం ప్రయోగయోగ్యం, వ్యాకరణ సమ్మతం. అయితే "సభ" దానంతటది వాయిదా పడదు. కర్త ఒకరుండి వుండాలి. అంటే పై వాక్యాన్ని కర్తృరహిత వాక్యం నుంచి నిష్పన్నం చెయ్యాలి. దాని నిర్మాణం కింది వాక్యంలో లాగా వుంటుంది.

ఉదా॥ 1. ఉపన్యాసకులు రాలేదని నిర్వాహకులు సభను వాయిదా వేశారు.

16. హేత్వర్థ బోధలో ఇంత వరకు కార్యవాక్యంలో నియమాలను గురించి మాత్రమే గమనించాం. కారణ వాక్యంలో నియమాలను కూడా కొన్ని గమనించాలి. ఈ క్రింద వాక్యాలను పరిశీలించండి.

ఉదా॥ 1. మా అబ్బాయి ఇడ్డెన్లు తిన్నాని / తిన్నాడని భోజనం మానేశాడు.

2. నువ్వు జీతం కట్టావని పరీక్ష రాశావు.

3. మా పక్కావిడ మమ్మల్ని తిట్టానని మా ఇంటికి రావడం లేదు.

ఈ పై వాక్యాలు కారణ కార్య వాక్య భాగాలు రెండూ ఏక కర్తృకాలు. వీటిని సంపూర్ణంగా వ్యాకరణ విరుద్ధాలని చెప్పలేం గాని వీటి కన్నా పూర్వపు వాక్యాలతో పోలిస్తే ఇవి అంత సమ్మతంగా కన్పించడం లేదు.

17. పై వాక్యాల్లో ఒకే కర్త రెండు వ్యాపారాలను ఒక దాని తర్వాత ఒకటి నిర్వహించినట్టు చెప్పబడింది. ఏక కర్తృక నిర్వాహిత వ్యాపారాల్లో "అని" ప్రయోగం సమ్మతం కాదని పై వాక్యాలు నిరూపిస్తున్నాయి "అని" కి పూర్వమున్న వాక్య భాగంలో భవిష్యద్బోధక క్రియవుంటే ఏకకర్తృకత సమ్మతమవుతుంది. కాని నిశ్చయార్థక క్రియా రూపాలు వాడటానికి వీలులేదు. కాంక్షార్థంలో వచ్చేదాం, అని, అనే ప్రత్యయాలతో వున్న క్రియా రూపాలు మాత్రమే ప్రయుక్తమవుతాయి.

ఉదా॥ 1. సోషలిజం త్వరగా తీసుకు రావలని ప్రభుత్వం వారు పన్నులు పెంచారు.

2. పుస్తకాలు కొనుక్కుందామని బజారుకు వెళ్ళాను.

ఈ పై వాక్యాల్లో "అని" కి పూర్వమున్న వాక్య భాగం పూర్తి అయిన వ్యాపారాన్ని కాని, నిశ్చతమైన భవిష్యద్వ్యాపారాన్ని కాక, పరవాక్యంలో భాగానికి లక్ష్యాన్ని సూచిస్తుంది. అందువల్ల ఇది వ్యాకరణ సమ్మతమయింది.

18. "అని"తో అనుకృతమైన వాక్యంలో ఏ క్రియ వున్నా అది మొత్తం వాక్యార్థంలో నిశ్చయార్థకంకాదు. రెండు భాగాల్లో ఒకే కర్త వుంటే, కర్త తను నిర్వమించినట్టుగా చెప్పే వాక్యంలో అనిశ్చితత్వాన్ని వ్యక్తం చేయడం కుదరదు. అదే లక్ష్యార్థమయితే నిర్వాహిత వ్యాపారం కాదు గనుక కుదురుతుంది. దీన్ని బట్టి ఇంకో సంగతి చెప్పవచ్చు. "అని"కి పూర్వమున్న వాక్య భాగార్థం పరవాక్యంలో కర్త్రను భోక్తల చేత భావ్యమవుతుంది. నిశ్చయార్థం సత్యమనీ, భావ్యమైనది సత్యం కానక్కర్లేదని వ్యవహర్త అనుకుంటున్నట్టుగా చెప్పవచ్చు. అందువల్ల ఒకే కర్త తను నిర్వహించిన పూర్వ వ్యాపారాన్ని గురించి అనిశ్చతంగా వుండటం సాధ్యం కాదు. "అని" తో అనుకృతమైన వాక్యాల్లో అనిశ్చితాంశం వుందనటానికి ఈ కింది వాక్యాలను గమనించండి.

ఉదా॥ 1. వాళ్ళన్నయ్య వచ్చాడని మా ఆవిడ గారెలు వండింది. కాని నిజానికి రాలేదు

2. వాళ్ళన్నయ్య వచ్చాడు కాబట్టి మా ఆవిడ గారెలు వండింది. కాని నిజానికి రాలేదు.

19. పై వాక్యాలలో "అని" కి పూర్వమున్న వాక్య భాగం విషయం యదార్థమవునా ? కాదా ? అనే దానితో ఆ వాక్య వ్యవహర్తకు సంబంధం లేదు. అయితే రెండో వాక్యంలోని ఉపయోగించిన వ్యవహర్త అందుకు బాధ్యత వహించాలి. అందువల్ల ఒక చోట వచ్చాడని చెప్పి, అదే వాక్యాలలో మళ్ళీ రాలేదని చెపితే అది స్వయం వైరుధ్యం (Self - Contratiction) అవుతుంది.

సంజ్ఞానామాల (Proper Names) వర్గ నిరూపణ కోసం కూడా "అని" ప్రయోగం జరుగుతుంది.

ఉదా॥ 1. ఆ ఊళ్ళో వెంకయ్య అని ఒక రైతున్నాడు.

2. ఆ దేశంలో మిసిసిపి అని ఒక నది వుంది.

పై వాటి నుంచి "వెంకయ్య అనే రైతు" "మిసిసిపి అనేనది" అనే నామ బంధాలను నిష్పన్నం చెయ్యవచ్చు.

20. అర్థవివరణలో అంటే శబ్దం ప్రయుక్తమవుతుంది. ఈ అర్థ వివరణ ఒక శబ్దానికి గాని, వాక్యానికి గాని, ఒక విషయానికి గాని, సంఘటనకు గాని జరగవచ్చు. శబ్దానుకృతి జరిగినప్పుడు అది ఏ భాషా శబ్దమైన కావచ్చు.

ఉదా॥ 1. ఏ రాలు అంటే తోటికోడలు

2. అంభస్ అంటే నీళ్ళు

3. ఎన్నికలు వస్తున్నయ్యంటే నల్లధనానికి పని కలిగిందన్నమాట.

భాషలో పదాలను గాని, జీవితంలో సంఘటనలను గాని అనుకృతం చేసి వ్యాఖ్యానం చేయడం ఇక్కడ కన్పిస్తుంది. పై వాక్యాల్లో "అని" అర్థం "అని" భావం అన్నమాట పై మూడోదాన్లో లాగ వాడవచ్చు.

ఈ అన్నమాట అనేది తెలుగులో ఇతర నిశ్చయార్థక వాక్యాల తర్వాత కూడా ప్రయుక్తమవుతుంది. ఒక వాక్యం వ్యకం చేస్తున్న వాఖ్యానం అని సూచించడానికి వాడతారు. ఆట, కదా, అనే శబ్దాలు కూడా వ్యక్తమైన భాషాంశం మీద వక్రుద్దేశాన్ని సూచించేవే

21. కొన్ని ప్రశ్నార్థక శబ్దాలకు కూడా అని, అంటేలు ప్రయుక్తమవుతాయి.

ఉదా॥ 1. ఎందుకని రాలేదు ?

2. ఎక్కడని వెతికేది ?

3. ఏమని, చెప్పాడు.

4. ఎందుకంటే

ఇలాంటి విశేష ప్రయోగాలున్నాయి. వీటిని కూడా అనుకరణ సంబంధులు గానే ఊహించవచ్చు.

22. ఇవిగాక గణగణమని, పకపకమని మొదలైన ధ్వన్యనుకరణ ప్రయోగాలు కూడా తెలుగులో వున్నాయి. భాషేతర శబ్దాలను అనుకరించవచ్చునని ఈ శబ్దాలు నిరూపిస్తున్నాయి. అంతేకాక ధగధగమని, తళతళమని లాంటి ప్రయోగాలు చూస్తే దృశ్యయోగ్యమైన వాటిని జివ్వుమని, ఝల్లుమని అనే వాటిని చూస్తే స్పర్శయోగ్యమైన వాటిని, గుప్పుమని (వాసన వచ్చింది) లాంటి వాటిని చూస్తే ఘ్రాణ యోగ్యమైన వాటిని కూడా అనుకరించవచ్చునని తెలుస్తుంది. ఇంద్రియ గ్రహణ యోగ్యమైన ప్రతిదీ అనుకరణ యోగ్యమేనని చెప్పవచ్చు. వీటిల్లో మ కారాగమం విశేషం. ఇది గాక పరోక్ష విధిలో మాత్రమే ఇలాంటి "మ" కారాగమం వస్తుంది.

**ముగింపు :**

తెలుగులో అనుకరణానికి చాలా విస్తృతమైన ప్రణాళిక వుంది. తెలుగులో అనుకరణం మీద చేసే పరిశోధన వల్ల అసలు భాషల్లో అనుకరణ తత్వాన్ని పరిశీలించడానికి ఉపయోగిస్తుంది. భాషను గురించి భాషతో చెప్పడానికి అనుమతించే సాధనం అనుకరణ. ఈ అనుకరణను గురించి ఇతర భాషల్లో ఏమంత పరిశోధన జరిగినట్లు కనబడదు. తెలుగులో జరిగిన ఈ మాత్రం పరిశీలననైనా అందుకు పనికి వస్తుంది. విశాల విశ్వాన్నే గర్భీకృతం చేసుకునే శక్తి అనుకరణకుంది. కాబట్టి భాషను అర్థం చేసుకోటానికి అలాంటి పరిశీలన అవసరం.

**ఆధారగ్రంథాలు:**


1. ఆధునిక తెలుగు వ్యాకరణం - ఎన్. శివరామమూర్తి
2. ఆధునిక తెలుగు వెన్నెలకంటి వ్యాకరణం - వెన్నెలకంటి ప్రకాశం
3. ఆధునిక తెలుగు భాషా నిర్మాణం - శివుని రాజేశ్వరి
4. ఆధునిక ప్రామాణికాంధ్ర వ్యాకరణం - వజ్ఝల వేంకటేశ్వర్లు
5. ఆధునిక భాషాశాస్త్రం - వెలమల సిమ్మన్న
6. ఈనాడు భాషా స్వరూపం - బూదరాజు రాధాకృష్ణ
7. తెలుగు దారి - వెల్చేరు నారాయణరావు
8. తెలుగులో వెలుగులు - చేకూరి రామారావు
9. తెలుగు భాషా చరిత్ర (సంపాదకులు) - భద్రిరాజు కృష్ణమూర్తి
10. తెలుగు భాషా చరిత్ర - వెలమల సిమ్మన్న
11. తెలుగు భాషా తత్త్వం - కొమర్రాజు లక్ష్మణరావు
12. తెలుగు భాషా శాస్త్రవేత్తలు - వెలమల సిమ్మన్న
13. తెలుగు భాషా స్వరూపం - బూదరాజు రాధాకృష్ణ
14. తెలుగు వాక్యం - చేకూరి రామారావు
15. ప్రౌఢ వ్యాకరణం - బహుజనపల్లి సీతారామయ్య
16. బాల వ్యాకరణం - చిన్నయసూరి
17. బాల వ్యాకరణం - శాస్త్రీయ వ్యాఖ్య - వెలమల సిమ్మన్న, గుమ్మా సాంబశివరావు
18. భాషా తపస్వి గిడుగు - వెలమల సిమ్మన్న
19. భాషానువర్తనం - చేకూరి రామారావు
20. వ్యావహారిక భాషా వ్యాకరణం - వడ్లమూడి గోపాలకృష్ణయ్య
21. శబ్ద బ్రహ్మ చిన్నయసూరి (అముద్రితం) - వెలమల సిమ్మన్న, గుమ్మా సాంబశివరావు
22. సంధి - వెలమల సిమ్మన్న


**II. ఆంగ్లం :**


1. A Grammar of ModernTelugu - Bh. Krishan Murthy
2. Sandhi Balavyakaranam - J. Pratap Reddy.

పాఠం - 13

# తెలుగులో నామ్నీకరణాలు

భాషాశాస్త్రం ఆధునికయుగంలో బాగా అభివృద్ధి చెందింది. ఆ క్రమంలో వాక్యంపై పరిశోధనలు జరిగాయి. తెలుగులో భాషా శాస్త్ర రంగంలో ఎనలేని కృషి చేసిన వారు ఆచార్య చేకూరి రామారావు. వీరు తెలుగు వాక్య నిర్మాణాన్ని శాస్త్ర దృష్టితో లోతుగా పరిశీలించారు. వాక్యంపై ప్రామాణిక పరిశోధన చేసిన మార్గదర్శకులు రామారావుగారు

చేకూరి రామారావుగారు "తెలుగు నామ్నీకరణాల పై పరివర్తన శాస్త్ర అధ్యయనం" (A Transformational Study of Telugu Nominates) అనే అంశంపై పరిశోధన చేశారు. 1968లో అమెరికాలోని కార్నెల్ యూనివర్శిటీ నుంచి పి.హెచ్.డి. డిగ్రీని పొందారు. నోమ్ ఛామ్స్కి భాషా శాస్త్ర రంగంలో ప్రవేశపెట్టిన "పరివర్తన వ్యాకరణం" (Transformational Grammar) విధానానికి చెందింది ఈ పరిశోధన.

### నామ్నీకరణం - నిర్వచన :

ఒక వాక్యాన్ని కొన్ని మార్పులుతో వాక్యంలో కర్త, కర్మ పద స్థానాల్లో ఉపయోగించే పద్ధతిని నామ్నీకరణం అని అంటారు.

### తెలుగులో నామ్నీకరణాలు - రకాలు :

తెలుగులోని నామ్నీకరణాల్ని ఆచార్య చేకూరి రామారావుగారు ఆరు విధాలుగా వర్గీకరించారు. అవి ఇవి.

1. విషయార్థక నామ్నీకరణం
2. సందేహార్థక నామ్నీకరణం
3. ఇత్యర్థక నామ్నీకరణం
4. కాంక్షార్థక నామ్నీకరణం
5. వ్యాపారార్థక నామ్నీకరణం
6. లుప్త విభక్తిక నామ్నీకరణం

భాషలో నామాలు, క్రియలూ, నామ-క్రియా విశేషణాలులాంటి భాషాంగాలుంటాయి. భావ విశేషాలను ప్రత్యేకంగా గాని, సామూహికంగా గాని మనం కొన్ని సంజ్ఞలతో వ్యవహరిస్తాం. అంలాంటి సంజ్ఞలను నామ పదాలంటాం. సాధారణంగా ఇలాంటి పదాలు స్వతస్సిద్ధంగానే నామ పద వాచ్యాలు. ఈ నామ పదాలు వాక్యంలో ప్రవర్తించే విధానాన్ని బట్టి బహుధా విభక్తాలు, భాషా వ్యవహర్తల ప్రయోజనాల్ని అనుసరించి ఒక్కోసారి ఒక భాషా భాగాన్ని ఇంకో భాషా భాగంగా వ్యవహరిస్తుంటాం. అలాంటి వ్యవహారానికి భాషలో కొన్ని నియతమైన పద్ధతులుంటాయి. ఒక భాషా భాగానికి చెందిన శబ్దానికి కొన్ని ప్రత్యయాదుల్ని

చేర్చి వేరొక భాషా భాగంగా వ్యవహరించుకోవడం భాష అనుమతించే ఒక పద్ధతి.

నామాల్ని క్రియలుగా ఉపయోగించే ఈ పద్ధతిని గమనించండి .

ఉదా ॥

| నామం | క్రియ |
|---|---|
| బాధ | బాధించు<br>బాధపడు<br>బాధపెట్టు |
| కష్ట (ము) | కష్టించు<br>కష్టపడు<br>కష్టపెట్టు (కొను) |

నామాల్ని క్రియలుగా వాడుకున్నట్టుగానే క్రియల్ని కూడా నామాలుగా వ్యవహరించుకోవచ్చు. పూర్వ వ్యాకరణాల్లో కృదంత పరిచ్ఛేదం ఈ పద్ధతుల్లోని నియమాల్ని సూచించటానికే

పృథక్పదాల్ని మాత్రమే కాక వాక్యాల్ని కూడా కొన్ని మార్పులు చేసుకొని భాషా భాగాల స్థానంలో మరో బృహత్ వాక్యంలో ప్రయోగించవచ్చు. నామ పదాల స్థానంలో వాక్యాలను ప్రయోగించడం ఇందులోని విషయం. ఇదే నామ్నీకరణం.

నామ్నీకరణం అంటే నామం కాని దాన్ని నామం చెయ్యడం, ధాతువులకు ప్రత్యయాదుల్ని చేర్చిన నామాలుగా వ్యవహరించడాన్ని కూడా నామ్నీకరణం అనవచ్చు. అయితే ఈ పదం ఈ వ్యాసంలో వాక్య నామ్నీకరణానికి పరిమితం. ధాతు నామ్నీకరణం పద నిర్మాణానికి సంబంధించిన విషయం. వాక్య నామ్నీకరణం వాక్య నిర్మాణానికి సంబంధించిన విషయం.

## 1. విషయార్థక నామ్మీకరణం :

మొత్తం విషయాన్ని తెలియజేసేది విషయార్థక నామ్మీకరణం. ఈ క్రింది వాక్యాల్ని పరిశీలిద్దాం.

ఉదా॥ 1. ఖలీల్ జిబ్రాన్ కవిత్వాన్ని కాళోజీ తెలిగించాడు.

2. ఆ విషయం (లేక ఆ సంగతి) నాకు తెలుసు.

ఇద్దరి మధ్య జరిఇన సంభాషణ ఇది. పై సంభాషణను పరిశీలిస్తే రెండో వాక్యంలోని ఆ విషయం (లేక సంగతి) మొదటి వాక్యం మొత్తానికి బదులుగా వాడబడిందని గ్రహించవచ్చు. ఆ విషయం ఏమిటో మొదటి వాక్యంలో చెప్పబడింది కాబట్టి మళ్ళీ ఆ విషయాల్ని చెప్పే అవసరం లేకుండా రెండో వ్యవహర్త " ఆ విషయం" అని సంగ్రహించి చెప్పాడు. మొదటి వాక్య సందర్భం లేకనప్పుడు ఆ వాక్యాన్ని రెండో వాక్యంలో ఏదో విధంగా మిళితం చేసి చెప్పాలి. "ఆ విషయం" అనే మాటకు

బదులుగా మొత్తం వాక్యాల్ని ప్రయోగించాలి. ఇక్కడ విషయ శబ్దానికి వాక్యంలో చెప్పిన మొత్తం విషయం అని అర్థం. ఇలా విషయార్థంలో వాక్యాన్ని ప్రయోగించడానికి కొన్ని మార్గాలున్నాయి. అందులో ఒకటి వాక్యానికి"అని" అనే రూపాన్ని తగిలించడం. అప్పుడు రెండు వాక్యాల్ని "అని" చేత అనుసంధిస్తే ఇలా ఉంటుంది.

ఉదా॥ ఖలీల్ జిబ్రాన్‌కవిత్వాన్ని కాళోజీ తెలిగించాడని నాకు తెలుసు.

ఇది సంక్లిష్ట వాక్యం. వ్యాకరణ సూత్రాల వల్ల కలిసిన రెండు వాక్యాల సంయోగ రూపం సంశ్లిష్ట వాక్యమని వ్యవహృతం.

పై సంశ్లిష్ట వాక్యంలో నామ ప్రవర్తన కలిగిన (నామ్నీకృతం చేయబడిన) వాక్యాన్ని విశేషణీకృతం చేయవచ్చు. "అని" ని "అన్న" లేక "అనే" అని మార్చి, సంగతి లేక విషయం అనే మాటల్ని చేరిస్తే మొదటి వాక్యం విశేషణీకృతం అవుతుంది. అప్పుడు ఆ వాక్యం ఇలా వుంటుంది. అర్థంలో భేదం వుండదు.

ఉదా॥ ఖలీల్ జిబ్రాన్ కవిత్వాన్ని కాళోజీ తెలిగించాడన్న సంగతి నాకు తెలుసు.

"అను" ధాతువుకున్న బహు విశేషణ రూపాల్లో రెండు మాత్రమే ఇక్కడ (అర్థ భేదం లేకుండా) ప్రయోగించగులుగుతాం. పై వాక్యాల్లో అని ప్రత్యయతుల్యం. అంటే శబ్ద రూప సాధనలో ప్రత్యయం చేసే పనిని వాక్య నిర్మాణంలో "అని" చేస్తున్నదన్నమాట. ఇలాంటి వాటిని అవయవి సూచకాలు (Construction Markers) అనవచ్చు.

అంతర్నిర్మాణం వున్న వాక్య, వాక్యాంశాలు అవయవులు (Constructions) వాటిలో పృథగ్భాగాలు అవయవాలు (Constituents) (అవయవి-అవయవం-అనే మాటల్ని పై అర్థంలో ప్రయోగించవచ్చునని ఆచార్య నాయని కృష్ణ కుమారిగారు సూచించారు).

విషయార్థక నామ్నీకరణంలో మరో పద్ధతి తచ్ఛబ్ద ప్రయోగం. తెలుగులో "అది" అనే శబ్దానికున్న బహుళ ప్రయోజనాల్లో ఇది ఒకటి. ఒక వాక్యాన్ని మరో వాక్యానికి "అది" చేత అనుసంధించాలంటే ఆ వాక్యంలోని కాలబోధక ప్రత్యయ సహితమైన సమాపక క్రియా రూపాన్ని విశేషణ రూపంగా మార్చాలి. ఈ రూపల్నే పరవస్తు చిన్నయసూరి ధాతుజ విశేషణాలని వ్యవహరించాడు. బహుజనపల్లి సీతారామాచార్యుల క్రియాజన్య విశేషణాలనే మాట కూడా ఈ అర్థంలోనే వాడాడు. కాల వాచి ప్రత్యయ ప్రాధాన్యమున్న ఈ రూపాల్ని క్రియాజన్య విశేషణాలు అనడమే సముచితంగా కన్పిస్తుంది.

ఆధునిక భాషలో ఒక్కో క్రియా రూపానికి నాలుగేసి క్రియాజన్య విశేషణ రూపాలుంటాయి. "వండు" ధాతువు తీసుకుంటే ఈ రూపాలు ఇలా వుంటాయి.

ఉదా॥ భూతకాలం - వండిన

తద్ధర్మకాలం - వండే, వ్యతిరేక - వండని

వర్తమాన కాలం - వండుతున్న

ఈ విశేషణ రూపాల తర్వాత తచ్ఛబ్దంలోని అకారం లోపించి "ది" అనే రూపం మాత్రమే మిగులుతుంది. ఇంతకు ముందటి వాక్యాన్నే ఉదాహరణగా తీసుకుంటే నామ్నీకరణం తర్వాత ఇలా వుంటుంది.

ఉదా॥ జలీల్ జిబ్రాన్ కవిత్వాన్ని కాళోజీ తెలిగించింది నాకు తెలుసు.

ఈ నామ్నీకరణం భూత కాల క్రియా రూపం మీద చేసింది. మిగతా క్రియా రూపానికి కూడా ఇదే పద్ధతి సాధ్యం అని సుస్పష్టం.

ఇంత వరకు మనం క్రియలున్న వాక్యాల్ని నామ్నీకరించే పద్ధతి మాత్రమే పరిశీలించాం.

2. ఇప్పుడు క్రియలేని వాక్యాలు గూర్చి తెలుసుకుందాం. క్రియలేని వాక్యాల్ని నామ్నీకరించటం ఎలా అనేది సమస్య వుంది. తెలుగులో రెండు నామాల్ని (నామం అనే శబ్దం నామ బంధానికి కూడా గ్రాహ్యం) అను సంధించడం వల్ల కొన్ని రకాల వాక్యాలేర్పడతాయని అందరూ ఎరిగిన విషయమే.

ఉదా॥ చిన్నయసూరి గొప్ప వ్యాకర్త.

ఈ వాక్యం రెండు నామాలు సన్నిహిత అవయవాలుగా గల అవయవి. ఈ వాక్యాన్ని "నాకు తెలుసు" అనే వాక్యంతో అనుసంధించాలంటే "అని" చేర్చడం ఒక పద్ధతి. అక్కడ ఎలాంటి సమ్య లేదు. "అది" చేర్చాలంటే మాత్రం, తప్పనిసరిగా క్రియ కావాలి. అంతే కాదు "అది" కాలబోధక ప్రత్యయ సహితమై వుండాలి. దాన్ని విశేషణంగా మార్చాలి. ఇలాంటి సందర్భాల్లో క్రియలేని వాక్యాలకి "అగు" ధాతు క్రియా రూపాల్ని అనుబంధించడం వల్ల ఉద్దిష్ట లక్ష్యాన్ని సాధించవచ్చు.

ఉదా॥ చిన్నయసూరి గొప్ప వ్యాకర్త అయింది

(అయిన సంగతి) నాకు తెలుసు.

పై వాక్యంలో అస్పష్టత వుంది. అంటే ఈ వాక్యానికి రెండు రకాలుగా తాత్పర్యం చెప్పవచ్చు.

ఉదా॥ 1. చిన్నయసూరి గొప్ప వ్యాకర్త అని నాకు తెలుసు.

2. చిన్నయసూరి గొప్ప వ్యాకర్త అయినాడని నాకు తెలుసు.

ఈ భిన్నార్థబోధ "అగు" ధాతువుకు వున్న రెండు ప్రయోజనాల వల్ల ఏర్పడింది. "అగు" ధాతువు ప్రత్యేక క్రియగా, ఉపయుక్తమైనప్పుడు పరిణామార్థకం. ఆ అర్థమే వాక్యం "చిన్నయసూరి గొప్ప వ్యాకర్త అయినాడని నాకు తెలుసు"లో సూచితం.

క్రియా రహిత వాక్యాన్ని ఇంకో వాక్యంతో కలపటానికి అనుసంధిక రూపంగా ఉపయోగపడడం రెండో ప్రయోజనం. "అది" వాక్యం చిన్నయసూరి గొప్ప వ్యాకర్త అని నాకు తెలుసు" లో వ్యక్తం చేసిన తాత్పర్యం వల్ల సూచితం.

పై రకపు నామ బంధ వాక్యాల్ని ఆపి చేదాద్యర్థాల్లో వాడాలన్నా "ఆగు" ధాతు క్రియా రూపాల్ని అనుబంధించాలి.

ఉదా॥ 1. చిన్నయసూరి గొప్ప వ్యాకర్త అయినా చిన్న వ్యాకరణం రాశాడు.

2. చిన్నయసూరి గొప్ప వ్యాకర్త అయితే చిన్న వ్యాకరణం ఎందుకు రాశాడు.

పై వాక్యాల్లో "అగు" ధాతువు అనుసంధిక రూపంగా ప్రయుక్తం అయిన సంగతి స్పష్టం.

3. తచ్ఛబ్దనామ్నీకరణానికి కాల వాచి ప్రత్యయం అవసరమని పూర్వమే ఉక్తం. కాల వాచి ప్రత్యయం అసలే లేదని లేదా పరిమితంగా చేరే క్రియలు కొన్ని వున్నాయి. వాటిలో బుద్ధ్యర్థక ధాతువులైన "వచ్చు", "తెలియు" పేర్కొనదగినవి.

ఉదా॥ తెలుగు వ్యాకర్తలకు సంస్కృతం వచ్చు (ను).

అభ్యసనయుక్తమైన నామాలు మాత్రమే ఈ "వచ్చు"కు కర్తృ పద స్థానంలో రాగలవు. పై వాక్యాన్ని తచ్ఛబ్దమైన "అది"తో నామ్నీకరించలేం. "వచ్చు" అనే సమాపక క్రియలో కాలవాచి ప్రత్యయం లేకపోవటమే అందుకు కారణం. "అని"తో నామ్నీకరరించడానికి ఎలాంటి ఆటంకమూలేదు. కాల వాచి ప్రత్యయమున్నప్పుడు తచ్ఛబ్ద నామ్నీకరణమూ సాధ్యమే.

"తెలియు" ధాతువుకు కర్తృపద స్థానంలో అమూర్త పదార్థ (Abstract) వాచియైన నామం వచ్చినప్పుడు మాత్రమే భూతకాల వాచి ప్రత్యయం సాధ్యం. అప్పుడు తచ్ఛబ్ద నామ్నీకరణం చేయవచ్చు. రానప్పుడు వీలులేదు.

ఉదా॥ 1. వాడికి వ్యాకరణం చదివే పద్ధతి తెలుసు.

2. వాడికి వ్యాకరణం చదివే పద్ధతి తెలిసింది.

పై రెండు వాక్యాల్లో రెండో వాక్యానికి మాత్రమే తచ్ఛబ్ద నామ్నీకరణం సాధ్యం.

ఉదా॥ వాడికి వ్యాకరణం చదివే పద్ధతి తెలిసింది

(తెలిసిన సంగతి) నాకు తెలియదు.

ఈ వాక్యంలో "తెలిసింది" అనే రూపం క్రియ కాదు. క్రియాజన్య విశేషణానికి తచ్ఛబ్దం చేర్చటం వల్ల ఏర్పడిన నామరూపం.

పైన ఉదాహరించిన వాక్యం కొంత కృతకంగా కన్పించే మాట వాస్తవమే. ఈ వాక్యం ఇంతకు ముందు ఎప్పుడూ ఎవరూ ప్రయోగించి వుండకపోవచ్చు. ఇక ముందు ప్రయోగించకపోవచ్చు కూడా. ప్రయుక్త వాక్యాల్ని మాత్రమే వ్యాకరించాలనడం వ్యాకరణ ప్రయోజనాన్ని సంకుచితం చేయటమే. ప్రయోగించడానికి వీలున్న వాక్యాలు కూడా వ్యాకరణ విషయాలే అని ఆచార్య చేకూరి రామారావుగారు అన్నారు.

పై వాక్యానికి రామారావుగారు చెప్పిన అర్థం తెలుగు భాషా వ్యవహర్త అంతరీకరించుకున్న వ్యాకరణం అనుమతిస్తుంది.

4. తెలుగులో అన్నంత క్రియల తర్వాత కొన్ని భావ విశేషాలను వ్యక్తీకరించడానికి కొన్ని రకాల ధాతువుల్ని వాడతాం. ఆ ధాతువులకు కాల బోధక ప్రత్యయాలను సాధారణ ధాతువులకు వాడినంత విస్తృతంగా వాడలేం. ఈ క్రింది వాక్యాలను గమనించండి.

ఉదా॥ 1. ఏ శాస్త్రమైన మాతృభాషలో బోధించవచ్చు.

2. ఇతరుల విషయాల్లో తలదూర్చకూడదు.

3. అరసికుణ్ణి ఎవరు మెప్పించగలరు.

4. తింటే గారెలు తినాలి. వింటే భారతం వినాలి

(విన+వలయును)

అనుమత్యర్థంలో "వచ్చు" కు నిషేధార్థంలో "కూడు"కు, కాలవాచి ప్రత్యయాలు చేరవు. సామర్థ్యార్థంలో "కలుగు"కు

కాలవాచి ప్రత్యయాలు చేరతాయి. కాని "కల" అనే రూపంలో వున్నప్పుడు మాత్రం చేరవు "వలయు"కు భూతకాల, వాచి ప్రత్యయం మాత్రమే చేరుతుంది. అదీ అసమాపక క్రియగా వున్నప్పుడు మాత్రమే.

ఉదా॥ రావాల్సి వచ్చాను

"వలయు" ధాతువుకి కాలబోధ వ్యక్తీకరించి సమాపక క్రియగా వాడాలంటే "వలయు" ధాతుక్త్వార్థక రూపానికి "వచ్చు" గాని, "ఉండు" గాని అను ప్రయుక్తం చెయ్యాలి.

ఈ ధాతువులు ఈ సందర్భాల్లో కాలబోధక ప్రత్యయవాహకాలు (Tense Carriers) గా మాత్రమే వర్తిస్తాయి.

ఉదా॥ 1. తెలుగు పండితులు భాషాశాస్త్ర ప్రాధాన్యం గుర్తించాల్సి వుంది.

2. అయిదేళ్ళకి తెలుగులోనే భాషాశాస్త్రం బోధించాల్సి వస్తుంది.

కాలవాచి ప్రత్యయయుక్త క్రియా రూపాలున్న పై వ్యాకాలు సంఖ్య గల వాక్యాలు తచ్ఛబ్ద నామ్నీ కరణార్థాలు.

5. విషయార్థక నామ్నీకరణం లోనే ధాతువుకు భావ ప్రత్యయం చేర్చడం ఇంకో పద్ధతి. ప్రాచీన భాషలో "ట" భావ ప్రత్యయం. ఆధునకి భాషలో "అటం" (అడం కూడా అటం చేత గ్రాహ్యం). పూర్వ వ్యాకర్తలు భావ ప్రత్యయాన్ని ధాతువుకి విధించారు. (ధాతువునకు బాలవ్యా. క్రియ . ।. "ట" వర్ణ కంబు భావంబు నందగు" బాల వ్యా. క్రి. సూ. 35)

ఆధునిక భాషలో కాల బోధక సమర్థమైన ధాతువులకే (కాలవాచి ప్రత్యయ వాహకాలు కూడా గ్రహించాలి) భావ ప్రత్యయం చేర్చగలగుతాం గనక ధాతువునకు అనకుండా కాలవాచి ప్రత్యయయుక్త సమాపక క్రియా రూపాలకు అనటం సమంజసంగా కన్పిస్తుంది. భావ ప్రత్యయం చేరినప్పుడు ధాతువుకి పూర్వహితమైన లిడాదులకు, డుజకాదులకు లోపం వస్తుందని చెప్పుకోవచ్చు.

కాల వ్యక్తి భావార్థక రూపంలో కలిసి పోతుందన్న మాట. అందువల్ల భావార్థక రూపం సర్వకాల బోధకమవుతుంది. కాలవాచి ప్రత్యయయుక్త సమాపక క్రియలకే భావ ప్రత్యయం చేరుతుందనడం వల్ల తద్భావంలో చేరదని తాత్పర్యం.

ఆధునికాంధ్రంలో భావ ప్రత్యయం చేరినప్పుడు ధాతువుకు "ముత్తు" పరమైనప్పుడు జరిగే ఆదేశ కార్యం జరుగుతుంది. ఉదాహరణకు "ముత్తు" పరమైనప్పుడు "వచ్చు"కు "రా" అని, "తెచ్చు"కు "తే" అని ఆదేశాలవుతాయి. ఈ ఆదేశరూపాలే "అటం" ముందు ప్రయుక్తం. దీర్ఘాంతైక స్వరయుత ధాత్వాదేశ రూపాలకు "అటం" పరమైనప్పుడు వడాగమం (వకారాగమం) అవుతుంది. పై రెండు దాతువులకి "అటమంత" రూపాలకు ఈ విధంగా నిష్పత్తి చూపించవచ్చు.

వచ్చు + అటం > రా + అటం > రా + వ్ + అటం > రావటం

తెచ్చు + అటం > తే + అటం > తే + వ్ + అటం > తేవటం

కాల వాచి ప్రత్యయాలు లోపించిన "అటమంత" రూపాలు ఆయా సందర్భాలననుసరించి సర్వకాల బోధకాలవుతాయి.

ఉదా॥ 1. ఖలీల్ జిబ్రాన్ కవిత్వాన్ని కాళోజీ తెలిగించటం నేనెరుగుదును.

2. ఖలీల్ జిబ్రాన్ కవిత్వాన్ని కాళోజీ తెలిగించాడు, తెనిగిస్తున్నాడు, తెలిగిస్తాడు.

పై వాక్య సమూహంలో ఏ క్రియా రూపాలు నుంచైనా నిష్పన్నం కావచ్చు. కాలబోధ ప్రధానం కానప్పుడు భాషా వ్యవహకర్త "అటమంత" నామ్నీకరణాన్ని ఎన్నుకోవచ్చు.

ఈ విషయార్థక నామ్నీకరణం అన్ని రకాల వాక్యాలకూ సాధ్యపడదు. విధ్యర్థక, ప్రశ్నార్థక వాక్యాలకు విషయార్థక నామ్నీకరణం లేదు. అవిధ్యర్థక, అప్రశ్నార్థక వాక్యాలకు వాటి వ్యతిరేక రూపాలతో సహా ఈ నామ్నీకరణం సాధ్యం. ఎరుగ్వాదులకు, వలయ్వాదులకు, విధ్యర్థక రూపాలు లేకపోవటం గమనించదగింది.

ఈ నామ్నీకృత వాక్యాలకు మరో వాక్యంతో అనుసంధించాలంటే ఇంకా కొన్ని విధి నిషేధాలున్నాయి. "అని" చేత నామ్నీకృతం చేయబడిన వాక్యం నామబంధ వాక్యాల్లో (క్రియా రహిత వాక్యాలు) ప్రయోగార్హం కాదు. నామ్నీకృతం చెయ్యని రెండో వాక్యం బుద్ధ్యర్థక ధాతువులు, శ్రవణార్థక, వచ్యర్థక ధాతువులు లాంటివి మాత్రమే క్రియా రూపాలుగా వుండాలి.

"అని", "అది", "అటం" విషయార్థక నామ్నీకారకాలుగా ప్రతిపాదితం. వీటికి భాషలో వేరే ప్రయోజనాలు కూడా వున్నాయి. ఇవి ఇతర నామ్నీకరణాల్లో ఉపయుక్తమవుతాయి.

## 2. సందేహార్థక నామ్నీకరణం :

వాక్యాలకు సందేహార్థ బోధక కల్పించే పద్ధతులూ, అవి వేరే వాక్యాల్లో సందేహార్థక నామాలుగా ప్రవర్తించే తీరు తెన్నులు గూర్చి చర్చించబడతాయి.

1. తెలుగులో "ఓ" శబ్దాన్ని సందేహార్థకంగా పూర్వ వ్యాకరణాలు గుర్తించాయి. అది పదాంతంలో కాని, పద బంధాంతంలోకాని, వాక్యాంతంలో కాని చేరుతుంది. "ఓ" శబ్దం సర్వస్వతంత్రం కాదు. యత్కిమర్థక శబ్దాపేక్షకం. యత్కిమర్థక శబ్దా భావంలో ఇంకొక "ఓ" శబ్దయుక్త దళం కావాలి. ఈ రెండు లేనప్పుడు కిమర్థక శబ్ద రూపమైన "ఏం" తెచ్చుకోవాలి.

ఉదా॥ అంగారక గ్రహంలో జీవరాశులున్నయ్యా ?

అన్న ప్రశ్నకు మనకు సమాధానం తెలియనప్పుడు, "ఏమో" అంటాం. నిజానికిక్కడ "ఓ" శబ్దమే సందేహ సూచికం. కిమర్థక శబ్ద రూపమైన "ఏం" స్వతంత్ర ప్రయోగార్హతలేని "ఓ" శబ్దం కోసం వచ్చింది.

యత్కిమర్థక శబ్ద రహిత వాక్యాలకు సందేహార్థ బోధ చేయాలంటే ఈ "ఏమో" శబ్దాన్ని వాక్యాంతంలో అనుబంధిస్తాం.

ఉదా॥ మాంసాహారం మనిషికి మంచిది కాదు + ఏమో !

ఈ "ఏమో" శబ్దయుక్త వాక్యాల్ని మరో వాక్యంలో నిబంధించవచ్చు. ఈ నామ్నీకరణానికి విషయార్థక నామాల్లోలాగా వేరే అవయవి సూచకాలు అక్కరలేదు. వాక్యంతంలోని "ఓ" లేక "ఏమో" శబ్దమే ఆ పనిని నిర్వహిస్తుంది. లేకపోతే ఓ శబ్దాన్నే నామ్నీకారకంగా చెప్పి, సందేహార్థక నామాన్ని స్వతంత్ర ప్రయోగార్హత గల నామంగా గుర్తించవచ్చు. ఈ సందేహార్థక నామాలు వేరే వాక్యంలో నిబంధించడానికి కొన్ని నియమాలు వున్నాయి. "ఏమో" శబ్దయుక్త వాక్యం నామంగా ప్రవర్తించే వాక్యంలో క్రియ-కనుక్కోను, చూచు, తెలియు లాంటి విషయ సేకరణ సంబంధి అయిన ధాతు నిష్పన్నం కావాలి.ఆ సంక్లిష్ట వాక్యంలో క్రియ విధ్యర్థకంకాని, ప్రశ్నార్థకం కాని, వ్యతిరేకార్థకం కాని అయి వుండాలి. ఈ మూడు కాని పక్షంలో క్రియాపదం భూతేతర కాలబోధకమై వుండాలి.

ఉదా॥ ఊర్మిళ ఊరి నుంచి వచ్చిందేమో

కనుక్కో

కనుక్కున్నావా ?

కనుక్కోలేదు

కనుక్కుంటాను.

పై వాక్యంలో సమాపక క్రియలు క్రమంగా విధి, ప్రశ్న, వ్యతిరేక భావ్యర్థకాలు.

ఉదా॥ ఊర్మిళ ఊరి నుంచి వచ్చిందేమో కనుక్కున్నాను

(ఈ వాక్యం వ్యాకరణ విరుద్ధం. పై వాక్యం ప్రశ్న, వ్యతిరేకార్థకాలు లేని భూతకాల బోధక సమాపక క్రియా పదయుక్తం కావటం వల్ల వ్యాకరణ సమ్మతమైన ఏక వాక్యం కాదు).

2. కిమర్థక శబ్దయుక్త వాక్యాలకు అంతంలో "ఓ" శబ్ద సంయోజనం వల్ల సందేహార్థ బోధ చేయవచ్చు. ఎక్కడ, ఎందుకు, ఎప్పుడు, ఎటు, ఎట్లా వంటి శబ్దాలు క్రమంగా స్థల, హేతు, కాల, దిక్, రీతులను గురించి ప్రశ్నించే శబ్దాలు. ఇవి క్రియా విశేషణాలుగా ప్రవర్తిస్తాయి. ఏం, ఎవరు మొదలైన శబ్దాలు కర్తగాకాని, కర్మగా కాని, ప్రవర్తించే నామాల్ని గురించి ప్రశ్నించేవి. వీటి సంయోజనంతో కూడిన పద బంధాలకు అంతంలో "ఓ" శబ్దాను బంధం వల్ల సందేహార్థ బోధ కలుగుతుంది.

ఉదా॥ ఎక్కడ ఉన్నాడో

ఎందుకు వచ్చాడో

ఎప్పుడు వెళ్ళాడో

ఎటుపోవాలో

ఎట్లా చెయ్యాలో

ఏం చెప్పాడో

ఎవరు తెచ్చారో

పై "ఏ" శబ్దయుక్త పద రూపాల్లో కొన్నిటికి విభక్తి ప్రత్యయాలు చేరవచ్చు.

ఉదా॥ 1. ఎప్పటికి అవుతుందో ?

2. ఎక్కడికి వెళ్ళాడో !

కిమర్థక శబ్దయుక్త పదాలకు, వాక్యాలకు వేరు వేరుగా "ఓ" శబ్దాన్ని చేర్చటం వల్ల అర్థభేదం కలుగుతుంది.

ఉదా॥ 1. అక్కడ ఎవరున్నారో !

2. అక్కడ ఎవరో ఉన్నారు.

పై వాక్యాల్లో "ఓ'' శబ్ద స్థానభేదం వల్ల అర్థ భేదం కలిగిందనేది స్పష్టం.

వ్యతిరేకావ్యతిరేక నిర్దేశక వాక్యాలకి "ఏమో'' శబ్దం, కిమర్థక శబ్దయుక్త వాక్యాలకి "ఓ'' శబ్దం సందేహార్థంలో వస్తుందనీ, ఈ వాక్యాలని ఇంకో వాక్యంలో నామ పద స్థానంలో ప్రయోగించవచ్చు.

3. సందేహార్థ బోధలో మరో పద్ధతి "ఓ'' శబ్దయుక్త వాక్యాల్ని కాని, వాక్యాంశాలను కాని కొన్నింటిని ఏక వాక్యంగా ప్రయోగించటం. ఇలాంటి సందర్భాల్లో ఆంగ్లంలో "Or'' అనే పదం ప్రయోగిస్తారు. భిన్న వ్యాపారాలకు వికల్ప బోధ చేయాలంటే అవి ఏకాశ్రయాలై వుండాలి. అంటే ఏక కర్తృకాలై వుండాలి.

ఉదా॥ వెంకట్రావు చదువుకుంటున్నాడో, నిద్రపోతున్నాడో చూసిరా !

అనే వాక్యంలో వికల్పాన్ని చెప్పిన చదువుకోవటం, నిద్రపోవడం అనే భిన్న వ్యాపారాలకు వెంట్రావు ఆశ్రయుడు.

ఉదా॥ వెంకట్రావు చదువుకుంటున్నాడో, సుబ్బారావు గుంటూరు వెళ్తున్నాడో చూసిరా ! (చదువుకోవటం, గుంటూరు వెళ్ళటం అనే భిన్న వ్యాపారాలు భిన్నాశ్రయాలు కాబట్టి ఈ వాక్యం వ్యాకరణ సమ్మతమైన ఏక వాక్యం కాదు)

ఏక కర్తృకమైన వ్యాపార వ్యతిరేకావ్యతిరేకతలకు మధ్య కూడా వికల్పాన్ని చెప్పవచ్చు.

ఉదా॥ వెంట్రావు వస్తాడో, రాడో !

వ్యతిరేకా వ్యతిరేక క్రియలకు వికల్పాన్ని చెప్పినప్పుడు వ్యతిరేక క్రియకు సర్వకాలాది బోధలో "లేదు'' అనే రూపం క్రియా రహిత వాక్యాలకు "కాదు'' అనే రూపం, ఆదేశాగమాలుగా క్రమంగా, వికల్పంగా వస్తాయి.

ఉదా॥ 1. వెంకట్రావు వస్తాడో లేదో ! (రాడుకు లేదు ఆదేశం)

2. వెంకట్రావు మంచివాడో, కాదో (ఇక్కడ కాదు ఆగమం)

క్రియా రహిత వాక్యాలకు ఉదార్థబోధలో "కాదు'' అనే రూపం చేరినప్పుడు పూర్వ వాక్యానికి "అవును'' శబ్దం వికల్పంగా చేరుతుంది. అయినప్పుడు "ఓ'' శబ్దం "అవును'' అనే శబ్దానికే చేరుతుంది.

ఉదా॥ వెంకట్రావు మంచివాడు అవునో, కాదో (ఎవరికి తెలుసు)

4. భిన్న వాక్యాల్లో వాక్యాంశాలకి ఉదార్థబోధ చేయాలంటే ఆ అంశాలు భిన్నార్థకాలయి, వ్యాకరణ రూపైక్యత కలిగి వుండాలి. వ్యాకరణ రూపైకత అంటే కారక బోధైకత అని స్థూలంగా చెప్పుకోవచ్చు. అంటే ఉతార్థ వివక్షితాంశాలు భిన్నార్థకాలయి భిన్న వాక్యాల్లో ఒకే రకపు వ్యాకరణ ప్రవర్తన కలిగి వుండాలి. భిన్న వాక్యాల్లో ఉతార్థోద్దిష్టేతర సర్వ శబ్దాలూ సరూపా (Identical) లయి వుండాలి.

ఉదా॥ 1. కమల పొద్దున 10 గంటలకు బస్సులో కాలేజికి వెళ్తుంది.

2. కమల పొద్దున 10 గంటలకు కారులో కాలేజికి వెళ్తుంది.

పై వాక్యాల్లో బస్సులో, కారులో, అనే పదాలకు ఉతార్థాన్ని వివక్షించాలి. ఈ రెండూ ఏక కారక బోధకాలే. మిగతా పదాలన్నీ సరూపాలు.

అప్పుడు పై వాక్యాలు రెండూ కలిసి మూడో వాక్యంగా ఏర్పడతే ఇలా వుంటుంది వాక్యం.

ఉదా॥ కమల పొద్దున 10 గంటలకు బస్సులోనో, కారులోనో కాలేజికి వెళ్తుంది.

పైన చెప్పిన రెండు వాక్యాల్లో ఒక దాంట్లో కమల బదులు విమల ప్రయోగించి మిగతా వాక్యాంశాల్ని సరూపం చేస్తే కమల, విమలలకు ఉతార్థాన్ని వివక్షించవచ్చు. అలాగే మిగతా శబ్దాలకూ ఊహించుకోవచ్చు.

5. సందేహార్థక గురుత్వంలో "ఏమో" శబ్దం కూడా "ఓ" శబ్దాంత వాక్యాలకు అను ప్రయుక్తం అవుతుంది. "ఏమో" శబ్దంతో సందేహార్థ వివక్ష చేసిన వాక్యాల మీది మళ్ళీ గురుత్వ బోధన కోసం "ఏమో" శబ్దాన్ని అనుప్రయుక్తం చేసేటప్పుడు మొదటి "ఏమో" శబ్దంలోని కిమర్థక భాగానికి లోపమవుతుంది.

ఉదా॥ 1. వాళ్ళు ఎప్పుడు వస్తారో, ఏమో !

2. వాడు పరీక్ష తప్పాడో, ఏమో !

విషయగురుత్వ బోధకు కొన్ని శబ్దాల్ని పునరావృత్తి చేసే పద్ధతి చాలా భాషల్లో వుంది. ఆంగ్లంలో వ్యతిరేకార్థక రూపం అలాగే ఆ వృత్తి, అవుతుంది. I dont Know Nothing అనే వాక్యం అమెరికన్ గ్రామీణ వ్యవహారంలో సర్వసాధారణం.

కళింగాంధ్ర వ్యవహారాంలో "ఏమో" శబ్దానికొక చిత్రమైన ప్రయోగం విశేషం వుంది.

ఉదా॥ అప్పుడేమో నేనేమో ఆయనతో ఇలా అన్నాను.

పై వాక్యంలో "ఏమో" శబ్దాన్ని వాక్యాంతంలో తప్ప మిగతా ఏ పద బంధమీదనైనా అసత్తిరక్షకంగా ఉపయోగించవచ్చు. వాక్యాంతంలో ఆ అవసరం లేదు కాబట్టి అక్కడ ప్రయోగించిన "ఏమో" శబ్దం తప్పనిసరిగా అర్థవంతమవుతుంది. ఇలాంటి సంధి ప్రాయమైన నిశ్శబ్దపూరక అసత్తి రక్షక శబ్ద ప్రయోగంలో వ్యవహర్తలు ఎంతో వైవిధ్యం చూపిస్తారు. వీటినే Mannerisms అంటారు.

ఆంధ్రదేశంలో కొన్ని ప్రాంతాల పిల్లలు వాక్యాదిన "మరే" శబ్దంతో ప్రారంభించి ప్రతి పదాంతంలోనూ (వాక్యాంత పదం తప్ప) "ఏ" శబ్దాన్ని దీర్ఘం తీసి ప్రయోగిస్తారు. ఆంగ్లంలో I Mean, You Know, You See లాంటి పదాలు ఇలాంటివే.

### 3. ఇత్యర్థక నామ్నీకరణం :

ఇత్యర్థక నామ్నీకరణం ఇతర నామ్నీకరణం కన్నా కొన్ని విషయాల్లో భిన్నమైంది. మిగతా నామ్నీకరణాలు కొన్ని రకాల వాక్యాలకే సాధ్యమవుతాయి. ఇత్యర్థకానికీ ఆంక్ష వర్తించదు. ఏ వాక్యమైన ఇత్యర్థక నామంగా వర్తించవచ్చు. అసలు వాక్యమే కానక్కరలేదు. వాక్యాంశము కావచ్చు, పదమూ కావచ్చు, పదాశము కావచ్చు. మహా వాక్యమూ కావచ్చు. సారాంశం ఏమంటే ఈ ఇత్యర్థక నామ్నీ కరణానికి పరిమితి లేదు.

ఇంకో విశేషం ఏమంటే ప్రపంచంలో మానవ వ్యవహారంలో వున్న ఏ భాషైనా దీనికి విషయమే. ఇతర నామ్నీకరణాలు భాషలో ప్రతిపాదించబడిన అర్థ ప్రధానాలు. ఇత్యర్థక నామ్నీకరణానికి భాషే విషయం. ఇంతకు పూర్వం చర్చించిన విషయార్థక, సందేహార్థక నామ్నీకరణాలకి భాషలో ప్రతిపాదితమైన విషయం (Information) ప్రధానం. ఈ నామాలు విషయ గ్రహణ,

విషయ సేకరణ సంబంధిధాతువలతో ప్రయోగయోగ్యాలు.

ఇత్యర్థిక నామం శబ్దకర్మ ధాతువులతో ప్రయోగ యోగ్యం. "అడుగు", "అను", "చెప్పు", "వ్రాయు", "విను" మొదలైన ధాతువులు శబ్ద కర్మ ధాతువులు. ఇత్యర్థ కనామం ప్రశ్నార్థక వాక్య గర్భితమైనప్పుడే "అడుగు" ధాతువు సమీపక క్రియగా రాగలదు. "అడుగు" అంటే తదార్థకమైన "పృచ్ఛించు", "ప్రశ్నించు" లాంటి ధాతువులు కూడా గ్రాహ్యాలే. "అడుగు" ధాతువు ప్రశ్నార్తక శబ్దకర్మ ధాతువు. మిగతా శబ్ద కర్మ ధాతువులకీ నియమం లేదు.

ఉదా॥ 1. మాట్లాడే భాషకు వ్యాకరణం ఎట్లా రాస్తారు ? అని పండితులు అడుగుతారు

2. వ్యాకరణంలేని భాషే వుండదు (అని) అంటారు భాషా శాస్త్రజ్ఞులు.

మొదటి వాక్యంలో 'అడుగు' స్థానంలో ఏ శబ్ద కర్మ ధాతువునైనా ప్రయోగించవచ్చు. కాని రెండో వాక్యంలో ప్రశ్నార్థకేతర శబ్ద కర్మ ధాతువులే ప్రయోగార్హాలు. రెండో వాక్యంలో "అను" ధాతు నిష్పన్న క్రియా రూపపరకమైన "అని"కి వికల్పాన్ని సూచించడం కోసం బ్రాకెట్లులో వుంచబడింది.

1. ఇత్యర్థక శబ్దం చేర్చిన విధ్యర్థక వాక్యంలో కొన్ని మార్పులు జరుగుతాయి. ఇత్యర్థక శబ్ద పరక విధిని పరోక్ష విధి అనవచ్చు, కాని అందులో కొన్ని చిక్కులున్నాయి. విధిని మరొకరి ద్వారా చేస్తే పరోక్ష విధి అనవచ్చు. కాని ఒకే వ్యక్తి తను ఇచ్చిన విధి (Command) ని తానే విధి గ్రహీతకు కాని, మరొకరికి గాని వేరొక సమయంలో గుర్తు చెయ్యవచ్చు. నివేదించవచ్చు. అప్పుడు అది విధి నివేదన అవుతుంది. ఈ రెండు సందర్భాల్లోనూ విధ్యర్థక వాక్యానికి "అని" చేరుతుంది. పరోక్ష విధిలో "అని"కి ముందున్న వాక్యంలోనే గాక ఆ వాక్యాం నామంగా ప్రవర్తించే వాక్యంలోనూ క్రియ విధ్యర్థకం కావాలి. విధి నివేదనలో అది అవిధ్యర్థకం కావాలి.

ఉదా॥ 1. పిల్లలని త్వరగా అన్నం తినమని చెప్పు

2. ఊర్మిళని ఊరి నుంచి వెంటనే రమ్మని రాశాను

ఇందులో మొదటి వాక్యంలో "అని" కి ముందూ, తర్వాత విధ్యర్థక క్రియలేవున్నాయి. దీన్ని పరోక్ష విధి అనవచ్చు. రెండో వాక్యంలో చివరి క్రియ ("అని"కి తర్వాత క్రియ) అవిధ్యర్థకం. దీన్ని విధి నివేదన అనవచ్చు. పై రెండు వాక్యాల్లో ఇంకా గమనించవలసిన విశేషాలున్నాయి. అవి ఇవి.

1. "తినమని", "రమ్మని" అనే రూపాల్లో మకారాగమం

2. "పిల్లలిని", "ఊర్మిళని" అనే రూపాల్లో ద్వితీయా విభక్తి ప్రత్యయం.

మకారాగమాన్ని సాధించడానికి రెండు మార్గాలున్నాయి. ప్రాచీన భాషలో "ము" వర్ణకం విధి బోధకం. ఆధునిక భాషలో కూడా దాన్నే గ్రహించి "అని", పరమైనప్పుడు తప్ప మిగతా అన్ని చోట్లా ఆ ప్రత్యయానికి లోపం చెప్పుకోవడం ఒక పద్ధతి. అప్పుడు "ము" వర్ణకం మిగిలిన చోట పరరూప సంధి వల్ల అంత్య స్వర లోపమూ, సమస్వర సూత్రం వల్ల క్రియా పదంలోని ప్రథమేతర "ఉ" వర్ణానికి "అ" వర్ణాదేశం చెప్పుకోవచ్చు. బాల వ్యాకరణ పద్ధతిలో ఆధునిక భాషలో "ము" ప్రత్యయాన్ని "ముజీ"గా విధించుకొని ఉద్దిష్ట రూపాన్ని సాధించుకోవచ్చు.

తిను+ముజీ + అని --> తినను + అని --> తినమని. దీర్ఘాంతైక స్వరయుత ధాత్వాదేశ రూపాల దీర్ఘ స్వరానికి "ము" ప్రత్యయం పరమైనప్పుడు స్వర హ్రస్వీకరణం, మకార ద్విత్వం ప్రాచీన భాషలోనూ వున్నాయి. (చూ. బాల వ్యాకరణం - క్రియా పరిచ్ఛేదం - 61). అవే ఆధునకి భాషకు వర్తించుకోవచ్చు. అప్పుడు రూప నిష్పత్తిని ఇలా చూపించవచ్చు.

ఉదా॥ రా + ముజీ + అని --> రా + మ + అని --> రమ్మని

ఈ పద్ధతి ప్రాచీన వ్యాకరణానుసారి, భాషా పరిణామ సూచి. కాని ఈ పద్ధతిలో లోపం అల్లా ఒక్కటే. కేవలం "అని" కి ముందు మాత్రమే కన్పించే మకారం కోసం మధ్యమ పురుషైక వచన ప్రత్యయంగా ముజీ"ని విధించుకోవడం, మళ్ళీ దానికి లోపం చెప్పుకోవటంలో ప్రక్రియా లాఘవం కన్పించదు. విధ్యర్థక క్రియా రూపానికి "అని" పరమైనప్పుడు "మ" కారం కాని, "ఆమ్" శబ్దం కాని ఆగమం అవుతుందని చెప్పటం తేలికైన పద్ధతి. ఈ ప్రక్రియల్లో ఏదో ఒక దాన్ని ఎన్నుకోవటం వ్యాకర్త దృష్టి భేదాన్ని బట్టి వుంటుంది.

2. ఇప్పుడు పల్లవి "ని", ఊర్మిళ "ని" అనే శబ్ద రూపాల్లో ద్వితీయా విభక్తి గుర్తించి తెలుసుకుందాం. పైన చెప్పిన రెండు వాక్యాల్లో పిల్లలు, ఊర్మిళ అనే నామాలు "తిను", "వచ్చు" అనే ధాతువుల నుంచి ఏర్పడిన క్రియలకు కర్తృపదాలు.

ఇక్కడ ఇంకో చిన్న ప్రక్రియ విశేషం కూడా వుంది పై రెండు వాక్యాల్లో సమాపక క్రియాపదాలైన "చెప్పు" "రాశాను" అనే క్రియలు అముఖ్య కర్మ పదాపేక్షకాలు. ఎవరికి అన్న ప్రశ్న వేసుకుంటే సమాధానంగా "పిల్లలకి", "ఊర్మిళకి" అనే పదాలే ఈ పై క్రియలకు అముఖ్య కర్మలు ఈ పదాలు పై వాక్యాల వెలుపలి నిర్మాణం (Surface Structure) లో కన్పించకపోయినా లోపలి నిర్మాణం (Deep Structure) వున్నయ్యని ఊహించుకోవాలి.

పై రెండు వాక్యాలను Indirect Speechs కి ఉదాహరణగా గ్రహించవచ్చు. ఆ వాక్యాల్లో ఇత్యర్థక నామాలు విధ్యర్థక వాక్యాల నుంచి నామ్నీకృతాలు. ఆ వాక్యాలు DirectSpeech లో ఇలా వుంటాయి.

ఉదా॥ 1. పిల్లలకి "మీరు త్వరగా అన్నం తినండి" అని చెప్పు.

2. ఊర్మిళకి "నువ్వు ఊరి నుంచి త్వరగా రా" అని రాశాను.

ఇంతకు పూర్వం చెప్పిన పిల్లలని త్వరగా అన్నం తినమని చెప్పు, ఊర్మిళని ఊరి నుంచి వెంటనే రమ్మని రాశాను" అనే వాక్యాల్లో కన్పించే ద్వితీయా విభక్తి ప్రత్యయాన్ని సాధించడానికి రెండు పద్ధతులు సూచించబడ్డాయి.

3. ఇప్పుడు మూడో పద్ధతిని గూర్చి కూడా ఆలోచించవచ్చు. నామ్నీకరించిన విధ్యర్థక వాక్య కర్తృపదం, ఈ వాక్యం నామంగా ప్రవర్తించే వాక్యంలోని సమాపక క్రియతో అన్వయించే అముఖ్యకర్మ ఒక మనిషిని సూచిస్తే అముఖ కర్మపదం కర్తృపదాన్ని తొలగించి ఆ స్థానాన్ని ఆక్రమించుకుంటుంది. ఆ ప్రయత్నంలో అముఖ్య కర్మ తన కారకాన్ని మార్చుకుంటుంది. "కు" విభక్తి "ను" విభక్తిగా మారుతుంది. ఈ పద్ధతి అయినా ఈ వాక్యాల్లో జరిగే వ్యాకరణ కార్యాన్ని పూర్తిగా నిరూపిస్తున్నట్టు అగపడదని చేకూరి వారు తెలియజేశారు.

Direct Speech కి Indirect Speech కి భేదం కన్పించే ఇంకో చోటు అనూదిత వాక్యంలో వక్తృ బోధక పదం ఉత్తమ పురుషలో వున్నప్పుడు ఈ క్రింది వాక్యాలను Direct Speech కి లక్ష్యాలుగా గ్రహించవచ్చు.

ఉదా॥ 1. "నాది ప్రజల వుద్యమం" (అని) అన్నారు గురజాడ అప్పారావు గారు.

2. మా కవిత్వాన్ని వచన కవిత్వం అని అనసీయం (అని) అన్నారు దిగంబర కవులు

పై వాక్యాల్లో వక్తృ బోధకపదాలు ఉత్తమ పురుషలో వున్నాయి. పై మొదటి వాక్యంలో అది ఏకవచనంలోనూ, రెండో వాక్యంలో బహు వచనంలోనూ వుంది.

ఈ నేను, మేము శబ్దాలకి బదులు Indirect Speech లో తనతమ శబ్దాలు వుంటే పై రెండు వాక్యాలు Indirect Speech లో ఇలా వుంటాయి.

ఉదా॥ 1. తనది ప్రజల వుద్యమం (అని) అన్నారు గురజాడ అప్పారావుగారు.

2. తమ కవిత్వాన్ని వచనకవిత్వం అని అనసీయం (అని) అన్నారు దిగంబర కవులు.

"నాది ప్రజల వుద్యమం (అని) అన్నారు గురజాడ అప్పారావుగారు", మా కవిత్వాన్ని వచన కవిత్వం అని అనసీయం (అని) అన్నారు దిగంబర కవులు" అనే రెండు వాక్యాల్లో నేను, మేము శబ్దాల విశేషణ రూపాలైన "నా", "మా" శబ్దాలను ప్రయోగించింద అనూదిత వాక్యంలోని వక్త.

"తనది ప్రజల వుద్యమం (అని) అన్నారు గురజాడ అప్పారావుగారు", "తమ కవిత్వాన్ని" వచనకవిత్వం అని అనసీయం (అని) అన్నారు దిగంబర కవులు" అనే రెండు వాక్యాల్లో "తను", "తము" విశేషణ రూపాలైన "తన", "తమ" శబ్దాలను ప్రయోగించింది వాక్యం అనువదించిన వక్త.

ఆంగ్లంలో ఈ సందర్భంలో "తను", "తము" శబ్దాల స్థానంలో ప్రథమ పురుష సర్వనామ రూపాలను ప్రయోగిస్తారు. తెలుగులో కూడా ఈ శబ్దాలను త్తుమ పురుష సర్వనామాలకు కాకుండా ప్రథమ పురుష సర్వనామాలకు ఆదేశమైన రూపాలుగానే గ్రహించవచ్చు. ఈ క్రింది వాక్యాన్ని గమనించండి.

ఉదా॥ ఆయన "తన" స్వార్థం కోసం ఈ పని చెయ్యలేదు.

పై వాక్యంలో ఇత్యర్థక నామం లేనేలేదు. అయినా "తన" అనే శబ్ద ప్రయోగం లేకుండా అనాలంటే ఈ క్రింది విధంగా వుంటుంది.

ఉదా॥ ఆయన ఆయన స్వార్థం కోసం ఈ పని చెయ్యలేదు.

ఈ వాక్యంలో "ఆయన" అనే శబ్దం పునరుక్తమైంది.

**ఆధారగ్రంథాలు:**

1. ఆధునిక తెలుగు వ్యాకరణం - ఎన్. శివరామమూర్తి

2. ఆధునిక తెలుగు వెన్నెలకంటి వ్యాకరణం - వెన్నెలకంటి ప్రకాశం

3. ఆధునిక తెలుగు భాషా నిర్మాణం - శివుని రాజేశ్వరి

4. ఆధునిక ప్రామాణికాంధ్ర వ్యాకరణం - వజ్ఝల వేంకటేశ్వర్లు

5. ఆధునిక భాషాశాస్త్రం - వెలమల సిమ్మన్న

6. ఈనాడు భాషా స్వరూపం - బూదరాజు రాధాకృష్ణ
7. తెలుగు దారి - వెల్చేరు నారాయణరావు
8. తెలుగులో వెలుగులు - చేకూరి రామారావు
9. తెలుగు భాషా చరిత్ర (సంపాదకులు) - భద్రిరాజు కృష్ణమూర్తి
10. తెలుగు భాషా చరిత్ర - వెలమల సిమ్మన్న
11. తెలుగు భాషా తత్త్వం - కొమర్రాజు లక్ష్మణరావు
12. తెలుగు భాషా శాస్త్రవేత్తలు - వెలమల సిమ్మన్న
13. తెలుగు భాషా స్వరూపం - బూదరాజు రాధాకృష్ణ
14. తెలుగు వాక్యం - చేకూరి రామారావు
15. ప్రౌఢ వ్యాకరణం - బహుజనపల్లి సీతారామయ్య
16. బాల వ్యాకరణం - చిన్నయసూరి
17. బాల వ్యాకరణం - శాస్త్రీయ వ్యాఖ్య - వెలమల సిమ్మన్న, గుమ్మా సాంబశివరావు
18. భాషా తపస్వి గిడుగు - వెలమల సిమ్మన్న
19. భాషానువర్తనం - చేకూరి రామారావు
20. వ్యావహారిక భాషా వ్యాకరణం - వడ్లమూడి గోపాలకృష్ణయ్య
21. శబ్ద బ్రహ్మ చిన్నయసూరి (అముద్రితం) - వెలమల సిమ్మన్న, గుమ్మా సాంబశివరావు
22. సంధి - వెలమల సిమ్మన్న

**II. ఆంగ్లం :**

1. A Grammar of ModernTelugu - Bh. Krishan Murthy
2. Sandhi Balavyakaranam - J. Pratap Reddy.

పాఠం - 14

# తెలుగులో నామ్నీకరణాలు

**4. కాంక్షార్థక నామ్నీకరణం :**

"అని" కి వున్న ఇంకో ముఖ్యమైన ప్రయోజనం కొన్ని వాక్యాల్ని కాంక్షార్థక నామాలుగా మార్చడం ఈ నామ్నీకరణానికి "వలయు" అనే అనుబంధ క్రియకు వున్న వాక్యాలే విషయాలు అనే విషయాన్ని మనం గుర్తించుకోవాలి. ఆధునిక భాషలో "వలయు"కు వ్యస్త ప్రయోగం లేదు. "నుజ్యంత" క్రియల తర్వాతనే ప్రయోగించబడుతుంది. వ్యవహారంలో "వలయు"కు "ఆవి" కొందరి భాషలో "ఆల" అనే శబ్దం ఆదేశం అవుతుంది. తమిళంలో "వలయు" అనే అర్థంలో "వేండుం" లేక "వేణుం" అనే శబ్దం స్వతంత్ర క్రియగానూ, అనుబంధ క్రియగానూ ఉపయోగిస్తారు. "వలయు"కు కాలబోధలో "వచ్చు", "ఉండు" ధాతువులు కాల వాహకాలుగా వస్తాయని పూర్వమే మనం చెప్పుకున్నాం.

1. ఈ నామ్నీకరణానికి కాలబోధ లేకుండా "వలయు" ధాతువు సమాపక క్రియగా అంతంలో వచ్చే వాక్యాలే విషయాలు. ఆ వాక్యాలకు "అని" చేర్చటం వల్ల కాంక్షార్థక నామం ఏర్పడుతుంది. ఈ నామం "ఉండు" "కలుగు", "పుట్టు" లాంటి ధాతువులకు కర్తృపదంగా వ్యవహరించబడింది. ఈ క్రింద వాక్యాల్ని పరిశీలిద్దాం.

ఉదా॥ నాకు వ్యవసాయం చెయ్యాలని వుంది.

పై వాక్యంలో "ఉంది" అనే క్రియకు "అని"కి పూర్వమున్న వాక్యం కర్తగా వ్యవహరిస్తుంది. ఈ వాక్యం వక్తకున్న కోరికను సూచిస్తుంది. అందుకే దీన్ని కాంక్షార్థక నామ్నీకరణం అంటారు.

పై వాక్యంలో "చెయ్యాలి" అనే క్రియా పదానికి కర్తృపదమైన "నేను" శబ్దం లోపించింది. కాని లోపలి నిర్మాణంలో ఈ శబ్దాన్ని ఊహించాలి. పై వాక్యాన్ని క్రింది విధంగా విశ్లేషించి చూపించవచ్చు.

ఉదా॥ అ) నాకు ఒక కోరిక ఉంది.

ఆ) నేను వ్యవసాయం చెయ్యాలి.

దీన్ని వివరించేముందు, ముందుగా ఇక్కడ రెండు పారిభాషిక పదాలు గూర్చి తెలుసుకోవాలి. పై వాక్యంలో 'అ', లో వున్న వాక్యాన్ని గర్భివాక్యం (Matrix Sentence), 'ఆ' లోని వున్న వాక్యాన్ని గర్భవాక్యం (Constituent Sentence) అని అనవచ్చు. గర్భివాక్యం, గర్భవాక్యాన్ని తనలో ఇముడ్చుకుంటుంది. ఈ సందర్భంలో మొదటి వ్యాసంలో ప్రవేశపెట్టిన అవయవి - అవయం అనే పదాల మధ్య సంబంధం గుర్తు తెరచ్చుకోతగింది. గర్భివాక్యంలో కాంక్షించే వ్యక్తి గర్భ వాక్యంలో కర్త ఒకే మనిషిని సూచిస్తే గర్భి వాక్యంలో "ఒక కోరిక" స్థానంలో గర్భవాక్యానికి "అని" చేర్చి ప్రయోగించవచ్చు. అలా చేర్చినప్పుడు గర్భవాక్యంలో కర్త లోపిస్తుంది. ఈ ప్రక్రియ గతి (Grammatical Process) ని ఈ క్రింది విధంగా నాలుగు దశల్లో వివరించవచ్చు.

ఉదా॥ అ) నేను + కు = ఒక కోరిక - ఉంది.

నేను వ్యవసాయం చెయ్యాలి

ఆ) నేను + కు - నేను వ్యవసాయం చెయ్యాలి అని - ఉంది

ఇ) నేను - లోపం

ఈ) నేను + కు = నాకు

"అ" లో బాణం గుర్తుతో సూచించిన విధంగా ఆదేశ కార్యం జరుగుతుంది. ఈ ఆదేశ కార్యానికి ఏకరూపత (Identity) నియమం. అ లో సూచించిన ఆదేశం జరగగానే గర్భవాక్యానికి "అని" చేరుతుంది. "ఆ"లో గర్భివాక్యంలో "నేను" శబ్ద గర్భ వాక్యంలో తనతో ఏకరూపత వున్న "నేను"ను తొలగిస్తుంది. ఈ రకమైన ప్రక్రియాగతి మిగతా నామ్నీకరణాలకు కూడా చూపించవచ్చు.

పై ప్రక్రియా గతిని పరివర్తన వ్యాకరణంలో (Transformational Grammar) సూత్ర పద్ధతిని సూచించాల్సి వుంటుంది. అవి ఎన్నో రకాల వాక్యాలకు ప్రక్రియా గతిని సూచించగల సమర్థమై ఉండాలి.

ఏక రూపత ఒక నియమంగా పైన ప్రతిపాదించబడింది. ఈ ఏక రూపత లేనప్పుడు అ, ఆ, ఇ, ఈ, లో సూచించిన ఆదేశ కార్యాలు జరగవు. ఈ క్రింది వాక్యాన్ని పరిశీలించండి.

ఉదా॥ మా తండ్రిగారికి నేను వ్యవసాయం చెయ్యాలని ఉంది.

పై వాక్యంలో గర్భి వాక్యంలో కాంక్షించే మనిషిని సూచించే పదం గర్భ వాక్యంలోని కర్తృపదం ఒకటి కాదు. అంటే ఏక రూపత లేదు. "ఆ" లో సూచించిన ఆదేశ కార్యం జరగడానికి వీలులేదు.

2. తెలుగులో ఇంకో రకమైన కాంక్షార్థ వ్యక్తి వుంది.

"నాకు వ్యవసాయం చెయ్యాలని వుంది" అనే వాక్యాన్నే ఆ పద్ధతిలో ఈ విధంగా కూడా చెప్పవచ్చు.

ఉదా॥ నాకు - వ్యవసాయం చేద్దామని - వుంది.

పై వాక్యంలో "అని"కి ముందు "చేద్దాం" అనే క్రియా పదం వుంది. ఆధునికాంధ్ర భాషలో "దాం" ఉభయ ప్రార్థనని సూచిస్తుంది. కాని "అని" అను ప్రయుక్తమైనపుడు అది ఉభయ ప్రార్థనను సూచించదు. ఉభయ ప్రార్థన క్రియకు వక్తృశ్రోతల ఇద్దరినీ సూచించే పదం మాత్రమే కర్త కాగలదు. అయితే పై వాక్యంలో అలాంటిది కాదు.

దీన్ని వ్యాకరించటానికి కూడా రెండు మార్గాలున్నాయి. "దాం"ను ఉభయ ప్రార్థన బోధకంగానే అంగీకరించి "అని" కి ముందు ఉభయ ప్రార్థనత్వం పోతుందని చెప్పటం ఒకటి. ఉభయ ప్రార్థన క్రియగా అంగీకరించాలంటే వక్తృశ్రోతలని సూచించే ఉభయార్థక పదాన్ని గర్భవాక్యంలో కర్తగా నిర్దేశించాలి. అందకు పై వాక్యంలో లోపలి నిర్మాణంలో ఆధారం కనపడదు.

రెండో పద్ధతి 'వలయు" కి "దాం" ను ఆదేశంగా చెప్పటం. అప్పుడు "దాం"ను ఉభయ ప్రార్థన బోధకంగా కాక ఆదేశంలో వచ్చే శబ్ద మాత్రంగానే గ్రహించాలి. ఈ ఆదేశానికి కూడా పైన పేర్కొన్న ఏక రూప విధి వర్తిస్తుంది. ఏక రూపత లేనప్పుడు ఈ ఆదేశ కార్యం నిరోధితమవతుంది. దాని కోసం ఈ క్రింది వాక్యం చూడండి.

ఉదా॥ మా తండ్రి గారికి - నేను వ్యవసాయం చేద్దామని వుంది.

పై వాక్యంలో వ్యాకరణ సమ్మతం కాదు. గర్భివాక్యంలోని కాంక్షించే వ్యక్తి గర్భ వాక్యంలోని కర్త ఒకటైనప్పుడు ఈ "దాం" ఆదేశం అవుతుంది. ఈ ప్రక్రియా గతిని ఈ క్రింది విధంగా చూపించవచ్చు.

ఉదా॥ $X_1$ + కు - కోరిక - ఉంది

$X_2$ - (కర్మపదం) - క్రియ (వలయు () దాం)

$X_1 = X_2$

$X_1$ , $X_2$ ఒకటే అయినప్పుడు $X_2$ లోపిస్తుంది. "అని చేర్చటం వల్ల ఉత్పన్నమయ్యే ఇతర నామాలకు లాగే ఈ కాంక్షార్థక నామాన్ని కూడా విశేషణంగా మార్చి "కోరిక" అనే పదం ముందు ప్రయోగించవచ్చు.

ఉదా॥ నాకు వ్యవసాయం చెయ్యాలనే కోరిక ఉంది.

"అని" ఇంత వరకు విషయ, ఇత్యర్థక, కాంక్షార్థాల్లో నామ్నీ కారకంగా పరిశీలించాం.

"అని" చేర్చిన గర్భవాక్యాలు, గర్భి వాక్యాలకు హేత్వర్థంలో విశేషణాలుగా ప్రవర్తించటం గమనించవచ్చు. ఈ క్రింది వాక్యాలను గమనించండి.

ఉదా॥ 1. అత్తగారు పెత్తనం చేస్తున్నదని కోడలికి కోపం వచ్చింది.

2. చుట్టాలెప్పుడు వస్తారో అని బస్తీ వాళ్ళు భయపడతారు.

3. వ్యవసాయం చెయ్యాలని మా ఊరు వెళ్ళాను.

పై వాక్యాల్లో "అని" కి పూర్వం వాక్యాలు "ఎందుకు" అనే ప్రశ్నకు సమాధానాలు. ఒకటో వాక్యంలో విషయార్థక నామం రెండో వాక్యలో సందేహార్థక నామం, మూడో వాక్యంలో కాంక్షార్థకనామం హేత్వర్థంలో వాక్య విశేషణాలుగా ప్రయోగించబడ్డాయి క్రియా విశేషణానికి, నామానికి లోపలి నిర్మాణంలో వున్న పోలిక సందేహార్థక నామ్నీకరణాలను చర్చించినప్పుడు పేర్కోబడింది.

క్రియా విశేషణం అనే పదం Adverb అనే ఇంగ్లీషు మాటకు సమానార్థకం. Adverbs ని Predicate Adverbs (అఖ్యాత విశేషణాలు), Sentential Adverbs (వాక్య విశేషణాలు) అని వర్గీకరించవచ్చు. ఈ Adverbs ని లోపలి నిర్మాణంలో నామ పదాలుగానే గ్రహించాలని ఆధునిక భాషా శాస్త్రవేత్తలు ప్రతిపాదిస్తున్నారు.

## 5. వ్యాపారార్థక నామ్నీకరణం

క్రియా వ్యాపార బోధకం వ్యాపారం భౌతికం కావచ్చు. మానసకిం కావచ్చు. 'అర్థమవు, అర్థం చేసుకొను, ఎరుగు, తెలియు, మొదలైన మనో వ్యాపార బోధకాలు. ఆడు, పాడు, కొట్టు, పెట్టు మొదలైనవి భౌతిక వ్యాపార బోధకాలు.

ఆధునిక భాషలో "అటం" భావార్థక ప్రత్యయం అనీ, అది క్రియా పదానికి చేరటం వల్ల కాల, పురుష బోధక ప్రత్యయాలకు లోపం జరిగి ధాతువు మాత్రమే మిగిలి ఈ రెండు సంయోగం వల్ల భావార్థక రూపం నిష్పన్నమవుతుందని ముందుగానే మనం తెలుసుకున్నాం.

1. భావార్థక రూపనిష్పత్తికి ఆ సూచన అంగీకరించికపోయినా, కాల బోధక ప్రత్యయ గ్రహణ సమర్థమైన ధాతువులకు మాత్రమే "ఆటం" చేరుతుండటం నిర్వివాదం. ఆ భావార్థక రూపంతో కూడిన వాక్యాలు విషయార్థక నామాలుగా ప్రవర్తించే పద్ధతి చర్చించాం ఇప్పుడు ఆ రకపు వాక్యాలు వ్యాపారార్థక నామాలుగా కూడా ప్రవర్తించే విధానం ఇందులో తెలుసుకుంటాం. అంటే "ఆటం" వ్యాపార్థాక నామ్నీకారకంగా కూడా ఉపయోక్తం అవుతుందన్నమాట.

క్రియ వ్యాపార బోధకం. క్రియలే కాక, కొన్ని నామాలు కూడా వ్యాపార బోధకాలు.

ఉదా॥ పెట్టె - పెండ్లి

పై రెండు నామాల్ని పరిశీలిస్తే ఈ విషయం తెలుస్తుంది పెట్టె ద్రవ్య బోధకం. ఆ ద్రవ్యం మన ఇంద్రియాల చేత ద్రష్టవ్యం. పెండ్లి ద్రవ్యం కాదు. కార్యం. అంటే వ్యాపారం. పెట్టె ఉంటుంది (Exists) పెండ్లి జరుగుతుంది (Happens).

ఎన్నికలు, (పంట) కోతలు, నాటకం (పుస్తకం కాదు), (వరి) నాట్లు, పని, పరిశోధన, ప్రదర్శన, యుద్ధం, సమావేశం, వంట, పెండ్లి లాంటి నామాలు వ్యాపారాన్ని బోధిస్తాయి. ఈ నామాలు కొన్ని రకాల క్రియలతోనే ప్రయుక్తమవుతాయి. ఈ వ్యాపారార్థక నామాల స్థానంలో కొన్ని వాక్యాలు కూడా ప్రయోగించవచ్చు.

ఒక వ్యాపారానికి కాలంలో ప్రారంభం, ముగింపు వుంటాయి. ఈ పై రకపునామాలు, ఆ అర్థంలో నామ్నీకృత వాక్యాలు ఏ తదర్థ బోధక క్రియలతో ప్రయుక్తమవుతాయి. ఈ క్రింది వాక్యాల్ని పరిశీలిద్దాం.

ఉదా॥ 1. తెలుగులో కావ్యాలు రాయటం పదకొండో శతాబద్ధంలో మొదలయింది.

2. మా పాటిచేలో జొన్న ఎదబెట్టం మొన్ననే పూర్తి అయింది.

పై మొదటి, రెండు వాక్యాల్లో వ్యాపారార్థక నామాలు (నామ్నీకృత వాక్యాలు) మొదలగు పూర్తి "అగు" అనే క్రియలకు క్రమంగా కర్తృ పద స్థానంలో వచ్చినాయి. ఈ పై క్రియలు అకర్మకాలు. ఇవే నామాలు సకర్మక క్రియా యోగంలో కర్మ పదాలుగా వ్యవహరిస్తాయి. కర్తృ స్థానంలో వచ్చినా, కర్మ స్థానంలో వచ్చినా ఈ నామాలు బోధించే వ్యాపారంలో భేదం వుండదు. ఈ క్రింది వాక్యాలతో పోల్చి చూడండి.

ఉదా॥ 1. తెలుగులో కావ్యాలు రాయటం పదకొండో శతాబ్దంలో నన్నయ్య మొదలుపెట్టాడు.

2. మా పాటిచేలో జొన్న ఎదబెట్టటం మొన్ననే పూర్తిచేశాం.

మొదలుపెట్టు, పూర్తి చేయు అనే క్రియలు సకర్మకాలు. కాబట్టి ప్రాణివాచక కర్తృపదాలు అవసరమయినాయి. నామ్నీకృత వాక్యాలు కర్మ పదాలుగా మారినాయి. పై ఉదాహరణల్లోని వాక్యాలని వర్గీకరించి చూసుకుంటే ఈ సంబంధం విశదమవుతుంది.

సకర్మకా కర్మక క్రియా భేదం వల్ల వ్యక్త నిర్మాణం (Surface Structure) లో కర్తృకర్మాది భేదాలుత్పన్నమవుతాయి. వ్యాపారార్థక నామాలతో వచ్చే క్రియలు ఈ క్రింది పట్టికలో చూపించబడుతున్నాయి. ఈ క్రియలన్నీ వ్యాపార ప్రారంభాన్నో, అంతాన్నో సూచించటం ఇక్కడ ప్రత్యేక విశేషం.

ఉదా॥

| | |
|---|---|
| అకర్మ | సకర్మక |
| ప్రారంభమగు | ప్రారంబించు |
| మొదలగు | మొదలుపెట్టు |
| పూర్తి అవు | పూర్తి చేయు |
| ముగియు | ముగించు |
| ఆగిపోవు | ఆపివేయు |
| ? | మానవేయు |

2. వ్యాపార బోధక నామాల్లో ఎన్నో అంతర్విభాగలుండవచ్చు. అందులో ముఖ్యమైనవి రెండు మాత్రమే ఇక్కడ పరిశీలించడం జరుగుతుంది.

అ) వ్యాపారం కొంతకాలం పాటు (< Durnation >) జరగడానికి వీలున్నవి కొన్ని.

ఆ) వ్యాపార ప్రారంభం, ముగింపు ఏక కాలంలో జరిగినట్లు (< Event >) బోధించేవి మరికొన్ని.

ఉదా॥ "సంఘటన" అనే నామం అలాంటిది.

"సంఘటన మొదలయింది" అని గానీ, సంఘటన పూర్తి అయింది అని గానీ అనలేం. అలాగే ప్రమాదం కూడా. ఇలాంటి నామాల్ని సంఘటనాత్మక నామాలు అనవచ్చు. వీటి స్థానంలో వచ్చే వాక్యాలు కూడా "జరుగు" అనే క్రియతో గాని, తదర్థరకమైన మరో క్రియలో గాని వస్తాయి. సంఘటనాత్మకం కాని నామాలతో కూడా "జరుగు" అనే క్రియ ప్రయుక్తం కావచ్చు. అప్పుడు ఆ నామాలు బోధించే వ్యాపారానికి పట్టే కాల పరిమితి కన్నా కాలావకాశ సమ్మిశ్రంలో ఆ వ్యాపారానికున్న అస్తిత్వ (Occurrence) ప్రాధాన్యమే వివక్షతమన్నమాట. ఇంకో రకంగా చెప్తే Duration అనే అంశం కలిగిన నామాలన్నిట్నీ సంఘటనాత్మకాలుగా కూడా భావించే వీలున్నదన్నమాట. ఈ క్రింది వాక్యాలను పరిశీలిస్తే పై విషయాలు విశదమవుతాయి.

ఉదా॥ 1. పట్టాలు తప్పి రైలు పడిపోవటం జరిగింది.

2. ఆంధ్ర ప్రభుత్వం వారు తెలుగు అకాడమీని స్థాపించటం జరిగింది.

పై వాక్యాల్లో సమాప క్రియ అయిన "జరుగు"ను తొలగించి నామ్నీ కృత క్రియను వినామ్నీకరిస్తే అంటే మళ్ళీ క్రియగా మారిస్తే అర్థ బోధకు ఏ ఇబ్బందీ రాదు. పైగా ఆ వాక్యాలే సహజంగా వుంటాయి.

3. వ్యాపారార్థక నామం స్థానంలో ఉపయోగించిన వాక్యం పరిభాష ప్రకారం గర్భ వాక్యం అవుతుంది. గర్భ వాక్యం గర్భి వాక్యంలోని వ్యాపారార్థక నామం స్థానంలో నామ్నీకృతమై చేరుతుంది. గర్భి వాక్యంతో క్రియ సకర్మకమైతే గర్భ వాక్యం ఆ క్రియకు కర్మగా వ్యవహరిస్తుంద.ఇ ఇలా వ్యవహరించడానికి గర్భి, గర్భ వాక్యాల్లో కర్తృ పదాలు భాషలో ఏక రూపత (Identity Inform) భావంలో సమబోధకత (Co-Referentiality) కలిగి వుండాలి.

ఉదా॥ ఈ క్రింది వాక్యాలు వ్యాకరణ విరుద్ధాలు.

1. సుమిత్ర వంట చెయ్యటం సుజాత పూర్తి చేసింది.

2. మా అమ్మాయి వంట చెయ్యటం సుమిత్ర పూర్తి చేసింది.

పై మొదటి వాక్యంలో "సుమిత్ర - సుజాత" అనే పదాలకు ఏకరూపత, సమ బోధకత రెండూ లేవు.

రెండో వాక్యంలో మా అమ్మాయి పేరు సుమిత్ర అని అనుకునేటట్టు అయితే సమబోధకత వుండడానికి వీలున్నది. అయినా "మా అమ్మాయి - సుమిత్ర" అనే పదాలకు ఏక రూపత లేకపోవడం వల్ల రెండో వాక్యం వ్యాకరణ విరుద్ధం.

పై రెండు వాక్యాల్ని వ్యాకరణ సమ్మతమైన ఈ క్రింది వాక్యంతో పోల్చి చూడండి

ఉదా॥ సుమిత్ర వంట చెయ్యటం పూర్తి చేసింది.

పై వాక్యంలో వంట చేయు, పూర్తి చేయు అనే రెండు క్రియలకూ ఒకే వ్యక్తిని కర్తగా మనం అర్థం చేసుకుంటున్నాం. సారూప్య సమబోధకతలున్న నామాల్లో ఒకటి వ్యక్త నిర్మాణంలో లోపించటం వల్ల పై వాక్యం ఏర్పడింది.

4. వ్యాపారార్థక నామాలు కేవల వ్యాపార ఆది, మధ్య, అంతాలను సూచించే క్రియలతో మాత్రమే కాక, వ్యాపార నామాలు తదితర క్రియలతో కూడా రాగలవని ఈ క్రింది వాక్యాలను పరిశీలిస్తే తెలుస్తుంది.

ఉదా॥ 1. నాకు కారు నడపటం వచ్చు.

2. మా ఆవిడ మిషను కుట్టటం నేర్చుకుంటున్నది.

వచ్చు, నేర్చుకొను, లాంటి క్రియలు విద్యా (Skill) సంబంధమైన నామాలతో వస్తాయి. ఆ నామాలు వ్యాపారార్థకాలు కావచ్చు, కాకపోవచ్చు నేర్చుకోదగినది ఏదైనా విద్యే అని ఇక్కడ అర్థం.

వ్యాపారార్థక నామాలతో వచ్చే మరి రెండు క్రియలు విను, చూచు, గర్భ వాక్యాల్లో సమాపక క్రియ "విను అయినప్పుడు దానికి < శ్రవ్యత (Audibility) అనే అంశం Feature) కలిగిన నామాలు కర్మపదాలుగా రాగలవు. అలాంటి నామాలకు ఆదేశంగా వచ్చే గర్భ వాక్యాలు కూడా < శ్రవ్యత > అనే లక్షణాన్ని కలిగి వుండాలి. అలాంటి లక్షణం గర్భ వాక్యంలోని క్రియ వల్ల వస్తుంది. ఇలాంటి వాక్యాలు సాధారణంగా భావార్థ బోధకాలు అవుతాయి. ఈ క్రింది వాక్యాలను పరిశీలించండి.

ఉదా॥ 1. రవీంద్రభారతిలో సుమిత్ర పాడటం విన్నాను

పై వాక్యంలో వున్న భిన్నార్థాలు ఈ క్రింది వివరణ వాక్యాల్లో (Paraphrases) గమనించవచ్చు.

2. రవీంద్ర భారతిలో సుమిత్ర పాడిందని విన్నాను.

3. రవీంద్రభారతిలో సుమిత్ర పాట విన్నాను.

రెండో వాక్యంలో సుమిత్ర పాడిందన్న విషయం మాత్రమే విన్నది. మూడో వాక్యంలో విన్నది సుమిత్ర పాట ఈ రెండర్థాలూ ఒకటో వాక్యంలో వున్నాయి.

ఇంత వరకు వ్యాపారార్థక నామాలు కొన్ని క్రియలకు కర్తలుగా గాని,కర్మలుగా గాని ప్రవర్తించే విధానాల్ని పరిశీలించాం.

వ్యాపారార్థక నామ్నీకరణంలో ఈ క్రింది వాక్య సమూహాన్ని పరిశీలించండి.

ఉదా॥ నువ్వు ఎక్కడ ఉంటున్నావు ? → నువ్వు (ఉండటం / ఉంటున్నది) ఎక్కడ ?

నువ్వు ఎప్పుడు వచ్చావు ? → నువ్వు (రావటం / వచ్చింది) ఎప్పుడు ?

నువ్వు ఎందుకు వెళ్ళావు ? → నువ్వు (వెళ్ళటం / వెళ్ళింది) ఎందుకు ?

పై వాక్యాల జంటల్లో ఎడం వైపు వాక్యాల్లో వున్న "ఎక్కడ", "ఎప్పుడు", "ఎందుకు" అనే ప్రశ్నార్థక క్రియా విశేషణాలు చివరికి జరగటం వల్ల కుడివైపు వాక్యాలు నిష్పన్నమయినాయి. అందువల్ల ఉపోత్తమ స్థానానికి చేరిన క్రియాపదం నామ్నీకృతమయింది.

ఇది రెండు రకాలు. అవి ఇవి

1. "అటం" వల్ల ఫలితం. కాలపురుష బోధక ప్రత్యయాలు లోపించినాయి.

2. తచ్ఛబ్దం (అది) వల్ల ఫలితం. పురుష బోధక ప్రత్యయాలు మాత్రం లోపించినాయి. పూర్వం చర్చించిన నామ్నీకరణాలు గర్భ వాక్యాలు, గర్భి వాక్యాల్లో చేరినప్పుడు జరిగినవి.

## 6. లుప్త విభక్తిక నామ్నీకరణం :

తెలుగులో విభక్తుల సంఖ్య గూర్చి పండితుల్లో, విమర్శకుల్లో ఏకాభిప్రాయం లేదు. ప్రాచీన సనాతన సాంప్రదాయిక వ్యాకర్తలు విభక్తులను 7 రకాలుగా వర్గీకరించారు. అందుకు ప్రధాన కారణం సంస్కృత వ్యాకర్తలు సంస్కృత భాషకు ఆ సంఖ్యను నిర్ణయించడం.

తెలుగు వ్యాకర్తల సప్త సంఖ్యా నిర్ణయానికి ఈ రెండు కారణాల్ని ఊహించవచ్చు. అవి ఇవి.

1. తెలుగు సంస్కృత జన్యమైన బాష. కాబట్టి సంస్కృతంలో ఉన్నన్ని విభక్తులే తెలుగులోనూ వుండాలి.

2. సంస్కృత వ్యాకర్తల నిర్ణయం సర్వభాషలకూ వర్తిస్తుంది.

ఈ రెండిట్లో ప్రాచీనాంధ్ర వ్యాకర్తలను ఏది ఎక్కువ ప్రభావితం చేసిందో చెప్పటం కష్టం. తర్వాత వచ్చిన చారిత్రక వ్యాకర్తలు ప్రాచీనాంధ్ర వ్యాకర్తల సప్త సంఖ్యా నిర్ణయాన్ని ఒప్పుకోలేదు. కొందరు మూడు విభక్తులే అన్నారు. మరి కొందరు నాలుగు విభక్తులు అన్నారు. ఈ వివాదాలకు మూల కారణం భాషలో గుప్త (Deep) వ్యక్త (Surface) నిర్మాణాలను స్పష్టంగా గుర్తించకపోవడమే.

1. వాక్యాల్లో నామాలు, క్రియలు ప్రధానమైన భాషా భాగాలు నామాలకూ, క్రియలకూ వుండే సంబంధాన్ని సంస్కృత వ్యాకర్తలు కారకాలు అన్నారు. ఈ కారక సంబంధాల్ని సంస్కృత వ్యాకర్తలు 6 గా గుర్తించారు. అవి ఇవి. 1. కర్తృ, 2. కర్మ, 3. కరణ, 4. సంప్రదాన, 5. అపాదాన, 6. అధికరణ కారకాలు.

ఈ కారకాలు భాషలో విభక్తుల ద్వారా వ్యక్తమవుతాయి. కొన్ని భాషల్లో విబక్తులు చేసే పనిని వాక్యలో పద క్రమం (Word Order) నిర్వహించవచ్చు. కారకం, విభక్తి అనేవి పర్యాయ పదాలు కావు. అంటే కారకాలకీ విభక్తులకీ ఏకైక సంబంధం (Isomorphism) లేదు. రెండు మూడు విభక్తులు వాక్య నిర్మాణ భేదాన్ని బట్టి ఒకే కారకాన్ని వ్యక్తం చెయ్యవచ్చు.

సఃకుంభాన్ కరోతి, తేన కుంభాః క్రియంతే కుంభాఃకృతా, కుంభానాం కర్తా అనే వాక్యాల్లో "కుంభ" శబ్దం భిన్న విభక్తులతో వ్యక్తమయినా అని బోధించే కారకం ఒకటే. అలాగే ఒకే విభక్తి భిన్న సందర్భాల్లో భిన్న కారకాల్ని బోధించవచ్చు. రామేణ బాణేన హతో వాలీ, అనే వాక్యంలో తృతీయా విభక్తి రామ శబ్దంతో వున్నప్పుడు కర్తృకారకాన్ని, బాణ శబ్దంతో వున్నప్పుడు కరణ కారకాన్నీ బోధిస్తుంది. పై ఉదాహరణల వల్ల అర్థానికి మూలమైన కారకం నిశ్చలమైందని వ్యక్తీకరణ భేదాలను అనుసరించి వచ్చే విభక్తి చలనశీలమైందనీ తేలుతుంది.

నామ్నీకరణ పరిభాష ప్రకారం కారకం గుప్త నిర్మాణానికి సంబంధించిన పదమనీ, విభక్తి వ్యక్త నిర్మాణానికి సంబంధించిన పదమనీ తెలిసిందే. భాషల మధ్య వ్యక్త నిర్మాణంలో కనిపించినంత భేదం గుప్త నిర్మాణంలో వుండదు. అంతే కాక సర్వ భాషలకూ ఒకే గుప్త నిర్మాణాన్ని ప్రతిపాదించవచ్చునని ఇటీవలి భాషా శాస్త్రవేత్తల విశ్వాసం. వాక్యాల అర్థ నిర్ణయం గుప్త నిర్మాణం మీద ఆధారపడి వుంటుంది. అర్థానికి బాధ్యత వహించే గుప్త నిర్మాణం సర్వ భాషలకీ సామాన్యమని భాషా శాస్త్రవేత్తల అభిప్రాయం. ఇలాంటి అభిప్రాయమే సంస్కృత వ్యాకర్తలకీ ఉండి వుంటుందని ఊహించటం అసమంజసమేమీ కాదు. గుప్త వ్యక్త నిర్మాణ భేదాల్ని సంస్కృత వ్యాకర్తలు గుర్తించారిన, సంస్కృత భాషను ఆధునిక పద్ధతుల్లో అధ్యయనం చేస్తున్న ఇటీవల పాశ్చాత్య శాస్త్రవేత్తలు గ్రహించారు.

ఒక వాక్యన్ని మరో వాక్యంలో నామంగా ప్రవర్తించేట్టు చేయటానికి జరిగే వ్యాకరణ ప్రక్రియా విశేషాలను నామ్నీకరణాలు అని అంటారు అలాంటి పద్ధతుల్లో ఒకటి లుప్త విభక్తిక నామ్నీకరణం. ఈ పద్ధతిలో గర్భవాక్యం (మరో వాక్యంలో నామంగా ప్రవర్తించే వాక్యం)లో పదాల వరసలో మార్పులు కలుగుతుంది. వాక్యంలో ఒకానొక నామం ఉద్దేశ్యం (Head) అయి, మిగతా వాక్య భాగం విధేయం (Attribute) అవుతుంది (ఉద్దేశం = Head, విధేయం = Atteribute అనే అర్థాల్లో డాక్టర్ భద్రిరాజు కృష్ణమూర్తిగారు వాడుతున్నారు.

2. ఈ ప్రక్రియా గతిలో ఉద్దేశ్యంగా మారిన నామం అంతకు ముందున్న విభక్తిని కోల్పోతుంది. అందుకే దీన్ని లుప్త విభక్తిక నామ్నీకరణం అనటం. విభక్తి పోయిన కారక నిలుస్తుంది. కాబట్టి దీన్ని కారక నామ్నీ కరణం అన్నా అనవచ్చు. అందుకే ఇంతకు ముంద కారకం నిశ్చలమైనదనీ, విభక్తి చలనశీలమైనదనీ అనటం ఈ క్రింది వాక్యాల్ని గమనిస్తే ఈ ప్రక్రియా గతిలో విశేషాలు తెలుస్తాయి.

ఉదా॥ 1. కిష్టప్పకర్రతో కుక్కను కొట్టాడు.

→ కర్రతో కుక్కను కొట్టిన కిష్టప్ప

→ కిష్టప్ప కర్రతో కొట్టిన కుక్క

→ కిష్టప్ప కుక్కను కొట్టిన కర్ర

పై వాక్యంలో ఒక వాక్యం నుంచి ఉద్దేశ్య భేదాన్ని బట్టి మూడు నామ బంధాలు నిష్పన్నమైనాయి. ఆ నామాలు మూల వాక్యం (Kernel Sentence) లోనూ, నిష్పన్న నామా బంధాల్లోనూ క్రమంగా కర్తృ, కర్మ, కరణ కారకాల్ని బోధిస్తున్నాయి.

ఈ నామాలు నిష్పన్న నామ బంధాల్లో ఉద్దేశ్యాలయినప్పుడు మూల వాక్యంలోని విభక్తులకు లోపం జరిగింది. కర్తృ కారకాన్ని సూచించటానికి మూల వాక్యంలోను విభక్తి ప్రత్యయం లేదు. కర్మకారకాన్ని బోధించే "ను", కరణ కారకాన్ని బోధించే"తో" విభక్తులకు లోపం జరిగింది. అయినా కారక సంబంధాలు నిల్చే వున్నాయి. కాబట్టి అర్థ బోధకానికి ఇబ్బంది లేదు. ఈ నామ్నీ కరణంలో మూల వాక్యంలోని సమాపక క్రియ నిష్పన్న నామ బంధలో క్రియజన్య విశేషణంగా మారుతుంది.

నేటి తెలుగులో వ్యతిరేక క్రియకి ఒక క్రియా జన్య విశేషణం, ఆ వ్యతిరేక క్రియకు కాల భేదాన్ని అనుసరించి మూడు క్రియా జన్య విశేషనాలు వుంటాయని పూర్వ నామ్నీకరణాల్లో తెలుసుకున్నాం.

పై వాక్యాన్ని బట్టి మూల వాక్యంలో నామం మాత్రమే ఉద్దేశ్యం అవుతుందని, నామంతో పాటు వున్న విశేషణాలు అలాగే వుండిపోతాయని అనిపించవచ్చు. ఈ క్రింది వానిని పరిశీలిస్తే ఈ సందేహం తీరుతుంది.

ఉదా॥ 1. సరళ మద్రాసులో ఒక జరీ అంచు పచ్చ పట్టు చీర కొన్నది.

→ సరళ మద్రాసులో కొన్న జరీ అంచు పచ్చ పట్టు చీర.

మూల వాక్యంలో నామం ఉద్దేశ్య స్థానానికి జరిగినప్పుడు అది తనతో పాటు తన వెనుక వున్న విశేషణాలను కూడా వెంట తీసుకొని పోతుంది.

ఈ విధంగా నిష్పన్నమైన నామాలు సాధారణంగా భిన్నార్థ బోధకాలు అవుతాయి.

"కిష్టప్ప కర్రతో కుక్కను కొట్టాడు" అనే వాక్యంలో నిష్పన్నమైన నామ బంధాలకు, సరళ మద్రాసులో "ఒక జరీ అంచు పచ్చ పట్టు చీర కొన్నది" అనే వాక్యంలో నిష్పన్నమైన నామ బంధానికి ఒక్కొ దానికి రెండేసి అర్థాలున్నాయి.

ఉదా॥ "కిష్టప్ప కుక్కను కొట్టిన కర్ర" అనేనామ బంధాన్ని తీసుకుంటే రెండు అర్థాలు సాధించవచ్చు.

అ) ఒక కర్ర ఉంది. ఆ కర్రతోకిష్టప్ప కుక్కను కొట్టాడు.

ఆ) కొన్ని కర్రలున్నాయి. అందులో ఒక దానితో కిష్టప్ప కుక్కను కొట్టాడు.

అదే విధంగా "సరళ మద్రాసులో ఒక జరీ అంచు పచ్చ పట్టు చీర కొన్నది'" అనే వాక్యంలో నిష్పన్నమైన నామ బంధానికీ రెండు అర్థాలు చెప్పవచ్చు.

అ) సరళ ఒక జరీ అంచు పచ్చ పట్టు చీర కొన్నది. అది కొన్నది మద్రాసులో

ఆ) సరళ కొని జరీ అంచు పచ్చ పట్టు చీరలు కొన్నది. అందులో ఒకటి మద్రాసులో కొన్నది.

ఈ రకమైన భిన్నార్థ బోధకత ఈ లుప్త విభక్తిక నామ్నీకరణం ద్వారా నిష్పన్నమైన నామ బంధాలన్నిటికీ వున్నట్టుంది. దీనిపై ఇంకా పరిశోధన చేయవలసిన అవసరం వుంది.

పై వాక్యాల ఆధారంతో ఒక విషయం చెప్పవచ్చు. ఒక వాక్యంలో కర్తృ,కర్మ, కారక బోధకనామాల్లో ఏదైనా నిష్పన్న నా బంధాల్లో ఉద్దేశ్యంగా రాగలదు. కాని మిగతా విభక్తులు, కారకాలు అలా కాదు. వాటిల్లో గమనించవలసిన విధి నిషేధాలు చాలా వున్నాయి.

3. కొన్ని విభక్తులు, వాటి అర్థాలు, అవి లుప్త విభక్తిక నామ్నీకరణంలో నిర్వహించే పాత్ర. ఈ క్రింద చూపించబడుతుంది.

తెలుగులో "తో" తృతీయ విభక్తి అంటారు. సాంప్రదాయిక వ్యాకర్తలు, అంటే సంస్కృతంలో తృతీయా విబక్తి వ్యక్తం చేసే అర్థాల్లో చాలా వాటిని "తో" వ్యక్తం చేస్తుంది. ఈ క్రింది వాక్యాలను పరిశీలిద్దాం.

ఉదా॥ 1. అతను కలంతో పరీక్ష రాశాడు

→ అతను పరీక్ష రాసిన కలం (వ్యాకరణ సమ్మతం కాదు)

2. అతను శ్రద్ధతో పరీక్ష రాశాడు

→ అతను పరీక్ష రాసిన శ్రద్ధ (వ్యాకరణ సమ్మతం కాదు)

3. అతను జ్వరంతో పరీక్ష రాశాడు

→ అతను పరీక్ష రాసిన జ్వరం (వ్యాకరణ సమ్మతం కాదు)

పై మూడు ఉదాహరణల్లో మూల వాక్యాల (బాణం గుర్తుకు ఎడం వైపున వున్న వాక్యాలు) వ్యక్త నిర్మాణాల్లో భేదం కన్పించదు. కాని గుప్త నిర్మానాల్లో భేదం వుంది. అదే నామ్నీ కరణాల్లో వ్యక్తమైంది.

పైన చెప్పిన మొదటి వాక్యంలో "తో" కరణార్థకం. అందువల్ల నామ్నీకరణం సాధ్యమైంది.

రెండో వాక్యంలో శ్రద్ధతో అనేది పరీక్ష రాసిన పద్ధతి (Manner) తెలియజేస్తుంది. ఈ అర్థంలో నామ్నీకరణం సాధ్యం కాదు. నామ్నీకరిస్తే వ్యాకరణ విరుద్ధమైన నామ బంధం నిష్పన్నమయింది.

మూడో వాక్యంలో జ్వరంతో అనేది పరీక్ష రాయటానికి ఉపకరణమూ కాదు. రాసే పద్ధతీ కాదు. రాసిన వాడి దేహ స్థితి. ఈ అర్థంలోనూ నామ్నీకరణం వ్యాకరణ విరుద్ధమయింది.

రెండో వాక్యంలో "తో" స్థానంలో "గా" ఆదేశం చెయ్యవచ్చు. మొదటి, మూడో వాక్యాల్లో అది సాధ్యం కాదు.

4. విభక్తులకున్న భిన్నార్థాల వల్ల ఒక్కో సారి చమత్కారాన్ని పుట్టించవచ్చు. రచయితలు వీటిని ఉపయోగించుకోవటం కూడా మనం గమనించవచ్చు. ముళ్ళపూడి వెంకట రమణ కూర్చిన "నవ్వితే నవ్వండి" అనే పుస్తకంలో ఈ క్రింది జోక్ ఒకటి వుంది. అది ఇది.

ఉదా॥ "అయితే ముద్దాయి నిన్ను విద్వేషోద్రేకాలతో కొట్టాడన్న మాట"

"కర్రతో గొట్టిండని చెబితే నీగ్గాదయా, ఆ మాయదారి మాటలు మనకొద్దు"

పై ఉదాహరణలో న్యాయవాది సంభాషణలో "తో", ముందు చెప్పిన రెండో వాక్యంలో ఉదాహృతమయిన వాక్యంలో "తో" వంటిది.

న్యాయ స్థానంలో బోనులో నిలబడ్డవాడి వాక్యంలో "తో" మొదటి వాక్యంలో ఉదాహృతమైన వాక్యంలో "తో" వంటింది.

"తో" సహార్థంలోనూ, వచ్యర్థ ధాతువుల అముఖ్య కర్మతోనూ ప్రయుక్తమవుతుంది. సహార్థాంలో నామ్నీకరణం సాధ్యం కాదు.

ఉదా॥ 1. నేను సరళతో చెప్పాను.

→ నేను చెప్పిన సరళ (వ్యాకరణ సమ్మతం కాదు)

2. నేను సరళతో వెళ్ళాను.

→ నేను వెళ్ళిన సరళ (వ్యాకరణ సమ్మతం కాదు)

5. "తో" ప్రయోగంలో ఇంకో చిన్న ప్రత్యేక విశేషం వుంది. ముందు ఈ క్రింది వాక్యాలను గమనించండి.

ఉదా॥ 1. సరళ సెనగ నూనెతో గారెలు వండింది.

→ సరళ గారెలు వండిన సెనగనూనె

2. సరళ మినపప్పుతో గారెలు వండింది.

→ సరళ గారెలు వండిన మినపప్పు

పైన ఉదాహరించిన వాక్యాలు నిష్పన్నమైన నామాలు పైకి ఒకే రకంగా కన్పిస్తున్నప్పటికీ "తో" ప్రయోగంలో భేదం వుంది. నిష్పన్నమైన నామాలు ప్రయోగించిన ఈ వాక్యాలు గమనించండి.

ఉదా॥ 1. అ) సరల గారెలు వండిన సెనగనూనె సూపర్ బజార్లో కొన్నది.

ఆ) సరళ గారెలు వండిన సెనగనూనె పారబోసింది.

2. అ) సరళ గారెలు వండిన మినపప్పు సూపర్ బజార్లో కొన్నది.

ఆ) సరళ గారెలు వండిన మినపప్పు పారబోసింది.

పై వాక్యాల్లో మొదటి వాక్యంలోని "అ"లో, రెండో వాక్యంలోని "అ"లో, సెనగనూనె, మినపప్పు, వంట అనే వ్యాపారంలో పాల్గొన్నవే కావచ్చు. లేక వక్త "అవే పదార్థాలు కావు. ఆ రకం పదార్థాలు" (Not the Same, But he Kind) అని ఉద్దేశించవచ్చు.

మొదటి వాక్యంలోని "ఆ" వాక్యంలో, రెండు వాక్యంలోని "ఆ" వాక్యంలో "రకం" అనే అర్థం రాదు.

గర్భ వాక్య గుప్త నిర్మాణాల్లో "తో" ప్రయోగం పై వాక్యాల్లో భిన్నమం అన్నమాట. వంట అనే వ్యాపారంలో పాల్గొన్న మినపప్పుకి వ్యాపారానంతరం అస్తిత్వం లేదు. రూపాంతరం చెందింది. కాని సెనగనూనె వంట అయిన తర్వాత కూడా మిగులుతుంది. అందువల్లనే పారబోయడం సాధ్యమైంది.

6. తెలుగులో మన పూర్వులు "కు" విభక్తిని "షష్ఠి" అని అన్నారు. దాన్ని చతుర్థిగా భావించారు ఆధునికలు. "కు" తెలుగులో ఎన్నో అర్థాల్లో ప్రయుక్తమవుతుంది. అందులో కొన్ని అర్థాల్లో నామ్నీకరణం సాధ్యమవుతుంది.

ఉదా॥ 1. వాళ్ళు సినిమాకు వెళ్ళారు.

→ వాళ్ళు వెళ్ళిన సినిమా (వ్యాకరణ సమ్మతం కాదు)

పై వాక్యంలో "కు" గమ్యాన్ని సూచిస్తుంది. ఈ అర్థంలో నామ్నీకరణం సాధ్యమైంది.

ఈ క్రింది ఉదహరించిన మరికొన్ని వాక్యాలను పరిశీలిద్దాం.

ఉదా॥ 1. పక్కింటామె పంచదారకు వచ్చింది.

→ పక్కింటామె వచ్చిన పంచదార (వ్యాకరణ సమ్మతంకాదు)

2. అత్తగారు మడి గట్టుకొని నీళ్ళకు వెళ్ళింది.

→ అత్తగారు మడిగట్టుకొని వెళ్ళిన నీళ్ళు (వ్యాకరణ సమ్మతం కాదు)

3. అతను తెలుగు చదవటానికి అమెరికా వెళ్ళాడు.

→ అతను అమెరికా వెళ్ళిన తెలుగు చదవటం

పై మూడు వాక్యాల్లో "కు" ("కి, "కు", కు రూపాంతరమే) వ్యాపార ప్రయోజనాన్ని సూచిస్తుంది. ఈ అర్థంలో నామ్నీకరణం సాధ్యం కాదు. పై ఆక్యాల్లో "కు" బదులు "కోసం" కూడా ఉపయోగించవచ్చు.

మూడో వాక్యంలో "కు" క్రియానిష్పన్నమైన వ్యాపార నామం తర్వాత వచ్చింది. ఇలాంటి సందర్భాల్లో "కు" సాధారణంగా వ్యాపార ప్రయోజనాన్ని సూచిస్తుంది.

7. దేశ కాలార్థాల్లో ప్రయోగించినప్పుడుకు ప్రవర్తనలో గమనించాల్సిన విశేషం ఒకటుంది. ఈ క్రింది వాక్యాల్ని పరిశీలిస్తే ఆ విశేషం తెలుస్తుంది.

ఉదా॥ 1. ప్రసాదు మద్రాసు (కు) వెళ్ళాడు.

→ ప్రసాదు వెళ్ళిన మద్రాసు

→ ప్రసాదు వెళ్ళిన ఊరు

2. ప్రసాదు పది గంటలకు కాలేజికి వెళ్ళాడు

→ ప్రసాదు కాలేజికి వెళ్లే పది గంటలు

→ ప్రసాదు కాలేజి వెళ్లేటైం

మొదటి వాక్యంలో "పువ్వు" గుర్తున్న నామం ఇంకో మద్రాసు నగరం అంటే తప్ప వ్యాకరణ సమ్మతం కాదు. విశేష నామాల (Proper Nouns) కన్నిటికీ ఈ నియమం వర్తిస్తుంది. విశేష నామం బదులు సాధారణ నామం (Common Noun) ఉపయోగిస్తే వ్యాకరణ సమ్మతమే.

రెండో వాక్యంలో "పువ్వు" గుర్తున్న నామం విశేష నామం లాంటిదే. అంటే కాలంలో ప్రత్యేకమైన (Specific) Point సూచిస్తుంది. కాబట్టి వ్యాకరణం నిష్పన్నం కావటానికి వీలులేదు. అదే మళ్ళీ సాధారణ నామాన్ని ఉపయోగిస్తే వ్యాకరణ సమ్మతమైంది. General Specific అనే విభాగాన్ని ఆశ్రయించి ఇక్కడ నామ్నీకరణం సాధ్యం అయిందన్నమాట.

8. వాక్యంలో సమాపక క్రియ "ఉండు" ధాతునిష్పన్నమైనప్పుడు "కు" స్వామ్యాద్యర్థాల్లో ప్రయుక్తమవుతుంది. ఈ అర్థాల్లో నామ్నీకరణం సర్వసాధారణంగా సాధ్యమవుతుంది. ఈ క్రింది వాక్యాల్ని పరిశీలించండి.

ఉదా॥ 1. అ) వాడికి డబ్బుంది

→ డబ్బున్నవాడు

→ డబ్బు గలవాడు

ఆ) ఆయనకు ఇల్లుంది

→ ఇల్లున్నవాడు

→ ఇల్లు గలవాడు

ఇ) వాళ్ళకు పిల్లలున్నారు

→ పిల్లలున్నవాళ్ళు

→ పిల్లలు గలవాడు

ఈ) ఆ అమ్మాయికి తెలివి వుంది

→ తెలివి వున్న అమ్మాయి

→ తెలివి గల అమ్మాయి

స్వామ్యాద్యర్థాలలో స్వామిబోధక నామం "కు"ను వదుల్చుకొని నిష్పన్న నామ బంధానికి ఉద్దేశ్యమయింది. ఈ అర్థంలో నిష్పన్నమయిన నామ బంధంతో "ఉన్న" శబ్దానికి వికల్పంగా "గల" శబ్దం ఆదేశమవుతుంది. ప్రాచీన భాషలో అస్త్యర్థంలో స్వతంత్ర ప్రయోగార్హమైన "కల" (కలుగు) ధాతువు వుంది. అది ఆధునిక భాషలో పై రకపు నామ బంధాల్లో మిగిలిందన్నమాట.

9. గురించి "Concerning because of, for the Purpose of" అనే అర్థాల్లో ప్రయుక్త మవుతుంది. ఇది చారిత్రకంగా క్త్వార్థక రూపం కావచ్చు. "గురించిన" అనే క్రియా జన్య విశేషణ రూపం కూడా ఆధునిక భాషలో క్వాచిత్కంగా కన్పిస్తుంది. ఇలాంటివే నేటి తెలుగులో "సంబంధించి, సంబంధించిన" అనే రూపాలు కూడా. వీటికి "గురించి, సంబంధించు" అనే మూల ధాతువులు నిర్మంచి క్త్వార్థక, క్రియా జన్య విశ్లేషణ రూపాలను సాధించవచ్చు. అయితే ఈ మూల ధాతువుల ప్రయోజనం ఆ రూపాలను (రెండేసి మాత్రమే) సాధించటం వరకే పరిమితం.

"గురించి" రూప నిష్పాదన ప్రక్రియ ఏదైనా, దాని ప్రవర్తన మాత్రం ఆధునిక భాషలో విభక్తి ప్రత్యయం వంటిదేనని చెప్పక తప్పదు. "బట్టి" అనేది నామాల తర్వాతనే కాక "అన్నంత" క్రియ మీద కూడా హేత్వర్థంలో వచ్చే ఒక విభక్తి ప్రత్యయం. దీన్ని కూడా "పట్టు" ధాతువుకు క్త్వార్థక రూపంగా నిరూపించవచ్చు. తెలుగు భాషలో వాక్య నిర్మాణానికి అవసరమైన వ్యాకరణ ప్రవర్తనైక ప్రయోజనం కలిగిన శబ్ద జాలం క్రియా పద నిష్పన్నమయ్యే ప్రక్రియాగతి ఒకటున్నట్టు తోస్తుంది.

నామ్నీకారకమైన "అని", "అను" ధాతునిష్పన్నం. కష్టమైన, సులభమైన వంటి విశేషణాల్లో విశేషణత్వాన్ని సూచించే "అయిన", "అగు" ధాతు నిష్పన్నం అయింది. కాని, కదా అనే రూపాలు "అగు" ధాతు వ్యతిరేక క్రియా రూపం నుంచి నిష్పన్నమైనట్టు భావించవచ్చు. అందువల్ల ఒకవేళ గురించి ధాతు నిష్పన్నమైన రూపమైనా వ్యాకరణ ప్రవర్తన ననుసరించి దాన్ని విభక్తి ప్రత్యయంగా భావించటంలో వైరుధ్యమేమీ లేదు.

గురించి - Concerning - అనే అర్థంలో ప్రయుక్తమైనప్పుడు మాత్రమే నామ్నీకరణం సాధ్యమైనట్టు తోస్తుంది.

ఉదా॥ 1. నేను సరళను గురించి చెప్పాను.

→ నేను చెప్పిన సరళ

2. నేను ఆయన్ని గురించి వచ్చాను

→ నేను వచ్చినాయన

3. వాడు డబ్బు గురించి వచ్చాడు.

→ వాడు వచ్చిన డబ్బు

పైన ఉదహరించిన వాటిలో రెండు, మూడు వాక్యాల్లోని నామ బంధాలు వ్యాకరణ నిష్పన్నాలుకావు. అక్కడ గురించి "For the Purpose of" అనే అర్థంలో ప్రయుక్తమైంది.

10. "నుంచి" దేశ కాలార్థాల్లో ప్రయోగించినప్పుడు వ్యాపారం మొదలైన చోటును, కాలాన్ని సూచిస్తుంది. ఈ అర్థాల్లో ఇది ప్రయోగించేటప్పుడు క్రియ గమనార్థక ధాతు జన్యమై వుండాలి. కాలార్థంలో బహువచన నామం తర్వాత ప్రయోగించినప్పుడు వ్యాపారోద్భవ కాలాన్నే కాక కాలంలో వ్యాపార వ్యాప్తిని కూడా తెలియపరుస్తుంది.

ఉదా॥ 1. అతను పదేళ్ళ నుంచి మెడిసన్ చదువుతున్నాడు.

పై వాక్యంలో "నుంచి" చదువు అనే వ్యాపార వ్యాప్తిని తెలియపరుస్తుంది.

"నుంచి" ని వల్ల Because of అనే అర్థంలో కూడా ఉపయోగిస్తాం.

ఉదా॥ నీ నుంచి మేం ఇన్ని కష్టాలు అనుభవిస్తున్నాం.

ఈ అర్థంలోనూ నామ్నీకరణం సాధ్యం కాదు. కాని Arden తన వ్యాకరణంలో..

ఉదా॥ నేను పువ్వులు కోసిన చెట్టు ఇదే

అనే వాక్యాన్ని ఉదాహరించాడు. ఈ వాక్యంలో నామ బంధం "నేను (ఒక) చెట్టు నుంచి పువ్వులు కోశాను" అని వాక్యం నుంచే నిష్పన్నమయి వుండాలి. ఈ నామ బంధం వ్యాకరణ సమ్మతమయిందే. అలాంటిదే ఇంకొకటి పరిశీలిద్దాం.

ఉదా॥ 1. అత్తగారు బావి నుంచి నీళ్ళు తెచ్చింది.

→ అత్తగారు నీళ్ల తెచ్చినబావి

దీన్ని బట్టి "నుంచి" అనే విభక్తి ఏక దేశ పృథక్కరణార్థంలో (Part from the Whole) ప్రయోగించినప్పుడు నామ్నీకరణం సాధ్యమవుతుందని సూత్రీంచుకోవచ్చు. అయితే ఈ క్రింది దాన్ని పరిశీలించండి.

ఉదా॥ మా ఆవిడ మార్కెట్ నుంచి కూరగాయలు తెచ్చింది.

→ మా ఆవిడ కూరగాయలు తెచ్చిన మార్కెట్

పై వాక్యంలో "తెచ్చింది" బదులు కొన్నది అనే క్రియ ఉపయోగిస్తే మార్కెట్ నుంచి బదులు మార్కెట్‌లో అని మార్చాలి. దీన్ని బట్టి ఇక్కడ పై వాక్యంలోని "నుంచి" ని "లో నుంచి" అని సంకీర్ణ విభక్తిగా భావించి "లో"కు లోపం జరిగిందనవచ్చు.

"లో" "మీద" అనే విభక్తులు తెలుగులో అధికరణ, కారకాన్ని వ్యక్తం చేస్తాయి. ఔపశ్లేషికార్థంలో ఈ విభక్తులు ఉపయోగించినప్పుడు నామ్నీకరణం సాధ్యం అవుతుంది.

ఉదా॥ 1. డబ్బు పెట్టెలో పెట్టాను

→ నేను డబ్బు పెట్టిన పెట్టె

2. చెట్టు మీద చిలక ఉంది

→ చిలక ఉన్న చెట్టు

"లో" కాలార్థంలో కూడా ఉపయోగిస్తాం. అప్పుడు విశేష నామాని (Specific Noun) కి సామాన్య నామం (General Noun) ఆదేశం చేస్తే నామ్నీకరణం సాధ్యమవుతుంది.

ఉదా॥ 1. 1956లో విశాలాంధ్ర ఏర్పడింది

→ విశాలాంధ్ర ఏర్పడ్డ 1956

→ విశాలాంధ్ర ఏర్పడ్డ సంవత్సరం

"లో" "మీద" అనే విభక్తులు వైషయికార్థంలోనూ ప్రయుక్తమవుతాయి. ఆ అర్థంలోనూ నామ్నీకరణం సాధ్యమే.

ఉదా॥ 1. మంత్రిగారికి సాహిత్యంలో ప్రవేశం వుంది.

→ మంత్రి గారికి ప్రవేశం ఉన్న సాహిత్యం

2. నేను పని మీద వెళ్తున్నాను.

→ నేను వెళ్తున్న పని.

ప్రక్క, కింద, వైపు మొదలైన విభక్తులు కూడా స్థల సూచకాలయినా వీటితో నామ్నీకరణం సాధ్యం కాదు. "లో", "మీద" అనేవి సామాన్య ఔపశ్లేషికార్థాన్ని సూచిస్తాయి. పక్క, కింద వంటివి ప్రత్యేకమైన Position సూచిస్తున్నాయి.

11. ఈ లుప్త విభక్తిక నామ్నీకరణంలో గమనించాల్సిన ముఖ్య విశేషం ఒకటి వుంది.

ఉదా॥ 1. నేను తిన్న అన్నం.

అనే నామ బంధంలో కర్తను లోపింపజేసి "తిన్న అన్నం" అని అన్నా "అన్నం" అనే నామానికి "తిను" అనే క్రియతో వున్న సంబంధం మారదు. అయితే అన్ని చోట్లా మారకుండా వుండడం సాధ్యం కాదు. కొన్ని నామాలకు కొన్ని క్రియలతో భిన్న వ్యాకరణ సంబంధాలుండవచ్చు. ఈ క్రింది నామ బంధాల్ని పోల్చి పరిశీలిద్దాం.

ఉదా॥ 1. నేను చంపిన పులి

2. చంపిన పులి

మొదటి వాక్యంలో పులి కర్మ. నేను కర్త. రెండో వాక్యంలో పులి కర్తగా కన్పిస్తుంది. దీన్ని బట్టి ఒక సూత్రీకరణ చేయవచ్చు. ఒక నామం ఒక క్రియకు కర్తగానూ, కర్మగానూ వ్యవహరించగలిగిన సామర్థ్యం వున్నప్పుడు, ఆ నామం లుప్త విభక్తిక నామ్నీకరణ పద్ధతిలో ఉద్దేశ్యమయితే, కర్తృపద సమర్థ పదేతరా భావంతో ఉద్దేశ్య నామమే కర్త అవుతుంది. అలాగే ఈ క్రింది నామ బంధాల్ని పోల్చి పరిశీలించండి.

ఉదా॥ 1. నేను డబ్బు పెట్టిన పెట్టె

2. నేను పెట్టిన పెట్టె

మొదటి వాక్యంలో పెట్టె అధికరణార్థంలోనూ, రెండో వాక్యంలో కర్మార్థంలోనూ ప్రయుక్తమయినాయి. ఈ భేదమూ పైన చెప్పిన దాని లాంటిదే. దీనికి కూడా పై లాగే సూత్రం చెప్పవచ్చు. ఒక నామ బంధంలో ఉద్దేశ్య నామానికి క్రియతో కర్మార్థంలోనూ, అధికరణార్థంలోనూ ప్రవర్తించగల సామర్థ్యం వున్నప్పుడు కర్మ పద సమర్థ పదేతరా భావంలో కర్మ పదంగానే వ్యవహరిస్తుంది.

దీన్ని బట్టి కారక సంబంధాల్లో అంతరువులు (Hierarchy) వున్నాయని తెలుస్తుంది. ఈ అంతరువుల నిర్ణయానికి పై సూత్రాలు ఉదాహరణ ప్రాయాలు.

తెలుగులో లుప్త విభక్తిక నామ్నీకరణానికి తుల్యమైంది, ఇంగ్లీషులో Relative Clause నిర్మాణం. ఇంగ్లీషులో ఉద్దేశ్యం తర్వాత విధేయం వస్తుంది. తెలుగులో ఉద్దేశ్యం విధేయం తర్వాత వస్తుంది. ఈ లుప్త విభక్తిక నామ్నీకరణం కొన్ని వివరాల్లో తేడా వున్నా, తమిళాది ఇతర ద్రావిడ భాషల్లో కూడా ఇదేపద్ధతి వుంది. విధేయోద్దేశ్యాల వరస జాపనీస్‌లో కూడా ద్రావిడ భాషల్లో లాగే వుందని తెలుస్తుంది. ద్రావిడ భాషల్లో లాగే జాపనీస్‌లో కూడా క్రియ వాక్యాంతంలో వస్తుంది.

కారక సంబంధాల్లో అంతరువుల నిర్ణయాన్ని గురించి పైన ఇచ్చిన వివరణ ఇతర ద్రావిడ భాషలకు కూడా వర్తిస్తుందని చేకూరి రామారావుగారు స్పష్టం చేశారు.

ఈ విధంగా తెలుగులోని నామ్నీకరణాలు గూర్చి చేకూరి రామారావుగారు చాలా వివరంగా, విశ్లేషణాత్మకంగా, విమర్శనాత్మకంగా, తులనాత్మకంగా విపులీకరించారు.

**ఆధారగ్రంథాలు:**


1. ఆధునిక తెలుగు వ్యాకరణం - ఎన్. శివరామమూర్తి
2. ఆధునిక తెలుగు వెన్నెలకంటి వ్యాకరణం - వెన్నెలకంటి ప్రకాశం
3. ఆధునిక తెలుగు భాషా నిర్మాణం - శివుని రాజేశ్వరి
4. ఆధునిక ప్రామాణికాంధ్ర వ్యాకరణం - వజ్ఝల వేంకటేశ్వర్లు
5. ఆధునిక భాషాశాస్త్రం - వెలమల సిమ్మన్న
6. ఈనాడు భాషా స్వరూపం - బూదరాజు రాధాకృష్ణ
7. తెలుగు దారి - వెల్చేరు నారాయణరావు
8. తెలుగులో వెలుగులు - చేకూరి రామారావు
9. తెలుగు భాషా చరిత్ర (సంపాదకులు) - భద్రిరాజు కృష్ణమూర్తి
10. తెలుగు భాషా చరిత్ర - వెలమల సిమ్మన్న
11. తెలుగు భాషా తత్త్వం - కొమర్రాజు లక్ష్మణరావు
12. తెలుగు భాషా శాస్త్రవేత్తలు - వెలమల సిమ్మన్న
13. తెలుగు భాషా స్వరూపం - బూదరాజు రాధాకృష్ణ
14. తెలుగు వాక్యం - చేకూరి రామారావు
15. ప్రౌఢ వ్యాకరణం - బహుజనపల్లి సీతారామయ్య
16. బాల వ్యాకరణం - చిన్నయసూరి
17. బాల వ్యాకరణం - శాస్త్రీయ వ్యాఖ్య - వెలమల సిమ్మన్న, గుమ్మా సాంబశివరావు
18. భాషా తపస్వి గిడుగు - వెలమల సిమ్మన్న
19. భాషానువర్తనం - చేకూరి రామారావు
20. వ్యావహారిక భాషా వ్యాకరణం - వడ్లమూడి గోపాలకృష్ణయ్య
21. శబ్ద బ్రహ్మ చిన్నయసూరి (అముద్రితం) - వెలమల సిమ్మన్న, గుమ్మా సాంబశివరావు
22. సంధి - వెలమల సిమ్మన్న


**II. ఆంగ్లం :**


1. A Grammar of ModernTelugu - Bh. Krishan Murthy
2. Sandhi Balavyakaranam - J. Pratap Reddy.

**402TL21**

# M.A. DEGREE EXAMINATION

FOURTH SEMESTER

TELUGU

## PAPER - II -STRUCTURE OF MODERN TELUGU

Time Three Hours | Maximum 70 Marks

ఈ క్రింది ప్రశ్నలలో ఐదింటికి సమాధానాలు రాయండి. అన్ని ప్రశ్నలకు మార్కులు సమానం.

1. ఆధునిక తెలుగు భాషా వర్ణాలు, వాటి వ్యాప్తిని వివరించండి.

2. ఆధునిక తెలుగు భాషలోని సంధి స్వరూపాన్ని నిరూపించండి.

3. ఆధునిక తెలుగు భాషలో నామ నిర్మాణాన్ని తెలియజేయండి.

4. ఆధునిక తెలుగు భాషలోని సమాస నిర్మాణ రీతిని ప్రకటించండి.

5. తెలుగు వాక్య నిర్మాణాన్ని విశదీకరించండి.

6. తెలుగులో అనుకృతి వాక్యాల తీరును పరిశీలించండి.

7. తెలుగులో వాక్య భేదాలను తెలపండి.

8. తెలుగు భాష ఆధునీకరణ ఆవశ్యకతను, పద్ధతులను చర్చించండి.

9. తెలుగు భాషలోని మాండలికాలను గూర్చి రాయండి.

10. తెలుగు భాషలోని సామాజిక మాండలికాన్ని విశదీకరించండి.